
అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 11-08-2024

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 10 సంచిక : 223 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00









రక్షణకే తొలి ప్రాధాన్యత

- కార్మికుల ప్రాణాల కంటే ఉత్పత్తి ప్రధానం కాదు :భద్రతా సమీక్షలో సింగరేణి సీఎండీ ఎన్ బలరాం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బొగ్గు ఉత్పత్తి కంటే కార్మికుల ప్రాణాలు అత్యంత విలువైనవనీ, రక్షణ లేని ఉత్పత్తి అవసరమే లేదని సింగరేణి కాలరీస్ సీఎమ్‌డీ ఎన్ బలరాం అన్నారు. కార్మికుల రక్షణ కోసం ఉన్న నియమ నిబంధనలను పాటిస్తూ సురక్షిత సింగరేణిని ఆవిష్కరించే లక్ష్యంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సింగరేణి 11 ఏరియాల్లోని 40 గనులు, విభాగాలకు చెందిన రక్షణ కమిటీలు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు, మైన్స్ కమిటీ సభ్యులు, ఇతర రక్షణ సూపర్‌వైజర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల నుంచి నేరుగా సలహాలు సూచనలు స్వీకరించారు. సింగరేణి సంస్థ ప్రమాదాల నివారణలో వెనకబడి ఉండటం విచారకరమనీ, దీనికి మానవ తప్పిదాలే ప్రధానంగా కనిపిస్తున్నాయని అన్నారు. సంస్థలో ప్రతి పనికి కొన్ని ఎస్‌ఓపీ (సేఫ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్) నిర్దేశించి ఉన్నాయనీ, వీటిని సరిగా పట్టించుకోక పోవడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. కార్మికులంతా తప్పనిసరిగా ఈ భద్రతా చర్యల్ని పాటించాలని విజ్ఞప్తి చేశారు. సంస్థలో ఖాళీ పోస్టుల భర్తీ జరుగుతున్నదనీ, ఇప్పటికే 1,800 పోస్టులకు నియామకాల ప్రక్రియ చేపట్టామని తెలిపారు. రెండు నెలల్లో ఇది పూర్తవుతుందనీ, తద్వారా గనుల్లో సూపర్‌వైజర్ల కొరత ఉండబోదని చెప్పారు. మెరుగైన వైద్యసేవలు, కార్మిక కాలనీలను గేటెడ్ కమ్యూనిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా రక్షణ, మైన్స్ కమిటీ సభ్యులు పలు సూచనలు చేశారు. వారసత్వ ఉద్యోగాల కారణంగా ఉన్నత చదువులు చదివిన యువకులు సింగరేణిలో చేరారనీ, వీరికి గనిలో పని చేయడంలో మరింత ప్రత్యేక శిక్షణ అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సీనియర్ కార్మికులు రిటైర్ అవ్వటం వల్ల కొంత అనుభవరాహిత్యం ఏర్పడుతుందన్నారు. కార్మికులకు నాణ్యమైన బూట్లు అందించాలనీ, గనుల్లో మరింత అధునాతన ఆటోమేషన్ జరపాలని సూచించారు. సమావేశంలో కొత్తగూడెం నుంచి డైరెక్టర్లు ఎన్వీకే శ్రీనివాస్ (ఆపరేషన్స్, పర్సనల్), డి సత్యనారాయణ రావు (ఈ అండ్ ఎం), జి వెంకటేశ్వర్‌రెడ్డి(పి అండ్ పి), జీఎం(కో ఆర్డినేషన్) ఎస్‌డీఎమ్ సుభానీ, జీఎం మార్కెటింగ్ రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సినారె సాహిత్య సేవ అజరామరం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి
- ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర సాహితీవేత్తలకు సినారే సాహిత్య పురస్కారాలు ప్రదానం



నవతెలంగాణ-తుర్కయాంజాల్

తెలుగు రాష్ట్రాల్లో డాక్టర్ సి.నారాయణరెడ్డి (సినారె) అందించిన సాహిత్య సేవ చారిత్రాత్మకమైనదని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ తుర్కయంజాల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన మహాకవి సినారె కళాపీఠం సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రకు చెందిన పలువురు సాహితీవేత్తలకు సినారె సాహిత్య పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ.. సినారే పట్టుదల, క్రమశిక్షణ ఎంతో గొప్పవన్నారు. ప్రత్యక్షంగా తాను సినారెను కలిసింది తక్కువసార్లు అయినప్పటికీ.. ఆ అనుభవం వేల గ్రంథాల పరిజ్ఞాన విస్తరణ కలిగించిందని తెలిపారు. సినారె భౌతికంగా మన మధ్య లేకున్నా ఆయన కవిత్వం అజరామరమన్నారు. ముఖ్యంగా సాహిత్య ప్రేమికులతో పాటు సినీ గేయ సాహిత్యం సామాన్య ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని ఏర్పర్చుకుందన్నారు. చివరి శ్వాస వరకు సాహిత్యాన్ని శ్వాసించిన నిరంతర కవి సినారె అని, ఆయన మాట, పాట బతికే ఉన్నాయి అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ మహారాష్ట్రకు చెందిన ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ టి.గౌరీ శంకర్ (హైదరాబాద్), వైహెచ్‌కె.మోహన్ రావు (పల్నాడు - గుంటూరు), సంగెనేని రవీందర్ (ముంబయి - మహారాష్ట్ర), డాక్టర్ చిదేళ్ల సీతాలక్ష్మి (హైదరాబాద్), కన్నోజు లక్ష్మీకాంతం (హైదరాబాద్), సమ్మెట ఉమాదేవి (ఖమ్మం), బూర్ల వెంకటేశ్వర్లు (కరీంనగర్), బిల్ల మహేందర్ (వరంగల్), డాక్టర్ కాసర్ల నరేష్ రావు (నిజామాబాద్), ధ్యావరి నరేందర్ రెడ్డి (రంగారెడ్డి)కి మహాకవి సినారె సాహిత్య పురస్కారాలు అందజేశారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నందిని సిద్ధారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ భాష సాంస్కృతిక మండలి అధ్యక్షులు డాక్టర్ గంటా జలంధర్ రెడ్డి, సాహితీవేత్తలు దాసరి దయానందరెడ్డి, తేజ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ పోరెడ్డి రంగయ్య, కార్యక్రమ నిర్వాహకులు మహాకవి సినారె కళాపీఠం అధ్యక్షులు మల్లకేడి రాములు, స్థానిక ప్రజాప్రతినిధులు కాకుమాను సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మిగిలిన పండితులకు పదోన్నతులివ్వాలి

- ఆర్‌యూటీపీటీఎస్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మిగిలిపోయిన భాషాపండితులకు అప్‌గ్రెడేషన్, పదోన్నతులను కల్పించాలని ఆర్‌యూపీపీటీఎస్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఎస్ నర్సిములు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గెజిటెడ్ హెడ్మాస్టర్ (జీహెచ్‌ఎం) పదోన్నతుల్లో స్కూల్ అసిస్టెంట్ హిందీ ఉపాధ్యాయులకు అడ్డంకిగా ఉన్న 10-2-3 విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అందరితో సమానంగా వారికీ జీహెచ్‌ఎం పదోన్నతుల్లో అవకాశం కల్పించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో భాషాపండితుల నియామకానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. 1/2005 యాక్టు ద్వారా నష్టపోయిన భాషాపండితులకు ప్రభుత్వం నోషనల్ సర్వీసును అనుమ తించాలనీ, అందుకోసం తగిన ఉత్తర్వులను విడుదల చేయాలని కోరారు.

డైట్ కాలేజీల్లో అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలి

- డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని డైట్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పది ప్రభుత్వ డైట్ కాలేజీల్లో అధ్యాపకుల కొరత వల్ల విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతున్నదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే రెండు, మూడు నెలల్లో డీఎడ్ వార్షిక పరీక్షలున్నాయని పేర్కొన్నారు. అధ్యాపకుల కొరత వల్ల బోధన లేకపోవడంతో ఉపాధ్యాయ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు తీవ్రంగా నష్టపోతున్నారని నష్టం జరుగుతున్నదని తెలిపారు. గతంలో ఉన్న గెస్ట్ లెక్చరర్లను రెన్యూవల్ చేయక పోవడం ఇటు రెగ్యులర్ అధ్యాపకులు లేకపోవడం వల్ల విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నదని వివరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి డైట్ కాలేజీల్లో అధ్యాపకుల భర్తీ ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 11-08-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 223

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar

16 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00

9వ వార్షికోత్సవం

శ్రమజీవుల పత్రిక

నేడు అనేక పత్రికలు పెట్టుబడిదారుల పత్రికలుగా ఉన్నాయి. కానీ, 'నవతెలంగాణ' శ్రమజీవుల కోసం స్థాపించిన పత్రిక. ప్రజల కోసం పోరాడే పత్రిక. వామపక్ష భావాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతం చేసే పత్రిక. నాడు ప్రజాశక్తి అయినా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 'నవతెలంగాణ'గా మారినా ఈ పత్రిక శ్రమజీవుల కూడు, గూడు, గుడ్డ కోసం నిరంతరం శ్రమిస్తోంది. అలాంటి నవతెలంగాణ 9 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పత్రికా యాజమాన్యానికి, సిబ్బందికి, పాఠకులకు శుభాకాంక్షలు.



- డాక్టర్ అంపశయ్య నవీన్,
కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

జల విద్యుత్ ప్రాజెక్టుల్లో గరిష్ట ఉత్పత్తి చేయండి

15లో..

థర్మల్ కేంద్రాల్లో 17 రోజుల బొగ్గు నిల్వలు ఉండాలి

- విద్యుత్‌శాఖ చీఫ్ ఇంజినీర్లతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ

'ఉచితాల'పై బీజేపీ రివర్స్‌గేర్

హర్యానా, మహారాష్ట్రలో నిధుల వరద

- గతంలో కాంగ్రెస్ హామీలపై ఎత్తిపొడుపులు
- ఇప్పుడు వాటినే అమలు చేస్తున్న వైనం

అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు ఎత్తుగడలు

7లో..

నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణాలు

రైలు ప్రమాదాల్లో పెరుగుతున్న మృతులు

7లో..

- గాలిలో దీపంలా ప్రయాణికుల భద్రత
- ప్రయివేటీకరణ దిశగా కేంద్రం అడుగులు

ప్రధానితో సెల్ఫీ బూత్‌ల పైనే శ్రద్ధ

తెలంగాణకు స్టాన్‌ఫోర్డ్ సహకారం

ప్రభుత్వ భాగస్వామ్యంతో కార్యకలాపాలు ..
ముఖ్యమంత్రికి యూనివర్సిటీ బృందం లేఖ

బయోడిజైన్ రంగంలో నైపుణ్యాల అభివృద్ధికి చేయూత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ముందుకొచ్చింది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి డి. శ్రీధర్‌బాబు నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీని సందర్శించింది. స్టాన్‌ఫోర్డ్ బైర్స్ సెంటర్ ఫర్ బయోడిజైన్ విభాగంలోని సీనియర్ ప్రతినిధులతో ఆ బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా హెల్త్ కేర్ రంగంలో కొత్త ఆవిష్కరణలు, విద్య, నైపుణ్య అభివద్ధి తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణలో ఏర్పాటు చేసే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, న్యూ లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీల్లో భాగస్వామ్యం పంచుకోవాలంటూ ప్రభుత్వం వారిని ఆహ్వానించింది. పరస్పరం అధునాతన పరిజ్ఞానాన్ని పంచుకునే కార్యక్రమాలతో పాటు ఉమ్మడిగా పరిశోధనలు నిర్వహించాలనే అభిప్రాయాలు ఈ సమావేశంలో...15లో

హైదరాబాద్‌లో జొయిటిస్ విస్తరణ

ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి ప్రారంభం 15లో..

జంతు ఆరోగ్య సంరక్షణలో కొత్త ఆవిష్కరణలు

అమెరికాలో సీఎంతో కంపెనీ ప్రతినిధుల భేటీ

గూగుల్ హెడ్ ఆఫీస్‌ను సందర్శించిన రేవంత్ బృందం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనలో భాగంగా కాలిఫోర్నియాలోని గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. రాష్ట్రాభివృద్ధిలో సాంకేతిక సహకారం, పెట్టుబడులు తదితర అంశాలపై సంస్థ ప్రతినిధులతో ఆయన చర్చలు జరిపారు. సీఎం వెంట మంత్రి శ్రీధర్‌బాబు, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

అర్హులందరికీ తెల్ల రేషన్ కార్డులు

మంత్రివర్గ ఉపసంఘం భేటీ

సక్సేనా కమిటీ సిఫార్సుల అమలు : మంత్రి ఉత్తమ్



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో అర్హులందరికీ తెల్లరేషన్ కార్డులను మంజూరు చేస్తామని రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘం ప్రకటించింది. దీనికోసం విధివిధానాలను పరిశీలిస్తున్నట్టు తెలియజేసింది. శనివారం ఉదయం హైదరాబాద్‌లోని సచివాలయంలో కొత్త తెల్లరేషన్ కార్డుల కోసం మంత్రివర్గ ఉప సంఘం సమావేశమై చర్చించింది. మంత్రివర్గ ఉపసంఘం చైర్మెన్ రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉపసంఘం సభ్యులు రాష్ట్ర ఆరోగ్యశాఖామంత్రి దామోదర రాజనరసింహా, రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పౌర సరఫరాల కార్యదర్శి డీఎస్ యస్ చౌహన్, ఆరోగ్య శాఖా కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు తదితరులు పాల్గొన్నారు. తెల్ల రేషన్ కార్డు దరఖాస్తుదారులకు గ్రామీణ ప్రాంతాలలో వార్షిక ఆదాయం 1.5 లక్షల్లోపు, మాగాణి 3.50 ఎకరాలు, చెలక 7.5 ఎకరాల్లోపు మాత్రమే ఉండాలన్నారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.2 లక్షలు మించకుండా ఉండాలన్న ప్రతిపాదన ఉపసంఘం ముందుకు వచ్చిందన్నారు. కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరీలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారెవరూ ఈ అవకాశం కోల్పోకుండా ఉండేలా లోతైన అధ్యయనం చేస్తామన్నారు. అందులో భాగంగా రాజకీయాలకు అతీతంగా అధికార, ప్రతిపక్షాలకు చెందిన ప్రజాప్రతినిధులందరి నుంచి సలహాలు, సూచనలు తీసుకోనున్నట్టు ప్రకటించారు. తక్షణమే రాజ్యసభ, లోక్‌సభ, శాసనసభ,...15లో



రు.2వేల కోట్లు ఇవ్వండి

ప్రధాని మోడీకి సీఎం విజయన్ విజ్ఞప్తి

వాయనాడ్‌ను ప్రకృతి వైపరీత్యంగా ప్రకటించని ప్రధాని

- బాధితులతో మాట్లాడిన మోడీ
- పునరావాసానికి తోడ్పడుతామని హామీ
- విధ్వంస ప్రాంతాల్లో కాలినడకన తిరిగి సందర్శన

తిరువనంతపురం : ప్రకృతి ప్రకోపానికి గురైన వాయనాడ్‌ను ప్రధాని నరేంద్ర మోడీ శనివారం సందర్శించారు. దాదాపు 300మందికి పైగా మరణానికి కారణమైన కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో ఏరియల్ సర్వే జరిపారు. అక్కడ జరుగుతున్న సహాయ, పునరావాస కార్యక్రమాలను సమీక్షించారు. ఈ ఆపత్కాలంలో బాధితుల వెనువెంట కేంద్రంతో పాటు యావత్ దేశం వుంటుందని మోడీ చెప్పారు. ఈ విపత్తును ఎదుర్కొనడానికి అవసరమైన సాయాన్ని అందిస్తామని కేరళకు హామీ ఇచారు. జులై 30న వాయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి చూర్మాలాల, ముండక్కై, అత్తమాలా ప్రాంతాలు నేలమట్టమైన విషాద ఘటనను ప్రకృతి వైపరీత్యంగా కేంద్రం ప్రకటించాలని కేరళలోని పాలక వామపక్ష సంఘటన, ప్రతిపక్షం కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. ఈ నేపథ్యంలో జరుగుతున్న మోడీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే పునరావాస చర్యలకు ఎలాంటి నిధుల కొరత వుండదని ప్రకటించిన ప్రధాని ప్రకృతి వైపరీత్యంగా దీన్ని ప్రకటించలేదు.

భారత వైమానిక దళానికి చెందిన హెలికాప్టర్‌లో ప్రధాని మోడీ శనివారం సాయంత్రం 5.45 గంటల సమయంలో కన్నూర్ చేరుకున్నారు. కన్నూర్ విమానాశ్రయంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్, గవర్నర్ ఆరిఫ్ మహ్మద్, కేంద్ర మంత్రి సురేష్ గోపి ప్రభృతులు ప్రధానికి స్వాగతం పలికారు. అంతకు ముందు దాదాపు ఐదు గంటల పాటు కొండచరియలు విరిగిపడిన వాయనాడ్‌లో మోడీ గడిపారు. అక్కడ బాధితులను కలిసి మాట్లాడారు. జరిగిన విధ్వంసాన్ని, నష్టాన్ని కళ్లారా చూసేందుకు ఆ ప్రాంతాల్లో తిరిగారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. తాము ఎదుర్కొన్న భయంకరమైన అనుభవాలను బాధితులు ఈ సందర్భంగా ప్రధానితో పంచుకున్నారు. ఐనవారినందరినీ కోల్పోయిన వారిని మోడీ ఓదార్చారు.

గ్రౌండ్ జీరో వద్ద 50నిమిషాలు గడిపిన మోడీ

పెద్ద ఎత్తున కొండచరియలు విరిగి మూడు ప్రాంతాలు నేలమట్టమైన గ్రౌండ్ జీరో వద్ద ప్రధాని 50 నిమిషాలు గడిపారు. ప్రకృతి విలయతాండవంలో జరిగిన విధ్వంసాన్ని వీక్షించారు. కేరళ ముఖ్యమంత్రి, గవర్నర్, కేంద్ర మంత్రి సురేష్ గోపి ప్రధాని వెంటే వున్నారు. కన్నూర్ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో వాయనాడ్ చేరుకున్న మోడీ చూర్మాలాలా ఏరియాకు వెళ్ళి స్వయంగా అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ప్రకృతి విలయం సంభవించిన నేపథ్యంలో సైన్యం ఇక్కడ 190 అడుగుల బెయిలీ బ్రిడ్జిని నిర్మించింది. ఆ వంతెన పైనుండి మోడీ నడుచుకుంటూ వెళ్లి ఆ ప్రాంతంలో...15లో

అదానీ తర్వాత ఎవరు ?

'ఎక్స్'లో హిండెన్‌బర్గ్ సంచలన పోస్ట్

షేర్ మార్కెట్‌లో కలకలం



న్యూఢిల్లీ : హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ మరోసారి బాంబు పేల్చబోతోందా? మరో దేశీయ కంపెనీ అవకతవకలను బయటపెట్టబోతోందా? ఆ సంస్థ శనివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పెట్టిన పోస్టును పరిశీలిస్తే ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం వస్తుంది. గత సంవత్సరం అమెరికా షార్ట్ సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్ రిసెర్చ్ ఇచ్చిన నివేదిక అదానీ కంపెనీని కోలుకోలేని దెబ్బ తీసిన విషయం తెలిసిందే. నివేదిక కారణంగా అదానీ కంపెనీ షేర్లు ఒక్కసారిగా పడిపోయాయి. ఇప్పుడు మళ్లీ హిండెన్‌బర్గ్ తన తాజా అధికారిక ఎక్స్ ఖాతాలో పెట్టిన పోస్టు షేర్ మార్కెట్‌ను కలవరపరుస్తోంది. 'సమ్‌థింగ్ బిగ్ సూన్ ఇండియా' అంటూ హిండెన్‌బర్గ్ పెట్టిన పోస్టు ఎవరిని ఉద్దేశించిందో, ఎవరి కొంప ముంచుతుందో తెలియక మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ పోస్టును చూసి స్టాక్ మార్కెట్ వర్గాలు తీవ్ర ఆందోళనలో మునిగిపోయాయి.

గత సంవత్సరం జనవరి 24న హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదిక కారణంగా అదానీ గ్రూపు వాటాల మార్కెట్ విలువ 86 బిలియన్ డాలర్లు పడిపోయింది. దాని ఓవర్‌సీస్ లిస్టెడ్ బాండ్లు పెద్ద సంఖ్యలో అమ్మకాలకు గురయ్యాయి. హిండెన్‌బర్గ్ దెబ్బకు దేశీయ స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్ల అమ్మకానికి ముందు ఈ నివేదిక విడుదలైంది. అదానీ తన షేర్ల ధరను పెంచి చూపించారని, అవకతవకలకు పాల్పడ్డారని హిండెన్‌బర్గ్ నివేదిక ఆరోపించింది. నివేదిక ప్రచురితమైన తర్వాత అదానీ గ్రూపు కంపెనీల షేర్ల విలువ వంద బిలియన్ డాలర్ల మేరకు పడిపోయిందని అంచనా.

హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై సెబీ విచారణ జరిపింది. ఆ తర్వాత అదానీ గ్రూపునకు సుప్రీంకోర్టు...15లో

ఇది కోతల ప్రభుత్వం

రెండు నెలల పింఛన్ రాలే..

కలుపు తీస్తున్నా రైతుబంధు పడలే..

కల్యాణలక్ష్మి ఊసే లేదు : ఎమ్మెల్యే హరీశ్‌రావు

నవతెలంగాణ-సిద్దిపేట

కాంగ్రెస్‌ది ఎగవేత.. కోతల ప్రభుత్వమని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం 217 మందికి రూ.49.91 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఆపదలో, కష్టంలో ఆరోగ్యానికి ఆర్థిక భరోసా సీఎం సహాయనిధి అన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఎల్లప్పుడూ మీ సేవలో ఉంటానని భరోసానిచ్చారు. కాంగ్రెస్ చెప్పిన పింఛన్, రైతుబంధు పెంపు, కల్యాణ లక్ష్మిలో లక్ష రూపాయలు, బంగారం హామీలు మాటలకే పరిమితం అయ్యాయని విమర్శించారు. రూ.4 వేల



పింఛన్ దేవుడెరుగు.. కేసీఆర్ ఇచ్చిన పింఛన్ రాక రెండు నెలలైందన్నారు. జులై, ఆగస్టు పింఛన్ డబ్బులు అందక వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆడపిల్ల పెండ్లికి ఇవ్వాల్సిన కల్యాణ లక్ష్మి చెక్కులు రాక 8 నెలలు అవుతోందని చెప్పారు. లక్ష రూపాయలు, తులం...15లో

త్యాగాల వారసత్వాన్ని భావితరాలకు అందిద్దాం

యూటీఎఫ్ 50 వసంతాల వేడుకల్లో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



ఘనంగా టీఎస్ యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు

రాష్ట్ర వ్యాప్తంగా జెండా ఆవిష్కరణలు వివరాలు 5లో..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆవిర్భవించి 50 వసంతాలైన సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ త్యాగాల వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరముందని చెప్పారు. యూటీఎఫ్ సంఘ నిర్మాతలు, పూర్వ నాయకులు కుటుంబాని కన్నా సంఘ నిర్మాణానికి అధిక ప్రాధాన్యతనిచ్చే వారని గుర్తు చేశారు. ఉద్యోగాలను సైతం త్యజించి సంఘం పటిష్టతకు, ఎదుగుదలకు ఎంతో కృషి చేశారని వివరించారు. అప్పారి వెంకటస్వామి, దాచూరి రామిరెడ్డి, మైనేని వెంకటరత్నం వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రయివేటు...15లో

గాజాలో మరో స్కూలుపై దాడి

వందమందికి పైగా పాలస్తీనియన్లు మృతి



ముక్కలైన మృతదేహాలు

ఖండించిన పలు దేశాలు

గాజా : నిర్వాసితులైన పాలస్తీనియన్లు తలదాచుకున్న స్కూళ్లను లక్ష్యంగా చేసుకుని దాడులు కొనసాగిస్తున్న ఇజ్రాయిల్ తాజాగా శనివారం నాడు గాజా సిటీ స్కూల్‌పై దాడి చేసింది. దారుణంగా జరిపిన ఈ దాడిలో వందమందికి పైగా మృతి చెందారు. డజన్ల సంఖ్యలో గాయపడ్డారు. బాంబు దాడిలో చాలా మృతదేహాలు ముక్కలు ముక్కలై చెల్లాచెదురుగా పడ్డాయి. దారుణ స్థితిలో ఉన్న మృతదేహాలను చూసి డాక్టర్లు కూడా భయకంపితులయ్యారు. ఇటీవలి వారాల్లో వరుసగా గాజా స్కూళ్ళే ఇజ్రాయిల్‌కు లక్ష్యాలుగా మారుతు న్నాయి. ఆ వరుసలో ఇది పదో దాడి. అల్ అహ్లి అరబ్ ఆస్పత్రికి వరుసగా మృతదేహాలను, క్షతగాత్రులను తీసుకుని వస్తూనే వున్నారు. ఉదయం ప్రార్థనల సమయంలో ఈ దాడి జరిగింది. ఇప్పటివరకు వందకు పైగానే మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. హమాస్, పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్ సంస్థలు ఈ స్కూలును తమ స్థావరంగా...6లో

ఐక్య ఉద్యమాలే సింగరేణికి రక్ష

వేలంపాట రద్దయ్యే దాకా పోరు ఆగదు

తెలంగాణ బొగ్గుపై హక్కు సింగరేణికే 7లో..

ప్రయివేటుపరమైతే ప్రజలపై భారాలు

కేంద్రంపై ఒత్తిడికి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి

నవతెలంగాణతో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య



ఖమ్మంలో డ్రగ్స్ కలకలం

హెరాయిన్ పట్టుకున్న టూ టౌన్ పోలీసులు

అప్రమత్తంగా వ్యవహరించిన టీజీఏఎన్‌బీ

క్రిప్టో కరెన్సీతో కొనుగోలు..

అసోం నుంచి పార్సిల్ 15లో..



నవతెలంగాణ

నిరాశ నిస్పృహలకు లోనుకాకుండా ప్రయత్నం సాగిస్తే విజయం తథ్యం - విలియం షేక్‌స్పియర్



వినేశ్ ఫోగట్ విజయిని

'భంగ పరచిన చరిత్ర కుటీరాల నుండి
నేను ఉద్భవిస్తాను...వేళ్లానుకుపోయిన
బాధామయ గతంనుండి, నేను పైకి లేస్తాను'

- మాయా ఏంజిలో

అవును... అణచివేత నుండి, నిర్బంధాల నుండి, అవమానాల నుండీ ఆమె మరల లేస్తూనే ఉంది. తనశక్తి, ధైర్యాన్ని ఎలుగెత్తుతూనే ఉంది. అయినా ఆమెకు అడ్డంకులెన్నో ఎదురవుతూనే ఉన్నాయి. ఈసారి పైకి కనిపిస్తున్న విషయంగా వందగ్రాముల బరువు తన దారికి అడ్డుగా నిలిచింది. విజయ శిఖరాన్ని చేరకుండా బరువునొడ్డింది. అయినా ఫోగట్ 140కోట్ల భారత ప్రజల గుండెల్లో విజయినిగానే నిలిచింది. ప్రపంచ క్రీడాభిమానుల్లోనూ మారుమోగుతున్న పేరు వినేశ్ ఫోగట్. పతకం ఒక ప్రకటన మాత్రమే. కానీ పోరాటం నిండిన నిరంతర స్ఫూర్తి వినేశ్. ఆమె పోరాటం కేవలం పారిస్ ఒలంపిక్ వేదికపైనే కాదు, భారత రెజ్లింగ్ సమాఖ్య పైనా, ప్రభుత్వ విధానంపైనా పోరాడింది. సమాఖ్య ఛైర్మన్ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని ఏడాదిపాటు వీధుల్లోకి వచ్చి పోరాటంచేసినా న్యాయం జరగలేదు. అయినా విశ్రమించ లేదు. తనను ఒలంపిక్ ఆటకు దూరం చేసే కుట్రలూ చేశారు. 53 కేజీల రెజ్లింగ్ పోటీకి సిద్ధపడుతున్న వేళ, ఆ అవకాశాన్ని ఫోగట్‌కు ఇవ్వలేదు. ఆఖరికి 50 కేజీల విభాగానికి సైతం ప్రయత్నించి ఎట్టకేలకు అర్హత సాధించుకున్నది. ఆమె వయసు రీత్యా 53 కేజీల విభాగంలో అవకాశం ఇచ్చి ఉన్నట్లయితే, పతకం సునాయసంగా వశమయ్యేదే. ఇవన్నీ ఆమె చేస్తున్న పోరాటాల్లో భాగమే. అయిననూ నాలుగేండ్లుగా ప్రపంచ ఛాంపియన్‌గా ఉన్న జపాన్ రెజ్లర్‌ను చిత్తు చేసి రజత పతకాన్ని ఖాయం చేసుకున్న ఫోగట్ బంగారు కలను బరువు వమ్ము చేసింది.

ప్రపంచ స్థాయి పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారుల వెయిట్‌కు సంబంధించిన మానిటరింగ్ చేసేవాళ్లు, డైటీషియన్స్ ఏం చేస్తున్నట్లు! అనర్హురాలుగా ఒలంపిక్ సంఘం ప్రకటించగానే భారతీయుల గుండెలు పగిలిపోయాయి. వెంటనే ఫోగట్ ఒలంపిక్ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఫైనల్‌లో ఆడించాలన్న డిమాండ్‌ను వెంటనే తోసిపుచ్చారు. ఇక రెండో డిమాండ్,ఫైనల్ అర్హత వరకు పోటీలో ఉన్నపుడు బరువు సక్రమంగానే ఉన్నందున కనీసం రజత పతకం ఇవ్వాలని కోరింది. ఇందుకు న్యాయ మూర్తులతో బెంచ్ ఏర్పాటు చేసుకోవటానికి అనుమతి ఇచ్చింది. ఏం కాబోతుందో వేచి చూడాల్సిందే.

'అమ్మా నన్ను క్షమించు, నాకిక పోరాడే శక్తిలేదు. రెజ్లింగ్ గెలిచింది 'నేను ఓడిపోయాను' అని ఫోగట్ దు:ఖపు గొంతుతో తల్లిని క్షమించమని కోరింది. అంతేకాదు, ఇక అంతర్జాతీయ కేరీర్‌కు సెలవు ప్రకటిస్తున్నానని సోషల్ మీడియాలో వెల్లడించింది. ఆబాధ తీవ్రత ఆమెకే తెలుసు. జరిగిన పరిణామాల్లో లోపం ఎక్కడుందో కూడా ఫోగట్‌కు తెలిసే ఉంటుంది. ఆ అనర్హత వెనుక కుట్ర కోణమూ ఉందని కొందరు అనుమానిస్తున్నారు కూడా. బాక్సర్ విజేందర్ మాట్లాడుతూ వినేశ్ ఫైనల్‌కు వెళ్లటం ఎవరికో నచ్చలేదని వ్యాఖ్యానించాడు. ఆరుసార్లు ఛాంపియన్ అమెరికన్ రెజ్లర్ జోర్డాన్ బుర్రోస్, ఫోగట్‌కు రజత పతకం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. గుండె పగిలిందని, ఫోగట్ ధైర్యంగా ఉండాలని క్రికెటర్ రవిశాస్త్రి కోరాడు. సినీనటుడు ధర్మేంద్ర, అలియాభట్, కరీనాకపూర్ కూడా ఫోగట్‌కు మద్దతుగా నిలిచారు. ఇక సినీనటుడు ప్రకాశ్‌రాజ్ అయితే దేశంలోని రాజకీయాలతోనే ఓడిందని కార్టూన్ పోస్టు చేశాడు. పార్లమెంట్‌లోని 'ఇండియా' బ్లాక్ ఎంపీలు ఫోగట్ అనర్హతపైన ఆందోళన వ్యక్తం చేస్తూ న్యాయం జరగాలని, ప్రభుత్వం స్పందించాలనీ డిమాండ్ చేశారు. ఆఖరికి ప్రధాని కూడా ఫోగట్‌కు మద్దతుగా నిలిచారు. కానీ బీజేపీ పార్లమెంటు సభ్యులు, సినీనటులు, హేమమాలిని, కంగనా మాత్రం ఆడవాళ్ల బరువు పెరగటంపై వ్యాఖ్యానించి, వారి వెలితి బుద్ధిని ప్రకటించుకున్నారు.

ఏదిఏమైనా వినేశ్ ఫోగట్, ఒలంపిక్స్ పోటీలో మొట్టమొదటిసారి ఫైనల్‌కు చేరిన మహిళా రెజ్లర్‌గా ఖ్యాతి గడించారు. ఇది మనందరికీ గర్వకారణ విషయం. ఆమె పోరాటస్ఫూర్తి నేటితరం అమ్మాయిలకు మరింత చైతన్యాన్ని నింపుతుంది. బంధువులు, స్నేహితులు కోరినట్లు, ఆమె విరమణ ప్రకటన వెనక్కి తీసుకుని, తిరిగి పోటీలో పాల్గొనాలి. అంతిమ విజయం పోరాటానిదే, ఫోగట్ ఇన్ని గుండెల నిండా విజయినే!

సంపాదకీయం

వర్గీకరణ సమస్య - ఓ పరిశీలన


బి.వి. రాఘవులు

సుప్రీంకోర్టు తీర్పు వర్గీకరణ సమస్యపై మరోసారి వాదోపవాదాలకు తెరతీసింది. వర్గీకరణ రాజ్యాంగ బద్ధమేనని, రాష్ట్రాలు నిర్ణయం తీసుకోవడానికి రాజ్యాంగం అడ్డుకాదని కోర్టు మెజారిటీ తీర్పునిచ్చింది. ఏడుగురి ధర్మాసనంలో ఒక్కరు మాత్రమే ఈ అభిప్రాయంతో విబేధించారు. ఈ సందర్భంలోనే ధర్మాసనంలోని నలుగురు న్యాయమూర్తులు 'క్రీమీలేయర్'ను కూడా ప్రవేశ పెట్టడం మంచిదని విడివిడి తీర్పుల్లో పేర్కొన్నారు. ప్రధాన న్యాయ మూర్తి, మరొకరు మాత్రం ఈ విషయంపై మౌనం వహించారు. మొత్తమ్మీద సుప్రీంకోర్టు తీర్పు వర్గీకరణకు వ్యతిరేకంగా లేవనెత్తబడిన రాజ్యాంగపరమైన అభ్యంతరాలపై స్పష్టమైన తీర్పునిచ్చింది. వర్గీకరణ చెయ్యాలా? వద్దా? అన్న నిర్ణయాన్ని రాష్ట్రాలకు వదిలివేసింది. కోర్టుకు వచ్చిన వ్యాజ్యం రాష్ట్రాలకు సంబంధించిన విషయం అయినప్పటికీ తీర్పు కేంద్రానికి కూడా వర్తిస్తుంది. గతంలో కొన్ని రాష్ట్రాలలో వర్గీకరణ సమస్య ముందుకొచ్చినప్పుడు సీపీఐ(ఎం) వర్గీకరణను సమర్థించింది. ఎస్సీల్లోనే వివిధ ఉపకులాల మధ్య విద్యా, ఉద్యోగాలలో కొట్టొచ్చి నట్లు వ్యత్యాసాలు వున్నాయని అధ్యయన కమిటీలు స్పష్టమైన వివరాలు/ డేటాపై ఆధారపడి సమర్పించిన నివేదికల ఆధారంగా నిర్ధారించినప్పుడు సీపీఐ(ఎం) వర్గీకరణకు సానుకూలత ప్రకటించింది.

తీర్పు నేపథ్యం-కొన్ని అంశాలు

పంజాబ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తమ రాష్ట్ర పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని గతంలో ఎస్సీ తరగతిలో వర్గీకరణ చెయ్యడానికి నిర్ణయాలు తీసుకున్నాయి. ఒక్క తమిళనాడులో తప్ప, మిగిలిన అన్ని రాష్ట్రాల్లో కోర్టు తీర్పుల మూలంగా ఈ నిర్ణయాలు అమలులోకి రాలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వర్గీకరణపై తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ వచ్చిన వాజ్యంపై వర్గీకరణ రాజ్యాంగబద్ధం కాదని సుప్రీంకోర్టు 2005లో తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ వచ్చిన అనేక పిటిషన్లన్నింటిని కలిపి విచారించిన ఏడుగురు సభ్యుల ధర్మాసనం 2024 ఆగష్టు 1వ తేదీన తన తీర్పును వెలువరించింది. తీర్పులో వివాదాస్పదంగా మారిన కొన్ని ముఖ్యాంశాలను పరిశీలిద్దాం.

రాజ్యాంగంలో 341 అధికరణం రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణ చేయడానికి అనుమతించదన్న వాదనను కోర్టు తిరస్కరించింది.ఎస్సీ, ఎస్టీ జాబితాలపై నిర్ణయించే హక్కు పార్లమెంటుదైనందున వర్గీకరణ అంశం కూడా పార్లమెంటు పరిధిలోనిదని, ఇందులో రాష్ట్రాల జోక్యానికి తావులేదన్న వాదనను తిరస్కరిస్తూ, తమ పరిస్థితులను బట్టి రాష్ట్రాలు నిర్ణయం తీసుకోవచ్చునని స్పష్టం చేసింది. వర్గీకరణ చేసేహక్కు పార్లమెంటుదా, రాష్ట్రాలదా అనే అంశంకన్నా, అసలు వర్గీకరణ చేయడం అవసరమా లేదా అన్నది ముఖ్యం. ఈ అంశంపై స్పష్టత వస్తే ఎక్కడి నుండి ప్రారంభించడం బాగుంటుందన్న అంశం కేవలం సాంకేతిక, ఆచరణాత్మక సమస్య అవుతుంది.

వర్గీకరణ చట్టబద్ధమా కాదా అన్న అంశాన్నే కాకుండా సమానత్వం సాధించడం అన్న కోణంలో కూడా వర్గీకరణ సమంజసమేనని కోర్టు అభిప్రాయపడింది. ఎస్సీ తరగతి అస్పృశ్యత 'అంటరానితనం' గురయ్యే కులాల బృందంగా ఏర్పడినందున అది ఒక 'ఏకఖండ' (హోమోజీనియస్) బృందం, అందువలన దాన్ని విడదీయడం సమం జసం కాదన్న వాదనను కోర్టు తిరస్కరించింది. అస్పృశ్యతకు ఎస్సీ తరగతిలో ఉన్న ఉపకులాన్ని గురవుతున్నా వాటి మధ్య అన్ని విషయాలలో ఏకరూపత లేదు. సామాజిక, ఆర్థిక, విద్యా విషయాలలో వ్యత్యాసం వుందని, హెటి రోజీనియస్ బృందమని కోర్టు భావించింది. ఈ వ్యత్యాసాలను అధిగమించడానికి వర్గీకరణ సమంజసమేనని కోర్టు చెప్పింది.

విమర్శలు-ఆక్షేపణలు

ఈ అంశంపై కోర్టు సరైన సమాచారం/ డేటా లేకుండానే నిర్ధారణ చేసిందని ఆక్షేపణలు వచ్చాయి. ఈ విమర్శలో పసలేదు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు నియమించిన అధ్యయన కమిషన్ల రిపోర్టులు అంతర్గతంగా ఎస్సీ ఉపకులాల మధ్య వున్న వ్యత్యాసాలను బహిర్గతం చేశాయి. 2011 జనరల్ సెన్సెస్‌లో ఎస్సీ ఉపకులాలపై ఉన్న సమా చారాన్ని పరిశీలించినా వ్యత్యాసాలపై నిర్ద్వంద్వమైన సమాచారం దొరుకుతుంది. కొంతమంది వ్యత్యాసాలున్నాయని అంగీకరిస్తూనే, ఎస్సీల్లో వెనకబడిన ఉపకులాలు, ముందంజలో ఉన్న కులాలతో పోటీపడగల స్థాయికి రావడానికి అవసరమైన ప్రత్యేక సదుపాయాలను అదనంగా కేంద్రం, రాష్ట్రాలు కల్పిస్తే సరిపోతుందని వర్గీకరణ అవసరం లేదని అంటున్నారు. ఈ సూచనలో అభ్యంతరం పెట్టాల్సిందేమీ లేదు కానీ ఇది వర్గీకరణకు ప్రత్యామ్నాయం కాదు. దానికి జత చేయాల్సింది మాత్రమే. వర్గీకరణ అనేది రిజర్వేషన్ హక్కులో భాగంగా వుంటుంది. వర్గీకరణ వలన లాభం ఏ కొద్దిపాటిదైనా, తక్షణం అందుబాటులోకి వస్తుంది.సదుపాయాలు ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి వుంటాయి.

'వర్గీకరణ' రిజర్వేషన్ల వ్యవస్థను ఉనికిలోకి తెచ్చిన మౌలిక భావనకు భంగం కలిగిస్తుందని గతం నుండి వస్తున్న విమర్శ. ఇప్పుడు కోర్టు ఇచ్చిన తీర్పుపై కూడా వస్తున్నది. అణచివేత, అస్పృశ్యత వంటి సామాజిక అంశాలు రిజర్వేషన్ల వ్యవస్థ ఉనికికి ప్రాతిపదిక అని ఇప్పుడు కోర్టు వెనకబాటుతనం, తగ్గిన ప్రాతినిధ్యం వంటి అంశాలను ప్రవేశపెట్టి రిజర్వేషన్‌కున్న ప్రాతిపదికను బలహీనం చేస్తున్నదని ఈ విమర్శ సారాంశం.

ఈ విమర్శకు తగిన ప్రాతిపదిక వుందని అనుకోలేం. ఎస్సీలలో అంతర్గత వ్యత్యాసాలను అధిగమించేందుకు ముందుకు వచ్చిన అంశాన్ని రిజర్వేషన్ల మౌలిక భావనకు వ్యతిరేకం అని భావించడానికి ఆస్కారం లేదు. మన దేశంలో రిజర్వేషన్ల చారిత్రక నేపథ్యం, అస్పృస్యత లేని తరగతులకు కూడా రాజ్యాంగం రిజర్వేషన్లు కల్పించిన తీరును పరిశీలిస్తే, రిజర్వేషన్లను, ప్రాతినిధ్యాలకు ఏదో ఒక్క అంశం ప్రాతిపదికగా వున్నది అనుకోవడం సాధ్యం కాదు. సామా జిక అణచివేత, అస్పృశ్యతలను నేరాలుగా రాజ్యాంగం ప్రకటించింది. వాటిని ఎదుర్కోవడానికి ప్రభుత్వాలు చట్టాలు కూడా తెచ్చాయి. అవి అధ్వాన్నంగా అమలు చేయబడుతున్నాయనేది వేరే విషయం. అయితే సామాజిక బలహీనత అధిగమించడానికి చట్టాలే సరిపోవని, విద్య, ఆర్థిక, రాజకీయ సాధికారతలను కూడా ఇవ్వడం అవసరమని భావించే, విద్య, ఉపాధి, రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు కల్పించబడ్డాయి.

జనరల్ కోటాకు మళ్లింపు-బ్యాక్‌లాగ్ విధానం

వర్గీకరణ మూలంగా నిండని ఖాళీల సంఖ్య పెరుగుతుందని, వాటిని జనరల్ కోటాలోకి మళ్లించడం ద్వారా ఎస్సీలకు అన్యాయం జరుగుతుందని కొందరు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. నిండని ఖాళీలను జనరల్ కోటాలోకి మార్చాలన్న ప్రయత్నం వర్గీకరణ అంశంతో ముడిపెట్టడం సరికాదు. జనరల్ కోటాలోకి మార్చాలనే ప్రయత్నాలు వర్గీకరణ అంశం చర్చకు రాకముందు నుండి జరుగు తున్నాయి. వీటికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల మూలంగానే 'బ్యాక్‌లాగ్' అన్న పద్ధతి ప్రవేశ పెట్టబడింది. అయినా ఇప్పటికీ ఇటువంటి ప్రయత్నాలు జరుగు తూనే వున్నాయి. ఈమధ్య యుజిసి రిజర్వుడ్ ఖాళీలను జనరల్ కోటాలోకి ఎటువంటి పరిస్థితుల్లో మార్చవచ్చో వివరిస్తూ మార్గదర్శక సూత్రాలను ప్రతిపాదించింది. తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం కావడంతో హడావుడిగా ఉపసంహరించుకుంది. ఇటువంటి ప్రయత్నాలను అడ్డు కోవడం తప్ప ఈ అంశాన్ని వర్గీకరణతో ముడిపెట్టడం తప్పు. అలాగే వర్గీకరణ అనేది ఎస్సీ తరగతి అంతర్గత అంశం: ఉన్న కోటాలో ఉప విభజన. అందువలన ఒక బృందంగా చూసినప్పుడు ఎస్సీ తరగతిగా నష్టపోయేది వుండదు. ఒక ఉపతరగతిలో ఖాళీ మిగిలిపోతే ఇంకో తరగతిలో అర్హులైనవారితో నింపవచ్చు. అన్ని ఉపతరగతుల నుండి కూడా భర్తీ కాకపోతే బ్యాక్‌లాగ్‌లో పెట్టవచ్చు. ఈ పద్ధతి వలన కోటా ఎస్సీ తరగతి దాటి బయటకు పోవడం వుండదు. రాష్ట్రాలు గానీ కేంద్రంగానీ వర్గీకరణ తీసుకువస్తే ఎస్సీ కోటా బయటకు పోకుండా రాజ్యాంగ, చట్టబద్ధమైన ఏర్పాటు చేసేట్లుగా చూడాలి.



సుప్రీంకోర్టు తను పరిష్కరించాల్సిన 'వర్గీకరణ' వివాదంపై తీర్పు చెబుతూనే 'క్రీమీలేయర్'పై కూడా వ్యాఖ్యలను చేసింది. నలుగురు న్యాయమూర్తులు 'క్రీమీలేయర్'ను ఎస్సీ, ఎస్టీలకు కూడా అనువర్తింప చేయాలని అభిప్రాయపడ్డారు. ఇది అమలు చేయాల్సిన తీర్పులో భాగం కాకపోయినా, వివాదాస్పద అంశం. ఎస్సీ, ఎస్టీలకు క్రీమీలేయర్ వుండకూడదని సీపీఐ(ఎం) అభిప్రాయం. చారిత్రకంగా ఎటువంటి ఆస్తిపాస్తులు కలిగివుండడానికి నోచుకోని ఎస్సీలలో ఇప్పటికీ స్థిరమైన ఆస్తిపాస్తులు కలిగిన స్పష్టమైన ఒక తరగతి ఏర్పడలేదు. కొద్దిమంది రాజకీయ నాయకులను, ఐఏఎస్, ఐపిఎస్ అధికారులను, కొద్దిమంది పరిశ్రమల యజమానుల పేర్లను చూపించి క్రీమీ లేయర్‌ను ప్రతిపాదించడం న్యాయం కాదు.

అభివృద్ధిలో వ్యత్యాసాలు-పరిష్కార మార్గాలు

వర్గీకరణకు మరికొన్ని అభ్యంతరాలు కూడా వస్తున్నాయి. వర్గీకరణ దళితుల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తుం దని వీటిలో ఒకటి. వాస్తవం ఏమంటే ఎస్సీల్లోని వివిధ ఉపకులాల మధ్య పెరుగుతున్న వ్యత్యాసాలే వర్గీకరణ డిమాండ్‌కు దారితీశాయి. వ్యత్యాసాలను అధిగమించే చర్యలను సమర్థించడమే ఐక్యతకు మార్గం తప్ప, వాటిని వ్యతిరేకించడం కాదు. దీని ద్వారా వ్యత్యాసాల పేరుతో అనైక్యతను సృష్టించేవారి ఆటలు కట్టించడం సులభం.

అలాగే బూర్జువా రాజకీయ పార్టీలు వర్గీకరణ అంశాన్ని తమ స్వార్థపూరిత ప్రయోజనాలకు ఉపయోగించు కొంటున్నాయనేది మరో విమర్శ. ఓట్ల కోసం ఒక సామాజిక తరగతిని ఇంకొక సామాజిక తరగతికి వ్యతిరేకంగా రెచ్చ గొట్టడం, సమీకరించడం బూర్జువా పార్టీలు ఒక శాస్త్రంగా మార్చివేశాయనేది నిజం. ఈ కుటిల ప్రక్రియ ప్రయో గంలో బీజేపీ అన్నిటికన్నా ముందున్నది. ఎస్సీల మధ్య ఉన్న అభివృద్ధి వ్యత్యాసాలను గుర్తించి, పరిష్కార మార్గాలను కనుగొనడం ద్వారా మాత్రమే బూర్జువా పార్టీల అనైక్యత సృష్టించే ఎత్తుగడలను తిప్పికొట్టగలం.

సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పిచ్చింది కాబట్టి ఇక ఎస్సీల్లోని వెనకబడిన ఉపకులాల సమస్యలన్నిటికి పరిష్కారం దొరికిపోయిందని ఎవరైనా భావిస్తే వారికి నిరాశే ఎదురవుతుంది.అలా చూస్తే రిజర్వేషన్లే సామాజిక అణచివేతను, దళితుల వెనకబాటు పరిస్థితిని పరిష్కరించలేదు. సరళీకరణ విధానాలొచ్చిన తర్వాత (బూర్జువా పార్టీలన్నీ వీటిని అమలు చేస్తున్నాయి) రిజర్వేషన్లు ఇంకా నామమాత్రం అవుతున్నాయి. ఈ స్థితిలో వర్గీ కరణ పెద్ద మార్పు సాధిస్తుందని అనుకోరాదు. ఎస్సీలలోని కొన్ని తరగతులలో అసంతృప్తి కారణమవుతున్న ఒక అంశానికి తక్షణ పరిష్కారం చూపించడం ద్వారా ఐక్యతను పెంపొందించడం జరిగితే, అదే మనం ఆశించగల పెద్ద లాభం.

వర్గీకరణ సర్వరోగ నివారిణి కాదు

సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పిచ్చింది కాబట్టి ఇక ఎస్సీల్లోని వెనకబడిన ఉపకులాల సమస్యలన్నిటికి పరిష్కారం దొరికిపోయిందని ఎవరైనా భావిస్తే వారికి నిరాశే ఎదురవుతుంది.అలా చూస్తే రిజర్వేషన్లే సామాజిక అణచివేతను, దళితుల వెనకబాటు పరిస్థితిని పరిష్కరించలేదు. సరళీకరణ విధానాలొచ్చిన తర్వాత (బూర్జువా పార్టీలన్నీ వీటిని అమలు చేస్తున్నాయి) రిజర్వేషన్లు ఇంకా నామమాత్రం అవుతున్నాయి. ఈ స్థితిలో వర్గీ కరణ పెద్ద మార్పు సాధిస్తుందని అనుకోరాదు. ఎస్సీలలోని కొన్ని తరగతులలో అసంతృప్తి కారణమవుతున్న ఒక అంశానికి తక్షణ పరిష్కారం చూపించడం ద్వారా ఐక్యతను పెంపొందించడం జరిగితే, అదే మనం ఆశించగల పెద్ద లాభం.

అసలైన పరిష్కారం వెనకబాటుకు కారణమైన మౌలిక అంశాలను పరిష్కరించడంలో ఉంది.ఇప్పటికీ దళితులను అట్టడుగు స్థాయికి కట్టిపడవేస్తున్న భూసంబంధాలను బద్దలుకొట్టాలి. భూపంపిణీ జరగాలి. నాణ్యమైన విద్య, వైద్యం, ఉద్యోగం, ఆహారం, ఆవాసం హక్కులుగా మారాలి. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు రావాలి. వీటిని సాధించుకుంటేనే దళితులకు, ఇతర బలహీన వర్గాలకు రిజర్వేషన్ల పరిమితులను దాటి తమ వెనకబాటుతనాన్ని అధిగమించేందుకు సత్తా వస్తుంది.

క్రీమీలేయర్ అవసరం లేదు

సుప్రీంకోర్టు తను పరిష్కరించాల్సిన 'వర్గీకరణ' వివాదంపై తీర్పు చెబుతూనే 'క్రీమీలేయర్'పై కూడా వ్యాఖ్యలను చేసింది. నలుగురు న్యాయమూర్తులు 'క్రీమీ లేయర్'ను ఎస్సీ, ఎస్టీలకు కూడా అనువర్తింప చేయాలని అభిప్రాయపడ్డారు. ఇది అమలు చేయాల్సిన తీర్పులో భాగం కాకపోయినా, వివాదాస్పద అంశం. ఎస్సీ, ఎస్టీలకు క్రీమీలేయర్ వుండకూడదని సీపీఐ(ఎం) అభిప్రాయం. చారిత్రకంగా ఎటువంటి ఆస్తిపాస్తులు కలిగివుండడానికి నోచుకోని ఎస్సీలలో ఇప్పటికీ స్థిరమైన ఆస్తిపాస్తులు కలిగిన స్పష్టమైన ఒక తరగతి ఏర్పడలేదు. కొద్దిమంది రాజకీయ నాయకులను, ఐఏఎస్, ఐపిఎస్ అధికారులను, కొద్దిమంది పరిశ్రమల యజమానుల పేర్లను చూపించి క్రీమీ లేయర్‌ను ప్రతిపాదించడం న్యాయం కాదు. ఈ కుటుంబాల చేతిలో తగినంత సంపద పోగుబడిందని, వారి సామాజికహోదా పెరిగిందని, అటువంటి కుటుంబాల సంఖ్య తగినంత మోతాదులో వుందని మాట వరసకు అంగీ కరించినా వాటి సంపద, సామాజిక హోదా తర్వాతి తరాలకు పాస్‌ఆన్ అవుతుందన్న పరిస్థితి లేదు. అటువంటప్పుడు ఎస్సీ తరగతిలో క్రీమీలేయర్ గురించి ఇప్పుడు చర్చించడం అసందర్భం.

నిబద్ధనేత, నిరాడంబరజీవి బుద్ధదేవ్

పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) అగ్రనాయకుడు బుద్ధదేవ్ భట్టాచార్యకు వంగదేశం అరుణాం జలితో అశ్రునివాళి అర్పించింది. ప్రగతిశీల రాజకీయాలు, ప్రజాస్వామిక విలువలు కోరుకునేవారందరికీ ఆయన మృతి విచారం కలిగించింది. రాజకీయ విభేదాలకు అతీతంగా ఆయనకు నేతలు నివాళులర్పించారు. అంతిమ యాత్రలో ప్రజలు పాల్గొన్న తీరు, ఎక్కడికక్కడ సామాన్యుల నుంచి కీలక నేతల దాకా ఆయనతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్న తీరు తనపట్ల ఎంతటి గౌరవాభిమానాలున్నదీ విదితం చేసింది. రాజకీయాల్లో విలువలు కనుమరుగవుతున్న ఈ తరుణంలో బుద్ధదేవ్ భట్టాచార్య తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో కనబరిచిన నిబద్ధత, నిరాడంబరత్వం, నిష్కపటత్వం వంటి విశిష్టతలను ఉదాహణలతో సహా ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. దేశంలో కీలకమైన బెంగాల్ వంటి పెద్ద రాష్ట్రానికి పదకొండేండ్లు ముఖ్యమంత్రిగా వున్నా సాదాసీదా అపార్ట్‌మెంట్‌లోనే ఆఖరిదాకా జీవితం గడిపిన ఆదర్శం ఆయనది.


తెలకపల్లి రవి

యువనేతగా ఆరంభం

కమ్యూనిస్టు ఉద్యమం సృష్టించిన త్యాగధనులలో మూడవ తరానికి చెందిన బుద్ధదేవ్ ప్రెసిడెన్సీ కాలేజీలో సాహిత్యం చదువుకుని విద్యార్థి సంఘాల ద్వారా 1966లో ఉద్యమంలో ప్రవేశించారు. ప్రమోద్ దాస్ గుప్తా తీర్చిదిద్దిన నాటి యువబృందంలో బిమన్ బోసు, సుభాస్ చక్రవర్తి, శ్యామల్ చక్రవర్తి, బుద్ధదేవ్ భట్టాచార్య, దినేష్ మజుందార్, అనిల్ బిశ్వాస్ వంటివారు ముఖ్యులు. వారిలో ఇప్పుడు ఒక్క బిమన్ బోసు మన మధ్య వున్నారు.1970లలో బెంగాల్‌లో అర్ధఫాసిస్టు బీభత్సకాండను,హత్యాకాండనూ తట్టుకుని నిలిచిన యువ నాయకత్వం అది. దేశానికి 1975లో ఎమర్జన్సీ వస్తే బెంగాల్‌లో అయిదేండ్ల ముందునుంచే ఈ బీభత్సకాండ తాండవించింది. సీపీఐ(ఎం) కార్యకర్తలు 1200 మంది బలికాగా వేలాది మంది ఇండ్లువదిలి ఎక్కడో తలదాచుకోవలసిన పరిస్థితి. అరాచకం తాండవించిన కాలమది. ఆ సమయంలో మొత్తం ఉద్యమ శ్రేణులు చెదరని స్థయిర్యంలో నిలబడటం వల్లనే దేశంలో రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమం కాపాడుకోవడం సాధ్యమైంది.

ఎమర్జన్సీ అనంతరం 1977 ఎన్నికల్లో తొలిసారి ఘన విజయం సాధించిన వామపక్ష సంఘటన మంత్రివర్గంలో బుద్ధదేవ్ సమాచార సాంస్కృతిక మంత్రి అయ్యారు.1982లో ఓడిపోయినా మళ్లీ 1987లో గెలిచి బాధ్యతలు చేపట్టారు.1996లో జ్యోతిబసు అనారోగ్యం తర్వాత కీలకమైన హోంశాఖ బాధ్యతలు నిర్వహించారు. 1985 నుంచి సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ తర్వాత పొలిట్‌బ్యూరో సభ్యుడిగా రాజకీయ నిర్ణయాల్లో సైద్ధాంతిక విధానాల్లో ముఖ్యపాత్ర పోషించారు. యువమంత్రిగా, డివైఎఫ్ఐ నాయకుడిగా ఆయన1979లో వరంగల్‌లో ఉమ్మడి రాష్ట్ర తొలి మహాసభలకు రావడం తెలుగునాట నాటి యువ నేతలందరికీ జ్ఞాపకమే. పాతికేళ్ల తర్వాత 2005లో అదే వరంగల్‌లో సీపీఐ(ఎం) మహాసభలలో చేసిన కీలక ప్రసంగం, అప్పటికి గుజరాత్ ముఖ్యమంత్రిగా వున్న నరేంద్రమోడీపై మతరాజకీయాలపై నిశిత విమర్శలు చేస్తే ఈ వ్యాసరచయిత అనువదించారు కూడా. "గుజరాత్‌లో జరిగిన మారణహోమానికి సాటి ముఖ్యమంత్రిగా నేను సిగ్గుపడు తున్నాను" అని బుద్ధదేవ్ తీవ్రస్వరంతో అన్నారు. వ్యక్తిగత మర్యాదలు ఎలా వున్నా రాజకీయ సిద్ధాంత విషయాల్లో రాజీ పడనితత్వం ఇక్కడే మనకు స్పష్టమవు తుంది.

విజయాలు.. విచ్ఛిన్నాలు..

23 ఏండ్లు ముఖ్యమంత్రిగా కొనసాగి దేశంలోనే కొత్తరికార్డు నెలకొల్పిన మహా నాయకుడు జ్యోతిబసు తర్వాత వామపక్ష కూటమి భవిష్యత్తు ఏదో అయిపోతుందని కొంతమంది రాజకీయ వ్యతిరేకులు కుత్సితంగా లేవనెత్తిన ప్రశ్నలకు సమర్థవంతమైన సమా ధానంగా బుద్ధదేవ్ శక్తిని చాటారు. జ్యోతిబసు రాజకీయ పాలనా వారసత్వాన్ని జయప్రదంగా కొనసా గించారు. కమ్యూనిస్టులకు సంబం ధించినంత వరకూ నాయకులపై ఎంత గౌరవం వున్నా విధానాలు, నిర్మాణం ముఖ్యమనే సత్యాన్ని నిరూపించారు. ఆయన హయాంలో జరిగిన మూడు ఎన్నికల్లోనూ ఫ్రంట్ విజయపరంపర కొనసాగింది. 2000 సంవత్సరంలో ప్రభుత్వ సారథ్యం చేపట్టిన బుద్ధదేవ్ నాయకత్వంలో 2006 ఎన్నికలలో 294కు 235 స్థానాలు రావడం సంచలనం సృష్టించింది. దాని కన్నా ముందు 2004 లోక్‌సభ ఎన్నికల్లోనూ 35 స్థానాలు వచ్చాయి. పార్లమెంటులో మొత్తం 60 స్థానాలతో ,42 సీట్లతో సీపీఐ(ఎం) వామపక్షం పాత్ర, ప్రతిష్ట శిఖరాగ్రానికి చేరాయి. కేంద్రంలో బీజేపీ మత రాజకీయాలకు అడ్డుకట్టవేశాయి. యుపిఎకు నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ ఆ రాజకీయ వాస్తవాలు తెలిసీ అవకాశవాద అణు ఒప్పందం చిచ్చుపెట్టక పోతే చరిత్ర మరోలా వుండేది. సరళీకరణ విధానాలను, భూ దోపిడీని వ్యతిరేకించినవే వామపక్షాలు కాగా ఆ ముద్రతో వాటిపైనే దాడిచేయడం పాలక వర్గాల వ్యూహమైంది. వామ పక్ష ఫ్రంట్ టార్గెట్‌గా సింగూరు, నందిగ్రామ్ ఘటనలపై అదేపనిగా ప్రచారాలు జరిగాయి. సింగూర్‌లో టాటాకార్ల ఫ్యాక్టరీ దాదాపు పూర్తవుతుంటే దాన్ని అడ్డుకోవడానికి ఆ రోజుల్లో మమతా బెనర్జీ చేసిన హడావుడి మర్చిపోరానిది. కాంగ్రెస్, మమతా బెనర్జీ తృణమూల్ మహాజోత్ పేరిట బుద్ధదేవ్ ప్రభుత్వాన్ని ఓడించడమే పరమార్థంగా వ్యవహరించాయి. మావోయిస్టు పార్టీ సహా గొంతుకలిపింది. వాటిలో కొన్ని తప్పొప్పులు లేవని కాదు గాని ప్రజలకు ఉపాధి పెంచాలన్నదే బుద్ధదేవ్ సంకల్పంగా వుండేది. ఆ పరిణామాలపై చాలా సమీక్షలే జరిగాయి. అనేక అధికారిక నివేదికలు తీర్పులు కూడా వచ్చాయి. సింగూరు విషయంలోనూ సుప్రీంకోర్టు బుద్ధదేవ్ ప్రభుత్వపాత్రను బలపర్చేలా తీర్పునిచ్చింది. ఇప్పుడు వాటిని సాకల్యంగా చూస్తే ఎవరికైనా పూర్తి నిజాలు తెలుస్తాయి.

బెంగాల్ ముఖ్యమంత్రిగా బుద్ధదేవ్ భట్టాచార్య పెట్టుబడిదారీ సంస్కరణల కోసం ప్రయత్నించారనీ, విఫలమైనారనీ శీర్షికలు వచ్చాయి.అప్పటికి పదేళ్ల సరళీకరణ విధానాల అమలు నేపథ్యంలో నూతన సహస్రాబ్ది తొలిపాదంలో అధికారం చేపట్టిన ఒక ప్రత్యామ్నాయ ప్రజాప్రభుత్వం ముందు ఎలాంటి సవాళ్లు వుంటాయనే వాస్తవికత లేని ప్రతికూల వ్యాఖ్యలవి, ఒకవైపున మతతత్వ రాజకీయాలు పెరుగుతున్న దశ. కేంద్రం సహకార నిరాకరణ, కార్పొరేట్ శక్తుల ప్రతికూలత, అపారిశ్రామికీకరణ (డీ ఇండస్ట్రియ లైజేషన్) నుంచి బెంగాల్‌ను ఎలా కాపాడు కోవాలనే సవాలు. ఆ క్రమంలో నూతన పారిశ్రామిక విధానం వచ్చింది.వాటిలో తప్పొ ప్పులు వుండొచ్చు గాని పారిశ్రామికీకరణ, ఉద్యోగ కల్పన లక్ష్యంలో తప్పులేదు. తొలిదశలో పాలక వర్గాల బడా మీడియా బుద్ధదేవ్ దార్శనికుడని, పిడివాదాన్ని వదిలేశాడని పైపైన పొగుడుతూనే ఆయన ప్రభుత్వం భూములు లాక్కొంటుందనే వ్యతిరేక ప్రచారాలు సాగించాయి. భూసంస్కరణలకు అమలులో అగ్రగామిగా నిలిచిన వామపక్ష కూటమి తదుపరి దశలో పారిశ్రామికీకరణ కోసం జరిపిన ప్రయత్నంలో కొన్ని పొరబాట్లున్న మాట నిజం. కానీ పాలకవర్గాలు, దారి తప్పిన కొన్నిశక్తులు పనిగట్టుకుని సాగించిన వ్యతిరేక ప్రచారాలే చాలా నష్టం చేశాయి. ఫలితమే 34 ఏండ్ల పాలన తర్వాత 2011లో వామపక్ష ఓటమి. వాటన్నిటినీ తట్టుకుని బుద్ధదేవ్ గట్టిగా నిలబడ్డారు. "(టాటాలు బెంగాల్ నుంచి తరలిపోవడం వల్ల) రాష్ట్రానికి చెప్పలేని నష్టం జరిగింది. నేను ఎక్కడ తప్పు చేశానా అని కొన్నిసార్లు ఆశ్చర్యం కలుగు తుంటుంది, భూ సేకరణే తప్పా, లేక భూ సేకరణ జరిగిన విధానమా? నేను ప్రతిపక్షాలపై మరీ మెతగ్గా వ్యవహరిం చానా? ఆ అనుభవాల నుంచి మనం పాఠాలు తీసుకోవాలి." అని ఆయన ఆత్మకథలో చెప్పారు ఫిర్‌దేఖా, ఫిర్‌దేఖా2 (సింహావలోకనం లాంటిది) అనే ఆ రెండు సంపుటాల్లో జీవితాన్ని రాజకీయ పాలనానుభవాలను నెమరువేసుకున్నారు.



కేంద్రం సహకార నిరాకరణ, కార్పొరేట్ శక్తుల ప్రతికూలత, అపారిశ్రామికీకరణ(డీ ఇండస్ట్రియలైజేషన్) నుంచి బెంగాల్‌ను ఎలా కాపాడుకోవాలనే సవాలు. ఆ క్రమంలో నూతన పారిశ్రామిక విధానం వచ్చింది.వాటిలో తప్పొప్పులు వుండొచ్చు గాని పారిశ్రామికీకరణ, ఉద్యోగ కల్పన లక్ష్యంలో తప్పులేదు. తొలిదశలో పాలక వర్గాల బడా మీడియా బుద్ధదేవ్ దార్శనికుడని, పిడివాదాన్ని వదిలేశాడని పైపైన పొగుడుతూనే ఆయన ప్రభుత్వం భూములు లాక్కొంటుందనే వ్యతిరేక ప్రచారాలు సాగించాయి. భూసంస్కరణలకు అమలులో అగ్రగామిగా నిలిచిన వామపక్షకూటమి తదుపరి దశలో పారిశ్రామికీకరణ కోసం జరిపిన ప్రయత్నంలో కొన్ని పొరబాట్లున్న మాట నిజం. కానీ పాలకవర్గాలు,దారి తప్పిన కొన్నిశక్తులు పనిగట్టుకుని సాగించిన వ్యతిరేక ప్రచారాలే చాలా నష్టం చేశాయి. ఫలితమే 34 ఏండ్ల పాలన తర్వాత 2011లో వామపక్ష ఓటమి.

ఆఖరుదాకా..ఆదర్శంగా...

వయోభారం, నిర్బంధాలు తట్టుకుంటూనే ఆరోగ్యం సహకరించినంతవరకూ సభలూ సమావేశాలలో పాల్గొంటూ తన పాత్ర నిర్వహిస్తూ వచ్చారు. 2011లో ఓడిపోయిన తన నియోజకవర్గం జాదవ్‌పూర్‌లో 2017లో పెద్ద మెజార్టీతో గెలిపించుకోగలిగారు. ఆయన భార్య మీరా భట్టాచార్య, కుమారుడు సుచేతన్ కూడా తోడుగా నిలిచారు. ఎంతటి కీలక బాధ్యతల్లో వున్నా బుద్ధదేవ్ ఎప్పుడూ సామాన్యజీవితమే గడిపారు. కార్యకర్తలతో కలసిపోయేవారు.గౌరవ మర్యాదలు పాటించినా మార్క్సిస్టు విలువలు, విధానాల విషయంలో రాజీ పడేవారూ కాదు. ఆయన నిరాడంబరత్వం, నిశితదృష్టి గురించి సహచరులు ప్రత్యేకంగా చెప్పుకునేవారు. పటాటోపాలను ఏనాడూ దరిచేరనివ్వని ఆయన ఎవరు ఎంతచెప్పినా పామ్ అవెన్యూలోని తన నిరాడంబర నివాసం మార్చుకోవడానికి ఒప్పుకోలేదు. ఎప్పుడో ప్రభుత్వంలో వున్నప్పుడు వచ్చిన పాత అంబాసిడర్ కారునే ఆఖరువరకూ ఆయన వాడేవారు. అందరితో స్నేహంగా, గౌరవంగా వుండేవారు. అనారోగ్యంలో పరామర్శించే పేరుతో ముఖ్యమంత్రి మమత గానీ, అప్పటి గవర్నర్ జగదీప్ ధంకర్ గానీ వంకర ప్రచారాలతో సీపీఐ(ఎం)పై బురదజల్లే ప్రయత్నం చేస్తే బుద్ధదేవ్‌భట్టాచార్య ఆయన భార్య చాలా గట్టిగా ఖండించేవారు.చివరి రోజుల్లో మోడీ ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డు ప్రకటిస్తే తీసుకోవడానికి నిరాకరించారు. ఆఖరుకు ఆయన మరణానంతరం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేస్తామని ప్రకటించి, తుపాకులతో వందనం సమర్పిస్తామంటే కూడా వారు నిరాకరించారు. బుద్ధదేవ్ వ్యక్తిత్వ ఒరవడి అలాంటిది.

కళ, సాహిత్య రంగాల్లో బుద్ధదేవ్ భట్టాచార్య కృషి ప్రత్యేకమైనది. ఆయన రచయిత, కవి, నాటకకర్త కూడా. ఇన్ని రాజకీయాల సిద్ధాంత ఘర్షణల మధ్యనా ఠాగూర్ పద్యాలను 500 దాకా కంఠోపాఠంగా చెప్పేవారట! ఇరవయ్యవ శతాబ్దపు పెట్టుబడిదారీ విధానం గురించి "అది అత్యద్భుతమైన కాలం..అదే అత్యంత అధ్వాన్నమైన కాలం" అన్న డికెన్స్ మాటలను తన సంభాషణల్లోనూ ప్రసంగాల్లోనూ తరచూ ప్రస్తావించేవారు, సంక్లిష్ట సృజన శిల్పానికి పేరొందిన కాఫ్కా, మార్క్వేజ్ వంటి వారి రచనలనూ బెంగాలీలోకి అనువదించారు. సమాంతర చిత్రాలకు పేరెన్నిక గన్న కొల్‌కతాలో నందన్ కానన్ కళాభవన్ పేరిట ఒక శాశ్వత వేదికను ఏర్పాటు చేయడానికి మంత్రిగా చొరవ తీసుకున్నారు. నామ్ చామ్‌స్కీ వంటి మేధావులను, ప్రపంచ విప్లవకారులను కొల్‌కతాకు పిలిపించి గౌరవించడం, వారి భావాలు తెలుసుకోవడం జరిగేది. ప్రముఖ బెంగాలీ దర్శకులు రచయితలతో లోతుగా చర్చలు చేసేవారు. ప్రసిద్ధ బెంగాలీ రచయిత సుకాంత భట్టాచార్య ఆయన బాబాయి.శ్రామికవర్గ ఉద్యమాలతో మమేకమై సిద్ధాంతాలను, సృజనశీలతనూ మేళవించి అదే సమయంలో ఉద్యమ నిర్మాణంలోనూ పాలనా వ్యవహారాలలోనూ రాటుదేలిన బుద్ధదేవ్ జీవితం భావితరాలకు ఓ పాఠం. ఆయనకిదే మరోసారి లాల్‌సలామ్.



ప్రజల హృదయాల్లోనే లౌకికవాదం

- రాష్ట్రంలోనూ విస్తరిస్తున్న మతోన్మాద విష సంస్కృతి
- విద్వేష ప్రచారాలను ఎండగట్టాలి : ఆర్టీఐ జాతీయ మాజీ కమిషనర్ డాక్టర్ మాడభూషి శ్రీధర్

నవతెలంగాణ-భువనగిరిఅర్బన్

రాజ్యాంగంలోని లౌకికవాదం అనే పదాన్ని తీసి వేస్తే పోయేది కాదని, ప్రజల హృదయాల్లో ఉందని ఆర్టీఐ జాతీయ మాజీ కమిషనర్ డాక్టర్ మాడభూషి శ్రీధర్ అన్నారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని శ్రీసాయి శ్రీనివాస్ ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 10, 11వ తేదీల్లో జరుగుతున్న ఆవాజ్ రాష్ట్ర రాజకీయ శిక్షణా తరగతుల సందర్భంగా 'రాజ్యాంగ హక్కులు-లౌకికవాదం ఎదురవుతున్న సవాళ్లు' అనే అంశంపై సదస్సును ఆహ్వానసంఘం అధ్యక్షులు మీరాచౌదరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ.. బీజేపీ పాలిత ప్రాంతాల్లో మైనార్టీలపై విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నాయని, అందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని సైతం ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. మతోన్మాద విష సంస్కృతి క్రమక్రమంగా రాష్ట్రంలోనూ విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మతోన్మాద శక్తులు తెలంగాణ ప్రజల మనస్సును కలుషితం చేస్తూ విద్వేషబీజాలు నాటుతున్నాయని విమర్శించారు. వందల ఏండ్లుగా అన్నదమ్ముల్లా కలిసిమెలిసి బతుకుతున్న ప్రజల మధ్య విభజన గీతలు గీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మతోన్మాద సంస్థలు సృష్టించిన అపోహలు, అపార్థాలను దూరం చేయాలని, మైనార్టీలపై జరుగుతున్న విద్వేష ప్రచారాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని, లౌకికవాదాన్ని, మతసామరస్య విధానాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని, రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణకై పోరాటాలు చేయాలని చెప్పారు. డాక్టర్ మహ్మద్ రియాజ్ మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలపై దాడులు చేయిస్తోందని ఆరోపించారు. పార్లమెంట్‌లో తన కూటమికి ఎన్నికల్లో సరిపోయే సీట్లు వస్తే దేశ రాజ్యాంగాన్ని మార్చడానికి సిద్ధపడ్డారని విమర్శించారు. బీజేపీ కుట్రలను తిప్పికొట్టేటట్టు ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. ఇది సెక్యులరిజం విజయమన్నారు. అంతకు ముందు శిక్షణా తరగతుల ప్రారంభ సూచికగా ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ మహ్మద్అన్సారి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖ న్యాయవాది ఎంఏ రహీం, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జహంగీర్, సయ్యద్‌హాషం, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎంఏ ఇక్బాల్, మీర్ ఖాజాహలీ, గౌరవ అధ్యక్షులు ఎస్‌కె.లతీఫ్ నాయకులు ఇమామ్‌పాషా, యూసుఫ్ అలీ, ముక్తార్ హుస్సేన్, షేక్ అమిత్ భాష,ఎండి పాషా, ఉమర్ అబ్దుల్ రెహమాన్, మహ్మత్ సాజిద్ పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యాలయం మాజీ కార్యదర్శి రామచంద్రరావు మృతి

- సురవరం, కూనంనేని సహా పలువురి నివాళి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ మాజీ కార్యదర్శి, కోశాధికారి ధూళిపాల సీతారామచంద్రరావు (డీఎస్ రామచంద్రరావు (89)) శనివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఉన్న సీఆర్ ఫౌండేషన్‌లో మరణించారు. తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో 1935లో ఆయన జన్మించారు. ఆయనకు ముగ్గురు కుమారులున్నారు. పెద్ద కుమారుడు నారాయణ లండన్‌లో స్థిరపడగా, రెండో కుమారుడు చింతామణి హైదరాబాద్‌లో, మూడో కుమారుడు రవి ఢిల్లీలో ఉన్నారు. రామచంద్రరావు 1964లో సీపీఐ ఉమ్మడి ఏపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శిగా బాధ్యతలను స్వీకరించి 2023 వరకు దాదాపు 60 ఏండ్ల పాటు సమర్థవంతంగా పని చేశారు. సీపీఐ అగ్ర నేతలు నీలం రాజశేఖర్, చండ్ర రాజేశ్వరరావు, తమ్మారెడ్డి సత్యనారాయణ, నల్లమల గిరిప్రసాద్, దాసరి నాగభూషణం, సురవరం సుధాకర్‌రెడ్డి, కె నారాయణ, చాడ వెంకటరెడ్డి హయాంలో రామచంద్రరావు పార్టీ ఆఫీస్ కార్యదర్శిగా, కోశాధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన ప్రతినిత్యం నాయకుల కన్నా ముందే కార్యాలయానికి వచ్చి అన్ని దినపత్రికలను చదివి అందులో ముఖ్యమైన వార్తలను కార్యదర్శులకు వివరించేవారు.

సీపీఐ నేతలు, ప్రముఖుల ఘననివాళి

మానవత్వం మూర్తీభవించిన గొప్ప మనిషి రామచంద్రరావు అని సీపీఐ నాయకులు, ప్రముఖులు కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. రామచంద్రరావు కమ్యూనిస్టు పార్టీ శాసనసభా పక్ష పార్టీ కార్యదర్శిగా, తర్వాత పార్టీ కార్యాలయ కార్యదర్శిగా ఆరు దశాబ్దాలపాటు సుదీర్ఘ కాలం నిబద్ధతతో సేవలందించారని సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి కొనియాడారు. కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ వద్ద ఉన్న రామచంద్రరావు భౌతిక కాయాన్ని సందర్శించి సురవరం సుధాకర్‌రెడ్డి, సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట రెడ్డి, తెలంగాణ మీడియా అకాడమి చైర్మెన్ కె శ్రీనివాస్‌రెడ్డి, భారత మాజీ రాయబారి టి సురేష్ బాబు, ఏఐటీయూసీ జాతీయ నాయకురాలు బీవి విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ పిజె చంద్రశేఖరరావు, సీఆర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు అజయ్ కుమార్, డిఎస్ కుమార్, ప్రతిభ, కోశాధికారి చెన్నకేశవరావు, హెల్త్ సెంటర్ డైరెక్టర్ కె రజిని నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రుల సందర్శనార్థం రామచంద్రరావు భౌతికకాయాన్ని హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌కు తరలించారు. చాడ వెంకట్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డితోపాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్యపద్మ, ఎన్ బాలమల్లేష్, ఈటి నరసింహ, పార్టీ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాపరెడ్డి పార్టీ పతాకాన్ని రామచంద్రరావు భౌతికకాయంపై కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన పార్థీవ దేహాన్ని గాంధీ మెడికల్ కళాశాలకు అప్పగించారు.

నారాయణ సంతాపం

రామచంద్రరావు మరణం పట్ల సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ సంతాపం తెలిపారు. కేరళలోని వాయనాడ్ వరద బాధితులకు సహాయక చర్యల కార్యక్రమంలో ఉన్న తాను రామచంద్రరావు పార్థీవ దేహాన్ని చివరిసారిగా చూడలేక పోతున్నందుకు ఎంతో బాధగా ఉందని పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో మోనార్క్ ట్రాక్టర్స్ విస్తరణ

- సీఎం రేవంత్‌రెడ్డి బృందానికి ఆ సంస్థ ప్రతినిధుల లేఖ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్‌లో తమ సంస్థ విస్తరణకు మోనార్క్ ట్రాక్టర్స్ సంస్థ ఆమోదం తెలిపింది. దానిలో భాగంగా ప్రస్తుతం హైదరాబాద్‌లోనే ఉన్న తమ పరిశోధన-అభివృద్ధి సంస్థను విస్తరించే ప్రణాళికలపై సంస్థ ప్రతినిధులు అమెరికాలో పర్యటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి బృందంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా హైటెక్, పర్యావరణ అనుకూల కంపెనీలను తాము తెలంగాణకు ఆహ్వానిస్తున్నామనీ, దానిలో భాగంగా మోనార్క్ ట్రాక్టర్స్ విస్తరణకు ప్రాధాన్యత ఇస్తామని సీఎం తెలిపారు. స్వయంప్రతిపత్తి, ఎలక్ట్రిక్ వాహనాల సాంకేతికతలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపామన్నారు. ఈ సందర్భంగా మోనార్క్ ట్రాక్టర్స్ సీఈఓ ప్రవీణ్ పెన్మెత్స మాట్లాడుతూ హైదరాబాద్‌లోని తమ ఆర్ అండ్ డీ కేంద్రం అధునాతన డ్రైవర్-ఆప్షన్ స్మార్ట్ ఎలక్ట్రిక్ ట్రాక్టర్‌లను రూపొందించడంలో కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రపంచంలోనే తొలిసారిగా డ్రైవర్‌తోనూ, డ్రైవర్ లేకుండానూ నడిచే స్మార్ట్ ఎలక్ట్రిక్ ట్రాక్టర్లతో మోనార్క్ ట్రాక్టర్స్ సాగు రంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నదని వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి బృందంతో చర్చలు ఫలప్రదమయ్యాయని చెప్పారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణే లక్ష్యం

- హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో ప్రహరీలు, కంచెలు
- 'జియోమ్యాపింగ్‌కు ప్రయత్నాలు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

హౌసింగ్ బోర్డు భూముల పరిరక్షణకు ఆ శాఖ ఉన్నతాధికారులు నడుం బిగించారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది ఎకరాలు కలిగి ఉన్న తెలంగాణ హౌసింగ్ బోర్డు భూములు పెద్దఎత్తున కబ్జాకు గురి కాగా మరికొన్ని కోర్టుల్లో వివాదాల్లో నలుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఎటువంటి వివాదం లేకుండా కబ్జాకు గురికాని భూములను పరిరక్షించాలన్న అధికారుల ప్రతిపాదనకు సర్కారు ఆమోద ముద్ర వేసింది. ఈ మేరకు అందుకు అవసరమైన నిధులను సైతం కేటాయించింది. ఆ మేరకు ఉన్నతాధికారులు సంబంధిత భూములను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ బోర్డు, డెక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్ లిమిటెడ్(దిల్) సంస్థల ఆధీనంలో ఉన్న భూములపై సర్కారు కీలక నిర్ణయం తీసుకున్నది. హౌసింగ్ బోర్డు ఆధీనంలో ఉన్న భూములు ఆక్రమణలు, కబ్జాలకు గురికాకుండా ఆ భూముల చుట్టూ కంచెలు నిర్మించనుంది. అలాగే జియో గ్రాఫికల్ మ్యాపింగ్ చేయాలని భావిస్తున్నది. ఈ విషయంలో ఇంతకుముందే అధికారులు ఒక రిపోర్టును ప్రభుత్వానికి పంపగా, అందుకు అవసరమైన నిధులను ఇటీవల ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో హౌసింగ్ బోర్డు, దిల్ పరిధిలో ఉన్న భూముల చుట్టూ ప్రహరీలు నిర్మించనున్నారు. జియోగ్రాఫికల్ మ్యాపింగ్ సాంకేతికతతో కూడుకున్న అంశం కావడంతో సంబంధిత కంపెనీతో ఒప్పందం చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

'హౌసింగ్' భూముల అసలు కథేంటీ?

రాష్ట్రంలోని నగర కేంద్రాల్లో పేద, మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధర(అఫర్డబుల్ ప్రైస్)కే ఇండ్లను నిర్మించేందుకు ప్రభుత్వం ఈ హౌసింగ్ బోర్డును ఏర్పాటు చేసిన విషయం విదితమే. అయితే, హైదరాబాద్ స్టేట్‌గా ఉన్నప్పుడే ఏడవ అసఫ్ జా గా పేరొందిన మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ దీన్ని 'సిటీ ఇంప్రూమెంట్ బోర్డు'గా ఏర్పాటు చేశారు. భారత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 1960వ దశకంలో దీన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ హౌసింగ్ బోర్డుగా మార్చారు. రాష్ట్ర విభజన అనంతరం హైదరాబాద్ తదితర తెలంగాణ జిల్లాల్లోని భూములు తెలంగాణ హౌసింగ్ బోర్డుకు కేటాయించినట్టు అధికారులు చెబుతున్నారు.

రాష్ట్ర పరిధిలోని పట్టణ ప్రాంత మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధరకే అనువైన ఇండ్లను నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం హౌసింగ్ బోర్డు పరిధిలో 5,045 ఎకరాలు, దిల్ కింద 1,800 ఎకరాలను సేకరించింది. హౌసింగ్ బోర్డు కింద మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డితోపాటు నిజామాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఇండ్ల నిర్మాణాల కోసం 4,230 ఎకరాలను వినియోగించారు. దాదాపు 124 ఎకరాల మేర న్యాయ సంబంధిత అంశాల్లో (లిటిగేషన్), కబ్జా వివాదాల్లో చిక్కుకున్నాయి.

మరో 691 ఎకరాల భూమి మాత్రమే హౌసింగ్ బోర్డు పరిధిలో ఉంది. మరోవైపు దిల్ పరిధిలోనూ 900-1000 ఎకరాల వరకు పలు వివాదాల్లో ఉన్నట్టు తెలిసింది. అంటే 800 ఎకరాలు మాత్రమే వివాదాలు లేని భూమి ఉంది. ఏపీ, తెలంగాణ విభజన తరువాత ఈ భూముల పంపకాల్లో వివాదాలు తలెత్తడంతో అప్పటి కేంద్ర ప్రభుత్వం వీటిని షెడ్యూల్ 9 లో చేర్చింది.

రాష్ట్రాలు విడిపోయి పదేండ్లవుతున్నా ఈ సమస్యకు పరిష్కారం లభించలేదు. అయితే, హౌసింగ్, దిల్ భూములు కబ్జాల బారిన పడకుండా కాపాడుకోవాలని తెలంగాణ ప్రభుత్వం కత నిశ్చయంతో ఉందని ఆర్ అండ్ బీ అధికారులు చెబుతున్నారు. హౌసింగ్ బోర్డు భూములు హైదరాబాద్‌లో 84 శాతం, జిల్లా కేంద్రాల్లో 26 శాతం ఉన్నట్టు అంచనా.

రెండు విడతలుగా చర్యలు

హౌసింగ్ బోర్డు భూములను పరిరక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం రెండు విడతలుగా చర్యలు చేపట్టనున్నది. తొలి విడతగా ఇదివరకే పనులు నిర్వహించేందుకు పది రోజుల క్రితమే టెండర్లను పిలిచింది. రెండో విడతకూ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వాటికీ ఇటీవల టెండర్లను ఆహ్వానించారు. మొత్తం 17 ప్రాంతాల్లో ప్రహరీలు, కంచెలు నిర్మించనున్నారు. ఈ నిర్మాణాలు పూర్తయ్యే సరికి ఏడాదిన్నర కాలం పడుతుందని ఆర్ అండ్ బీ శాఖ పేరు రాయడానికి ఇష్టపడని ఒక ఉన్నతాధికారి చెప్పారు. వీలైనంత తొందరగా నిర్మాణాలు చేపట్టనున్నట్టు తెలిసింది. కోర్టుల్లో వివాదాలున్న భూములకు మాత్రం తాము కంచె వేయలేమనీ, కబ్జాకు గురైన వాటిని తిరిగి పొందేందుకు న్యాయ పరంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

ఘనంగా టీఎస్ యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు

- రాష్ట్ర వ్యాప్తంగా జెండా ఆవిష్కరణలు

నవతెలంగాణ -విలేకరులు



50 ఏండ్ల ప్రస్థానం.. విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతర సమరం

విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సుదీర్ఘకాలంగా అలుపెరగని పోరాటాలు చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. 50ఏండ్ల సుదీర్ఘ ప్రస్థానం నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సంఘం వేడుకలు జరిగాయి. నేతలు జెండాలు ఆవిష్కరించారు.

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీఎస్‌యూటీఎఫ్ భవనం వద్ద జిల్లా అధ్యక్షులు స్వామి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులను ఏకం చేస్తూ 1974 ఆగస్టు 10న యూటీఎఫ్ ఆవిర్భావం జరిగిందన్నారు.

50 ఏండ్ల ప్రస్థానంలో విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా జెండా ఆవిష్కరించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని టీఎస్‌యూటీఎఫ్ సంఘ భవనంలో నిర్వహించిన ఆవిర్భావ వేడుకలకు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి వైద్య శాంతి కుమారి హాజరయ్యారు.సంగారెడ్డి పట్టణంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయ ప్రాంగణంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా.. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, సీపీఎస్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వై.జ్ఞాన మంజరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేట పట్టణంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో స్వర్ణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి జెండాను ఆవిష్కరించారు.ఉద్యమాల సారథి.. ఉపాధ్యాయుల పెన్నిధి యూటీఎఫ్ అని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా యూటీఎఫ్ వ్యవస్థాపక నాయకులు ఆర్.రాంరెడ్డి, కె.రామదాస్ అన్నారు. కార్యాలయంలో పతాకాన్ని ఆర్.రాంరెడ్డి ఎగరవేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో యూటీఎఫ్ పతాకావిష్కరణ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పూర్వ కోశాధికారి యం.లక్ష్మయ్య ఎగురవేశారు. జోగులాంబ గద్వాల జిల్లా కార్యాలయంలో సీనియర్ నాయకులు రామన్‌గౌడ్ జెండాను ఆవిష్కరించారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో యూటీఎఫ్ సీనియర్ నాయకురాలు, జిల్లా కార్యదర్శి ఎస్.నీలమ్మ పతాక ఆవిష్కరణ చేశారు.



కేరళకు ఏఐకేఎస్
రూ. కోటి సహాయం

- కేరళ సీఎం పినరయి విజయన్‌కు అందజేత
- ఆల్ ఇండియా వాయనాడ్ రిలీఫ్ ఫండ్‌కు ఏఐకేఎస్ పిలుపు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఇటీవలి కేరళలోని వయనాడ్‌లో కొండ చరియలు విరగడంతో జరిగిన విధ్వంసం నుంచి కోలుకునేందుకు అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్), కేరళ కర్షక సంఘం చేయూత అందించాయి. రూ.కోటి సహాయం అందించాయి. ఈ మేరకు తిరువనంతపురంలోని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను ఏఐకేఎస్, కేరళ కర్షక సంఘం నేతల బృందం కలిసి రూ. కోటి చెక్కును అందజేసింది. వాయనాడ్ కొండచరియల ఉపశమనం, పునరావాసం కోసం డిస్ట్రెస్ రిలీఫ్ ఫండ్‌ను అందజేసింది. అంతకు ముందే ఏఐకేఎస్ రూ.5 లక్షలు ఇచ్చింది. ఆగస్టు 10న ఆల్ ఇండియా వాయనాడ్ రిలీఫ్ ఫండ్‌కు పిలుపునిచ్చింది. అలాగే తమిళనాడు వివసాయిగల్ సంఘం (ఏఐకేఎస్ అనుబంధం) కూడా వాయనాడ్ రిలీఫ్ ఫండ్‌కి రూ.లక్ష విరాళంగా అందించింది. కేరళ కర్షక సంఘం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 27,000 కంటే ఎక్కువ ప్రాథమిక యూనిట్ల నుండి రూ. కోటి వసూలు చేసింది.

ఈ సందర్భంగా ఏఐకేఎస్, కేరళ కర్షక సంఘం నేతల బృందం వాయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రదేశాలను సందర్శించింది. అక్కడి పరిస్థితులను స్థానికులను అడిగి తెలుసుకుంది. ఈ బృందంలో ఏఐకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూ కృష్ణన్, ఉపాధ్యక్షులు ఈపి జయరాజన్, ఆర్థిక కార్యదర్శి పి.కృష్ణప్రసాద్, కేరళ కర్షక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. విజయకుమార్, వల్సన్ పనోలి, ఉపాధ్యక్షులు ఎం. మెహబూబ్, సంయుక్త కార్యదర్శి విఎస్. పద్మకుమార్, కోశాధికారి గోపి కొత్తమురికల్, సికెసి సభ్యుడు కె.కె.రఘేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.ఆర్.సకీనా, పి.శశి, పి.ఎం.ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.

హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు

- 120కు పైగా రహదారులు మూసివేత

షిమ్లా : హిమాచల్‌ప్రదేశ్‌లో గత కొన్ని రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నెల 16వ తేదీ వరకూ కూడా రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ శనివారం హెచ్చరించింది. కాగా, భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడ్డం, ఆకస్మిక వరదలు సంభవించి రాష్ట్రంలో అనేక రహదారులు దెబ్బతిన్నాయి.

దెబ్బతిన్న కారణంగా 120కు పైగా రహదారులను మూసివేశారు. రాష్ట్రంలో శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం వరకూ నహన్‌లో అత్యధికంగా 168.3 మీమీ వర్షపాతం నమోదయింది.

ఇల్లు పాయె...గుడిసె పాయె

కేసీఆర్ నిర్వాకంపై మంత్రి పొంగులేటి ఎద్దేవా

- త్వరలో అధికారులు మాజీ సీఎం సొంతూరిలో పర్యటిస్తారు
- పేదల ఇండ్లను పూర్తి చేస్తాం
- చింతమడక బాధితులకు మంత్రి హామీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మాజీ సీఎం కేసీఆర్‌ను నమ్ముకున్న సొంతూరి పేదలకు ఇల్లు రాకపాయె...గుడిసె రాకపాయె అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎద్దేవా చేశారు. చింతమడక గ్రామంలో అధికారులు పర్యటిస్తారని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో చింతమడక గ్రామానికి చెందిన కొంత మంది బాధితులు తాము ఎదుర్కొంటున్న ఇండ్ల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆ గ్రామంలో త్వరలో ఇండ్ల నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. 'ఎనకట ఒకడు ఉన్న ఇల్లు పీకి పందిరి వేసినట్టు'గా చింతమడకలో మాజీ సీఎం కేసీఆర్ పనితనముందని విమర్శించారు. తన పుట్టినిల్లు అయిన చింతమడక గ్రామంలో సీఎం హోదాలో ఐదేండ్ల క్రితం డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టిస్తానంటూ పేదోళ్ల ఇండ్లన్నీ కూల్చి వేశారని గుర్తు చేశారు. ఇప్పటివరకు వారికి నిలువ నీడ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి మార్గనిర్దేశం చేస్తానంటూ ప్రగల్భాలు పలికిన ఆయన ఉన్న ఊరోళ్లనే పట్టించుకోలేదని విమర్శించారు. 'చింతమడకలో ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తానని 22 జులై 2019లో ఆర్భాటంగా ప్రకటించారు. ఆయన చేసిన ప్రకటనను నమ్మి తమ ఇండ్లను, గుడిసెలను అక్కడి నిరుపేదలు సర్కారుకు అప్పగించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం వాటిని కూల్చి వేశారు. కేసీఆర్ హామీమేరకు లబ్దిదారులను గుర్తించి 1909 ఇండ్లను అధికారులు మంజూరు చేశారు. కానీ 1215 ఇండ్లను నిర్మించేందుకు కాంట్రాక్టర్లతో ఒప్పందం చేసుకున్నారు. ఇంకా 694 ఇండ్లకు ఒప్పందం జరగలేదు. నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. గత ఏడాది డిసెంబర్ నాటికి నాలుగేండ్లలో 1103 ఇండ్లను మాత్రమే పూర్తి చేశారు. ఇంకా 148 ఇండ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఇండ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో దాదాపు 60 నుంచి 70 కుటుంబాలు ఉన్న ఇంటిని, గుడిసెలను కోల్పోయి రోడ్డున పడ్డాయి. పొలం గట్ల దగ్గర గుడిసెలు వేసుకున్నారు. మరి కొంతమంది ఇతర ప్రాంతాలకు వలస పోయారు. ఇండ్ల కోసం ఐదేండ్లుగా కండ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. కానీ ఇల్లు రాలేదు ఉన్న ఇల్లు పోయింది. గుడిసె పోయింది. లబ్దిదారులకు కేటాయించిన కొన్ని ఇండ్లకు తాళం చెవులు ఇచ్చి హ్యాండ్ ఓవర్ చేయలేదు. చేసిన ఇండ్లకు కనీస సౌకర్యాలు కల్పించలేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రారంభోత్సవానికి
సీతారామ మూడు పంపులు రెడీ

మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

సీతారామ ప్రాజెక్ట్‌కు చెందిన మూడు పంప్‌హౌజ్‌లు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి యన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ చేతుల మీదుగా ఆగస్టు 15న శ్రీకారం చుడతామన్నారు. ఇందులో భాగంగా ఆదివారం ట్రయల్‌రన్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సీతారామ ప్రాజెక్ట్‌కు చెందిన మూడు పంప్‌హౌస్‌ల ప్రారంభోత్సవ ఏర్పాట్లతోపాటు సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ అనుమతులపై ఆయన శనివారం హైదరాబాద్ సచివాలయంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల శాఖా కార్యదర్శి రాహుల్ బొజ్జా, సహాయ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీ జి అనిల్ కుమార్, డిప్యూటీ ఈఎన్సీ కె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. పంపుల ప్రారంభోత్సవం రోజున ఖమ్మం జిల్లా వైరాలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్‌కు గోదావరి జలాల నుంచి 67 టీఎంసీల కేటాయింపుల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిందన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణపు పనులను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. ప్రాజెక్ట్ నిర్మాణపు అనుమతులు చివరి దశలో ఉన్నాయన్నారు. జీఆర్‌ఎంబీ త్వరలో అనుమతి ఇవ్వనుందన్నారు. అదే సమయంలో సుప్రీంకోర్టుతో పాటు కేంద్ర పర్యావరణం అటవీ శాఖాల అనుమతులపై దష్టి సారించి సంబంధిత కేంద్ర ప్రభుత్వ అధికారులతో సంప్రదింపులు జరపాలని సూచించారు. అదే సమయంలో కాలువల నిర్మాణంలో అడ్డుగా ఉన్న రైల్వే క్రాసింగ్‌ల వద్ద నిర్మాణం ఆగిపోకుండా ఉండేలా ఆ శాఖతో చర్చించి ఒక నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్యాకేజ్ 1, 2లకు సరిపడా భూసేకరణను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ఈ రెండు ప్యాకేజీలకు అవసరమయ్యే 3,000 ఎకరాల భూసేకరణ సత్వరమే చేపట్టగలిగితే, నిర్దేశిత లక్ష్యానికి చేరుకోగలుతామని మంత్రి స్పష్టం చేశారు. త్వరితగతిన ఈ ప్రాజెక్టు పూర్తయితే మూడు లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణతో పాటు కొత్తగా రెండు లక్షలా 60 వేల ఎకరాల ఆయకట్టు సేద్యంలోకి వస్తుందన్నారు.

దోపిడీ బాబాలపై చర్యలు తీసుకోవాలి

- వారి వల్లే గ్రామాల్లో ప్రజల మధ్య దాడులు : విజ్ఞాన దర్శిని రాష్ట్ర అధ్యక్షులు రమేష్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

బాణామతి, చేతబడి పేర్లతో దయ్యాలు, భూతాలు, సైతాన్‌ను వదిలిస్తామంటూ ప్రజలను మోసం చేస్తూ దోచుకుంటున్న బాబాలు, మంత్రగాళ్లపై చర్యలు తీసుకోవాలని విజ్ఞాన దర్శిని రాష్ట్ర అధ్యక్షులు రమేష్ ప్రభుత్వానికి, డీజీపీకి విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కొంత మంది బాబాలు ఆధ్యాత్మికతను వ్యాపారంగా మార్చుకుని, ప్రజలను లైంగికంగా, ఆర్థికంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. వీరి వల్ల ప్రశాంతంగా ఉండే గ్రామాల్లో చేతబడి పేరుతో దాడులు జరుగుతున్నా యన్నారు. ప్రజల రోగాలు తగ్గిస్తామని మోసాలకు పాల్పడుతున్నారని, ఇది డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ మ్యాజికల్ రెమెడీస్ చట్టం ప్రకారం నేరమని చెప్పారు.

బాధిత మహిళలు స్థానిక పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతున్నదన్నారు. చాలా మంది అమాయక ప్రజలు ఈ బాబాలు, మంత్ర గాళ్లు, భూత వైద్యులను నమ్మి ఆర్థికంగా మోసపోతున్నారని తెలిపారు. వెంటనే అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బయ్యారం స్టీల్‌ప్లాంట్ వస్తేనే మల్కాన్‌గిరి రైల్వేలైన్‌తో ఉపయోగం

- ఆ దిశగా ప్రధాని మోడీ నిర్ణయాలు తీసుకోవాలి : బీఆర్ఎస్ మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటైతేనే పాండురంగపురం-మల్కాన్‌గిరి రైల్వే లైన్ రాష్ట్రానికి ఉపయోగపడుతుందని బీఆర్ఎస్ ఎంపీ బీ వినోద్‌కుమార్ తెలిపారు. శనివారంనాడిక్కడి తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఎమ్ శ్రీనివాస్‌రెడ్డి, దిండిగాల రాజేందర్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రం రైల్వేలైన్‌ను ప్రకటించినందున వెంటనే బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుపై కూడా ప్రధాని మోడీ నిర్ణయం తీసుకోవాలని కోరారు. భద్రాచలంలో రైల్వేస్టేషన్ లేదనీ, కొత్తగూడెం నుంచి మణుగూరు వెళ్లే దారిలో పాండురంగపురం రైల్వేస్టేషన్ ఉన్నదనీ, అక్కడి నుంచి మల్కాన్‌గిరి రైల్వేలైన్‌కు అనుసంధానం అవుతుందన్నారు. బయ్యారం ఉక్కు తెలంగాణ హక్కు అనీ, అక్కడికి రైల్వేలైన్ లేకపోవడం కూడా ఉక్కు ఫ్యాక్టరీ రాకపోవడానికి ఓ కారణమని అభిప్రాయపడ్డారు. అందువల్ల పాండురంగపురం-మల్కాన్‌గిరి స్వాగతించదగిందేననీ, అయితే దీనిపై కేంద్రం తీసుకొనే నిర్ణయం కీలకమని అన్నారు.

రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నా ఉపయోగం సున్నా అని విమర్శించారు. విభజన చట్టంలోని హామీల అమలుకు వారు కృషి చేయాలని కోరారు. బయ్యారంలో 300 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పాదక ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని గతంలోనే స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతిపాదించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ ఉక్కు ఫ్యాక్టరీ వస్తే 4 వేల మందికి ప్రత్యక్షంగా, పది వేల మందికి పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయని వివరించారు. అయితే ఈ రైల్వేలైన్‌లో మార్పులు చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌తో స్వయంగా భేటీ అయ్యి, చర్చించిన విషయం తెలిసిందే.

క్రెడాయ్ ప్రాపర్టీ షోలో శ్రీలీలా సందడి

- నేటితో ముగియనున్న ప్రదర్శన
- నివాసాల ఎంపికకు ఉత్తమ మార్గం



హైదరాబాద్ : ప్రముఖ రియల్ ఎస్టేట్ ఆర్గనైజేషన్ క్రెడాయ్ నగరంలోని కొంపల్లిలో ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షోకు విశేష స్పందన వస్తోంది. రెండో రోజూ శనివారం ఈ ప్రదర్శనకు టాలీవుడ్ నటీ శ్రీలీలా హాజరై సందడి చేశారు. హైదరాబాద్‌లో అత్యుత్తమ రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రదర్శించే అద్భుతమైన ఈవెంట్‌ను నిర్వహించినందుకు క్రెడాయ్ బృందాన్ని శ్రీలీలా అభినందించారు. నగరంలో రియల్ ఎస్టేట్ రంగం అనూహ్యంగా అభివృద్ధి చెందుతోందన్నారు. డెవలపర్‌లందరికీ ఆమె అభినందనలు తెలిపారు. ఈ నగరంలో సొంత ఇంటిని సొంతం చేసుకోవాలనే వారి కలను సాకారం చేసుకోవడానికి, సౌలభ్యంతో కూడిన జీవితాన్ని ఆస్వాదించాలనే కుటుంబాలకు ఇదే సరైన సమయమన్నారు.

కొంపల్లిలోని శ్రీకన్వెన్షన్ సెంటర్‌లో 2వ క్రెడాయిబిలిటీ ప్రాపర్టీ షో ఆగస్టు 11 వరకు నిర్వహించనున్నారు. నేటితో ముగియనున్న ఈ ప్రదర్శనలో అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లు, విల్లాలు, ప్లాట్లు, వాణిజ్య స్థలాలు వంటి అనేక రకాల ప్రాజెక్టులను డెవలపర్లు ప్రదర్శించారు. నగరంలోని అత్యుత్తమ రియల్ ఎస్టేట్ ఆఫర్‌లను అన్వేషించడానికి ఈ ప్రత్యేక అవకాశాన్ని కోల్పోవద్దని క్రెడాయ్ హైదరాబాద్ ప్రతినిధులు సూచించారు.

కొత్త అంగన్‌వాడీ సెంటర్లను మంజూరు చేయండి

కేంద్ర ప్రభుత్వానికి మంత్రి సీతక్క విజ్ఞప్తి

- సానుకూల స్పందన



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాలకు కొత్త అంగన్‌వాడీ సెంటర్లను మంజూరు చేయాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ సెంటర్లలో మెరుగైన సేవలందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక సహకారాన్ని పెంచాలని కోరారు. దేశంలోని అన్ని రాష్ట్రాల మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రులతో కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా రాష్ట్రాల్లోని మహిళా శిశు సంక్షేమ శాఖల్లో అమలవుతున్న పథకాలు, ఎదురవుతున్న సవాళ్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ తెలంగాణలో అమలవుతున్న ప్రత్యేక సంక్షేమ పథకాలను వివరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అవసరాలను కేంద్రం ముందుంచారు. ఏజెన్సీ ప్రాంతాలకు కొత్త అంగన్ వాడీ సెంటర్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు వినియోగిస్తున్న మొబైల్ ఫోన్ల స్థానంలో ట్యాబ్‌లు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 35,700 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడు నెల్ల నుంచి ఆరేండ్ల మధ్య వయసు గల 14, 83, 940 మంది చిన్నారులకు, 3,45,458 మంది గర్భిణీ, బాలింతలకు సేవలందిస్తున్నట్టు తెలిపారు. 3,989 మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీ సెంటర్లుగా అప్ గ్రేడ్ చేసినట్టు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నర్సరీ క్లాస్‌లను త్వరలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. టీచర్లకు అవసరమైన శిక్షణను పూర్తి చేసినట్టు వివరించారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా అంగన్‌వాడీ చిన్నారులకు రంగు రంగుల యూనిఫారాలు ఇవ్వబోతున్నట్టు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బుక్ ర్యాక్స్, చౌకీలు, ప్లేయిన్ మాట్స్, థీమ్ బేస్డ్ పెయింటింగ్స్ తదితర మౌలిక సదుపాయాలను అందిస్తున్నట్టు చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లకు నెలకు రూ. 13,650, ఆయాలకు రూ. 7,800 చొప్పున గౌరవ వేతనం అందజేస్తున్నట్టు చెప్పారు. వారి వేతనాల్లో 67 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందనీ, కేంద్రం తన వాటాను పెంచాలని కోరారు. అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా కిశోర బాలికల్లో రక్తహీనత తగ్గించడానికి రాగి లడ్డూలను ప్రయోగాత్మంగా మూడు జిల్లాలో ప్రారంభించినట్టు తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ ద్వారా జూలై మాసంలో 2,755 మంది పిల్లలను రెస్క్యూ చేసినట్టు చెప్పారు. అకస్మాత్తుగా మరణించిన అంగన్‌వాడీ టీచర్ల అంత్యక్రియల కోసం రూ. 20 వేలు, ఆయాలకు రూ. 10 వేలు అందజేస్తున్నట్టు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్కతో పాటు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, కమీషనర్ కాంతి వెస్లీ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీతక్క ప్రతిపాదనలకు కేంద్ర మంత్రి అన్నపూర్ణా దేవి సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం కోరిన విధంగా కొత్త అంగన్‌వాడీ సెంటర్ల మంజూరుపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. మిని అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ అంగన్‌వాడీ సెంటర్లుగా తెలంగాణలో అప్ గ్రేడ్ చేయడాన్ని కేంద్ర మంత్రి అభినందించారు. మరిన్ని మినీ సెంటర్లను అప్ గ్రేడ్ చేసేందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. తమ ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించినందుకు సీతక్క కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

సాలార్‌జంగ్ మ్యూజియంలో కళావీర ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియం వేదికగా 'కళావీర' కళ ప్రదర్శన ప్రారంభమైంది. సంప్రదాయ ఎగ్జిబిషన్లకు భిన్నంగా, చీరలు, షర్టులు, టైలు, చొక్కాలు నవతరం లుంగీలు వంటి ఉత్పత్తులను ఇందులో ప్రదర్శిస్తున్నారు. పత్రికా సమాచార కార్యాలయం(పీఐబీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అదనపు డైరెక్టర్ జనరల్ శతిపాటిల్ ఈ ప్రదర్శనను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల వ్యక్తీకరణలు, భావనలను ఒక కళాకారుడు, భిన్న ఉత్పత్తులపై గీయడం చాలా ప్రత్యేకమైన అంశమని చెప్పారు. కళాకారులు రూపొందించిన ఈ కళ సజనలు అరుదైనవే కాదు, భిన్నత్వాన్నీ కలిగి ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఈ ఉత్పత్తులను కనుగొనడం చాలా అరుదు అని, కళావీర ప్రదర్శనలో మధ్యప్రదేశ్, అసోం, ఒడిశా తదితర రాష్ట్రాలకు చెందిన వివిధ గిరిజన కళారూపాలను వివిధ రకాల వస్త్రాలపై చిత్రీకరించడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. కళ అనేది ఊహకు, వాస్తవికత మధ్య సరితూగే సున్నితమైన అంశమని అభిప్రాయపడ్డారు. కళ అనేది కాలానికి, స్థలానికి అతీతంగా మాట్లాడే నిశ్శబ్ద భాషగా వర్ణించారు. కళా ప్రదర్శనలో పాల్గొన్న కళాకారిణి శిఖా అజ్మీరా గురించి ప్రస్తావిస్తూ, ఆమె సాధారణ ఉత్పత్తులను సైతం అసాధారణంగా మార్చిన తీరును అభినందించారు. 'కళావీర' ప్రదర్శనను, ప్రముఖ ఆర్టిస్ట్ శిఖా అజ్మీరా రూపొందించారని చెప్పారు. వీక్షకుల కోసం ప్రత్యేకంగా చేతితో వేసిన పెయింటింగ్ ఉత్పత్తులను ఆమె ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో ఒడిశా ప్రముఖ పట్టచిత్ర కళా రూపాన్ని చీరల్లో పొందుపరిచారు. మధ్యప్రదేశ్‌కు చెందిన గోండు కళ, అస్సాం గిరిజన కళారూపాలను ఆమె చీరల్లో ఒడిసిపట్టారు. తాజ్‌మహల్‌ను కూడా చీరపై అందంగా చేతితో పెయింట్ చేశారు. ఈ సందర్భంగా చిత్రకారిణి శిఖా అజ్మీరా మాట్లాడుతూ దుస్తులు, ఇతర వస్తువులు, సరుకులకు జీవం పోసేలా 'కారిగరి ఆఫ్ కలర్స్'ని రూపొందించామని చెప్పారు. రూపొందించిన ప్రతి ఉత్పత్తిని జాగ్రత్తగా చేతితో పెయింట్ చేయడం జరిగిందన్నారు. ప్రతి బ్రష్ స్ట్రోక్ ఆకర్షణీయమైన, అద్భుతమైన రూపకల్పనకు దోహదం చేస్తుందని గుర్తు చేశారు. మేము రూపొందించిన ప్రతి వస్తువుకు కళాత్మక స్పర్శను జోడించడం జరిగిందని అభిప్రాయపడ్డారు. ఈ వస్తువులకు ప్రత్యేకతను సంతరించుకునేందుకు భిన్నమైన రంగులను ఉపయోగిస్తామన్నారు. 'కళావీర' ఆర్ట్ ఎగ్జిబిషన్ హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియం లో ఆగస్టు 13వ తేదీ వరకు జరగనుంది. సాలార్‌జంగ్ మ్యూజియం ఉన్నతాధికారులు, సిబ్బంది కార్యక్రమానికి హాజరయ్యారు.

తెలంగాణలో అధికారంలోకి రావడమే లక్ష్యం

- త్వరలో అధ్యక్షుడిని నియమిస్తా
- పాత కమిటీల రద్దు : ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటన



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణలో అధికారంలోకి రావడమే లక్ష్యమని ఆ పార్టీ అధినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. టీడీపీకి త్వరలోనే అధ్యక్షుడిని నియమిస్తామని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో పార్టీ బలోపేతం, సభ్యత్వాల నమోదుపై చర్చించారు. నాలుగు దశాబ్దాల్లో పార్టీ ఎత్తుపల్లాలు, విజయాలను ప్రస్తావించిన ఆయన అన్నింటినీ తట్టుకుని నిలబడ్డామని గుర్తు చేశారు. 'చాలా రోజులైంది..అందరినీ చూసేందుకు వచ్చా..పార్టీ కోసం కష్టపడ్డ వారికి నేను రావడం ఉత్సాహానిస్తుంది..తెలంగాణలో పార్టీని బలోపేతం చేయాలని అభిమానులు, కార్యకర్తలు కోరుతున్నారు..కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో గత ఎన్నికల్లో పోటీచేయలేదు, అధ్యక్షుడిని నియమించ లేదు.. ఇక్కడి ప్రజల మనోభావాలను గౌరవిస్తా.. త్వరలోనే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని నియమిస్తా..ఒకప్పుడు తెలంగాణలో తెలుగుదేశం బలమైన పార్టీ..కొన్ని కారణాలతో బలహీనమయ్యాం..సామరస్యంగా మంచి వాతావరణంలో రెండు రాష్ట్రాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా' అని చంద్రబాబు వివరించారు. త్వరలో గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణంపై దృష్టిపెడతామని చెప్పారు. 15 రోజుల్లో తెలంగాణలో సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. యువకులు, బీసీలకు పెద్దపీట వేస్తామని అభిప్రాయపడ్డారు. సభ్యత్వ నమోదు తర్వాతనే టీటీడీపీ అధ్యక్షుడి ఎన్నిక ఉంటుందని స్పష్టం చేశారు. టీటీడీపీలో పాత కమిటీలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. పార్లమెంటు, అసెంబ్లీ సెగ్మెంట్‌ల వారీగా ఉన్న కమిటీల స్థానంలో కొత్తవి నియమిస్తామన్నారు. ఏపీ తరహాలోనే కష్టపడి పనిచేయాలని కార్యకర్తలకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రతినెలా రెండో శనివారం , ఆదివారం తెలంగాణకు వస్తానని చెప్పారు.

భారీస్వాగతం

చంద్రబాబు రాక నేపథ్యంలో ఎన్టీఆర్ భవన్‌కు భారీసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు చేరుకున్నారు. ఎన్టీఆర్ భవన్‌లో జోష్ నెలకొంది. ఈ సందర్భంగా టీటీడీపీ నేతలు బాబును ఘనంగా సన్మానించారు. జూబ్లీహిల్స్‌లోని బాబు నివాసం నుంచి ట్రస్ట్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు.

అక్రమ నిర్మాణాలు, కబ్జాలపై ఉక్కుపాదం

- 45 ఏండ్లల్లో 61శాతం తగ్గిన చెరువులు, కుంటల విస్తీర్ణం
- కబ్జాదారుల గుండెల్లో గుబులు రేపుతున్న హైడ్రా
- రాజేంద్ర నగర్‌లో కట్టడాల కూల్చివేతలు
- అక్రమాలపై కఠిన చర్యలు: హైడ్రా కమిషనర్





నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాలు, కబ్జాలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. ఎన్ఆర్ఎస్‌సీ (నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్) నివేదిక మేరకు 1979-2024 (మధ్యకాలంలో) ఈ 45ఏండ్లలో నగరంలో దాదాపు 61శాతం కుంటల విస్తీర్ణం తగ్గినట్టు తేలింది. 39 శాతం (విస్తీరణలో) మాత్రమే చెరువులు, కుంటలు మిగిలాయి. వాటిని సైతం కబ్జాదారులు వదలడం లేదు. ఈ క్రమంలో వాటిని పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. నగరంలో చెరువులు, పార్కులు, నాలాలను పరిరక్షించడంతోపాటు ఆక్రమణలు, భూ కబ్జాలను అరికట్టేందుకు ప్రత్యేకంగా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా)ని ఏర్పాటు చేశారు. హైడ్రాకు ఐజీ ఏవీ రంగనాథ్‌ను కమిషనర్‌గా నియామకం చేసిన విషయం తెలిసిందే. కమిషనర్ నేతృత్వంలో పనిచేస్తున్న హైడ్రా ముందుకు దూసుకెళ్తోంది. రాజకీయాలకు అతీతంగా ట్రై సిటీలో ఎక్కడ అక్రమ నిర్మాణాలను గుర్తించినా, ఫిర్యాదులు వచ్చినా క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటిని నేలమట్టం చేస్తుండటంతో భూ కబ్జాదారులు, స్థానిక నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు స్వాధీనం చేసుకున్న హైడ్రా బృందాలు

రాజేంద్రనగర్‌లో అక్రమంగా నిర్మించిన భవనాలను శనివారం హైడ్రా బృందాలు కూల్చేశాయి. శిరాంపల్లి, చందానగర్‌లో చెరువులను కబ్జా చేసి ఎఫ్.టీ.ఎల్ బఫర్ జోన్‌లో పెద్దఎత్తున భవనాలు నిర్మిస్తున్నారని హైడ్రా విభాగానికి ఫిర్యాదులు అందాయి. కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా బృందాలు బూముఖా ఉద్ దవాశ్ చెరువులో అక్రమంగా నిర్మాణాలు చేపట్టినట్టు గుర్తించింది. ఈ క్రమంలో బఫర్ జోన్‌లో నిర్మించిన పలు భవనాలు, నిర్మాణంలో ఉన్న మరో భవనంతో పాటు, ప్రహరీ గోడలు, ఆక్రమ లేవుట్లు, ఎర్ల చెరువుకు సంబంధించి చందానగర్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న భవనాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. సైబరాబాద్ పోలీసుల పర్యవేక్షణలో ఈ కూల్చివేతలు సాగాయి. దీంతో బూముఖా ఉద్ దవాశ్ చెరువు ఎఫ్.టి.ఎల్‌కు సంబంధించి దాదాపు పది ఎకరాల భూమిని హైడ్రా విభాగం అధికారులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు.

స్థిరాస్తులు కొనుగోలు చేసే ముందు పరిశీలించాలి

నగరంలో స్థిరాస్తులు కొనుగోలు చేసే ముందు నగరవాసులు జాగ్రత్తగా పరిశీలించాలి. ముఖ్యంగా నాలాలు, చెరువులు, బఫర్‌జోన్ పరిసరాల్లో ఇంటి స్థలాలు, అపార్ట్‌మెంట్స్, వ్యక్తిగత ఇండ్లు కొనుగోలు చేసేముందుగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తక్కువ ధరకు ఇంటి స్థలాలు, అపార్టుమెంట్లు లభిస్తున్నాయని కొనుగోలు చేస్తే నష్టపోయే అవకాశముంది. సులువుగా డబ్బులు సంపాదించాలని కొందరు భూకబ్జాదారులు, స్థానిక నాయకులు ప్రభుత్వ భూములు, పార్కులు, నాలాలు, చెరువులను కబ్జాచేసి ఇండ్లను నిర్మిస్తున్నారు. కొనుగోలుదారులు ముఖ్యంగా చెరువుకు కనీసం 30 మీటర్ల బఫర్ జోన్ పరిధిలో ఉందా లేదా అనేది పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు.

అక్రమ నిర్మాణాలపై సమాచారం ఇవ్వండి

చెరువులకు సంబంధించిన బఫర్ జోన్ల పరిధిలో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టినా, ప్రస్తుతం చేపడుతున్నా వెంటనే స్థానిక ప్రజలతో పాటు స్వచ్ఛంధ సంస్థలు సమాచారం అందించాలని హైడ్రా కమిషనర్ ఐజీ ఏవీ రంగనాథ్ సూచించారు.

కఠిన చర్యలు తప్పవు: కమిషనర్

ట్రై సిటీ పరిధిలో చెరువులకు సంబంధించిన బఫర్ జోన్లు. ఎఫ్‌టీఎల్ పరిధిలో రియల్టర్లు, బిల్డర్లు అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ ఐజీ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలకు సహకరించిన వారిపై సైతం చర్యలు తీసుకుంటామన్నారు.

బిల్డర్లకు, రియల్టర్లకు ప్రభుత్వ అధికారులు సహకరించినట్టు తేలితే వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



మల్లారెడ్డి యూనివర్సిటీలో ఉద్రిక్తత

- విద్యార్థి మృతిపై విద్యార్థి సంఘాల ఆందోళన
- యూనివర్సిటీలో అంబులెన్స్ సౌకర్యం లేకపోవడం పట్ల ఆగ్రహం

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఈ యూనివర్సిటీలో రెండ్రోజుల కిందట అగ్రికల్చర్ బీఎస్సీ మొదటి సంవత్సరం విద్యార్థి అరుణ్ కుమార్ పరీక్ష హాల్‌లో అకస్మాత్తుగా పడిపోయి ప్రాణం కోల్పోయాడు. అయితే, యూనివర్సిటీలో సమయానికి అంబులెన్స్ అందుబాటులో ఉండి ఉంటే అరుణ్ కుమార్ బతికేవాడని పలువురు విద్యార్థులు తెలిపారు. దాంతో శనివారం పలు విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థులతో కలిసి యూనివర్సిటీలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కళాశాల యాజమాన్యం లక్షలకు లక్షలు ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే యూనివర్సిటీలో అంబులెన్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

అదే విధంగా, తాము ఆందోళన చేస్తున్న సమయంలో అసభ్యకరంగా ప్రవర్తించిన ఫ్యాకల్టీని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసన జరుగుతుండగా కొందరు కళాశాల భవనాలపైకి రాళ్లు విసిరారు. దాంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని విద్యార్థులతో చర్చించి శాంతింపజేశారు.

గాజాలో మరో స్కూలుపై దాడి

(మొదటిపేజీ తరువాయి)

ఉపయోగిస్తున్నాయని ఇజ్రాయిల్ ఆరోపించింది. అందుకు తగిన సాక్ష్యాధారాలను చూపలేదు. ఈ స్కూల్లో 20మందికి పైగా తీవ్రవాదులున్నారని, అందుకే దాడి చేశామని చెప్పుకుంటోంది. ఈ దాడిని ఈజిప్ట్, జోర్డాన్, సౌదీ అరేబియా, ఖతార్, ఇరాన్, ఇయు సహా పలు దేశాలు తీవ్రంగా ఖండించాయి. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని విమర్శించాయి. ఒక పక్క కాల్పుల విరమణ ఒప్పందం కోసం చర్చలు జరగాలని కసరత్తు చేస్తుంటే మరోపక్క ఇలా స్కూళ్ళపై దాడులు చేయడమంటే ఆ ప్రతిపాదిత చర్చలను దెబ్బతీయడమేనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గాజా దారుణాల్లో ఇది మరో రోజని పాలస్తీనా శరణార్థుల వ్యవహారాల సంస్థ (యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ) అధినేత వ్యాఖ్యానించారు. తక్షణమే కాల్పుల విరమణ జరగాలని డిమాండ్ చేశారు. ఐక్యరాజ్య సమితి ఇటువంటి ఊచకోతలను ఏ రకంగానూ సమర్థించుకోలేదని యురోపియన్ యూనియన్ విదేశీ వ్యవహారాల ప్రతినిధి జోసెఫ్ బోరెల్ వ్యాఖ్యానించారు. అమాయకులైన పౌరుల హత్యలను ఆపగలిగేది, బందీలైన ఇజ్రాయిలీల విడుదలకు మార్గం సుగమం చేసేది కాల్పుల విరమణ ఒప్పందమేనని అటువంటి దాన్ని వ్యతిరేకిస్తున్నారంటూ ఇజ్రాయిల్ ఆర్థిక మంత్రిని ఆయన విమర్శించారు. ఆ స్కూలుపై దాడిని కతార్ విదేశాంగ శాఖ కూడా తీవ్రంగా ఖండించింది. నిర్వాసితులైన, నిరాయుధులైన పౌరులపై ఇటువంటి కిరాతకమైన దాడి జరపడమంటే వారి ప్రాథమిక హక్కులన్నీ దారుణంగా ఉల్లంఘిస్తున్నట్టేనని విమర్శించింది. ఇలా స్కూళ్ళపై జరుపుతున్న దాడులపై వెంటనే స్వతంత్ర ఐక్యరాజ్య సమితి దర్యాప్తు అధికారులతో విచారణ జరిపించాల్సిన అవసరముందని అన్నారు. ఆగస్టులో ఈ పది రోజుల్లోనే 8 స్కూళ్లపై దాడులు జరిపింది. సౌదీ అరేబియా కూడా ఈ దాడిని తీవ్రంగా ఖండించింది. తక్షణమే ఈ ఊచకోతలను ఆపాల్సిన అవసరముందని పేర్కొంది. గాజాపై గత 10మాసాలుగా కొనసాగుతున్న దాడుల్లో ఇప్పటివరకు 39,790మంది మరణించగా, 92702 మంది గాయపడ్డారు.

ఇవన్నీ ఊచకోతలే : ఐక్యరాజ్య సమితి ఖండన

ఒకసారి ఆస్పత్రి, మరోసారి స్కూలు, ఇంకోసారి శరణార్థుల శిబిరం, సురక్షిత ప్రాంతం ఇలా ఎక్కడైనా ఎప్పుడైనా పాలస్తీనియన్లను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ ఊచకోతలకు పాల్పడుతోందని ఐక్యరాజ్య సమితి ప్రత్యేక దూత, మానవ హక్కుల నిపుణురాలు ఫ్రాన్సెసా అల్బనీస్ విమర్శించారు. ఈ మేరకు ఆమె ఎక్స్‌లో పోస్టు పెట్టారు. పాలస్తీనా ప్రాంతాల్లో మానవ హక్కుల పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ఐక్యరాజ్య సమితి ప్రత్యేకంగా ఆమెను నియమించింది. అమెరికా, యూరోపియన్ యూనియన్ అందచేసిన ఆయు ధాలను ఉపయోగించి ఈ దాడులకు పాల్పడుతోందని అన్నారు. పాలస్తీనియన్లను కాపాడడంలో మనందరి వైఫల్యాన్ని వారు క్షమించాలని ఆమె వ్యాఖ్యానించారు.

బీసీ గురుకుల వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు

- సంస్థ కార్యదర్శి బడుగు సైదులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలల్లో (బీఎస్సీ హానర్స్) మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఈనెల 12 నుంచి అందుబాటులో ఉంటాయని సంస్థ కార్యదర్శి బడుగు సైదులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో తెలంగాణ ప్రభుత్వ ఇఎపిసెట్- 2024ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థినీలు ఆన్‌లైన్ ttps://mjptbcwreis.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వనపర్తి, కరీంనగర్‌లో ఉన్న మహిళా వ్యవసాయ డిగ్రీ కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థినీలు ఈనెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇఎపీసెట్-2024 ప్రవేశ పరీక్షలో సాధించిన ర్యాంకు, రిజర్వేషన్ ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేస్తామని ఆయన తెలిపారు. సీటు సాధించిన వారు కాలేజీ హాస్టల్ లోనే ఉండాలని ఆయన స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న విద్యార్థినీ తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.1,50,000, పట్టణ ప్రాంతాల్లో నివసించే వారి వార్షిక ఆదాయం రూ.2,00,000 మించని విద్యార్థినీలు మాత్రమే అర్హులని తెలిపారు . దరఖాస్తు చేయడంలో ఏమైనా సందేహాలు ఉంటే కార్యాలయ పనివేళల్లో 040-23328266 ఫోన్ నెంబర్లో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

ఫైలేరియా నివారణకు ప్రాధాన్యం

- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఫైలేరియా (బోదకాలు), నులిపురుగుల నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. దీనికోసం సంగారెడ్డి, మహబూబాబాద్ జిల్లాల్లోని 14 ఆరోగ్య కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. దీనిలో 2,600 మంది సిబ్బందిని భాగస్వామ్యం చేశామన్నారు. జాతీయ ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలనా దినం సందర్భంగా కేంద్ర ఆయుష్, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల మంత్రి ప్రతాప్ రావు జాదవ్ అధ్యక్షతన వర్చువల్‌గా జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రాష్ట్రంలో ఫైలేరియా, నులిపురుగుల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను కేంద్రమంత్రికి వివరించారు. అనంతరం అవగాహనా కరపత్రాలు, బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర మంత్రులు వర్చువల్‌లోనే ఆయా వ్యాధుల నివారణకు ఉద్దేశించిన ఐవర్‌మెక్టిన్, డీఈసీ మాత్రలను వేసుకున్నారు. ప్రజలంతా ఈ మాత్రలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖల ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా తదితరులు పాల్గొన్నారు.

'ఉచితాల'పై బీజేపీ రివర్స్ గేర్



హర్యానా, మహారాష్ట్రలో నిధుల వరద

• గతంలో కాంగ్రెస్ హామీలపై ఎత్తిపొడుపులు • ఇప్పుడు వాటినే అమలు చేస్తున్న వైనం • అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు ఎత్తుగడలు

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికలు దేశ రాజకీయాలను తిరిగి సమతూకం చేశాయి. జూన్ 4న ఫలితాలు వెలువడిన తర్వాత ఈ విషయం అందరికీ తెలిసొస్తోంది. దశాబ్ద కాలం పాటు తీవ్ర నిరాశానిస్పృహలకు లోనైన ప్రతిపక్షం తిరిగి జవసత్వాలు కూడగట్టుకుంది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి సవాలు విసురుతోంది.

కాంగ్రెస్ తన ఎన్నికల ప్రచారం సందర్భంగా పలు ప్రజా సమస్యలను లేవనెత్తింది. నిరుద్యోగ సమస్యను ప్రస్తావించింది. ఉపాధి కల్పన కోసం నిరుద్యోగ యువతకు రాయితీలు, ఇంటర్న్‌షిప్ ప్రణాళికను ప్రకటించింది. పేదలు, నిరుద్యోగులు, అన్నదాతలకు నగదు బదిలీలు చేస్తామని తెలిపింది. అన్ని ప్రధాన పంటల కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పిస్తామని, రైతు రుణాలు మాఫీ చేస్తామని చెప్పింది. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి, అట్టడుగు వర్గాల ప్రజలకు ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చింది. కాంగ్రెస్ ఇచ్చిన పలు హామీలను బీజేపీ అప్పట్లో హేళన చేసింది. ఉచితాలు అనర్థదాయకమని సుద్దులు చెప్పింది. కుల సంబంధమైన అంశాలన్నింటినీ విస్మరించింది. ముఖ్యంగా హిందూ ఓట్లను సంఘటిత పరిచేందుకు విశ్వ ప్రయత్నం చేసింది.

ఉచితాల తాయిలాలు చూపించి ఓట్లు దండుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్న అభిప్రాయాలు కూడా అప్పట్లో వ్యక్తమయ్యాయి. అయితే ఎన్నికల ఫలితాలు వెలువడి, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితిలో స్పష్టమైన మార్పు కన్పిస్తోంది. ఎన్నికల ప్రచార సమయంలో తాను ఏ కాంగ్రెస్ హామీలనైతే తేలికగా తీసుకొని కొట్టిపారేసిందో ఇప్పుడు వాటినే ఎన్డీఏ సర్కారు అందిపుచ్చుకుంటోంది. కాంగ్రెస్ ఇచ్చిన కొన్ని హామీలను అమలు చేయడం మొదలు పెట్టింది కూడా. నిరుద్యోగ సవాలును ఎదుర్కొనేందుకు బడ్జెట్‌లో కొన్ని కేటాయింపులు చేశారు. హామీలు ఇచ్చారు. ఉద్యోగులను అధిక సంఖ్యలో తీసుకొనే కంపెనీలకు ప్రోత్సాహకాలు ఇస్తామని చెప్పారు. రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో కోటి మంది యువతకు ఇంటర్న్‌షిప్ కల్పిస్తామని తెలిపారు. వాస్తవానికి ఈ హామీలు కాంగ్రెస్ మ్యానిఫెస్టో నుండి కాపీ చేసినవే.

హర్యానాలో ఏం జరుగుతోంది?

త్వరలో శాసనసభ ఎన్నికల బరిలో దిగబోతున్న బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు కనీస మద్దతు ధరల వ్యవస్థను ఇప్పటికే విస్తరించాయి. ఉదాహరణకు హర్యానా ప్రభుత్వం రాష్ట్రంలోని మొత్తం 24 పంటలకూ ఎంఎస్‌పీ ఇస్తోంది. అక్కడ గతంలో 14 పంటలకు మాత్రమే ఎంఎస్‌పీ అందేది. హర్యానాలో ఇప్పుడు ఉచితాల వరద పారుతోంది. 46 లక్షల కుటుంబాలకు కేవలం ఐదు వందల రూపాయలకే ఎల్పీజీ సిలిండర్ అందిస్తున్నారు. పాఠశాల విద్యార్థినులకు ఉచితంగా పాలు ఇస్తున్నారు. సాగునీటిపై విధించే సెస్సును రద్దు చేశారు. లక్ష రూపాయల కంటే తక్కువ వార్షిక ఆదాయం ఉన్న కుటుంబాల వారికి నెలకు వెయ్యి కిలోమీటర్ల దూరం వరకూ ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నారు. ప్రతిపక్షాల పాలనలో ఉన్న ఢిల్లీ, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. హర్యానాలో ఓబీసీల క్రీమిలేయర్ ఆదాయ పరిమితిని ఆరు లక్షల రూపాయల నుండి ఎనిమిది లక్షల రూపాయలకు పెంచారు. ఈ చర్యలన్నీ రాబోయే శాసనసభ ఎన్నికల్లో ఓట్లు కొల్లగొట్టేందుకేనని వేరే చెప్పాల్సిన అవసరం లేదు.

మహారాష్ట్రలో ఖజానాకు గండి

త్వరలో మహారాష్ట్రలో కూడా శాసనసభ ఎన్నికలు జరగబోతున్నాయి. అక్కడి ప్రభుత్వం సైతం ఉచితాల వర్షం కురిపిస్తోంది. ఫలితంగా ప్రభుత్వ ఖజానాపై సంవత్సరానికి రూ.96,000 కోట్ల భారం పడుతుంది.

కులగణనపై పిల్లిమొగ్గలు

సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ వేసిన కొన్ని ఎత్తుగడలు ఫలించలేదు. కులం విషయంలో బీజేపీ మరోసారి ఇబ్బందులు పడుతోంది. కనీసం 2021లో జరగాల్సిన జనాభా లెక్కల సేకరణ గురించి కూడా మాట్లాడడం లేదు. బీసీల ఉప వర్గీకరణ గురించి మాట్లాడుతున్న బీజేపీ, దానిని పరిశీలించేందుకు ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి.రోహిణి నేతృత్వంలో ఓ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అయితే ఆ కమిషన్ నివేదికను మాత్రం బయట పెట్టడం లేదు. ఉప వర్గీకరణకు సుముఖత వ్యక్తం చేస్తే కులగణన అనివార్యం అవుతుంది. అదే జరిగితే రాహుల్‌కు మరో విజయం అందించినట్లు అవుతుంది. ఒకవేళ కులగణనకు విముఖత చూపితే హిందూ ఓట్లు కులాల వారీగా చీలిపోయే అవకాశం ఉంది. ప్రస్తుతం కాంగ్రెస్ ఏ హిందీ రాష్ట్రంలోనూ అధికారంలో లేదు కనుక తమాషా చూస్తూ కుర్చుంటోంది. రాజ్యాంగ సవరణ అంశాన్ని ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ నాయకులు ప్రస్తావించారు. కానీ ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు.

ఆదాయ పరిమితికి లోబడి మహిళలు, యువత, సీనియర్ సిటిజన్లకు నగదు బదిలీలు చేస్తున్నారు. సబ్సిడీలు అందిస్తున్నారు. వర్కారీలకు (పుండరీకుని భక్తులైన హిందువులు. వీరికి కులమనేది ఉండదు. రాష్ట్రంలో వీరి సంఖ్య 16 లక్షల వరకూ ఉంటుందని అంచనా) కూడా సబ్సిడీలు లభిస్తున్నాయి. ఏటా పండరిపురం తీర్థయాత్రకు వెళ్లే వర్కారీలకు సబ్సిడీలు ఇస్తారు. 2027లో ఉత్తరప్రదేశ్ శాసనసభకు ఎన్నికలు జరుగుతాయి. దానికి ముందే అక్కడి యోగి ప్రభుత్వం కన్వరియాలకు కూడా ఇలాంటి సబ్సిడీలనే అందించే అవకాశాలు ఉన్నాయి.

మహారాష్ట్రలో రెండున్నర లక్షల రూపాయల వార్షిక ఆదాయం కంటే తక్కువ ఉన్న 21-65 సంవత్సరాల మధ్య వయసున్న మహిళలకు నెలకు పదిహేను వందల రూపాయల చొప్పున స్టయిఫండ్ ఇస్తున్నారు. దీనివల్ల ఏటా ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం అక్షరాలా రూ.46,000 కోట్లు. 12వ తరగతి పాసైన విద్యార్థులు, డిప్లొమా హోల్డర్లు, పట్టభద్రులకు కూడా శిక్షణ, నైపుణ్యం కోసం ఆరు నెలల పాటు స్టయిఫండ్ ఇస్తారు. ఐదుగురు సభ్యులున్న ప్రతి కుటుంబానికి సంవత్సరానికి మూడు ఉచిత ఎల్పీజీ సిలిండర్లు లభిస్తాయి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎద్దేవా చేసిన బీజేపీ, ఇప్పుడు వాటిలో కొన్నింటిని ఓట్ల కోసం అమలు చేయడం గమనార్హం.

రాహుల్ సవాలుకు జవాబేది?

ఎన్ని కులాలు ఉన్నప్పటికీ హిందువులందరూ మోడీకి మద్దతు ఇవ్వడం వల్లనే ఆయన ప్రధాని కాగలిగారు. బీజేపీ నేతలు హిందూత్వ వాదాన్ని రెచ్చగొట్టి అధికారాన్ని దక్కించుకున్నారు. అంటే దేశాన్ని పాలిస్తున్నది ఒక విధంగా కులం, మతమే. ఇప్పుడు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా కులం జపం చేయడం మొదలు పెట్టారు. కులగణనను తెర పైకి తెచ్చారు. తాము అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని ఎన్నికల సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. పార్లమెంట్ నుండే కులగణన చేస్తామని ప్రకటించారు. రాహుల్ సవాలుకు దీటుగా స్పందించడంలో బీజేపీ పూర్తిగా విఫలమైంది. కానీ బీజేపీ ముఖ్యమంత్రులు మాత్రం కుల ప్రస్తావన తెస్తూనే ఉన్నారు. నూతన వక్ఫ్ బిల్లుపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ మాట్లాడుతూ 'ల్యాండ్ జిహాద్' ప్రస్తావన చేశారు. 'లవ్ జిహాద్'కు పాల్పడితే జీవితకాల కారాగార శిక్ష విధిస్తామని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చెబుతున్నారు. ఇందుకోసం ఆయన చట్ట సవరణను ప్రతిపాదించారు కూడా. ఓ కులానికి చెందిన వారు జనాభాను నియంత్రించడం లేదని రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ నిందించారు.

ఐక్య ఉద్యమాలే సింగరేణికి రక్ష

• తెలంగాణ బొగ్గుపై హక్కు సింగరేణికే • ప్రయివేటు పరమైతే ప్రజలపై భారాలు • విద్యుత్ చార్జీలు పెరిగే ప్రమాదం • అన్ని కార్మిక సంఘాలు కలిసి పనిచేయాలి • కార్మికులే కాదు ప్రజలూ పోరాటంలో భాగస్వాములు కావాలి • వామపక్ష పార్టీలపై గురుతర బాధ్యత • త్వరలో గవర్నర్, సీఎంను కలుస్తాం • కేంద్రంపై ఒత్తిడికి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి : నవతెలంగాణతో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య



'సింగరేణి సంస్థ పరిరక్షణకు ఐక్య ఉద్యమాలే రక్ష. తెలంగాణ బొగ్గుగనులపై సింగరేణికే హక్కు ఉంటుంది. ఎనిమిది మంది ఎంపీలను గెలిపించినందుకు శ్రావణపల్లి బొగ్గుబ్లాకును వేలంపాట చేయడమే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన బహుమానం. బొగ్గుగనుల శాఖ మంత్రి తెలంగాణకు చెందిన కిషన్‌రెడ్డి ఉన్నా వేలంపాట నిర్వహించడం, తెలంగాణకు అన్యాయం చేయడం దురదృష్టకరం. వేలంపాట రద్దయ్యేదాకా ఈ పోరాటం ఆగదు. సింగరేణి ప్రయివేటుపరం అయితే ప్రజలపై భారాలు పడతాయి. సింగరేణి ప్రాంతాల్లో సంక్షేమానికి నిధులు ఆగిపోతాయి. ఇప్పటిదాకా సింగరేణి ఉత్పత్తి చేస్తే బొగ్గు చౌకధరకు లభిస్తోంది. ప్రయివేటు సంస్థలు ఉత్పత్తి చేస్తే బొగ్గు పిరం అవుతుంది. అప్పుడు విద్యుత్ చార్జీలు పెరిగే ప్రమాదం లేకపోలేదు. అందుకే సింగరేణి సంస్థను పరిరక్షించుకునే బాధ్యత కార్మికులపైనే కాకుండా ప్రజలపైనా ఉన్నది. అందుకోసం జరిగే పోరాటంలో ప్రజలంతా భాగస్వాములు కావాలి. వామపక్ష పార్టీలపై సింగరేణిని కాపాడుకునే గురుతరమైన బాధ్యత ఉన్నది. వేలంపాటను రద్దు చేయాలనీ, తెలంగాణలోని బొగ్గుబ్లాకులను నేరుగా సింగరేణికే కేటాయించాలని కోరుతూ త్వరలోనే గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలుస్తాం. అమెరికా పర్యటన నుంచి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డినీ కలుస్తాం. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడం కోసం రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి. ఈ బస్సుయాత్ర ఆరంభం మాత్రమే. ప్రభుత్వ నిర్ణయాన్ని బట్టి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తాం.'అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. ఇటీవల చేపట్టిన సింగరేణి పరిరక్షణ యాత్ర ముగిసిన నేపథ్యంలో ఆయన నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్‌కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

ఈ సమస్యకున్న రాజకీయ ప్రాధాన్యతను వివరించండి?

'బొగ్గుగని కార్మికులు, ఆ ప్రాంతంలోని ప్రజలంతా కాంగ్రెస్ లేదా బీజేపీకి ఓట్లేశారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎనిమిది మంది ఎంపీలు గెలిచారు. ఫలితాలు వచ్చిన నెలరోజులకే సింగరేణికి ఇంత కష్టం వస్తుందని ఎవరూ ఊహించలేదు. బొగ్గు మంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణ వ్యక్తి అయినా, సింగరేణికి బీజేపీ ఇంత ద్రోహం చేస్తుందని అనుకోలేదంటున్నారు. ఇంకోవైపు వేలంపాటలో కిషన్‌రెడ్డి పక్కన ఉప ముఖ్యమంత్రి భట్టి కూర్చున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాల్గొనాల్సింది కాదు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ వేలంపాటపై ఒకే అభిప్రాయంతో ఉండడం వల్ల కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి కొట్టగలమా అనే ప్రశ్న ప్రజల్లో ఉన్నది. 2021లో కోయగూడెం, సత్తుపల్లి బ్లాకులను ప్రయివేటువారికి అప్పగించారు. ఆ మూడు పార్టీలు ప్రత్యక్షంగా, పరోక్షంగా దానికి అనుకూలం. వేలంపాటను వ్యతిరేకించే పార్టీలు వామపక్ష పార్టీలు మాత్రమే. సింగరేణిని పరిరక్షించాల్సిన బాధ్యత ఆ పార్టీలపైనే ఉన్నది. కార్మిక సంఘాలన్నీ ఐక్యం కావాలి.

గతనెల 29న యాత్ర చేపట్టాం. అదే రోజు కేంద్ర బొగ్గుగనుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కోయగూడెం, సత్తుపల్లి బొగ్గుబ్లాకుల్లో తవ్వకాలకు ఉన్న అడ్డంకులను తొలగించాలని చెప్పింది. రాష్ట్రంలో ఎనిమిది మంది ఎంపీలను గెలిపించినందుకు బీజేపీ ప్రజలకు ఇచ్చిన బహుమానం. ఆ ఉత్తర్వుల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం లేదా సింగరేణి చేతిలో ఉన్న భూమిని ప్రయివేటు వారికి లీజుకివ్వాలి. దీంతో వారు బొగ్గు తవ్వకాలు ప్రారంభించొచ్చు. కోయగూడెం 1/70 చట్టం పరిధిలో ఉన్నది. ప్రభుత్వరంగ సంస్థ లేదా గిరిజనుల సొసైటీ తవ్వకాలు చేపట్టాలి. ప్రయివేటు వ్యక్తులు తవ్వకాలు చేపట్టకూడదు. న్యాయపరమైన అంశాలు ఏమైనా ఉంటే గిరిజన సంఘాలు ఆలోచించాలి.'అని వీరయ్య అన్నారు.

మీ ప్రధాన డిమాండ్లకు పునాది ఏమిటీ?

సింగరేణి సంస్థ సర్వే చేసి 15 ప్రాంతాల్లో కొత్త బొగ్గు బ్లాకులను గుర్తించింది. వాటిపై ఇప్పుడు సింగరేణికి హక్కులేదు. కేంద్రం వేలంపాట వేస్తున్నది. ప్రస్తుతం సింగరేణి పరిధిలో ఉన్న బొగ్గుబ్లాకులు మూతపడతాయి. కొత్త బ్లాకులు ప్రయివేటు వారికి అప్పగిస్తారు. దీంతో సింగరేణి నష్టాలపాలవుతుంది. ఆ తర్వాత మూతపడుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సింగరేణి ఏటా రూ.71 వేల కోట్లు డివిడెండ్, పన్నుల రూపంలో ఇస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం, జెన్‌కో, ఎన్టీపీసీ వంటి సంస్థలు సింగరేణికి రూ.30 వేల కోట్లు బకాయి పడ్డాయి. అయినా సింగరేణి లాభాల్లో ఉన్నది. అందుకే ప్రయివేటు సంస్థల వారి కన్ను పడింది. స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలు బొగ్గుబ్లాకులను దక్కించుకుంటాయి. విపరీతమైన లాభాలు పొందుతాయి.'అని వీరయ్య అన్నారు.



సింగరేణి కార్మికుల ఆదరణ మీ యాత్రకు ఎలా ఉన్నది?

'గతనెల 29న బెల్లంపల్లిలో సింగరేణి పరిరక్షణ యాత్ర ప్రారంభించాం. ఈనెల ఐదున కొత్తగూడెంలో ముగిసింది. సింగరేణి కార్మికుల ఇండ్లలోనే బస చేశాం, వారి ఇండ్లలోనే భోజనం చేశాం. గెస్ట్ హౌజ్‌లు, లాడ్జీల్లో ఉండలేదు. దీంతో కార్మికులతోనే కాకుండా వారి కుటుంబాలతోనూ మమేకమయ్యాం. రాష్ట్ర నాయకులు ఇంటికి రావడంతో కార్మికులు సంతోషపడ్డారు. వారి ఆతిథ్యం వల్ల మాలో ఉత్సాహం పెరిగింది. వారి కష్టసుఖాలు తెలుసుకునేందుకు ఈ యాత్ర దోహదపడింది. ఈ యాత్ర ఎందుకు చేపట్టామో కార్మికులే కాకుండా కుటుంబాలు అర్థం చేసుకోవాలన్న లక్ష్యం నెరవేరింది. కార్మికుల సమస్యలు లోతుగా అధ్యయనం చేయడానికి ఉపయోగపడింది.

'బొగ్గుగనుల వద్ద సమావేశాలను నిర్వహించాం. కొన్నిచోట్ల ఏఐటీయూసీ నాయకులు మమ్మల్ని కలిసి సంఘీభావం ప్రకటించారు. ఇలాంటి ఉద్యమాలు అవసరమన్నారు. ఓచోట ఐఎన్‌టీయూసీ నాయకులు మా బృందానికి స్నాక్స్ ఏర్పాటు చేశారు. ఉద్యమం బలపడాలని ఆకాంక్షించారు. గోదావరిఖనిలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు సంఘీభావం ప్రకటించారు.'అని వీరయ్య చెప్పారు.

కార్మికులకు మీరిచ్చే సందేశం ఏమిటీ?

సింగరేణి సంస్థలో 40 వేల మంది పర్మినెంట్, 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులున్నారు. కాంట్రాక్టీకరణ పెరిగింది. ఓపెన్ కాస్టు మైనింగ్‌లో వలస కార్మికులు బానిస చాకిరీ చేస్తున్నారు. పైకి ప్రభుత్వరంగ సంస్థ లోపల అంతా ప్రయివేటీకరణ. ఇంతకాలం దొడ్డిదారిన చేశారు. ఇప్పుడు నేరుగా ప్రయివేటీకరణ చేయడానికి కేంద్రం పూనుకున్నది. బొగ్గుగనులపై సింగరేణికి హక్కులేదని తేల్చింది.

వేలంపాట రద్దయ్యే దాకా పోరు ఆగదు

దీంతో సింగరేణికి బొగ్గుగనుల్లేకుంటే కార్మికులకు పని ఉండదు, ఆ సంస్థకు లాభాలుండవు, తర్వాత అది మూతపడుతుంది. ఇది ప్రమాదకరం. దీన్ని అడ్డుకోవాలి.

'యువ కార్మికులు ఎంతో ఆందోళనలో ఉన్నారు. వారు రిటైర్ అయ్యేలోపు సింగరేణి సంస్థ ఉంటుందా? అన్న ప్రశ్న వారిని వేధిస్తున్నది. మా భవిష్యత్ ఏంటని ప్రశ్నిస్తున్నారు. సింగరేణి మూతపడితే మా కుటుంబాలు రోడ్డునపడతాయి. ఆ తర్వాత ఎలా బతకాలి. కార్మిక సంఘాలు కదలడంతోపాటు కుటుంబాలు, ప్రజలు పోరాటంలో భాగస్వాములు కావాలి.

'సింగరేణి ప్రాంతాల్లో ఉద్యోగులకే కాకుండా ప్రజలకూ అభివృద్ధి ఫలాలు అందుతాయి. విద్యుత్ చార్జీలు తక్కువగా ఉంటాయి. రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు వంటి సౌకర్యాలకు సింగరేణి సంస్థ నిధులు కేటాయిస్తుంది. ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి గనులు పోతే విద్యుత్ చార్జీలు పెరుగుతాయి. అభివృద్ధి పనులకు నిధులుండవు. అందుకే ఆ సంస్థను ప్రజలు కాపాడుకోవాలి.'అని వీరయ్య సూచించారు.

మీ యాత్ర సత్ఫలితాలను ఇచ్చిందని భావిస్తున్నారా?

'సరైన సమయంలో ఈ యాత్ర చేపట్టామన్న సంతృప్తి మాకు కలిగింది. కార్మికులు, ప్రజల్లో చైతన్యం పెంచడానికి ఉపయోగపడింది. వామపక్ష పార్టీలపై పెద్ద బాధ్యత ఉన్నదనే అభిప్రాయం ఎల్లెడలా వ్యక్తమైంది. వేలంపాట రద్దు కావాలనీ, తెలంగాణలోని బొగ్గు సింగరేణికే దక్కాలని వామపక్షాలే అంటాయి. వాటిమీద గురుతర బాధ్యత ఉన్నది. రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రజలు కదలాలి. శ్రావణపల్లి బొగ్గుబ్లాకు వేలంపాటను రద్దు చేయాలి. 2021లో ప్రయివేటు వారికి అప్పగించిన కోయగూడెం, సత్తుపల్లి బ్లాకులను సింగరేణికే కేటాయించాలి. తెలంగాణలోని బొగ్గు నిక్షేపాలు సింగరేణికే హక్కు కల్పించాలి.'అని వీరయ్య డిమాండ్ చేశారు.



మీ భవిష్యత్ కార్యాచరణ ఎలా ఉండబోతుంది?

'తెలంగాణ ప్రజలకు పోరాట చరిత్ర ఉన్నది. రానున్న కాలంలో ప్రజలను మరింత చైతన్యం చేయాలి. కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీలు కదలాలి. సింగరేణి పరిరక్షణ యాత్ర భవిష్యత్తులోనూ కొనసాగాలి. ఐక్య ఉద్యమాలకు దారితీయాలి. త్వరలోనే గవర్నర్‌ను కలుస్తాం. అమెరికా నుంచి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలుస్తాం. కేంద్రంపై ఒత్తిడి పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి. ఆ తర్వాత భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తాం.

ఈ నెల 29న యాత్ర మొదలైనప్పటి నుంచి కొత్తగూడెంలో ముగింపు వరకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా బాగా సహకరించింది. కళాకారుల బృందం క్రమశిక్షణతో ఉండి ఆట,పాటలతో ప్రజలను చైతన్యపరిచింది. పార్టీ కార్యకర్తలు, శ్రేయోభిలాషులందరూ కలిసి ఈ యాత్రను జయప్రదం చేశారు.'అని వీరయ్య అన్నారు.

నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణాలు

రైలు ప్రమాదాల్లో పెరుగుతున్న మృతులు

గాలిలో దీపంలా ప్రయాణికుల భద్రత

ప్రయివేటీకరణ దిశగా కేంద్రం అడుగులు



న్యూఢిల్లీ : మన దేశంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నది రైల్వేలే. అయితే ఇటీవల చోటుచేసుకుంటున్న రైలు ప్రమాదాల నేపథ్యంలో ప్రజలు భయం భయంగా ప్రయాణించాల్సి వస్తోంది. గమ్యస్థానం చేరిన తర్వాత హమ్మయ్య అనుకోవాల్సిన పరిస్థితి. చండీఘర్-దిబ్రూఘర్ ఎక్స్‌ప్రెస్, కాంచనజుంగా ఎక్స్‌ప్రెస్, గత నెల 30న జార్ఖండ్‌లో ముంబయి -హౌరా ఎక్స్‌ప్రెస్...ఇవన్నీ పట్టాలు తప్పిన కారణంగా జరిగిన రైలు ప్రమాదాలే. ఇటీవలి కాలంలోనే ఈ మూడు ప్రమాదాలు జరిగాయి. పెరుగుతున్న ప్రమాదాలు రైల్వే భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. బాలాసోర్ ప్రమాదంలో 291 మంది ప్రాణాలు కోల్పోయిన దారుణ ఉదంతాన్ని ఎలా మరచిపోగలం?

రైలు ప్రమాదాలకు లైన్స్‌మాన్‌నో లేదా లోకో పైలట్‌నో బాధ్యుడిని చేసి చేతులు దులుపుకోవడం పరిపాటైంది. కానీ రైల్వే మంత్రిని ఎవరూ తప్పు పట్టడం లేదు. జరిగిన ప్రమాదానికి బాధ్యత వహించి రాజీనామా చేస్తానని కూడా ఆయన అనడం లేదు. రైల్వే స్టేషన్లలో ప్రధాని ఫొటోతో సెల్ఫీ బూత్‌లు ఏర్పాటు చేయడంతోనే సంబంధిత మంత్రి పని అయిపోదు... సామాన్య ప్రజల భద్రత కూడా ఆయన బాధ్యతే కదా.

ప్రభుత్వ ప్రాధాన్యతల్లో రైల్వేలకు స్థానం ఉన్నట్లు కన్పించదు. ఏ రైలు చూసినా ప్రయాణికులతో కిక్కిరిసి ఉంటోంది. బోగీలలో నెలకొంటున్న అమానుష, దుర్భర పరిస్థితులు నరకాన్ని తలపిస్తున్నాయి. దేశంలో 67 వేల కిలోమీటర్ల పొడవునా రైల్వే లైన్లు ఉన్నాయి. ప్రతిరోజూ 2.3 కోట్ల మందిని గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. ప్రపంచంలోని రైల్వే వ్యవస్థల్లో మనదే అతి పెద్దది. అయినప్పటికీ రైల్వే వ్యవస్థ నిర్లక్ష్యానికి గురవుతోంది. ప్రభుత్వం భద్రతను గాలికి వదిలేసింది.

నెల రోజుల వ్యవధిలోనే...

గత నెల 30న హౌరా-ముంబయి మెయిల్ జార్ఖండ్‌లో పట్టాలు తప్పడంతో ఇద్దరు చనిపోగా 20 మందికిపైగా గాయపడ్డారు. గత నెల 19న ఉత్తరప్రదేశ్‌లో చండీఘర్-దిబ్రూఘర్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురైంది. నలుగురు మరణించగా 31 మంది గాయాలపాలయ్యారు. వీరిలో చాలా మందికి తీవ్ర గాయాలయ్యాయి. జూన్ 17న సెల్డా వెళుతున్న కాంచన్‌జుంగా ఎక్స్‌ప్రెస్ ఓ గూడ్సు రైలును ఢీకొంది. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది చనిపోగా సుమారు 30 మంది గాయపడ్డారు. జూన్ 2న జరిగిన బాలాసోర్ దుర్ఘటన అత్యంత భయానకమైనది. బెంగళూరు-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ షాలిమార్-చెన్నయ్ సెంట్రల్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌ను, ఆగివున్న గూడ్సు రైలును ఢీకొంది. ఈ ప్రమాదం 291 మంది ప్రాణాలను బలిగొంది. వెయ్యి మందికి పైగా గాయాల బారిన పడ్డారు. ఈ ఘటన కేవలం నిర్వహణ వైఫల్యాన్ని మాత్రమే కాకుండా భద్రతా లోపాలను, మౌలిక సదుపాయాల లేమిని కూడా ఎత్తిచూపుతోంది.

> **ప్రయివేటీకరణ దిశగా...**
>
> **రైల్వేల ప్రయివేటీకరణ కోసమే ప్రభుత్వం ఇదంతా చేస్తోందని నిపుణులు అంటున్నారు. ప్రయివేటు కంపెనీల పోటీని తట్టుకోలేక ప్రభుత్వ రంగంలోని బీఎస్ఎన్ఎల్ చతికిలపడుతోంది. ఎయిర్ ఇండియా పూర్తిగా కనుమరుగైంది. ప్రయివేటీకరణ కారణంగా ఎదురవుతున్న దుష్ఫలితాలను బ్రిటన్, సింగపూర్ రైల్వే వ్యవస్థలు ఇప్పటికే అనుభవిస్తున్నాయి. అయినప్పటికీ రైల్వేల ప్రయివేటీకరణకు అనుకూలంగా 2015లో వివేక్ దేవ్‌రాయ్ కమిటీ చేసిన సిఫారసులను అమలు చేసే దిశగా ఎన్డీఏ ప్రభుత్వం అడుగులు వేస్తోందని అర్థమవుతోంది.**

ఆ రైళ్లు కన్పించడం లేదు

రైలు ప్రమాదాలకు కేవలం వ్యక్తులే బాధ్యులు కారు. ఆర్థిక పరమైన అవకతవకలు, నిర్లక్ష్యం కూడా వీటికి కారణమవుతున్నాయి. ట్రాక్‌ల నవీకరణకు రూ.1,03,395 కోట్లు అవసరమవుతాయని కాగ్ తెలిపింది. రైల్వేల ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నదన్న విషయాన్ని ఇది రుజువు చేస్తోంది. ట్రాక్‌ల నవీకరణకు రూ.58,459 కోట్లు కేటాయించినా 2020-21 ఆర్థిక సంవత్సరం చివరికి రూ.671.92 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అంటే అవసరమైన మొత్తంలో ఇది 0.7 శాతమే. రైల్వేల భద్రత కోసం ఏర్పాటు చేసిన రాష్ట్రీయ రైల్ సంరక్ష కోశ్ (ఆర్ఆర్ఎస్‌కె) అవసరం లేని సామగ్రిని కొంటూ నిధులను దుర్వినియోగం చేస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. ప్రయాణికుల భద్రతను గాలికి వదిలేసిన ప్రభుత్వం, వందేభారత్ వంటి హైస్పీడ్ రైళ్లపై ఆసక్తి చూపుతోంది. ఈ తరహా రైళ్లలో చార్జీలు మధ్య తరగతి ప్రజలకు సైతం అందుబాటులో ఉండడం లేదు. స్థానిక ప్యాసింజర్ రైళ్లు క్రమేపీ తగ్గిపోతున్నాయి. ప్యాసింజర్, అన్ రిజర్వ్‌డ్ బోగీలున్న రైళ్లు ఎప్పుడో కానీ కన్పించడం లేదు. అంటే మెజారిటీ ప్రయాణికుల గురించి పట్టించుకునే వారే కరువయ్యారు. ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సైతం జనరల్, నాన్-ఏసీ బోగీల సంఖ్య తగ్గిపోతోంది. ఏసీ బోగీల సంఖ్య పెరుగుతోంది. ప్యాసింజర్, గూడ్సు రైళ్లు నత్తనడక నడుస్తున్నాయి.

భద్రతా ఆందోళనలు



• సైన్యంలో సిబ్బంది కొరతపై వివరాలను పంచుకోవటానికి కేంద్రం నో
• విమర్శలకు దారి తీసిన మోడీ సర్కారు తీరు
• ప్రభుత్వంపై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ఆగ్రహం

న్యూఢిల్లీ : కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ(ఎంఓడీ) సాయుధ దళాలలో సిబ్బంది కొరతకు సంబంధించిన డేటాను పంచుకోవటానికి నిరాకరించింది. 'జాతీయ భద్రత'ను కారణంగా చూపింది. ఈనెల 5న కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ రాజ్యసభను ఉద్దేశించి లిఖితపూర్వక సమాధానమిస్తూ.. అభ్యర్థించిన సమాచారం దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన కార్యాచరణ అంశమనీ, అటువంటి వివరాలను బహిర్గతం చేయటం జాతీయ ప్రయోజనాలకు సంబంధించినది కాదని పేర్కొన్నారు. "సాయుధ బలగాల్లో అధికారులు, సైనికులు, వైద్యాధికారులతో సహా వివిధ విభాగాల్లో కొరత గురించి ప్రభుత్వానికి తెలియదా? ఎలాంటి చర్యలు తీసుకున్నారు" అని పార్లమెంటు సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ మందాడి అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర మంత్రి నుంచి పై విధంగా లిఖితపూర్వక సమాధానం వచ్చింది.

గతేడాది మార్చి 13న అప్పటి రక్షణ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ నివేదించిన సమాచారం ప్రకారం.. మార్చి 10, 2023 నాటికి, ఆర్మీలో 8,070 ఆఫీసర్ ఖాళీలు, జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్లు (జేసీఓలు), ఇతర ర్యాంకులు(ఓఆర్‌లు) 127,673 ఖాళీలు ఉన్నాయి. అలాగే, జనవరి 1, 2023 నుంచి మార్చి 10, 2023 మధ్య 613 ఆఫీసర్ స్థానాలు, 19,065 జేసీఓ, ఓఆర్ స్థానాలు భర్తీ చేయబడ్డాయి.

కాగా, మోడీ సర్కారు సిబ్బంది కొరతను వెల్లడించటానికి నిరాకరించటం విమర్శలకు దారితీసింది,. ముఖ్యంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఖర్గే.. ప్రధాని మోడీని ట్యాగ్ చేస్తూ ప్రభుత్వ నిర్ణయాన్ని విమర్శించారు. ముఖ్యమైన సమాచారాన్ని దాచిపెట్టారని ఆరోపించారు. ఇలాంటి వివరాలను ప్రభుత్వం గతంలోనే వెల్లడించిందని ఖర్గే ఎత్తిచూపారు. హఠాత్తుగా ఆ పద్ధతి ఎందుకు మారిందని ప్రశ్నించారు. 2023 మార్చిలో అందించిన తాజా గణాంకాల ప్రకారం, సాయుధ దళాలలో 1.55 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన ఉదహరించారు. ఖాళీల సంఖ్యపై పారదర్శకత "నిజమైన జాతీయ ప్రయోజనం"లో ఉన్నదనీ, ఈ అంతరాలను పరిష్కరించటానికి, దేశం ప్రాదేశిక సమగ్రతను కాపాడేందుకు సమగ్రమైన చర్యలు తీసుకోవటానికి ఇది వీలు కల్పిస్తుందని ఖర్గే నొక్కిచెప్పారు.

'చేప' చేదాయే..!

చేపపిల్లల టెండర్‌కు కాంట్రాక్టర్ల విముఖత

- రెండు సార్లు పిలిచినా ముందుకు రాని స్థితి
- గతేడాది బిల్లులు రూ.100 కోట్లు రాకపోవడమే కారణం
- ప్రభుత్వ ఆధ్వర్యంలో విత్తనాభివృద్ధికి పలుచోట్ల అవకాశం
- టెండర్ల ఆలస్యంతో మత్స్యసొసైటీలకు తీరని నష్టం

రాష్ట్రవ్యాప్తంగా చేప పిల్లల టెండర్లకు కాంట్రాక్టర్లు విముఖత చూపుతున్నారు. ఇప్పటికే రెండు సార్లు పిలిచినా ఎవరూ ముందుకు రాకపోవడంతో మరోసారి ఈనెల 13వ తేదీన మరోసారి టెండర్లు ఆహ్వానిస్తున్నారు. అయితే, 2023-24 ఏడాదికి చెందిన రూ.100 కోట్ల బిల్లులే కాంట్రాక్టర్లకు అందలేదు. ఖమ్మం జిల్లాలో రూ.40లక్షలకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. రాష్ట్రంలో చేప విత్తన ఉత్పత్తికి అవకాశాలున్నా దాదాపు 80శాతానికి పైగా పిల్లలను ఆంధ్రా నుంచి దిగుమతి చేసుకోవడంపై అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. విత్తన ప్యాకెట్లలో ఉండాల్సిన పిల్లల కంటే తక్కువగా ఉంటున్నట్టు మత్స్యకారులు చెబుతున్నారు. జులై నాటికి టెండర్లు పూర్తి చేసి చేపపిల్లలు పంపిణీ చేయాల్సి ఉన్నా ఆలస్యమవుతుండటంతో సరైన సైజ్ వస్తాయో లేదోనని మత్స్యకార సొసైటీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



టెండర్ల వాయిదాతో మరింత జాప్యం

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే రెండు సార్లు టెండర్లు ఆహ్వానించారు. జులై 23, ఆగస్టు 2వ తేదీన టెండర్లు పిలిచారు. ఎవరూ ముందుకు రాకపోవడంతో తిరిగి ఈనెల 13న ఆహ్వానిస్తున్నారు. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా 23,130 చెరువుల్లో చేపల పెంపకం చేపట్టారు. చిన్నచెరువుల్లో 35-40 మి.మీ పిల్లలు 41.63 కోట్లు, పెద్ద చెరువుల్లో 80-100 మి.మీటర్లకు పైగా సైజ్ ఉన్న పిల్లలు 34.74 కోట్లు పంపిణీ చేశారు. అలాగే 357 మంచినీటి చెరువులకు 9.15 కోట్ల రొయ్య పిల్లలను సరఫరా చేశారు. చిన్నపిల్లలు హెక్టార్‌కు మూడు వేల చొప్పున.. లక్ష పిల్లలకు రూ.51వేల ధర నిర్ణయించారు. పెద్ద వాటికి హెక్టార్‌కు రెండువేల చొప్పున.. లక్ష పిల్లలకు రూ.1.61 లక్షల ధర నిర్ధారించారు. వీటికి సంబంధించి రూ.100 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 26వేల నీటి వనరుల్లో 86 కోట్ల చేప పిల్లలు, 10 కోట్ల రొయ్య పిల్లలు పోయాలని మత్స్యశాఖ నిర్ణయించింది. 2025-25 ఆర్థిక సంవత్సరానికి ఈ పథకం అమలు చేయడానికి రూ.114 కోట్లు కేటాయించారు. రాష్ట్ర మత్స్యశాఖ డైరెక్టర్ ప్రియాంక జులై 10వ తేదీన టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఇప్పటికే నెల రోజులైనా ఏ ఒక్కరూ ముందుకు రావడం లేదు.

సీడ్ కొరత మరో సమస్య

ఇప్పటికే టెండర్లు ఆలస్యమవుతుండటంపై మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తుంటే మరోవైపు సీడ్ కొరత పెద్ద సమస్యగా పరిణమించనుంది. రాష్ట్రంలో చేప పిల్లల విత్తన ఉత్పత్తి కేంద్రాలు సరిపడా లేకపోవడంతో 80% పిల్లలను ఆంధ్రా నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. చేపపిల్లల సైజ్‌ను బట్టి రాష్ట్ర మత్స్యశాఖ డైరెక్టరేట్‌లో ప్రతిపాదిత ధరలను నిర్ణయించారు. 30-40 మి.మీ సైజులో ఉన్న చేప పిల్లలు 61 పైసలు, 80-100 మి.మీ.లు ఉన్నవాటికి రూ.1.63, రొయ్య పిల్లలకు రూ.2.34 చొప్పున ప్రతిపాదించారు. రొయ్య పిల్లల టెండర్లను మాత్రం రాష్ట్రం యూనిట్‌గా నిర్ధారిస్తారు.

ఆంధ్రా నుంచి దిగుమతిలో అవకతవకలు

దాదాపు 80శాతం చేప విత్తనాలను అధికారులు ఆరేండ్లుగా ఆంధ్రప్రదేశ్ నుంచి దిగుమతి చేస్తున్నారు. 20శాతం చేప పిల్లలు మాత్రమే మత్స్యశాఖకు రాష్ట్రంలో స్థానికంగా అందుబాటులో ఉన్నాయి. మత్స్యశాఖ స్వతహాగా సీడ్ తయారు చేసుకునే అంశంపై దృష్టి సారించకుండా కొనుగోలుపైనే ఆధారపడింది. ఈ క్రమంలోనే గతేడాది పెద్దఎత్తున కొనుగోళ్లలో గోల్‌మాల్ జరిగినట్టు ఆరోపణలొచ్చాయి. దిగుమతి చేసుకున్న ప్యాకెట్లలో సీడ్ తగిన సంఖ్యలో లేదని మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 86 కోట్ల చేపపిల్లల అవసరం ఉంటే వీటిలో కనీసం పది శాతం కూడా మత్స్యశాఖ ఆధ్వర్యంలోని నీటివనరుల్లో పెంచట్లేదు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జలశయాల్లో చేపపిల్లలు పెంచుకునే వెసులుబాటు ఉన్నా ఆంధ్రా నుంచి దిగుమతి చేసుకోవడంలో అవినీతి దాగుందనే ఆరోపణలున్నాయి. గతేడాది పంపిణీ చేసిన చేపపిల్లల్లో 60శాతం తెలంగాణ ఉత్పత్తి కేంద్రాల నుంచి పంపిణీ చేశామని అధికారులు చెబుతున్నారు. కానీ కొందరు వ్యాపారులు తెలంగాణ కేంద్రాల పేరిటే టెండర్లు దక్కించుకున్నా.. సీడ్‌ను మాత్రం ఏపీలోని ఏలూరు, కైకలూరు, భీమవరం తదితర ప్రాంతాల నుంచి సేకరిస్తున్నారని సమాచారం.

ఎవరూ ముందుకు రావట్లేదు

ఖమ్మం జిల్లాలో 2024-25 సంవత్సరానికి 876 చెరువుల్లో 3.45 కోట్ల చేపపిల్లలను పంపిణీ చేయాలని ప్రతిపాదనలు పంపాం. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే రెండుసార్లు టెండర్లు ఆహ్వానించారు. కానీ ఎవరూ ముందుకు రాకపోవడంతో మూడోసారి 13వ తేదీన పిలిచారు. ఈసారి ఎవరూ ముందుకు రాకపోతే ప్రభుత్వం పున:పరిశీలన చేసే అవకాశం ఉంది.



- గట్టు రాజనర్సయ్య, ఖమ్మం జిల్లా మత్స్యశాఖ అధికారి

సుంకిశాల ప్రమాద బాధ్యత ఎవరిది?

- రాహుల్‌గాంధీకి మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్న

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సుంకిశాల ప్రమాదానికి ఎవరు బాధ్యత వహిస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు (కేటీఆర్) కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రశ్నించారు. ఈ మేరకు సుంకిశాల ప్రమాదంపై పలు ప్రశ్నల్ని 'ఎక్స్' వేదికగా సంధించారు.


కోట్లాది రూపాయల నష్టం జరిగిన తర్వాత కూడా సుంకిశాల ప్రమాదాన్ని చిన్నదిగా చూపించేలా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. లోపభూయిష్టం గా పనులు చేసిన కాంట్రాక్టింగ్ ఏజెన్సీని బ్లాక్‌లిస్ట్ లో పెట్టడానికి ఎవరు, ఎందుకు ఆపుతున్నారో స్పష్టం చేయాలని అడిగారు.ఈ మొత్తం వ్యవహారం పై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిం చేందుకు ఎందుకు వెనుకంజ వేస్తున్నారని ప్రశ్నించారు.

గవర్నర్ జిష్ణుదేవ్‌కు త్రిపుర సీఎం సన్మానం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు త్రిపుర ముఖ్యమంత్రి ప్రొఫెసర్ మాణిక్ సాహా ఘనంగా పౌర సన్మానం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌కు వచ్చిన సీఎం, వారి అధికార బృందం రాష్ట్ర గవర్నర్‌ను అభినందించారు. ఈశాన్య రాష్ట్రాల నుంచి రాజ్యాంగబద్ధ గవర్నర్ స్థాయికి ఎదిగిన తొలి వ్యక్తి అని సంతోషం వ్యక్తం చేశారు.

వీడని ఉత్కంఠ!



- వినేశ్ పిటిషన్‌పై నిర్ణయం వాయిదా
- నేడు రాత్రి సీఏఎస్ తుది నిర్ణయం

నవతెలంగాణ-పారిస్

పారిస్ ఒలింపిక్స్‌లో వినేశ్ ఫోగట్ ఉత్కంఠ కొనసాగుతుంది. మహిళల 50 కేజీల ఫ్రీ స్టయిల్ విభాగం రెజ్లింగ్ ఫైనల్‌కు చేరుకున్న వినేశ్ ఫోగట్.. 100 గ్రాముల అధిక బరువు కారణంగా పసిడి పోరులో తలపడేందుకు అర్హత కోల్పోయింది. యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ నిబంధనల ప్రకారం వినేశ్ ఫోగట్‌పై అనర్హత వేటు వేయటంతో పాటు ఆమె ఖాయం చేసుకున్న సిల్వర్ మెడల్‌ను సైతం లాగేసుకుంది. దీనిపై వినేశ్ ఫోగట్, భారత ఒలింపిక్ సంఘం న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్) పారిస్ ఒలింపిక్స్ స్పెషల్ బెంచ్ ఇప్పటికే ఈ అంశంలో వాదనలు వినేసింది. వినేశ్ ఫోగట్ తరఫున ఫ్రెంచ్ న్యాయవాదులు వాదనలు వినిపించగా.. భారత ఒలింపిక్ సంఘం తరఫున హరీశ్ సాల్వే సింఘానియాలు వాదనలు వినిపించారు. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ, యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్‌లు సైతం తమ లీగల్ వాదనలను సమర్పించాయి. శుక్రవారం రాత్రి జరిగిన విచారణలో సుమారు మూడు గంటల పాటు అందరూ వాదనలను సీఏఎస్ న్యాయమూర్తి ఆలకించారు. అయితే తీర్పును శనివారానికి వాయిదా వేశారు. ఈ అంశంలో పరిశీలించాల్సిన అంశాలు ఎక్కువగా ఉండటంతో తీర్పు వెల్లడించేందుకు, అందుకు కారణాలను తెలియజేందుకు మరో 24 గంటల సమయం తీసుకుంది. దీంతో వినేశ్ ఫోగట్‌ను సంయుక్త రజత పతక విజేతగా ప్రకటించాలనే పిటిషనుపై ఆదివారం రాత్రి 9.30 గంటల వరకు సీఏఎస్ న్యాయమూర్తి తుది తీర్పు వెల్లడించనున్నారు. పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు ఆదివారమే ఆఖరు. దీంతో నేడు కచ్చితంగా తీర్పు వెలువడనుంది.

ఇక రెజ్లింగ్ హెవీ వెయిట్‌లో తొలిసారి ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన రీతిక హుడా క్వార్టర్‌ఫైనల్లో ఓటమి చెందింది. మహిళల ఫ్రీ స్టయిల్ 76 కేజీల విభాగం ప్రిలిమినరీ రౌండ్‌లో గెలుపొందిన రీతిక హుడా.. క్వార్టర్‌ఫైనల్లో నిరాశపరిచింది. రితీకపై నెగ్గిన రెజ్లర్ ఫైనల్‌కు చేరితే రీతిక రిపిచేజ్ బౌంట్‌లో తలపడే అవకాశం దక్కించుకోనుంది.

10 గంటల్లో 4.5 కిలోలు తగ్గాడు!

పారిస్‌లో రెజ్లర్ అమన్ షెరావత్ పాట్లు



పారిస్ : కుస్తీ వీరులు మ్యాట్‌పై పోరాటంతో పాటు శరీర బరువు నియంత్రణలో ఉంచుకునేందుకు స్వీయ యుద్ధమే చేస్తారు. 100 గ్రాముల అధిక బరువు కారణంగా వినేశ్ ఫోగట్ చారిత్రక పసిడి పోరుకు దూరం కావటంతో యావత్ భారతావని షాక్‌కు గురైంది. మెన్స్ 57 కేజీల విభాగం కాంస్య పతక పోరుకు చేరిన అమన్ షెరావత్‌కు సైతం ఇటువంటి కష్టమే వచ్చింది. ఫ్రీ స్టయిల్ సెమీఫైనల్ బౌట్ ఓటమి అనంతరం అమన్ షెరావత్ 61.5 కిలోల బరువు ఉన్నాడు. కాంస్య పతక బౌట్‌కు ముందు షెరావత్ బరువు చూపించాల్సి ఉంటుంది. దీంతో రాత్రికి రాత్రి అతడు 4.5 కిలోల బరువు తగ్గాల్సిన పరిస్థితి తలెత్తింది. వినేశ్ ఫోగట్ విషయంలో కంగుతిన్న రెజ్లింగ్ బృందం.. అమన్ షెరావత్ అంశంలో ఎటువంటి పొరపాటుకు చోటివ్వలేదు. కోచ్‌లు జగ్‌మందర్ సింగ్, వీరెందర్ దహియ 'ఆపరేషన్ వెయిట్‌లాస్' మిషన్ షురూ చేశారు. శుక్రవారం బరువు కొలమాన సమయానికి షెరావత్ 4.6 కిలోలు బరువు తగ్గి 56.9 కిలోలకు చేరుకున్నాడు. దీంతో భారత బృందం ఊపిరి పీల్చుకుంది.

సుమారు 10 గంటల వ్యవధిలో అమన్ షెరావత్ 4.6 కిలోల బరువు తగ్గేందుకు సాధారణ కసరత్తులు చేయలేదు. తొలుత గంటన్నర పాటు బౌట్ పొజిషన్లను సాధన చేయించారు. గంటపాటు వేడి నీటితో స్నానం చేయించారు. జిమ్‌లో 60 నిమిషాల పాటు ట్రెడ్‌మిల్ చేశారు. 30 నిమిషాల విశ్రాంతి అనంతరం.. సెషన్‌కు ఐదు నిమిషాల చొప్పున ఐదు సెషన్ల పాటు ఆవిరి స్నానం చేయించారు. చివరి ఆవిరి సెషన్ తర్వాత అమన్ బరువు 900 గ్రాములు అధికంగా ఉన్నాడు. దీంతో మసాజ్‌తో పాటు తేలికపాటి జాగింగ్ చేయించారు. తర్వాత సెషన్‌కు 15 నిమిషాల చొప్పున ఐదు సెషన్ల పాటు రన్నింగ్ చేశారు. దీంతో ఉదయం 4.30 గంటలకు అమన్ బరువు 56.9 కిలోలకు వచ్చింది. కాంస్య పతక బౌట్‌కు ముందు రోజు రాత్రి అమన్ షెరావత్ నిద్ర కూడా పోలేదు. రాత్రంతా రెజ్లింగ్ బౌట్ల వీడియోలు చూస్తూ గడిపాడు. ఈ విషయాన్ని అమన్ షెరావత్, రెజ్లింగ్ బృందం కాంస్య పతక విజయం అనంతరం మీడియాతో పంచుకుంది.



హర్మన్‌సేనకు అపూర్వ స్వాగతం

కాంస్య పతకంతో స్వదేశం చేరుకున్న హాకీ ఇండియా

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక విశ్వ క్రీడల్లో వరుసగా రెండోసారి పతకం సాధించిన హాకీ ఇండియాకు స్వదేశంలో అభిమానులు అపూర్వ స్వాగతం పలికారు. పారిస్ ఒలింపిక్స్ హాకీ కాంస్య పతక మ్యాచ్‌లో స్పెయిన్‌పై సూపర్ విక్టరీ సాధించిన హర్మన్‌ప్రీత్‌సేన శనివారం ఉదయం న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంకు చేరుకుంది. హాకీ ఆటగాళ్లపై పూల వర్షం కురిపించిన అభిమానులు.. సంగీత వాయిద్యాలతో డప్పులు మోగిస్తూ, నృత్యాలు చేస్తూ బ్రాంజ్ వీరులకు వెల్‌కమ్ పలికారు. పారిస్ ఒలింపిక్స్‌లో టీమ్ ఇండియా పతక ప్రదర్శన పట్ల భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ సంతోషం వ్యక్తం చేశారు. గోల్ కీపర్, వెటరన్ ఆటగాడు పీఆర్ శ్రీజేష్ కాంస్య పతక మ్యాచ్‌తో ఆటకు వీడ్కోలు పలికాడు. ఆదివారం జరిగే ఒలింపిక్స్ ముగింపు కార్యక్రమంలో షూటర్ మను భాకర్‌తో కలిసి శ్రీజేష్ భారత జట్టు పతాకధారిగా వ్యవహరించనున్నాడు. ముగింపు వేడుకల్లో పాల్గొనేందుకు మను బాకర్‌తో కలిసి శ్రీజేశ్ సైతం తిరిగి పారిస్‌కు బయల్దేరనున్నాడు.

పక్కా మాస్ ఎంటర్‌టైనర్



రవితేజ, డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబోలో రూపొందిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై నిర్మాత టి.జి.విశ్వ ప్రసాద్ నిర్మించారు. ఇందులో రవితేజకు జోడిగా భాగ్యశ్రీ బోర్సే నటించింది. ఈ సినిమా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ మీడియాతో సంభాషించారు. ఆ విశేషాల సమాహారం..

- రవితేజతో మా బ్యానర్‌లో ఇది మూడవ సినిమా. ఆయనతో సిరీస్ ఆఫ్ మూవీస్ చేస్తాం. హరీష్ శంకర్‌తో కొంతకాలంగా ట్రావెల్ అవుతున్నాం. రవితేజ, హరీష్‌ది వెరీ క్రేజీ కాంబినేషన్. ఇందులో అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్నాయి. ఎంటర్‌టైన్మెంట్, మాస్, యాక్షన్ ఎపిసోడ్స్ పరంగా 'మిస్టర్ బచ్చన్' ధమాకా ప్లస్‌లా ఉంటుంది. ఇది కంప్లీట్ మాస్ ఎంటర్‌టైనర్.
- ఈ సినిమా స్టార్ట్ చేసినప్పుడే మే, జూన్ లోగా పూర్తి చేయాలనేది ప్లాన్. ఒరిజినల్‌గా ఈనెల 9 రిలీజ్ డేట్ అనుకున్నాం. అయితే మా సాంగ్స్ షూటింగ్ పూర్తి కాకపోవడంతో మొదట్లో డేట్ ఇవ్వలేదు. 'పుష్ప2' స్లాట్ క్లియర్ అవ్వడంతో ఈనెల 15 ది బెస్ట్ అని డేట్ ఇవ్వడం జరిగింది. అయితే ఈ 15కి రెండు పెద్ద సినిమాలు 'మిస్టర్ బచ్చన్, డబుల్ ఇస్మార్ట్' ఉన్నాయి. ఈ రెండింటికీ ఎలాంటి ప్రాబ్లమ్ ఉండదు. వీటికి బెటర్ అవుట్ పుట్ ఈ సీజన్‌లో కచ్చితంగా వస్తుంది. లాంగ్ వీకెండ్ ప్లస్ అవుతుంది.
- రవితేజ, హరీష్ శంకర్ వంటి క్రేజీ కాంబినేషన్‌లో వచ్చే సినిమా ఎంత గ్రాండ్‌గా ఉండాలో అంత గ్రాండ్‌గా తీశాం. కొత్త అమ్మాయిని హీరోయిన్‌గా తీసుకోవడం అనేది డైరెక్టర్ నిర్ణయం. భాగ్యశ్రీ బోర్సే చాలా చక్కగా నటించారు. ఈ సినిమాలోని పాటలన్నీ సూపర్ హిట్ అయ్యాయి. మిక్కీ, హరీష్‌కి ఎక్స్‌ట్రార్డినరీ సింక్ ఉంది. వాళిద్దరూ సినిమాకి ఎలాంటి మ్యూజిక్ కావాలో అంత గ్రాండ్ అవుట్ పుట్ తీసుకొచ్చారు. పాటలకి చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది.

జీ2, మిరాయ్, సన్నీడియోల్‌తో హిందీ మూవీ జరుగుతోంది. కన్నడలో గణేష్ అనే యాక్టర్‌తో 50 కోట్ల స్పాన్ ఉన్న మూవీ చేస్తున్నాం. వీటితోపాటు మూడు కన్నడ, నాలుగైదు తెలుగు సినిమాలు వున్నాయి. అలాగే యూఎస్‌లో రెండు ప్రాజెక్ట్స్ చేస్తున్నాం. 'విశ్వం, శ్వాగ్' రిలీజ్‌కి రెడీగా ఉన్నాయి. ఓటీటీ రిలీజ్‌కి ఓ ఐదు సినిమాలు రెడీగా ఉన్నాయి. ప్రభాస్‌తో చేస్తున్న రాజాసాబ్ షూటింగ్ దాదాపు 50% పైనే పూర్తయింది.

- నిర్మాత టి.జి.విశ్వప్రసాద్

సరికొత్త క్రైమ్ థ్రిల్లర్



సహస్ర ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై నిశాంత్, ఎంఎస్‌ఓపీ సమర్పణలో.. నిర్మాత నరేంద్ర బుచ్చిరెడ్డిగారి, దర్శకుడు బసిరెడ్డి రానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'హైడ్ న్ సిక్' మోషన్ పోస్టర్ రిలీజ్ అయింది. హీరో శివాజీ చేతుల మీదుగా ఈ మోషన్ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా హీరో శివాజీ మాట్లాడుతూ,'ఈ చిత్రంతో తెలుగు పరిశ్రమకి మరో ఫెంటాస్టిక్ డైరెక్టర్ పరిచయం అవుతున్నాడని బలంగా నమ్ముతున్నాను' అని తెలిపారు.

దర్శకుడు బసిరెడ్డి రానా మాట్లాడుతూ, ' ఈ చిత్రం నుంచి ఎలాంటి కంటెంట్ వచ్చిన అది కచ్చితంగా బ్లాస్ట్ అయ్యేలా ఉండాలనే ఉద్దేశంతో ప్రతిదీ చక్కగా ప్లాన్ చేసుకున్నాం. నిర్మాత నరేంద్ర బుచ్చిరెడ్డిగారి చాలా ప్యాషనేట్ ప్రొడ్యూసర్. ఈ సినిమా తప్పకుండా విజయం సాధిస్తుంది' అని అన్నారు.

'ఈ సినిమాని చూశాను. ఒక క్రైమ్ థ్రిల్లర్‌ని ఇలా కూడా చెప్పొచ్చా అనే ఎగ్జైట్‌మెంట్‌తో ఈ చిత్రాన్ని ప్రజెంట్ చేస్తున్నాను' అని డైరెక్టర్ నవీన్ మేడారం చెప్పారు. హీరోయిన్ శిల్ప మంజునాథ్ మాట్లాడుతూ,' ఇందులో పోలీస్ క్యారెక్టర్‌లో నటించాను. నా రోల్ చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది. నా పాత్ర ప్రేక్షకులకు బాగా గుర్తుండిపోతుంది' అని తెలిపారు. 'ఈ సినిమా ఖచ్చితంగా అందరిని ఆకర్షిస్తుంది' అని హీరో విశ్వంత్ అన్నారు.

'మా'కు రూ.10 లక్షలు విరాళం



మంచు విష్ణు

తన కూతురు ఐరా విద్యా మంచు పుట్టిన రోజు సందర్భంగా మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడు విష్ణు మంచు 'మా'కు పది లక్షల రూపాయల విరాళాన్ని ప్రకటించారు. అసోసియేషన్‌లో ఆర్థికంగా వెనుకబడిన కళాకారుల సంక్షేమం కోసం ఆయన ఈ విరాళాన్ని అందించారు. కళా కారులకు సహాయం చేయడం, వారికి అవసరమైన సపోర్ట్, సంరక్షణ అందేలా చేయడం కోసం ఈ మొత్తాన్ని వెచ్చించనున్నారు.

గత మూడు సంవత్సరాలలో మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ విష్ణు నాయకత్వంలో అద్భుతమైన అభివృద్ధిని సాధించింది. 'మా' భవనంపై విష్ణు మంచు ఫోకస్ పెట్టారు. ఇక మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ మెంబర్లు, సినీ ఆర్టిస్టుల మీద సోషల్ మీడియాలో వచ్చే అసత్యపు కథనాలు, ట్రోలింగ్‌ను కట్టడి చేసేందుకు నడుంబిగించారు.

నటులు, వారి కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని కొంతమంది యూట్యూబర్‌లు పోస్ట్ చేసిన అసభ్యకరమైన, అవమానకరమైన కంటెంట్‌ను తీసి వేయించడంలో ప్రముఖ పాత్ర పోషించారు. విష్ణు చేపట్టిన ఈ చర్యలను ఇతర ఇండస్ట్రీలకు చెందిన ఆర్టిస్టులు కూడా ప్రశంసించారు. విష్ణు మంచు ప్రస్తుతం 'కన్నప్ప' చిత్ర ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఈ మూవీ డిసెంబర్‌లో విడుదల కానుంది. భారీ తారాగణంతో రాబోతోన్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్న సంగతి తెలిసిందే.

నేను - కీర్తన రిలీజ్‌కి రెడీ



చిమటా రమేష్‌బాబు, రిషిత

చిమటా రమేష్ బాబు హీరోగా, స్వీయ దర్శకత్వంలో రూపొందించిన 'నేను - కీర్తన' చిత్ర ప్రీ రిలీజ్, ట్రైలర్ రిలీజ్ వేడుక ప్రసాద్ ల్యాబ్‌లో అత్యంత ఘనంగా జరిగింది. ఈ వేడుకలో నిర్మాత డి.ఎస్.రావు, శోభారాణి, పద్మినీ నాగులపల్లి, గిడుగు కాంతికృష్ణ, వాసిరెడ్డి స్పందన పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు. చిమటా ప్రొడక్షన్స్ పతాకంపై చిమటా రమేష్ బాబు సి.హెచ్.ఆర్)ను దర్శకుడిగా పరిచయం చేస్తూ, చిమటా రమేష్ బాబు (సి.హెచ్.ఆర్) - రిషిత - మేఘన హీరో, హీరోయిన్లుగా చిమటా జ్యోతిర్మయి (యు.ఎస్.ఎ) సమర్పణలో చిమటా లక్ష్మీకుమారి నిర్మించిన ఈ చిత్రాన్ని ఈనెల 30న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హీరో, డైరెక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ, 'ఈ చిత్ర రూపకల్పనలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. నా సోదరి జ్యోతిర్మయి, నా జీవిత భాగస్వామి లక్ష్మీ కుమారి సపోర్ట్ లేకుంటే... ఈ సినిమా ఇంత అద్భుతంగా వచ్చేది కాదు. ఒక మూవీ బ్లాక్‌బస్టర్ అవ్వడానికి అవసరమైన ఎలిమెంట్స్ అన్నీ ఈ చిత్రంలో పుష్కలంగా ఉన్నాయి' అని చెప్పారు.

నవచిత్రం

ఆయ్.. ట్రైలర్ ఎన్టీఆర్‌కి బాగా నచ్చింది



నార్నే నితిన్

జీఏ2 పిక్చర్స్ బ్యానర్ నుంచి రాబోతున్న లేటెస్ట్ మూవీ 'ఆయ్'. మ్యాడ్ చిత్రంతో మెప్పించిన నార్నే నితిన్ హీరోగా, నయన్ సారిక జంటగా నటించారు. అంజి కె.మణిపుత్ర ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాస్, విద్యా కొప్పినీడి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈనెల 15న సినిమా రిలీజ్ అవుతుంది. ఈ సందర్భంగా హీరో నార్నే నితిన్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- మంచి ఫన్ ఉన్న గోదావరి బ్యాక్ డ్రాప్ మూవీ వచ్చి చాలా కాలమైంది. కచ్చితంగా ఆడియెన్స్ ఎంజాయ్ చేస్తారని నమ్ముతున్నాం. దర్శకుడు అంజి కె మణిపుత్ర అమలాపురం కుర్రాడు. ఆయనకున్న ఫ్రస్టేషన్స్, లైఫ్‌లో ఆయన చూసినవన్నీ కలిపి చేసిన సినిమానే 'ఆయ్'.
- ఎన్టీఆర్ ట్రైలర్ చూశారు. ఆయనకు కామెడీ బాగా నచ్చింది. ఎంజాయ్ చేశారు. సినిమా చూసిన తర్వాత కూడా ఆయన దగ్గర నుంచి అలాంటి రెస్పాన్స్ వస్తే బావుంటుందనిపిస్తుంది.
- రామ్ మిర్యాల మూడు పాటలకు సంగీతాన్నిస్తే.. అజయ్ అరసాడ రెండు పాటలకు మ్యూజిక్ ఇస్తూ బ్యాగ్రౌండ్ స్కోర్ అందించారు. మ్యూజిక్ సినిమా సక్సెస్‌లో చాలా కీలక పాత్ర పోషిస్తుంది. హీరోయిన్ నయన్ సారిక మరాఠీ అమ్మాయి. కానీ తెలుగు అమ్మాయిలా ఉంటుంది. తన పాత్ర అందరికీ బాగా కనెక్ట్ అవుతుంది.
- కులం, మతం కంటే స్నేహం చాలా గొప్పది. అంత కంటే గొప్ప విషయమేదీ ఉండదనే మెసేజ్‌ను ఈ సినిమాలో ఇస్తున్నాం. 'మ్యాడ్' సీక్వెల్ షూటింగ్ జరుగుతోంది. ఈ ఏడాదిలోనే రిలీజ్ ఉండొచ్చు.

మా కమిటీ కుర్రోళ్ళు మెప్పించారు



నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. ఈ సినిమాకు యదు వంశీ దర్శకుడు. ఈ మూవీ ఈనెల 9న విడుదలైంది. చిత్రానికి అద్భుతమైన ఆదరణ దక్కింది. ఇంత భారీ విజయాన్ని ఆడియెన్స్ అందించడంతో శనివారం సక్సెస్ మీట్ నిర్వహించారు.

నిహారిక మాట్లాడుతూ, 'మా చిత్రాన్ని ఆదరిస్తున్న ఆడియెన్స్‌కు థ్యాంక్స్. మా చిత్రాన్ని రమేష్ భుజానికెత్తుకుని నడిపించారు. పెట్టిన ప్రతీపైసా తెరపై కనిపిస్తుందని అంతా అంటున్నారు. మా అందరినీ నమ్మి వంశీ సినిమాను రిలీజ్ చేసినందుకు థ్యాంక్స్. మంచి చిత్రాన్ని తీస్తే సరిపోదు. అది జనాల వరకు వెళ్లాలి. అలా జనాల వరకు తీసుకెళ్లిన మీడియాకు థ్యాంక్స్. ఇది పీపుల్స్ సినిమా అయింది. ఈ మూవీని ఎవరైనా తక్కువ చేసి మాట్లాడితే జనాలే కౌంటర్లు ఇస్తున్నారు. ఇంత మంచి చిత్రాన్ని తీసినందుకు మా అందరికీ గర్వంగా ఉంది' అని అన్నారు.

'మంచి కంటెంట్‌తో ముందుకు వస్తే ఆదరిస్తామని తెలుగు ఆడియెన్స్ మళ్లీ నిరూపించారు. సినిమాను హిట్ చేసిన ప్రతీ ఒక్కరికి థ్యాంక్స్' అని నిర్మాత జయ అడపాక చెప్పారు. దర్శకుడు యదు వంశీ మాట్లాడుతూ, 'మా చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రతీ ఒక్కరికీ థ్యాంక్స్. నాలుగేళ్ల క్రితం ఈ ప్రయాణం మొదలైంది. సక్సెస్ అనే పదం వినడానికి మూడున్నరేళ్లు పట్టింది. సినిమా తీయడం గొప్ప కాదు.. మా అందరినీ ఎంకరేజ్ చేసే నిర్మాతలే గొప్ప. మమ్మల్ని నమ్మి ఇంత డబ్బులు పెట్టిన నిర్మాతలకు థ్యాంక్స్. మా అందరినీ ఎంకరేజ్ చేస్తున్న ఆడియెన్స్‌కు థ్యాంక్స్' అని అన్నారు.

అంకిత్ కొయ్య మాట్లాడుతూ, 'నిహారిక ఈ కథని నమ్మింది. ఈ చిత్రం మీద నమ్మకం కంటే భయం ఎక్కువగా ఉండేది. ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్' అని తెలిపారు.



పెద్ద అంబర్‌పేట్ సత్యం టెక్నో స్కూల్లో నిర్వహించిన బోనాల పండుగ వేడుకల్లో ప్రిన్సిపాల్, డైరెక్టర్ అరవింద్, మరియు అధ్యాపకుల బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పత్రిక
'నవతెలంగాణ'కు శుభాకాంక్షలు



ఎల్బీనగర్ ట్రాఫిక్ సీఐ సర్వర్ అహ్మద్

నవతెలంగాణ - చంపాపేట్

ప్రజా పత్రిక 'నవతెలంగాణ'కు నా హృదయపూర్వక వార్షికోత్సవ శుభాకాంక్షలు. అంకిత భావంతో పని చేస్తున్న విలేకరులు, సిబ్బంది ఈ పత్రికకు ఆయువు పట్టు. సమాజం పట్ల గౌరవంతో, ప్రజల పట్ల నిబద్ధతతో పని చేస్తున్న పత్రిక నవతెలంగాణ. ప్రజా కోణంలో వార్తలు, విశ్లేషణలు అందిస్తూ ఎప్పటికప్పుడు నూతన ఉత్తేజంతో నవతెలంగాణ పాఠకులకు చేరువవుతోంది. 9 సంవత్సరాలు పూర్తి చేసుకుని 10వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పత్రిక ఉన్నతికి కారణమైన ప్రతి ఒక్కరికీ అభినందనలు.

పేదింటి అమ్మాయిల పెండ్లికి
ఉప్పల ఫౌండేషన్ చేయూత



- ఉప్పల శ్రీనివాస్ గుప్త

నవతెలంగాణ -నాగోల్

పేదింటి అమ్మాయిల పెండ్లికి ఉప్పల ఫౌండేషన్ చేయూతనిస్తుందని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు ఉప్పల ఫౌండేషన్ చైర్మెన్ శ్రీనివాస గుప్తా తెలిపారు. హైదరాబాద్‌లోని నాగోల్‌లో ఉప్పల శ్రీనివాస్ గుప్త క్యాంపు కార్యాలయంలో భువనగిరి పరిధిలోని గుండ్ల పోచంపల్లి గ్రామానికి చెందిన అలబత్తుల దివ్య దయాకర్ ల కుమార్తె శ్రావణి వివాహం కోసం శనివారం ఉప్పల శ్రీనివాస్ గుప్తను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస గుప్త వారి ఆర్థిక పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. వెంటనే పుస్తె, మెట్టెలు, చీర, గాజులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక పేద కుటుంబాలకు చెందిన వారికి పుస్తె, మట్టెలు, చీర, గాజులను అందజేసినట్టు వివరించారు. అదేవిధంగా అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ నాయకులు గంజి రాజమౌళి గుప్త జన్మదిన సందర్భంగా ముషీరాబాద్‌కు చెందిన దేవేందర్ యాదవ్ లక్ష్మీల కూతురు నికిత వివాహానికి కూడా చేయూత ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, రమ తదితరులు పాల్గొన్నారు.

రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు

- గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు



నవతెలంగాణ - చంపాపేట్

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సిద్ధంగా ఉందని గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి. వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు శనివారం కంచన్ బాగ్‌లోని మిధాని డిపోను హయత్ నగర్, మెయింటెనెన్స్, సీటీఎం డిప్యూటీ రీజినల్ మేనేజర్లు సుచరిత, జగన్, శ్రీనివాస్‌లతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రావణమాసంలో అధికంగా శుభకార్యాలను దృష్టిలో ఉంచుకుని 10 శాతం రాయితీ ద్వారా అద్దె బస్సులు నడిపేందుకు నిర్ణయించామన్నారు. డిపోను పరిశీలించిన అనంతరం ఉద్యోగులు, సిబ్బందితో మాట్లాడినట్లు తెలిపారు. అనంతరం 'లక్ష్య లక్ష్యం'పై సలహాలు, సూచనలు అందజేశారు. ఆయన వెంట మేనేజర్ పి. విజయకుమార్, ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

శ్రీ అక్షర డిజైనర్స్‌ను ప్రారంభించిన ఉప్పల



నవతెలంగాణ- నాగోల్

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని ఎన్జీవోస్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ అక్షర డిజైనర్స్‌ను టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త ఆయన సతీమణి ఉప్పల స్వప్నలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపార రంగంలో అడుగుపెడుతున్న నిర్వాహకులకు డిజైనర్స్ రంగలో రాణించి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ ప్రారంభంలో రంగారెడ్డి జిల్లా ఐవీఎఫ్ అధ్యక్షుడు చింతల రజినీకాంత్ గుప్తా, ఉప్పల సాయికిరణ్, ఉప్పల సాయి తేజ, రాపతి సంజయ్ చల్ల మంగ, మాధవి, నితిన్, విజయ, శ్రీనివాస్, కొత్తపల్లి మురళీ మోహన్, సతీష్, శివ, వరణ్ తదితరులు పాల్గొన్నారు.

కామేశ్వర సోమయాజులుకు కన్నీటి వీడ్కోలు



నవతెలంగాణ-బడంగ్‌పేట్

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 26వ డివిజన్ అల్మాస్‌గూడ మధురా నగర్ కాలనీ అసోసియేషన్ మాజీ జనరల్ సెక్రెటరీ ఆదిత్య శర్మ తండ్రి కామేశ్వర సోమయాజులు(88) కొంతకాలం అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, పార్టీ శ్రేణులు అక్కడికి చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తర్వాత మృతదేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మనోధైర్యం, భరోసా కల్పిస్తూ కామేశ్వర సోమయాజులు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో రామిడి రామ్ రెడ్డి, శేఖర్ రెడ్డి, సామ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఏనుగు రామ్ రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



'డబుల్ ఇండ్ల బాధితులకు అండగా ఉంటాం'



నవతెలంగాణ -చంపాపేట్

డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వకుండా పేదలను మోసం చేస్తే సహించేది లేదని, వారికి అండగా ఉంటామని సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, సౌత్ జిల్లా కార్యదర్శి యం.డీ అబ్బాస్ అన్నారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గం పరిధిలోని సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కృష్ణ నాయక్ అధ్యక్షతన శనివారం డబుల్ బెడ్ రూం ఇండ్ల బాధితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 60సంవత్సరాలుగా 72 కుటుంబాలు మున్సిపల్ క్వార్టర్స్‌లో జీవించేవారన్నారు. ఇందులో కొన్ని ఇండ్లను మరమ్మతులు చేయాలని హైదరాబాద్ రెవెన్యూ జీహెచ్ఎంసీ అధికారులను కోరగా.. 2015లో 72 కుటుంబాలకు అధికారులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను 16నెలల్లో నిర్మిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. స్థానిక ప్రజలు నమ్మి తమ ఇండ్లను అప్పగించారని చెప్పారు. 16 నెలలు పోయి తొమ్మిది సంవత్సరాలు కావస్తున్నా నేటికీ వాళ్లకు ఇండ్లు ఇవ్వకపోవడం దుర్మార్గం అని మండిపడ్డారు. 10 సంవత్సరాలుగా వారు అర్ధాకలితో ఉంటూ..వారి సంపాదనలో వేల రూపాయలను ఇంటి కిరాయిలకే దారపోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల ఇంటి స్థలంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లను గత ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రారంభం చేయడానికి సన్నాహాలు చేసిందని, ఎందువల్లనో ప్రారంభించకుండా నిలిపివేసిందన్నారు. ఎన్నికల తర్వాత అయినా ప్రారంభం చేస్తామని స్థానిక ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు. ఎన్నికల జరిగి 8 నెలల పైన కావస్తున్నా ఇప్పటివరకు ఆ బాధితులకు ఇండ్లు ఇవ్వలేదన్నారు. బాధితులు ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో అనేకమంది ప్రాణాలు కూడా కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాలపై ఎన్నిసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా సమస్యను పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఆగస్టు నెల చివరి కల్లా వారికి డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించకపోతే బాధితుల కుటుంబాలే గృహప్రవేశం చేసుకుంటారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.విట్టల్, కోటిరెడ్డి, జిల్లా నాయకులు లక్ష్మమ్మ, రామ్ కుమార్, శశికళ తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిమాండ్స్ డే ను జయప్రదం చేయండి



బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు

నవతెలంగాణ - నాగోల్

బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కౌన్సిల్ పిలుపు మేరకు ఈ నెల 12న బీసీ డిమాండ్స్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలను అందజేసి జయప్రదం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ బీసీల సమస్యల పరిష్కారం కోసం దేశ జనగణనలో బీసీ కుల గణన జరపాలన్నారు. చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అమలు జరపాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన రాష్ట్రంలో బీసీ కులగణన జరపాలన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని చెప్పారు. సంవత్సరానికి రూ.20వేలకోట్ల బడ్జెట్ కేటాయించి బీసీల సంక్షేమానికి, అభివృద్ధికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. దరఖాస్తులు పెట్టుకున్న వారందరికీ సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని చెప్పారు. బీసీ విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్, పాత బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బీసీల డిమాండ్ల సాధన కోసం ఈ నెల 12న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జిల్లా కలెక్టర్ల ద్వారా వినతి పత్రాలు అందజేయాలని బీసీ హక్కుల సాధన సమితి కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు.

జంక్షన్‌లో జామ్



నవతెలంగాణ- కొత్తపేట

కొత్తపేట్ నుండి నాగోల్ వెళ్లే పాల డబ్బా జంక్షన్ దగ్గర ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు ఏదో ఒక సమయంలో ట్రాఫిక్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్కూల్ బస్సులు మరియు పండ్ల వ్యాపారులు వారి ఇష్టానుసారంగా దారిపై వాహనాలను నిలిపివేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్ లేకపోవడంతో ట్రాఫిక్ జామ్ అవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ జంక్షన్ దగ్గర ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈరోజు (శనివారం) దాదాపు గంటకు పైగా ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రజలు చాలా ఇబ్బందులకు గురయ్యారు.





బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా పురుషోత్తం



నవతెలంగాణ-తుర్కయంజాల్

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్ గ్రామానికి చెందిన కొండ్రు పురుషోత్తం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పదవితో తనకు ఇంకా బాధ్యత పెరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను మోసం చేస్తున్నటువంటి వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు.దళితుల సంక్షేమమే లక్ష్యంగా, రాష్ట్రంలో ఎస్సీ మోర్చాను బలోపేతం చేస్తానని హామీ ఇచ్చారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం తన నియమాకానికి సహ కరించిన రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్‌కు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతికి, రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు బొక్క నరసింహ రెడ్డికి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్‌కు, రాష్ట్ర, జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

మహానుభావులను
సన్మానించుకోవడం శుభ పరిణామం

- టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస గుప్త

నవతెలంగాణ-సిటీబ్యూరో

వివిధ రంగాలలో సమాజ సేవలందిస్తున్న మహానుభావులను సన్మానించుకోవడం శుభ పరిణామమని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. హైదరాబాద్ నగరంలోని బొగ్గులకుంటలో గల తెలంగాణ సారస్వత్ పరిషత్ ఆడిటోరియం ధనలక్ష్మి కన్సిడర సొసైటీ వారు సంఘ సేవకురాలు, కీర్తిశేషులు సరోజా దేవి అవార్డుల ప్రదానోత్సవంలో శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ రంగాలలో సేవలందిస్తున్న మహానుభావులకు అవార్డులను ప్రదానం చేసి, శాలువాలతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రంగాలలో సమాజానికి సేవలందిస్తున్నటువంటి మహానుభావులను గుర్తించి..వారి సేవలకు గుర్తుగా అవార్డులను ప్రదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలలో పాలుపంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అడిషనల్ ఎస్పీ రాందాస్ తేజవాత్ నాయక్, భారత ప్రైవేటు ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గంధం రాములు, తోడు ఫౌండేషన్ ఫౌండర్ సురేష్ కుమార్, అఖిలభారత డప్పు కళాకారుడు డాక్టర్ డప్పు స్వామిన, వేదాంతం భవ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ వేదాంతం కర్ణాకర్, రఘు, అరకపూడి ట్రస్ట్ చైర్మెన్ రఘు, తెలంగాణ షీ టీం పోలీస్ ఆఫీసర్ శ్రీనివాస్, ప్రైవేటు ఉద్యోగుల సంఘం నాయకులు వేదాంతం శ్రీకాంత్ గద్వాల సురేష్ , జుటూరు రమేష్ , కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



- కార్పొరేటర్ మధుసూదర్ రెడ్డి

నవతెలంగాణ - చంపాపేట్

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలని కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి ప్రజలకు సూచించారు. ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలో చంపాపేట్ నవజీవన సంఘం నందు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అస్మా అంజుమ్, మెడికల్ అధికారులు, ఆర్.ఆర్ డిస్టిక్ మెడికల్ ఆర్గనైజేషన్ మేనేజర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆయుష్ శాఖ మందులు వాడినట్లయితే ఎలాంటి జబ్బునైనా తగ్గించుకోవచ్చు అని అన్నారు. ఈ శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువ జన సంఘం అధ్యక్షులు కట్ట వెంకటేశ్, బీజేపీ సీనియర్ నాయకులు సుంకరి రమేష్ గౌడ్, లింగల దశరథ్ గౌడ్, యాదిరెడ్డి, మహిళా సంఘం నాయకురాండ్లు పాశం నాగ మణి, షానాజ్ బేగం, కవిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్ గుర్రంగూడ పరిధిలో ఉన్న ఆదిత్య నగర్‌లో శ్రీశ్రీ శక్తి పోచమ్మ దేవాలయంలో శనివారం విగ్రహ ప్రతిష్టాపన ప్రారంభోత్సవంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి, సీనియర్ నాయకులు సంరెడ్డి వెంకటరెడ్డి, బోయపల్లి శేఖర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, మాజీ కౌన్సిలర్ గుర్రం సాయి కిరణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు జెకిడి విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్



పార్కులో అభివృద్ధి పనుల పరిశీలించిన బండారి



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని థీమ్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి తో కలిసి శనివారం పరిశీలించారు. థీమ్ పార్కులో అసంపూర్తిగా ఉన్న ఇంజినీరింగ్ పనులకు మరిన్ని నిధులు అవసరం కావడంతో ఈస్ట్ జోన్ జోనల్ కమిషనర్‌తో నిధుల విషయమై ఫోన్‌లో మాట్లాడారు. పనులకు నిధులు మంజూరు చేస్తానని జోనల్ కమిషనర్ హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు తండా వాసుగౌడ్, ఫైళ్ల ప్రవీణ్, పద్మారెడ్డి, ప్రభాకర్ రెడ్డి దుల్మిట్ట దయాకర్ రెడ్డి, మారుతి రావు, ముత్యాలు, సంతోష్ యాదవ్, నర్సింగరావు, పరమేష్ రెడ్డి, రాపోలు శ్రీనివాస్, మెండ రఘు, రమేష్, వెంకటాచారి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిది : ఎమ్మెల్యే



నవతెలంగాణ-కీసర

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. శనివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఎస్‌వీ నగర్‌లో నివాసముంటున్న శివ కుమార్‌కు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.38,500 చెక్కును ఎమ్మెల్యే మల్లారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యానికి గురైన పేదలను ఆదుకోనేందుకు ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ గూడూరు సబిత ఆంజనేయులు గౌడ్ పాల్గొన్నారు.

ప్రతి వాడనూ అభివృద్ధి చేస్తాం



- పోచారం మున్సిపల్ చైర్మెన్ కొండల్ రెడ్డి

నవతెలంగాణ-పోచారం

పోచారం మున్సిపల్ పరిధిలోని అన్ని గ్రామాలను, కాలనీలను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మెన్ కొండల్ రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని నారపల్లి శివాజీ నగర్, పోచారం నుంచి సింగపూర్ టౌన్షిప్ వరకు చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగర శివారులో ఉన్న పోచారం మున్సిపాలిటీ శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, మున్సిపల్ పరిధిలో కొత్త కాలనీల ఏర్పాటు, అపార్టుమెంట్ల నిర్మాణం జరుగుతుందన్నారు. మున్సిపల్ పరిధిలో ఉన్న పాత గ్రామాలతో పాటు కొత్తగా ఏర్పడుతున్న కాలనీలను సైతం అభివృద్ధి చేస్తామని, స్థానికులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ రెడ్యా నాయక్, కార్పొరేటర్ రవీందర్, ఏఈ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్వాహకులకు బోనాల చెక్కు పంపిణీ



నవతెలంగాణ-ఉప్పల్

బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని ఉప్పల్ నియోజకవర్గంలోని ఆలయాల నిర్వాహకులకు కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి, ఈవో భాగ్యలక్ష్మితో కలిసి శనివారం బోనాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఆలయాల అభివృద్ధి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఆలయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పలు ఆలయాలకు బోనాల ఉత్సవాలు చెక్కులను పంపిణీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో అబ్బయ్య, మంగ, సుధాకర్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి



నవతెలంగాణ-ఉప్పల్

తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఉద్యమకారుల ఫోరం నాయకులు చీమ శ్రీనివాస్, నేర్థం భాస్కర్‌గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం అనేక ఉద్యమాలు చేసి పోలీసు కేసులు, లాఠీ దెబ్బలు తిని, జైలుకు వెళ్లిన వారిని గుర్తించాలని కోరారు. శనివారం పలువురు ఉద్యమ కారుల ఆధ్వర్యంలో ఉప్పల్ రింగ్‌రోడ్డులోని అంబేద్కర్ విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. అనంతరం నేర్థం భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటులో అమ రులైన వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. లేని పక్షంలో ఉద్యమకారులకు న్యాయం జరిగేదాకా పోరాడుతామన్నారు.ఈనెల 27వ తేదీన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని హరిహర కళాభవన్‌లో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, నరేందర్, నరసింహ, సుధాకర్, రాజు ఉన్నారు.

లారీని వెనక నుంచి ఢీకొన్న బస్సు



నవతెలంగాణ-పోచారం

పోచారం మున్సిపల్ పరిధిలోని నారపల్లి సమీపంలో ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు లారీని వెనక నుంచి ఢీకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా భూపాలపల్లి నుంచి హైదరాబాదు వైపు శనివారం తెల్లవారుజామున వస్తున్న సూపర్ లగ్జరీ బస్సు నారపల్లి నందనవనం సమీపంలోకి రాగానే కాంక్రీట్ మిక్సింగ్ లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం ధ్వంసం కాగా ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. అయితే వరంగల్ హైదరాబాద్ జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరగడంతో వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకొని జేసీబీతో బస్సులు పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

తెలంగాణలో కియా షోరూంలకు ఆదరణ

నవతెలంగాణ-కాప్రా

ఆటోమొబైల్ రంగంలో తమ సేవలను మరింత వేగంగా విస్తరిస్తామని, తెలంగాణలో తమ కార్లకు విపరీతంగా డిమాండ్ పెరుగుతుందని కియా సౌత్ హెడ్ డీలర్ డెవలప్మెంట్ అమిత్ మిశ్రా, ఆటోమోటివ్ కియా గ్రూప్ సీఈవో చెన్నకేశవ తెలిపారు. తెలంగాణలో 9వ కియా షోరూంను కుషాయిగూడలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. కియా బ్రాండ్ మరింత విస్తరించాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. ఆధునిక సౌకర్యాలు, ప్రదర్శన స్థలంతో కస్టమర్లకు మెరుగైన సేవలను అందిస్తామని పేర్కొన్నారు. కాగా షోరూం ప్రారంభ వేడుకల్లో టెస్ట్ డ్రైవ్లు, ఫైనాన్సింగ్, సర్వీస్ సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

శ్రీలక్ష్మీ వేంకటేశ్వరుడి బహ్మోత్సవాలకు రావాలని మైనంపల్లికి ఆహ్వానం



నవతెలంగాణ-మల్కాజిగిరి, నేరేడ్‌మెట్

మల్కాజిగిరి ఆనంద్ బాగ్ చౌరస్తాలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు రావాలని మ్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు ఆలయ ఈవో ఏబీ రవీందర్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై వెంకటరమణచార్యులు శనివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆనంద్ బాగ్ క్యాంపు కార్యాలయంలో మైనంపల్లిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఆలయ క్లర్క్ సంద్ర సుధాకర్, ఆలయ మాజీ చైర్మెన్ సంతోష్ రాందాస్ ముదిరాజ్, కమిటీ సభ్యుడు గణేష్ (కన్నా), కాంగ్రెస్ నాయకులు జీఎస్‌వి సతీష్ కుమార్ పాల్గొన్నారు.

'మహిళా క్యాంటీన్ల' ఏర్పాటుకు సన్నాహాలు

- కార్యాచరణ తయారీలో అధికారులు
- అనువైన స్థలాల గుర్తింపు
- 15న కలెక్టరేట్‌లో ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నియోజకవర్గ కేంద్రాలు, మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, మండలాలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో అనువైన స్థలాలను ఎంపిక చేసినట్టు సమాచారం. జన సమూహం ఎక్కువగా ఉండే చోట క్యాంటీన్లను ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని రకాలుగా అనుకూలంగా ఉండే ప్రదేశాలను ఎంపిక చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నారు. ఇప్పటికే కలెక్టరేట్‌లో స్థలం కేటాయించగా.. ఈ నెల 15వ తేదీన ప్రారంభించనున్నట్టు సమాచారం.

మహిళలను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బ్యాంకు లింకేజీ, శ్రీనిధి రుణాలు తీసుకుని ఇప్పటికే చిన్నపాటి వ్యాపారాలు సాగిస్తున్న స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా వారితో క్యాంటీన్లను ఏర్పాటు చేయించనున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో పలు చోట్ల మహిళా క్యాంటీన్లను త్వరలో ఏర్పాటు చేయనున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 3,380 స్వయం సహాయక సంఘాలు ఉండగా, అందులో 36,782 మంది సభ్యులు ఉన్నారు. సంఘాల అర్హతను బట్టి రూ.50వేల నుంచి రూ.5లక్షల వరకు ఏటా బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తున్నారు. తీసుకున్న రుణాలను సక్రమంగా తిరిగి చెల్లిస్తే మళ్లీ రుణాలిస్తున్నారు. దీంతోపాటు ప్రభుత్వపరంగా క్యాంటీన్లను ఏర్పాటు చేసి వీటిని మహిళా సంఘాల సభ్యులకు కేటాయించాలని సర్కార్ ఇటీవలే నిర్ణయించింది. హైదరాబాద్‌లో మంత్రి సీతక్క ఇప్పటికే మహిళా క్యాంటీన్‌ను ప్రారంభించగా.. వీటిని జిల్లాలోనూ నెలకొల్పితే మహిళలకు దన్నుగా నిలువనున్నాయి.

ఇప్పటికే కలెక్టర్ ఆదేశాలు జారీ

జిల్లాలో మహిళా క్యాంటీన్లను పక్కాగా నిర్వహించేందుకు కార్యాచరణను తయారు చేయాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. మహిళలు, క్యాంటీన్లు నిర్వహించడంతోపాటు మీ సేవా కేంద్రాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు, కస్టం హైరింగ్, కుట్టు కేంద్రాలు, పాడి పశువులు, పౌల్ట్రీ, సంచార మత్స్య విక్రయ ఔటు లెట్లు, మిల్క్ పార్లర్లు ఏర్పాటు చేసేందుకు మండలాల వారీగా ప్రణాళికలు తయారు చేస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే మహిళా సంఘాల సభ్యులతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టించే కార్యక్రమం పూర్తయింది.

జన సమూహాల్లో ఏర్పాటు

డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జిల్లాలో పలు చోట్ల మహిళా క్యాంటీన్లు ఏర్పాటు చేయాలనే లక్ష్యం ఉండగా.. అందుకు అనువైన స్థలాలను ఎంపిక చేసినట్టు సమాచారం. ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఉండే కలెక్టరేట్‌తో పాటు జన సమూహం ఎక్కువగా ఉండే ప్రాంతాలు అనుకూలంగా ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన మహిళా క్యాంటీన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు దక్కడంతో సెక్రెటేరియట్ జీ ప్లస్ 5వ అంతస్తులో ఏర్పాటు చేసిన మహిళా క్యాంటీన్‌కు ఊహించిన దాని కంటే ఎక్కువ స్పందనరావడంతో అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే



- రూ.54లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ లక్ష్యంగా ముందుకెళ్తున్నామని, అభివృద్ధిలో రాజకీయాలకు తావు లేకుండా అన్ని డివిజన్లను అభివృద్ధి చేస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీత అన్నారు. శనివారం చిల్కానగర్ డివిజన్‌లో రూ.54 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిల్కానగర్ డివిజన్‌లో మూడున్నరేండ్ల లో రూ.75 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, బీఆర్ఎస్ కుటుంబ సభ్యులందరూ ఐక్యంగా ఉంటూ డివిజన్‌లోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయడం అభినందనీయం అన్నారు. కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో డివిజన్‌ను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. తనకు అన్ని రకాలుగా తోడ్పాటు అందిస్తున్న డివిజన్ బీఆర్ఎస్ కుటుంబ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. డివిజన్‌లోని కొన్ని ప్రాంతాలలో సీవరేజ్ పైప్ లైన్ వేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వారి సహకారంతో దశలవారీగా పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్, నరసింహ, కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగన్, వాస్, నరేష్ , శేఖర్, నర్సింగ్ రావు, కిషన్, మహమూద్, శ్రీనివాస్, గూడూరు రమేష్, మహేందర్, యాదగిరి, పోచయ్య, బాలు తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి
- రూ. 35లక్షలతో డ్రయినేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. నేరేడ్‌మెట్ డివిజన్ యాప్రాల్‌లోని చిన్న కందిగూడలో శనివారం రూ.35లక్షలతో డ్రయినేజీ పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం కాలనీలో పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ బోర్డు మేనేజర్ మల్లికార్జున, బీఆర్ఎస్ నాయకులు ఉపేందర్ రెడ్డి, కరంచంద్, రావుల అంజయ్య, శ్రీనివాసరావు, రమేష్, రాజు, మధుసూధన్ రెడ్డి, శ్యామ్, నవీన్, రాజేష్, దామగళ్ల సుధీర్, రాజు, ఆల్బర్ట్, మల్లేష్, నవనీత, రుబినా, స్థానిక కాలనీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పిట్టల నాగరాజు జన్మదిన వేడుకలు

- శుభాకాంక్షలు తెలిపిన మైనంపల్లి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్,మల్కాజిగిరి

వినాయక్ నగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు పిట్టల నాగరాజు జన్మదిన వేడుకలను ఆనంద్ బాగ్‌లోని మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినాయక్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చుఏసిన రక్తదాన శిబిరంలో 30 మంది రక్తదానం చేశారు. ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాల్గొని శాలువాతో సత్కరించి జన్మదినశుభాకాంక్షలను తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ.. నాగరాజు ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, రానున్న కాలంలో పార్టీలో మంచి స్థాయి ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, నాయకులు సతీష్ కుమార్, వెంకటేష్ యాదవ్, పిట్టల శ్రీనివాస్, సంపత్ గౌడ్, సంతోష్ రాందాస్, కె చెన్నారెడ్డి, బాబు, సత్యనారాయణ, సయ్యద్ మబ్బు, యాది, ఆగమయ్య, బాలరాజు యాదవ్, పార్ధసారథి, సురేష్ సింగ్, పాండురంగ, రోట్టెల ధరణ్ కుమార్, సతీష్, కృష్ణ, లత, చంద్రకాంత్, నాయకులు ఉన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మర్రి



నవతెలంగాణ-నేరేడ్ మెట్

నేరేడ్‌మెట్ డివిజన్ యాప్రాల్ పరిధిలోని చిన్న కందిగూడ లో ఉన్న నల్ల పోచమ్మ దేవాలయంలో కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డి, కాలనీ వాసులతో కలిసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి శనివారం అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కాలనీలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు కాలనీవాసులతో కలిసి పలు కాలనీలో పర్యటిస్తూ స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కరంచంద్, రావుల అంజయ్య, ఉపేందర్ రెడ్డి, శ్రీనివాసరావు, రమేష్, రాజు, మధుసూధన్ రెడ్డి, సాయి గౌడ్, శ్యామ్, నవీన్, రాజేష్, దామగళ్ల సుధీర్, రాజు, ఆల్బర్ట్, మల్లేష్, నవనీత, రుబినా, పాల్గొన్నారు.

రూ.100 కోట్ల విలువ చేసే భూదాన్ భూములకు ఎసరు

- వెలుగులోకి వచ్చిన మేడ్చల్ తహశీల్దార్ నిర్వాకం
- నిషేధిత జాబితాలో ఉన్న 5.04 ఎకరాల భూమిని పట్టాగా మార్చే కుట్ర
- సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎర్ర అశోక్



సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎర్ర అశోక్

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని ఎల్లంపేట గ్రామంలో భూధాన్ భూమిని పట్టా భూమిగా మార్చే ప్రయత్నం చేసిన మేడ్చల్ తహశీల్దార్‌పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎర్ర అశోక్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎల్లంపేట గ్రామంలో సర్వే నంబర్ 185లో 5.04లో భూదాన్ భూమిని తహశీల్దార్, ఆర్డీవోను బురిడీ కొట్టించి కలెక్టర్ ద్వారా ఎన్వోసీ తీసుకునే ప్రయత్నం చేసిందన్నారు. కలెక్టర్ తహశీల్దార్ సిఫారసులను హెూల్డ్‌లో పెట్టడంతో ప్రభుత్వ భూమి ప్రయివేటు వ్యక్తులకు చేరకుండా ఆగిందని పేర్కొన్నారు. ఓ వైపు ఏసీబీ రైడ్స్ జరుగుతున్నా రెవెన్యూ శాఖలోని అవినీతి అధికారులలో ఏ మాత్రం మార్పు రావడం ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అధికారులతో విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయని మండిపడ్డా రు. కోట్ల విలువైన భూదాన్ భూమిని ధారాదత్తం చేసేందుకు మేడ్చల్ ఎమ్మార్వో చేసిన కుట్రలపై మేడ్చల్ రెవెన్యూ అధికారులలో జోరుగా చర్చ జరుగుతోందన్నారు. రాష్ట్రంలో అమలులో ఉన్న ఆర్ఓఆర్ యాక్ట్-2020 ప్రకారం తహశీల్దార్ కోర్టులు రద్దు కావడంతో 2022 నవంబర్ 25న వచ్చిన ఈ ఆర్డర్‌పై గతంలో తహశీల్దార్లుగా పనిచేసిన వారు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అలాగే రెవెన్యూ రికార్డుల లో సర్వే నంబర్ 185లో 5.04 ఎకరాల భూమి భూదాన్ భూమిగా నమోదై ఉండడంతో ఆ భూమి జోలికి ఎవరూ వెళ్లలేదు. కానీ అసెంబ్లీ ఎన్నికల ముందు బాధ్యతలు స్వీకరించిన ప్రస్తుత ఎమ్మార్వో ఈ వ్యవహారాన్ని సెటిల్ చేసే బాధ్యతను తీసుకున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి భూదాన్ భూములను కాపాడాలని డిమాండ్ చేశారు.

న్యూ అంబేద్కర్ నగర్‌లో స్తంభాల ఏర్పాటు



నవతెలంగాణ-జవహర్ నగర్

జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఐదో డివిజన్ న్యూ అంబేద్కర్ నగర్ కాలనీలో ఆదివారం బోనాల పండుగ ఉన్న నేపథ్యంలో విద్యుత్ స్తంభాలు లేక ఇబ్బంది పడుతున్నామని కాలనీ అధ్యక్షుడు అబ్బగొని మహేష్ గౌడ్, కొంగరి మల్లేష్ నాలుగో డివిజన్ కార్పొరేటర్ మారగోని నాగరాణి వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా కార్పొరేటర్ వెంటనే విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. పండుగ నేపథ్యంలో ప్రజలు చీకట్లో ఉండకుండా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి వెలుగులు నింపినందుకు కాలనీ వాసులు నాలుగో డివిజన్ కార్పొరేటర్ మారగోని నాగరాణి వెంకటేష్ గౌడ్‌కు న్యూ అంబేద్కర్ నగర్ కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఐదో డివిజన్ కార్పొరేటర్ మురుగేష్ ప్రజా అవసరాలను గాలికి వదిలేశాడని వాపోయారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా

రేబెల్లి శ్రీనివాస్‌కు 14 మండల మద్దతు



రేబెల్లి శ్రీనివాస్

నవతెలంగాణ-కాప్రా

రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ వివిధ జిల్లాలకు ఎన్నికల అధికారులను నియమించింది. ఈ క్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారిగా చింతల రవికుమార్ గుప్తాను నియమించింది. కాగా కాప్రా సర్కిల్ కుషాయిగూడకు చెందిన రేబెల్లి శ్రీనివాస్‌గుప్తా ఆర్యవైశ్య సంఘం మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష పదవి దక్కించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని 14 మండలాల కమిటీలు, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్య బస్తీ సంఘాల ముఖ్య నాయకుల మద్దతు కూడగట్టుకునేందుకు శనివారం ఈసీఐఎల్ కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో ఇష్టగోష్టి నిర్వహించారు. ఈ సమావేశానికి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్తా హాజరయ్యారు. సమావేశానికి హాజరైన సభ్యులందరూ రెబెల్లి శ్రీనివాస్‌రెడ్డికి తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి దారం సతీష్ గుప్తా, కార్యనిర్వాక కార్యదర్శి బచ్చు ప్రమోద్ గుప్తా, పొలిటికల్ చైర్మెన్ కటకం శేఖర్ గుప్తా, తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి బాధ్యతగా సంరక్షించాలి



- కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్

నవతెలంగాణ-నేరేడ్ మెట్

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని బాధ్యతగా సంరక్షించాలని కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ అన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మౌలాలి డివిజన్ ఆర్టీసీ కాలనీలోని పార్క్ జీహెచ్ఎంసీ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమానికి కార్పొరేటర్ హాజరయ్యారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పారిశుధ్య సిబ్బంది, ఆడమ్ స్కూల్ ప్రిన్సిపాల్, విద్యార్థులు, ఆర్టీసీ కాలనీ అధ్యక్షులు, పాలకమండలి సభ్యులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్వచ్ఛదనం పచ్చదనం పట్ల విద్యార్థులకు, కాలనీ సభ్యులకు, ఉపాధ్యాయులకు అందరికీ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మౌలాలి డివిజన్ అధ్యక్షులు సాయిబాబా, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగారావు, డివిజన్ జనరల్ సెక్రెటరీ వెంకటేష్, జహంగీర్, కార్యకర్తలు, స్కూల్ విద్యార్థులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ 11వ వార్షికోత్సవంలో పాల్గొన్న మైనంపల్లి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని గౌతమ్ నగర్ డివిజన్ ఐఎస్‌నగర్‌లోని సాయిబాబా దేవాలయం 11వ వార్షికోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సాయిబాబాను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఆర్గనైజర్ శ్రీనివాస్, సలికిటి కుమార్, కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, బిబ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి ఎస్ వి సతీష్ కుమార్, బి కే శ్రీనివాస్, కన్నేమల్ల నాగరాజు రామచందర్, కొమురయ్య, శంకర్,ఆగమయ్య, బాలరాజు యాదవ్, సురేష్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ ఉల్లంఘనపై స్పీకర్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ - కూకట్‌పల్లి,కేపీహెచ్‌బీ

ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుంటే కొందరు అధికారులు ప్రోటోకాల్ ఉల్లంఘిస్తూ, పనులు చేయకుండా పబ్బం గడుపుతున్నారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతూ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతుంటే అధికారులు స్పందించడం లేదని పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన స్పీకర్ వెంటనే ప్రోటోకాల్ సంబంధిత విభాగాల ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి శాసనసభ్యుల హక్కులకు భంగం కలిగించే అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరోసారి ప్రోటోకాల్ ఉల్లంఘనలు పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇంజినీరింగ్ కోర్ బ్రాంచ్ విద్యార్థులకు
మైనర్ డిగ్రీతో ఐటీ రంగంలో అవకాశాలు

నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మగూడలోని సెయింట్ పీటర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ కోర్ బ్రాంచ్ విద్యార్థులకు మైనర్ డిగ్రీ ద్వారా ఐటీ రంగంలో అపార అవకాశాలు లభిస్తయని సెయింట్ పీటర్ కళాశాల సెక్రటరీ టివి రెడ్డి తెలిపారు. శనివారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను ఉదేశించి మాటాడుతూ.. ప్రతి విద్యార్థి ఇలాంటి అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా.కె శ్రీలత మాట్లాడుతూ.. కోర్ బ్రాంచ్ విద్యార్థులు మైనర్ డిగ్రీ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ మిషన్ లర్నింగ్ లాంటి అడ్వాన్స్ కోర్సెస్‌ను చదివి ఐటీ రంగంలో స్థిరపడడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ మైనర్ డిగ్రీ కోర్సును ఎంచుకున్న విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ సరోజ రెడ్డి , అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి, పీఆర్వో రవి సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- **ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాసం వద్ద నియోజకవర్గానికి చెంది న పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రజలు, సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పలు వినతులు, ఆహ్వానాలు అందజేశా రు. సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికా రులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి నూతన పనులను చేపడతామన్నారు.



ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

సీజనల్ వ్యాధులు వస్తుండడంతో దాతలు, ప్రయివేట్ ఆస్పత్రులు ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ ఆధ్వర్యంలో మల్లారెడ్డి ఆస్పత్రి(సూరారం)సౌజన్యంతో జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్ పరిధిలోని భగత్ సింగ్ మార్గ్‌లోని శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్, స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్, లయన్స్ డిస్ట్రిక్ గవర్నర్ రాజేంద్రప్రసాద్, లయన్ ఎస్.ఎన్.రెడ్డి, మేడ్చల్ జిల్లా ట్రస్మా అధ్యక్షులు లయన్ కె.రామేశ్వర్ రెడ్డి, డైరెక్టర్లు లయన్ బి.రు ఆంజనేయులు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో దోహదపడతాయన్నారు. దోమలు, ఈగలు క్రిమికీటకాలు అధికంగా ఉండే ఈ సీజన్‌లో అంటురోగాలు, విషజ్వరాలు సోకకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం వివిధ విభాగాల వైద్య నిపుణులచే పరీక్షలు చేయించుకున్న వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రుద్ర అశోక్, సయ్యద్ రషీద్, మక్సూద్ అలీ, సంతోష్, అధ్యక్షులు లయన్ సిద్దారెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఆర్.సి.వినోద్ జాదవ్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, పాఠశాల ప్రిన్సిపాల్ బి.రు శోభారాణి, ఉపాధ్యాయులు, మల్లారెడ్డి ఆస్పత్రి డాక్టర్ల బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేయాలి



- **కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రజలకు మౌలిక సదుపాయాలుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా గతంలో ప్రారంభించిన పనులను సత్వరమే పూర్తి చేయాలని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం కేపీహెచ్‌బీ డివిజన్‌లోని వివిధ అభివృద్ధి పనులను కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఇందులో భాగంగా మలేషియన్ టౌన్ షిప్ వెనకాల ఐదె ఎకరాల పార్కు పరిశీలన, ఫోరం మాల్ ఫ్లై ఓవర్ కింద స్పోర్ట్స్ ప్రాంగణ ప్రాంతాన్ని పరిశీలించారు. 4వ ఫేస్ ఎస్‌టిపి ప్లాంట్ వద్ద ఫ్లైఓవర్ క్రింద ప్రాంగణానికి సంబంధించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కేపీహెచ్‌బీ డివిజన్‌లో వేలకోట్లతో గత పదేండ్ల నుంచి అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.ఇందుకు నిదర్శనమే అనేక పార్కులు, క్రీడా మైదానాలు, ఇండోర్ షటిల్ కోర్టులు మొదలైనవి ప్రజలు ఇప్పటికే వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, ఈఈ శ్రీనివాస్, డీఈ ఆనంద్, ఏఈ సాయి ప్రసాద్, యుబిడి సమత, వాటర్ వర్క్స్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు , అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పని చేయాలి



- **హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు**

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అన్ని డిపార్టుమెంట్ల అధికారులు కో ఆర్డినేషన్‌తో పని చేయాలని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని జేఎన్టీయూ ప్రధాన రహదారి నుండి అడ్డగుట్ట, సమతా నగర్ మీదుగా ప్రగతి నగర్ రోడ్డుకు వెళ్లే కూడలి (ఎంఎన్ఆర్ కాలేజ్) వద్ద ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ట్రాఫిక్ సీఐ వెంకట్‌తో కలిసి ట్రాఫిక్ నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. జేఎన్టీయూ ప్రధాన రహదారి నుండి అడ్డగుట్ట, సమతా నగర్ మీదుగా ప్రగతి నగర్ రోడ్డుకు వెళ్లే వాహనదారులకు నిత్యం ట్రాఫిక్ సమస్యతో ఇక్కట్లు పడుతున్నారన్నారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే రోడ్లలో ఆక్రమణల తొలగింపుపై చర్యలు తీసుకునేలా పలు సూచనలు చేశారు. వాటర్ వర్క్స్, ఎలక్ట్రిసిటీ వర్క్స్ జరుగుతున్న సమయాల్లో రోడ్ల తవ్వకాల పూడ్చివేతకు సంబంధించిన అంశాలపై ఫోకస్ పెట్టాలన్నారు. వ్యాపారులు దుకాణాల ముందు వాహనాలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయనీయకూడదని సూచించారు. వాహన దారులు తమ వాహనాలను దగ్గర్లోని పార్కింగ్ ప్రదేశాల్లో పార్కు చేసి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తద్వారా చాలా వరకు ట్రాఫిక్ సమస్య తగ్గేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ అధికారులు , నాయకులు కుమార స్వామి, నిరంజన్ రెడ్డి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు, కళాశాలల్లో వ్యాస రచన, పాటల పోటీలు

- **ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డా.హిప్నో పద్మా కమలాకర్, టి.శోభారాణి**

నవతెలంగాణ-సిటీబ్యూరో



ఆగష్టు 12 అంతర్జాతీయ యువజన దినోత్సవం, 15 స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా స్కూల్లో, కాలేజీలో వ్యాస రచన, పాటలు పోటీలు నిర్వహిస్తున్నామని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు లయన్ డా.హిప్నో పద్మా కమలాకర్ తెలిపారు. డా.హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్‌లో పత్రికా విలేకరులతో మాట్లాడారు. నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో స్వాతంత్ర్య దినోత్సవం గురించి, దేశభక్తి గీతాలు, పద్యాలు పాటలు, జాతీయ సమర యోధులపై వ్యాసరచన పోటీలు, స్లమ్ ఏరియాలో, ప్రభుత్వ హాస్టల్ ,స్కూల్లో, కాలేజీల్లో, రామకృష్ణ మఠం బాలల సేవా విభాగంలో పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తారని తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా లయన్స్ పి.స్వరూపా రాణి, జి.కృష్ణ వేణి, టి. శోభా రాణి, జ్యోతి రాజా వ్యవహరిస్తారన్నారు. స్వాతంత్ర్యం దినోత్సవాలు వస్తున్నాయి చేస్తున్నాం...వెళ్ళి పోతున్నాయి.. ఎందుకు, చేయాలి, చేస్తున్నాం అనేది నేటి విద్యార్థులకు క్వశ్చన్ మార్క్ .. అందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మనం ఈ రోజు ఇంత స్వేచ్ఛగా ఉన్నామంటే ఎందరో స్వాతంత్ర సమరయోధుల త్యాగాల ప్రతిఫలమన్నారు. బహుమతులను అందజేసే రోజున క్లబ్ 320 ఏడిస్ట్రిక్ట్ గవర్నర్ డా.డి.కొటేశ్వరరావు, 1వ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లిడా.మహేంద్ర కుమార్ రెడ్డి, ఆర్.సి. డా.వి.శ్రీనివాస్, సి.హెచ్.గోపాల కృష్ణ, జె.సి.బి.వినయ్, బి.వనిత, పాల్గొంటారన్నారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సహాయ సహకారాలతో, ఇటీవల కేరళ రాష్ట్రంలోని వయనాడులో వరదలతో అతలాకుతలమైన అక్కడి ప్రజలకు, ఆ ప్రాంతాన్ని తిరిగి పునర్నిర్మాణం కొరకు కేరళ మల్టిపుల్ డిస్ట్రిక్ట్ - 318 అక్షరాల ఐదు కోట్ల రూపాయలు అందజేయడం జరిగిందన్నారు.

శ్రీ ముత్యాల గుండు ఎల్లమ్మ విగ్రహ పునఃప్రతిష్టాపన

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 130 సుభాష్ నగర్ డివిజన్ పరిధి ముత్యాల బస్తీలో నూతనంగా నిర్మించిన శ్రీముత్యాల గుండు ఎల్లమ్మ తల్లి విగ్రహ పునః ప్రతిష్టాపనకు బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బాల చందర్ గౌడ్, పద్మ గౌడ్,గజా,వెంకట్ రెడ్డి,నార్లకంటి దుర్గయ్య, నార్లకంటి ప్రతాప్,సాయిలు,ప్రేమ్ దీప్ గౌడ్,లక్ష్మి, ఝాన్సీ, అనసూయ, భరత్, అనుదీప్, విజయందర్, విగ్నేష్,శ్యామ్, శివ తదితరులు పాల్గొన్నారు

మౌలిక వసతుల కల్పనకు నిధులు వెచ్చిస్తాం

- **మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి తో పాటు మౌలిక వసతుల కల్పన కోసం ఎన్ని నిధులైన విచ్చిస్తామని మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ లు అన్నారు. శనివారం గాజులరామారం డివిజన్ కైలాష్ హిల్స్ కాలనీ ప్రాంతంలో రూ.29.60 లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న భూగర్భ డ్రయినేజీ పనులను స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఎంపీగా గెలిపించిన ఇక్కడి ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. ప్రజా సేవకుడుగానే నిస్వార్థంగా పనిచేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో నియోజకవర్గంలోని గ్రేటర్‌లోని అన్ని డివిజన్లతో పాటు, నిజాంపేట్ కార్పొరేషన్, కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీలలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. ప్రజల సహాయ సహకారాలతో రానున్న రోజుల్లో రాష్ట్రంలోనే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నెంబర్ వన్‌గా మారుస్తామన్నారు. అనంతరం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు విజయరామ్ రెడ్డి,సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

- **కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్**

నవ తెలంగాణ - బాలానగర్



కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించకుంటే సహించేది లేదని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అధికారులను హెచ్చరించారు. కూకట్‌పలి నియోజకవర్గ పరిధిలోని మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ ఇందిరాగాంధీ పురం పరిధిలో రూ. 60 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలన్నారు. లేని ఎడల సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. డివిజన్ అధ్యక్షుడు, స్థానిక నాయకులు రహదారి నిర్మాణంలో నాణ్యత పాటించడం లేదని తనకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సర్కిల్ అధికారులు ఈఈ శ్రీనివాస్, డీఈ ఆనంద్, ఏఈ పవన్‌లతో ఫోన్‌లో మాట్లాడి రహదారి నిర్మాణ నాణ్యతపై ప్రశ్నించారు. దీనిపై క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ తమకు అందజేయాలని సూచించారు. బస్తీలోని మంచినీటి సమస్యను స్థానికుల ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధు గౌడ్ గృహ ప్రవేశానికి వెళ్లి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు కాంగ్రెస్ నాయకుడు సాధు ప్రతాపరెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, ఎ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, రమేష్ ఎండి. బాకీ, వరహాలస్వామి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణకు ఘన స్వాగతం పలకాలి

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్



మంద కృష్ణ మాదిగ ఏబీసీడీ వర్గీకరణ సాధించి ఈ నెల 13న హైదరాబాద్‌కు వస్తున్న సందర్భంగా ఆయనకు ఘనంగా స్వాగతం పలకడానికి మాదిగలు వేలాది సంఖ్యలో రావాలని కుత్బుల్లాపూర్ ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. 30ఏండ్ల సుదీర్ఘ పోరాట ఫలితంలో భాగంగా ఆగస్టు 1వ తేదిన సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని చెప్పారు. మంద కృష్ణ మాదిగ సాధించిన ఏబీసీడీ వర్గీకరణను కాపాడుకోవాలంటే వర్గీకరణ వ్యతిరేకులకు ఒక గుణపాఠంగా ర్యాలీ నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకలు చిన్న వెంకటేష్, అధికార ప్రతినిధి సిలివేరు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు రసమల్ల యాదగిరి, బూరు రవి, ఎం జె ఎఫ్ డప్పు రామస్వామి, తిరుపతి, యక్కన్న, కృష్ణ ఏరోల్ల, అబ్రహం, సలోమి పద్మ అరుణ శ్రావణి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. ఈనెల 13న ర్యాలీని విజయవంతం చేయాలని అని పిలుపునిచ్చారు.

అసంఘటితరంగ కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయి

నవతెలంగాణ-దుండిగల్



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా దుండిగల్ మున్సిపల్ పరిధిలోని గండి మైసమ్మ భవన నిర్మాణ కార్మికుల అడ్డాలో క్విట్ ఇండియా దినోత్సవం పురస్కరించుకొని కార్మికులతో కలిసి సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం, సీఐటీయూ యూనియన్ నాయకుడు కుమార్, కురుమయ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్ అసంఘటితరంగా కార్మికులను విస్మరించిందన్నారు. కార్మికులకు అన్యాయం చేసేలా ఉందన్నారు. దేశంలోని అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయడం దారుణమని తెలిపారు.. మన రాష్ట్రంలో ఉన్న సింగరేణి బొగ్గు బ్లాక్ లను సింగరేణికే కేటాయించాలని, ఎలాంటి ప్రయివేట్ సంస్థలకు అప్పజెప్పొద్దన్నారు. గండిమైసమ్మ అడ్డాలో పనులు లేక కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వారిని ఆదుకోవాలన్నారు. గండిమైసమ్మ అడ్డాలో ఐదు రూపాయల భోజనం కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని, ఇప్పటికైనా అధికారులు ఐదు రూపాయల భోజనం కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు నరసింహ, వెంకటేష్, నరసింహ, సైదులు, ఆర్ రవి, ఎల్ మధు, కలాం, పప్పు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలి



- **కూకట్ పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి కూచిపూడి సత్యం మాదిగ**

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అభినవ అంబేద్కర్ మందకృష్ణ మాదిగ ఈ నెల 13న ఢిల్లీ నుండి హైదరాబాద్‌కు చేరుకుంటున్న సందర్భంగా మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ర్యాలీని జయప్రదం చేయాలని కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి కూచిపూడి సత్యం మాదిగ అన్నారు. శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గ కేంద్రంలో ముత్యపాగ శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి కో - ఇన్చార్జి సూదిపాక వాసుదేవరావు మాదిగ, చిరంజీవి మాదిగలు పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ లక్ష్య సాధన కోసం మందకృష్ణ మాదిగ గత 30 ఏండ్లుగా అలుపెరుగని పోరాటం చేసారన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాల చిరకాల ఆకాంక్ష, సామాజిక న్యాయ సిద్ధాంతాన్ని గెలిపించుకుని ఢిల్లీ గడ్డ నుండి హైదరాబాద్ గడ్డపై అడుగుపెడుతున్న సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గంలోని అని డివిజన్‌ల నుండి యావత్ మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు లక్ష లాదిగా తరలి వచ్చి ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో పుర్ర రాజు మాదిగ, అభిలాష్ , చింటూ , చంద్రకళ , సాయమ్మ , మానయ్య, గణేష్ , సబ్బు , అనిల్ , తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు మంచి స్పందన



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జేఎన్టీయూ యూనివర్సిటీ క్యాంపస్‌లో జేఎన్టీయూ హైదరాబాద్, నిపుణ సొసైటీ వారు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు మంచి స్పందన లభించింది. ఈ జాబ్ మేళాకు రిజిస్ట్రార్ డా కె. వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ ఎ. రజని, డైరెక్టర్, యుఐఐసి, జేఎన్‌టీయూహెచ్, డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ జె సురేష్ కుమార్‌లు హాజరై జాబ్ మేళాను ప్రారంభించారు. యూనివర్సిటీ పరిధిలో గల అన్ని ప్రయివేట్ , అటనామస్ , ఇతర డిగ్రీ, ఇంటర్మీడియట్ కాలేజీ విద్యార్థులు సుమారు10 వేల మంది హాజరయ్యారు. జాబ్ మేళాకు పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలు, హార్డ్ వేర్ కంపెనీలు, పలు ప్రయివేట్ బ్యాంకులు, అనేక ఫార్మ్ కంపెనీలు, మేనేజ్ మెంట్ సంస్థలు, ఐటీ కంపెనీలు, రాంకీ బిల్డర్స్ సంస్థ, పలు పేరు గల వివిధ రంగాలకు చెందిన సంస్థలు పాల్గొన్నాయని యూనివర్సిటీ ఇండస్ట్రియల్ ఇంటరాక్షన్ డైరెక్టర్ రజినీ తెలిపారు. ఎలాంటి రిజిస్ట్రేషన్ రుసుము లేకుండా జాబ్ మేళా నిర్వహించినట్టు నిపుణ సొసైటీ వారు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ , లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ , రాంకీ ఫౌండేషన్ వారు తెలిపారు. కార్యక్రమంలో శ్రీ విద్యా భూషణ్, ప్రాంతీయ కార్యదర్శి, లయన్స్ క్లబ్ లక్ష్మీ కుమారి, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, హైదరాబాద్ అధ్యక్షురాలు సుభద్ర రాణి, నిపుణ హ్యూమన్ డెవలప్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ గురుసేవ్, బీఎంటీ ఇండస్ట్రీస్ చైర్మన్ , లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం. రామ్‌రెడ్డి, రాంకీ ఫౌండేషన్ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు పేదలకు వరం



- **జనహిత సేవా ట్రస్ట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిత్య కోడి**

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పేద ప్రజల నివాసిత ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు, దాతలు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు వరమని, వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జనహిత సేవ ట్రస్ట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిత్య కోడి సూచించారు. శనివారం చింతల్ డివిజన్ పరిధి భగత్ సింగ్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఆస్పత్రి, ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి, భారత్ వికాస్ పరిషత్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సంబంధిత ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో ఆర్థోపెడిక్, పిడియాట్రిక్, గైనకాలజీ, జనరల్ ఫిజీషియన్, ఫీజియో థెరపీ, నేత్ర వైద్యులు సుమారు 250 మందికి పరీక్షలు చేయడంతో పాటు బీపీ, షుగర్, బరువు పరీక్షించి, మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తమ ఆరోగ్యానికి పాటించాల్సిన పద్ధతులతో పాటు పలు సూచనలు చేశారు. భారత్ వికాస్ పరిషత్ ద్వారా మహిళలకు హిమోగ్లోబిన్ శాతం పరీక్షించి, అనీమియా లక్షణాలు ఉన్నవారికి మందులను అందజేశారు. ఈ శిబిరంలో జనహిత సేవా ట్రస్ట్ సభ్యులు వెంకట నారాయణ, మెడికల్ క్యాంప్ కో-ఆర్డినేటర్ బి.నర్సింగ్ రావు, స్థానిక యువ నాయకులు సాయి ప్రకాష్, నరేష్ పలువురు నాయకులు స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డుపై మట్టి కుప్పలను తొలగించిన కాంగ్రెస్ నేతలు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



కేపీహెచ్‌బీ రమ్య గ్రౌండ్ వద్ద నిర్మించిన రోడ్డుపై మట్టి కుప్పలను కాంగ్రెస్ యువ నాయకులు తొలగించి సమస్యను పరిష్కరించారు. కేపీహెచ్‌బీ రమ్య గ్రౌండ్స్ ఎదుట జీహెచ్ఎంసీ అధికారులు నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. సదరు కాంట్రాక్టర్ సీసీ రోడ్డు పూర్తయిన తర్వాత రోడ్డుపై ఇరువైపులా ఉన్న మట్టి కుప్పలను అలాగే వదిలి వెళ్లిపోవడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత పది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా, రోడ్డుపై ఉన్న మట్టి కుప్పలు రాళ్ళ, నీరు నిలిచి ప్రజలను, వాహనదారులను, చిన్న చిన్న తోపుడు బండ్ల వ్యాపారులకు ఆ రోడ్డుపై వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా మారింది. దీంతో స్పందించిన స్థానిక కాంగ్రెస్ యువనాయకులు శివ చౌదరి, బచ్చు మళ్ళీ, బాబ్జి కుమార్ లు నడిరోడ్డు మీద మట్టి కుప్పలను ట్రాక్టర్ ద్వారా అక్కడి నుంచి తరలించి సమస్యను గంటలో పరిష్కారం చేశారు. దీంతో స్థానికులు, వ్యాపారులు వారు చేసిన పనికి ఆనందం వ్యక్తం చేశారు.

12

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్

ఆదివారం | ఆగస్టు 11, 2024 | www.navatelangana.com

భవనంపై నుంచి కింద పడిన దంపతులు

- భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు

నవతెలంగాణ-బేగంపేట్

నిర్మాణంలో ఉన్న ఓ భవనంపై పనిచేస్తూ భార్యా, భర్తలు ప్రమాదవశాత్తు కిందపడిపోయారు. ఈ ఘటనలో భర్త మృతి చెందగా భార్య తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నది. ఈ ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లాకు చెందిన భైరాగి (56), లక్ష్మి భార్యాభర్తలు. 5 ఏండ్ల క్రితం ఉపాధి కోసం నగరానికి వచ్చి ఆవులమందలో నివాసం ఉంటున్నారు.కొద్ది రోజుల క్రితం శ్రీనివాస్ అనే కాంట్రాక్టర్ వద్ద రెజిమెంటల్ బజార్‌లోని ఓ భవన నిర్మాణంలో వారు కూలీలుగా పనిచేస్తున్నారు. గురువారం భవనం స్లాబ్ నిర్మాణ పనులు జరుగుతుండగా భార్య మాల్ అందిస్తుండగా భర్త అందుకుంటున్నాడు. సాయంత్రం 5.30 గంటల సమయంలో ఇద్దరూ ప్రమాదవశాత్తు కిందపడిపోయారు. దాంతో ఇద్దరినీ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి భర్త చనిపోయాడు. భార్య తీవ్రగాయాలతో చికిత్స పొందుతోంది. కాంట్రాక్టర్ శ్రీనివాస్, ఇంటి యజమాని నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని గోపాలపురం పోలీసులు కేసు నమోదు చేసికుని దర్యాప్తు చేపట్టారు.

'బీసీ అధికారులకు ప్రాధాన్యత లేని శాఖలా..?'



నవతెలంగాణ-ఓయూ

బీసీ అధికారులకు ప్రాధాన్యత లేని శాఖలు కేటాయించడం అన్యాయమని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి దగ్గర నుంచి నేటి వరకు బీసీల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తూ కేవలం రెండు మూడు కులాలకే ప్రాధాన్యతనిస్తున్నట్టు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ. తెలంగాణలోని అన్ని శాఖలలో కులవివక్షత కొనసాగు తున్నదని ఆరోపించారు. అన్ని అర్హతలు, సీనియారిటీ బీసీ అధికారులకు ఉన్నప్పటికీ పదోన్నతులు, పోస్టింగ్ విషయా లలో ప్రాధాన్యత లేని పోస్టులకే పరిమితం చేస్తూ రెండు మూడు కులాలకే అగ్రతాంబూలం వేస్తున్నారని తెలిపారు. సామాజిక న్యాయం అంటూ రాజ్యాంగం చేతిలో పట్టుకొని రాహుల్ గాంధీ దేశమంతా తిరుగుతుంటే సీఎం రేవంత్ రెడ్డి ఏమో ఒకే కులానికి అగ్ర తాంబూలం వేస్తున్నాడన్నారు. ఇప్పటికైనా బీసీలను గుర్తించి భవిష్యత్తులో జరిగే బదిలీల్లో సామాజిక న్యాయం పాటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.



సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

వెంగల్ రావు నగర్ డివిజన్ మధుర నగర్‌లో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ రూ. 27 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు మంజూరు చేయించి శుక్రవారం శంకుస్థాపన చేయించారు. స్థానిక కార్పొరేటర్ దేదీప్యా రావు, బీఆర్ఎస్ మధురనగర్ ప్రెసిడెంట్ ప్రతాప్ రెడ్డి, నాయకులు కోడె సాంబశివ రావు, హనుమంత్ రావు, సుగుణ, సత్యసాయి కుమార్, రాజేందేర్ ప్రసాద్, సత్యనారాయణ రాజు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే చెక్కుల పంపిణీ

వెంగల్ రావు డివిజన్‌కు చెందిన 21మందికి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఒకొక్కరికి రూ. 1,00,116/- చొప్పున మొత్తం 21,02,436/- విలువగల కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను, ఐదుగురు లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేదీప్యా రావు, విజయ్, అంబటి రామకష్ణ, పూజారి బాలరాజు, ఆంజనేయులు యాదవ్, గజ్జెల బాలకష్ణ, పవన్, యాదగిరి, అర్జున్, శుషీల్, మహబూబ్ తదితరులు ఉన్నారు.



ఓయులో గ్రూప్స్ పుస్తకాల పంపిణీ

నవతెలంగాణ-ఓయూ

మంత్రి జూపల్లి కృష్ణారావు పుట్టినరోజు సందర్భంగా శనివారం ఉస్మానియా విశ్వవిద్యాలయం డా.బి.ఆర్.అంబేద్కర్ లైబ్రరీ వద్ద వనపర్తి జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు, ఇంద్రకంటి చారిట్రబుల్ ట్రస్ట్ చైర్మెన్ ,ఓయూ జేఏసీ నేత డా.ఇంద్రకంట వెంకటేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు పోటీ పరీక్షల పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. కృష్ణారావు ప్రజల మనిషి అని ,నిత్యం అందుబాటులో ఉంటూ ఇటు రాష్ట్ర అటు జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్న నేత అని డా.వెంకటేష్ కొనియాడారు. విద్యార్థులు జీవితంలో రాణించాలని అందుకే ఇలా పుస్తకాలు అందజేస్తున్నట్టు చెప్పారు. అంతకుముందు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నేత రాజు యాదవ్ , జగన్ , గోపీ ,రాజు ,అనిల్ ,పవన్ విద్యార్థులు పాల్గొన్నారు.



బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి

నవతెలంగాణ-ఓయూ

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేసి రాష్ట్రంలో సమగ్ర కులగణన చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఓయు ఆర్ట్స్ కాలేజీ నుంచి ఇందిరా పార్క్ వరకు ఓయు జేఏసీ చైర్మెన్ రాజారాం యాదవ్,మన అశోక్ యాదవ్, తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్



బస్తీ బాట చేపట్టిన నామినేటెడ్ సభ్యుడు

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జన్యావుల రామకృష్ణ శనివారం నాలుగో వార్డులోని అంబేద్కర్ హరిజన బస్తీ, అంబేద్కర్ సేవా సంఘం, రాంనగర్, పికెట్‌లో బస్తీ బాట నిర్వహించారు . బస్తిల్లో పాదయాత్ర చేపట్టి స్థానికులతో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకున్నారు.దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటానని అధికారం ఉన్నా లేకపోయినా బీజేపీ కార్యకర్తలు ఎల్లపుడూ ప్రజలకోసం పని చేస్తూనే ఉంటారని తెలిపారు. అందుకోసం అధిష్టానం నిరంతరం వారిని మార్గదర్శనం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కంటోన్మెంట్ అసెంబ్లీ కన్వీనర్ విజయనంద్, వార్డు అధ్యక్షులు రాజ మల్లేష్, సీనియర్ నాయకులు టోపీ శంకర్, నాగభూషన్ రెడ్డి, ఓంకార్, సరిశ్, జగన్, లక్మన్, ఉగ్రాసేన్, దీన్ దయాళ్ , ప్రేమ్ కుమార్, సాయి కుమార్ పాల్గొన్నారు.

తీర్థయాత్రలలో జంపన్న దంపతులు



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ దంపతులు తీర్థయాత్రల బాట పట్టారు. అందులో భాగంగా కాశీని ప్రతాప్ దంపతులు సందర్శించారు. కాశీలోని త్రివేణి సంగమమైనా గంగా, వారణాసి, విశ్వేశ్వర లింగం, అన్నపూర్ణ దేవాలయం, కాల భైరవ, గణపతి, కేదారేశ్వర ఆలయాలను సందర్శించడంతో పాటు గంగా హారతిని దర్శించుకున్నారు కాశి విశ్వనాథానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ. ద్వాదశ జ్యోతర్లింగాలలో ఒకటైన విశ్వేశరలింగం దర్శించుకోవడంతో తమ జన్మధన్యమైందని అన్నారు.

యుద్ధం వద్దు.. ప్రపంచ శాంతి ముద్దు

- జన విజ్ఞాన వేదిక జూబ్లీహిల్స్ కమిటీ ఆధ్వర్యంలో చిత్ర ప్రదర్శన



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

హిరోషిమా డే సందర్భంగా తెలంగాణ రెసిడెన్షియల్ బాలికల గురుకుల పాఠశాల బోరబండ లో శనివారం జనవిజ్ఞాన వేదిక , జూబ్లీహిల్స్ కమిటీ , ముందడుగు సంస్థల ఆధ్వర్యంలో శనివార చిత్ర ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. 1945 ఆగస్టు 6వ తేదీ, 9వ తేదీ చరిత్రలోనే ఒక సామూహిక హింసకాండ జరిగిన రోజులని.. విశ్రాంతి సైంటిస్ట్ , జన విజ్ఞాన్ వేదిక నాయకులు సూర్యదేవర రవి తెలియజేశారు. శనివారం తెలంగాణ రెసిడెన్షియల్ బాలికల గురుకుల పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక నగర కార్యదర్శి ఎం రవీంద్రబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రవి ఎస్ మాట్లాడుతూ 1939లో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైందని, హిట్లర్, ముస్సోలినీ వంటి నియంతల చర్యల వల్ల ప్రపంచ యుద్ధం వచ్చిందని తెలిపారు. యుద్ధం ముగుస్తున్న దశలో జపాన్ నగరాలైన హిరోషిమా, నాగసాకి నగరాలపై అమెరికా అణుబాంబులతో దాడి చేశారని తెలిపారు. ఆ దాడులలో సుమారుగా ఐదు లక్షల మంది మరణించారని, రేడియేషన్ ప్రభావంతో లక్షలాదిమంది వికలాంగులు అయ్యారని తెలిపారు, ఇప్పటికి కూడా ఆ ప్రభావం ఇంకా పోలేదని, మొక్కలు కూడా మొలవని పరిస్థితి ఉన్నదని తెలిపారు. అమెరికా వంటి దేశాల యుద్ధ ఉన్మాద చర్యలను ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ ప్రయత్నం చేయాలని కోరారు. ముందడుగు వ్యవస్థాపకులు ఐకా బాలాజీ చిత్ర ప్రదర్శన ద్వారా అణుబాంబు సృష్టి నుంచి దాని ప్రయోగం వలన జరిగిన విధ్వంసం, దుష్ఫలితాలను వివరించారు. విద్యార్థులు చాలా ఆసక్తిగా తిలకిస్తూ అప్పుడు జరిగిన విధ్వంసాన్ని చూస్తూ దానికి గల కారణాలను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో కామన్ స్కూల్ అసోసియేషన్ సభ్యురాలు వివి జ్యోతి , సాయి జెవివి నాయకులు ముందడుగు సభ్యులు సహజ , నిర్మల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి రమ, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఇండ్లను కూల్చారని ఎమ్మెల్యే దానంకు మొర..

- సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తా : ఎమ్మెల్యే

నవతెలంగాణ - బంజారా హిల్స్

30 సంవత్సరాలుగా నివసిస్తున్న ఇండ్లని ప్రభుత్వ అధికారులు కూల్చారని గురుబ్రహ్మనగర్ బస్తీ వాసులు శనివారం ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు మొరపెట్టుకున్నారు. ప్రభుత్వ అధికారులు తమపై చేస్తున్న అరాచకాన్ని ఆపాలని కోరారు. ఎమ్మెల్యే వెంటనె ఘటన స్థలానికి వెళ్లి అక్కడ ఉన్న ప్రజలతో.. మీరు ఎటువంటి ఆందోళన పడవద్దని.. తాను అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూబ్లీహిల్స్ డివిజన్ గురుబ్రహ్మ నగర్ బస్తీలో ఎన్నో ఏండ్లుగా జేఎన్ఎన్‌యూఆర్ఎం కింద గతంలోనే ఇండ్లు మంజూరు చేశారని రోశయ్య సీఎంగా ఉన్న సమయంలోనే పట్టాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. తాజాగా ఇది గ్రీన్ బెల్ట్ స్థలమంటూ సొసైటీలోని కొంత మంది పెద్దలకు మేలు చేసేందుకు అధికారులు బస్తీలోకి రాకపోకలు నిలిపివేస్తూ ప్రహరీని నిర్మిస్తున్నారని ఆరోపించారు. ఇక్కడ పార్కు నిర్మిస్తే తాము కూడా సంతోషిస్తామని అలా కాకుండా ఎవరికో మేలు చేసేందుకు కొంత మంది అధికారులు ప్రయత్నిస్తున్నారన్నారు. గతంలో 150 మంది అప్పుడు పట్టాలు పొందారనీ సీఎం స్వయంగా వచ్చి ఇక్కడ ఫౌండేషన్ స్టోన్ కూడా వేశారని అన్నారు.జూబ్లీహిల్స్ గురుబ్రహ్మ నగర్ లో ఎక్కువగా గిరిజనులు నివసించే ఈ ప్రాంతంలో స్థానికులకు న్యాయం చేయకుండా ప్రయివేటు వ్యక్తులకు లాభం చేకూరేలా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీని వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా నుంచి రాగానే విషయం వివరిస్తానన్నారు వారికి న్యాయం జరిగేలా చూస్తానని చెప్పారు.

అధికారులు మాత్రం ప్రభుత్వ భూములు కాపాడే బాధ్యత తమపై ఉందని తాము ఎవరి పక్షాన లేమని ప్రభుత్వ పక్షాన ఉంటామని తెలిపారు. ఎవరికి లాభపేక్షం చేయడానికి ఈ ఉద్యోగం చేయడం లేదన్నారు. ఈ స్థలాలను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రభుత్వ స్థలాలలో అక్రమాలు ఉంటే ఉపేక్షించేది లేదని తెలిపారు.

25న మహనీయుల జాతరను విజయవంతం చేయండి.



- ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్

నవతెలంగాణ-ఓయూ

బీపీ మండల్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 25న రవీంద్ర భారతిలో నిర్వహిస్తున్న మహనీయుల జాతరను విజయవంతం చేయాలని సామాజిక న్యాయ జేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట మహనీయుల జాతర కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ నెల 25న హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగే కార్యక్రమంలో ఆట - పాట - మాట బహుజన సాంస్కృతిక ఉద్యమం జరుగనుంది. ముఖ్యఅతిథులుగా బీపీ మండల్ మనవడు ప్రొ. సూరజ్ మండల్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు ఉద్యమకారులు, కవులు కళాకారులు రచయితలు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రొ. ప్రభంజన్ యాదవ్ కోరారు. కార్యక్రమంలో విద్యార్థి ఉద్యమ నాయకుడు కంచర్ల బద్రి, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సాంస్కృతిక అధ్యక్షుడు చక్రాల రఘు, విద్యార్థి నాయకుడు అంజి యాదవ్, గిరిజన నాయకులు వీరన్న నాయక్, ఉపేందర్, జర్నలిస్టులు, మేధావులు, ఆర్టీసీ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొమరయ్య యాదవ్, పాల్గొన్నారు.

ఒంటరి మహిళలే టార్గెట్..



- దోపిడీలకు పాల్పడుతున్న జంటకు రిమాండ్

నవతెలంగాణ-ఓయూ

ఒంటరి మహిళలను టార్గెట్ చేసుకొని దోపిడీలకు పాల్పడుతున్న జంటను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు లాలాగూడ పోలీసులు. శనివారం లాలాగూడ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఘటనకు సంబంధించిన వివరాలు ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి వెల్లడించారు. నల్గొండ జిల్లాలోని త్రిపురారం మండలం చెన్నైపాలెంకు చెందిన నేనావత్ హరి నాయక్ కొంత కాలం క్రితం నగరానికి వలసొచ్చాడు. అనంతరం, వడ్డేపల్లి లక్ష్మి అలియాస్ కవిత అనే మహిళతో పరిచయం ఏర్పరచుకొని సహజీవనం సాగిస్తున్నాడు. హస్తినపురంలోని రాఘవేంద్ర హోటల్ సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నాడు. అయితే, ఈజీ మనీకి జల్సా లకు అలవాటు పడిన వీరు ఒంటరి మహిళలను టార్గెట్ చేస్తూ దోపిడీలు చేస్తుండేవారు. ఈ క్రమంలో ఆగస్టు 3న, సాయంత్రం 6 గంటల సమయంలో అత్తాపూర్ లోని ఓ కల్లుకంపౌండ్‌కు వెళ్లిన అక్కడ ఒంటరిగా ఉన్న అచ్చమ్మ అనే మహిళతో మాట కలిపారు. పని ఇప్పిస్తామని చెప్పి అచ్చమ్మను ఆటో ఎక్కించుకొని లాలాగూడలోని రైల్వే మద్దూర్ యూనియన్ కార్యలయం సమీపంలోని మహంకాళి ఆలయం వద్దనున్న ఖాళీ ప్రదేశానికి తీసుకొచ్చారు. అనంతరం, అచ్చమ్మను చంపేస్తామని బెదిరించి ఆమె వద్దనున్న నల్లపూసలు, బంగారు గొలుసు, చెవి కమ్మలు, ముక్కుపుడక, మెట్టెలు (మొత్తం రూ.30 వేల విలువగల 12 గ్రాముల బంగారు నగలు, 3 తులాల వెండి ఆభరణాలు) లాక్కొని అక్కడి నుంచి పరారయ్యారు. కాగా, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అత్తాపూర్ నుండి లాలగూడా పీఎస్ వరకు ప్రతి సీసీ కెమెరాలను పూర్తిగా పరిశీలించారు.సీసీ పుటేజీ ల ఆధారంగా.. దొంగలించిన సొత్తును సికింద్రాబాద్ పాట్ మార్క్ లోని శ్రీ స్వతంత్ర జ్యులర్స్ ,శ్రీలక్ష్మి నారాయణ జ్యులార్స్ యజమానులు సంజయ్ ఉపాధ్యాయ , ప్రవీణ్ కుమార్‌లకు విక్రయాలు చేసినట్టు గుర్తించారు. వారి వద్దకు వెళ్లి విచారించారు. ఈ మేరకు శనివారం ఉదయం క్రైమ్ ఎస్ఐ నాగరాజు ,ఆధ్వర్యంలో పలువురు కానిస్టేబుల్ లు.. నిందితులు హరి నాయక్ , వడ్డె లక్ష్మీ లను హస్తిన పురం లోని నందన వనం కాలనీ లో అదుపులోకి తీసుకున్నారు.

మొత్తం 7 గ్రాముల బంగారు నగలు, 23 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. అదే విధంగా దొంగలించిన సొత్తును కొనుగోలు చేసిన జ్యువెల్లరీ షాపు యజమానులపై కూడా కేసు నమోదు చేసినట్టు తెలిపారు. నిందితుడు హరి నాయక్‌పై 2000 సంవత్సరం నుంచి ఇప్పటివరకు 7 పోలీస్ స్టేషన్లలో 10 కి పైగా కేసులు నమోదై ఉన్నాయని వివరించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ జైపాల్ రెడ్డి, ఇన్స్పెక్టర్ కరుణాకర్రెడ్డి, ఎస్ఐలు నాగరాజు, షాహీద్ పాషా, క్రైమ్ టీమ్ రాజశేఖర్, సుమంత్, సాయినాథ్, జగదీష్, నవీన్, వేణు , పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి



- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ-ముషీరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద బీసీ కుల గణన 42 శాతం రిజర్వేషన్ లకై బిసి జనసభ రాష్ట్ర అధ్యక్షులు రాజారామ్ యాదవ్ ఆధ్వర్యంలో బీసీ సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ దీక్షను మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు ప్రారంభించారు. ఈ దీక్షకు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎంపీ ఆర్ కృష్ణయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు చామకూర రాజు, హాజరయ్యారు. ఈ సత్యాగ్రహ దీక్షను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య నాయకులకు నిమ్మరసం ఇచ్చి విరమింప చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. బీసీలంతా ఏకం కావలసిన సమయం ఆసన్నమైందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు అరకొర నిధులు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ కులగలను చేపట్టి స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ మహాసభ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మేకపోతుల నరేందర్, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయి నరేందర్, విద్యార్థి యువజన సంఘం అధ్యక్షులు రామ్మూర్తి, నవ సంఘర్షణ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, బి ఆర్ పి ఎస్ నాయకులు కోట్ల భాస్కర్, సోషల్ జస్టిస్ పార్టీ నాయకులు కెవి గౌడ్, తెలంగాణ జర్నలిస్టు ఫోరం అధ్యక్షులు మేకల కృష్ణ, ఓయూ చేసి నాయకులు మన అశోక్, తదితర నాయకులు పాల్గొన్నారు

రేషన్ షాప్‌ల తనిఖీ చేపట్టిన కార్పొరేటర్



నవతెలంగాణ-ఓయూ

సీతాఫల్ మండి కార్పొరేటర్ సామల హేమ శనివారం సీత ఫలమండిలోని రేషన్ షాపులో ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వం ఇచ్చే రేషన్ సరిగ్గా అందుతుందా అని ఆరా తీశారు. అవకతవకలు జరగకుండా పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీలర్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.



సనత్ నగర్ డివిజన్ జయ ప్రకాష్ నగర్‌లో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వనమోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ కొలను లక్ష్మీ చేతుల మీదుగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని ప్రజలు ఎంతగానో ఆదరించారని తెలిపారు. పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉంటారని, ప్రతి కుటుంబం నుంచి ఒక్కరు ఒక మొక్కను తప్పనిసరిగా నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు జోష్ణ, సంధ్య, కైలాష్, మూర్తి, సనత్ నగర్ డివిజన్ అధ్యక్షులు కోలను బాల్ రెడ్డి కాలనీవాసులు దాసు, సాయినాథ్ రెడ్డి, గీత తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-బేగంపేట

బిల్లా పవన్‌ను ఎందుకు బైండోవర్ చేయలేదు

- గొడవకు రౌడీ షీటరే ప్రధాన కారణం
- కాంగ్రెస్ యువ నాయకుడు నవీన్ యాదవ్



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఈనెల 4వ తారీఖు జరిగిన బోనాల ఫలహార బండి ఊరేగింపులో వెస్ట్ జోన్ పరిధిలో పలు పోలీస్ స్టేషన్లలో ,అనేక కేసులలో నిందితుడిగా ఉన్న రౌడీ షీటర్ బిల్లా పవన్ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా జరిగిన గొడవపై నవీన్ యాదవ్ తన అనుచరులతో యూసుఫ్‌గూడలోని తన ఆఫీసులో శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..

రహమత్ నగర్ గల్లి నివాసి అయిన జి చంద్రహాస్ ఈ నెల 4న ఊరేగింపునకు సంబంధించి సాయంత్రం 6 గంటల నుండి 10 గంటల వరకు ఊరేగింపునకు పోలీసుల అనుమతి తీసుకున్నాడు. అయితే అదే రోజు టాటా ఏసీ పెద్ద ఆటోలో విగ్రహాలతో పాటు డీజే సౌండ్, లైటింగ్‌తో తన స్నేహితులు బస్తీ యువకులతో భారీ ర్యాలీగా వెళుతూ రౌడీ షీటర్ బిల్లా పవన్ ను ర్యాలీలో కలుపుకున్నాడు. అనంతరం యూసుఫ్ గూడా చెక్ పోస్ట్ లోని నవీన్ యాదవ్ ఇంటి ముందుకు వెళ్లగానే డీజే సౌండ్ పెంచి కేకలు వేశారు. ఇంటి ముందు నిల్చుని ఉన్న నవీన్ యాదవ్ అనుచరులకు వేలు చూయించి బెదిరించారు. ఆగ్రహించిన నవీన్ యాదవ్ అనుచరులు శివ ,నాగేందర్, అనిల్ ముగ్గురు వెళ్లి అనుమతి టైం అయిపోయిందని శబ్దం చేయకుండా వెళ్లిపోవాలని సూచించారు. అందుకు ఆగ్రహించిన బిల్లా పవన్ అనుచరులు ముగ్గురిపై చేయగా ముగ్గురూ తిరిగి ఎదురు దాడి చేశారు. నవీన్ యాదవ్ మిగితా అనుచరులు, ఆయన కుటుంబ సభ్యులు బయట ఉన్న నవీన్ యాదవ్ కు ఫోన్ చేసి విషయం తెలిపారు. వెంటనే నవీన్ యాదవ్ మధురానగర్ పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసి అనంతరం 100 నంబర్‌కు డయల్ చేయవలసిందిగా తన అనుచరులకు సూచించారు. .వెంటనే మధురానగర్ సబ్ ఇన్స్పెక్టర్ సాయినాథ రెడ్డి, బాలరాజు సిబ్బందితో అక్కడికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టి అక్కడ నుండి పంపించి వేశారు. అయితే 5వ తేదీన చంద్రహాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, నవీన్ యాదవ్ అనుచరులైన శివ, నాగేందర్, అనిల్‌ను స్టేషన్‌కు రావలసిందిగా కోరారు. ఈ మేరకు 6వ తేదీన అడ్వకేట్ తో కలిసి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఇన్స్పెక్టర్ ఎదుట హాజరయ్యారు. అనంతరం వారిని పంజాగుట్ట ఏసీపీ ఆఫీసుకు తరలించి పలు సెక్షన్ల పై కేసు నమోదు చేసి 8న సాయంత్రం నాంపల్లి కోర్టులో 14వ న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. న్యాయమూర్తి పోలీసులు పెట్టిన కొన్ని సెక్షన్లను తిరస్కరిస్తూ వెంటనే బెయిల్ ఇచ్చారు.

నవీన్ యాదవ్ మాట్లాడుతూ గొడవకు ప్రధాన కారణం రౌడీ షీటర్ బిల్లా పవన్ అని,పోలీసుల నిర్లక్ష్యం మరో కారణమని అన్నారు. అసలు బోనాలు పండుగ రోజు బిల్లా పవన్‌ను ఎందుకు బైండోవర్ చేయలేదని ప్రశ్నించారు. గొడవకు రౌడీ షీటరే ప్రధాన కారణం అని ఆరోపించారు. పంజాగుట్ట ఏసీపీ విచారణ జరపకుండా, రెండు రోజులు తన అనుచరులను చిత్రహింసలకు గురి చేసి తీవ్రంగా కొట్టారని ఆరోపించారు. ఈ విషయంపై హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ కు, డీజీపీకి ఫిర్యాదు చేస్తానని, న్యాయం జరగని ఎడల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి కూడా తీసుకువెళ్తానని చెప్పారు. ఇటీవల అనేక పోలీస్ స్టేషన్లలో అకారణంగా నేరాలు చేశారని దాడి చేసి కొట్టి, అత్యుత్సాహం ప్రదర్శించిన పోలీస్ అధికారులు ఉద్యోగాలు పోగొట్టుకున్న సంఘటనలు జరిగినా కూడా, పంజాగుట్ట ఏసీపీ, మధురానగర్ పోలీస్ అధికారులు ఈ విధంగా అకారణంగా కొట్టడంపై, న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బాధితులతో మీడియాతో మాట్లాడించి అనంతరం పోలీసులు కొట్టిన దెబ్బలంటూ బాధితులు మీడియాకు చూపించారు.



పోలీసులకొట్టిన దెబ్బలంటూ మీడియా ఎదుట చూపించిన నవీన్ యాదవ్ అనుచరుడు నాగేందర్.

గుర్తు తెలియని మహిళ మృతి

నవతెలంగాణ - ధూల్ పేట్

గుర్తు తెలియని ఓ మహిళ మృతి చెందిన సంఘటన మంగళ హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శనివారం చోటు చేసుకుంది. సబ్ ఇన్స్పెక్టర్ అస్లం షేక్ తెలిపిన వివరాల ప్రకారం... మంగళ్ హాట్ మార్కెట్‌లోని అన్నపూర్ణ ట్రేడర్స్ దుకాణం ముందు పడి ఉంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందింది. మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ఆర్యవైశ్య హాస్టల్ చైర్మెన్ గంజి రాజమౌళి గుప్తా జన్మదిన సందర్భంగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ శనివారం గంజి రాజమౌళి గుప్తను ఆర్యవైశ్య హాస్టల్‌లో కలిసి ఘనంగా సన్మానించారు. తర్వాత జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ముఠా జయసింహ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-ముషీరాబాద్

ఆదివాసుల మీద
అణచివేత ప్రయోగిస్తున్న బీజేపీ, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు

- ప్రొఫెసర్లు హరగోపాల్, కోదండరాం



నవతెలంగాణ - ముషీరాబాద్

ఆదివాసుల మీద కేంద్రంలోని బీజేపీ, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రమైన అణచివేత ప్రయోగిస్తున్నాయని ప్రొఫెసరు హరగోపాల్, కోదండరాంలు అన్నారు. శనివారం బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివాసీ హక్కులు - కార్పొరేటీకరణ సంఘీభావ ఉద్యమాలు అఖిల భారత సదస్సు రెండవ రోజు ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ అన్వర్ ఖాన్ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సుకు ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ కోదండరాం, అన్వర్ ఖాన్, సోని సోరి, ఉస్మానియా యూనివర్సిటీ డాక్టర్ కిషోర్ కుమార్, సర్వసత్వ పరిషత్ ఈశ్వర్ గజ్వేలి, పిఓడబ్ల్యు సంధ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్లు హరగోపాల్, కోదండరామ్ మాట్లాడుతూ... సమాజంలోని ఆధిపత్య శక్తులు ఆదివాసీ చట్టాలకు, అటవీ చట్టాలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నప్పుడు పాలకులు అడ్డుకోవడం లేదన్నారు. బ్రిటిష్ పాలనపై పోరాడిన ఆదివాసీలు నేడు మన ప్రభుత్వ పాలనపై కూడా పోరాడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ప్రధాన కారణం చట్టబద్ధ పాలన అనే అతి ముఖ్యమైన రాజ్యాంగ మార్గదర్శకత్వాన్ని ప్రభుత్వాలు స్వీకరించకపోవడం అని అన్నారు. రాజ్యాంగ ఆదర్శాలను ఆచరణలో నిజం చేయాల్సిన ప్రభుత్వాలు వాటికి వ్యతిరేకమైన ఆర్థిక, సాంస్కృతిక, పర్యావరణ విధానాలను అమలు చేస్తున్నాయన్నారు. ఈ విషయంలో కేంద్రంలో, రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలన్నీ ఒకటే అయినప్పటికీ బీజేపీ మరింత అమానుషంగా ప్రవర్తిస్తున్నది అని మండిపడ్డారు. ఆదివాసీ సంక్షేమం పట్ల తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని చెప్పారు. రాజ్యాంగ ఆదేశాలను విస్మరించి పాలన సాగిస్తున్నాయని తెలిపారు. అనేక ఉన్నత మానవీయ విలువలను, లక్ష్యాలను ప్రకటించుకున్న రాజ్యాంగం ఆదివాసుల విషయంలో ఘోరంగా విఫలమవుతుందని విమర్శించారు. ఆదివాసుల కోసం నిర్దేశించిన చట్టాలను అమలు చేయాలని ప్రభుత్వాలు అనుకోవడం లేదన్నారు.

అటవీ ప్రాంతాల కార్పొరేటీకరణకు ఆటంకంగా ఉన్న ఆదివాసులను అక్కడి నుంచి బైటికి పంపించడమో లేక చంపివేయడమో లక్ష్యంగా హింసాకాండ పెరిగిపోయిందని ఆరోపించారు. దీనికి తాజా ఉదాహరణ ఆపరేషన్ కగార్ అనే పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆదివాసీ ప్రాంతాల్లో ఎన్కౌంటర్ల పేరుతో ఆదివాసులను చంపేస్తుందన్నారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఆరంభమైన ఈ అణచివేత చర్యల కోసం దేశ సరిహద్దుల్లోని సైనిక బలగాలను కూడా ఆదివాసీ ప్రాంతాలకు తరలించారని పేర్కొన్నారు.ఒక్క చత్తీస్‌ఘడ్‌లోనే సుమారు 150 మంది ఆదివాసులను చంపేశారని వివరించారు. మహారాష్ట్రలో, ఝూర?ండ్లో, తెలంగాణలో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. కేవలం హత్యలే కాకుండా నిరంతర నిఘా, వేల సైనిక బలగాలతో క్యాంపులు, అత్యాధునిక సాంకేతికతతో నేల మీద, ఆకాశంలోంచి దాడులు, మహిళల మీద అత్యాచారాలు, లెక్కలేనన్నీ అక్రమ కేసులు, విచారణ లేని జైలు నిర్బంధం మొదలైన అనేక హింసా రూపాలు ఆదివాసీ ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి అని అన్నారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆదివాసీ సంఘీభావ ఉద్యమాలు ఉధృతమయ్యాయి, ఇందులో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఏర్పడ్డ ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఈ అఖిల భారత సదస్సును ఏర్పాటు చేసిందన్నారు. ఆదివాసుల హత్యాకాండను నిలువరించడమే లక్ష్యంగా దేశంలో జరుగుతున్న సంఘీభావ ఉద్యమాలను వేగవంతం చేయడానికి ఈ సదస్సు దోహదం చేస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాలను తయారు చేయాలి

- ఏసీపీ వెంకట్ రెడ్డి



నవతెలంగాణ - ధూల్ పేట్

మట్టి గణపతి విగ్రహాలను తయారు చేసి పర్యావరణాన్ని పరిరక్షించాలని గోషామహల్ డివిజన్ ఏసీపీ వెంకట్ రెడ్డి అన్నారు. గణేష్ ఉత్సవాలను పురస్కరించుకొని మంగళ్ హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విగ్రహాల తయారీ దారుల, నిర్వాహకులతో అవగాహన కార్యక్రమం మంగళ్ హాట్ పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక చవితి పండగలో మట్టి విగ్రహాలను ప్రతిష్టించుకోవాలన్నారు. తయారీ దారులు మట్టి విగ్రాలను తయారు చేయడంతో పర్యావరణ సంరక్షించినవారవుతారన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ గణపతులతో ప్రమాదమని సూచించారు. దీంతో పర్యావరణ కలుషితమై జీవరాశుల మనుగడ దెబ్బ తింటుందని అన్నారు. పర్యావరణ పరిరక్షణ సమతుల్యం కై మట్టి గణపతులను తయారు చేయాలని, మండపాల నిర్వాహకులు వాటినే ప్రతిష్ఠించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్స్పెక్టర్ ఎం మహేష్, డీఐ, ఎస్ఐలు, సిబ్బంది తదరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ - ముషీరాబాద్

ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన నర్సయ్యకు ముషీరాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సందీప్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నర్సయ్యకు శాలువా కప్పి, స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. అడిషనల్ డీసీపీ నర్సయ్యను సన్మానించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు విజయ్ కుమార్, సమీర్ తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన
కార్మికుల ధర్నాను జయప్రదం చేయండి

- ఈ నెల 13న మండల కేంద్రాలు, 21న రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నాలు
- తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి కె.ఉన్నికృష్ణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈ నెల 13న మండల కేంద్రాలు, 21వ తేదీన రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నా జయప్రదం చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి కె.ఉన్నికృష్ణ పిలుపునిచ్చారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను హరే రామ హరే కృష్ణ సంస్థకు అప్పగించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపర్చిన విధంగా మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల వేతనం చెల్లించాలనీ, పెండింగ్ వేతనాలు, బిల్లులు చెల్లించి ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ ధర్నాకు రాష్ట్ర నలుమూలల నుంచి మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఉవ్వెత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మల్లారెడ్డి
అగ్రికల్చర్ యూనివర్సిటీపై విచారణ చేపట్టాలి

- యూనివర్సిటీ గుర్తింపు వెంటనే రద్దు చేయాలి
- ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్

నవతెలంగాణ-సిటీబ్యూరో

కుత్బుల్లాపూర్ మైసమ్మగూడలో ఉన్న మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీలో విద్యార్థి మృతి పట్ల అనుమానాలున్నాయనీ, యూనివర్సిటీపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో ఈ యూనివర్సిటీలో విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో అనేకమంది ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవి ఆత్మహత్యలు కాదనీ, మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీ హత్య అని ఆరోపించారు. వెంటనే యూనివర్సిటీ గుర్తింపు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన అరుణ్ కుమార్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీ, ఇంజినీరింగ్ యూనివర్సిటీ, కళాశాలల్లో విద్యార్థులు ఈ మధ్యకాలంలో ఎక్కువమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ ఆత్మహత్యలకు కారణం కళాశాలల యజమాన్యమే అని భావిస్తున్నట్టు తెలిపారు. రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేయడమే కాదు.. విద్యార్థులకు హాస్టళ్లలో తినే భోజనంలో పురుగులు వస్తున్నాయనే కారణంతో విద్యార్థులు అనేక దపాలు పోరాటాలు నిర్వహించారని తెలిపారు. ఇంత జరుగుతన్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటు అన్నారు.



విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించకుండా విద్యను వ్యాపారంగా మార్చిన మల్లారెడ్డి కళాశాలల గుర్తింపులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన విద్య, భోజనం, సౌకర్యాలు అందించకుండా రూ.లక్షల్లో దోపిడీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో కళాశాలల్లో రూ.లక్షలు వెచ్చించి అడ్మిషన్ తీసుకుంటే యాజమాన్యం విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడు తుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అండగా నిలవాలని కోరారు. మృతుడి కుటుంబానికి రూ.కోటి ఆర్థిక సాయం అందించాలని కోరారు. మల్లారెడ్డి విద్యాసంస్థల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ప్రభుత్వం పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)గా పెద్ద ఎత్తున పోరాటం రూపొందిస్తామని హెచ్చరించారు.

చలో జీహెచ్ఎంసీ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ముషీరాబాద్

నగరంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్ లాంటి వ్యాధులు విజృంభిస్తున్నా వాటిని అరికట్టేందుకు చర్యలు సరిగా తీసుకోవడం లేదని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పి.వై.ఎల్) గ్రేట్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. రవి కుమార్, బి.ఎస్ కృష్ణలు అన్నారు. శనివారం మార్క్స్ భవన్ లో ఛలో జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు నిరసనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. రవి కుమార్, బి.ఎస్ కృష్ణ లు మాట్లాడుతూ...గత రెండు రోజులుగా ఏరియాలో సర్వే చేస్తే ప్రజలు అనేక ఫిర్యాదులు చేశారన్నారు. అందుకే ఆగస్టు 12న ఛలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. నగరంలో దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవడం లేదని, పారిశుద్ధ పనుల్లో తీవ్ర లోపాలు ఉన్నాయని, దీనికి సాక్ష్యం కమిషనర్ ఆమ్రపాలి మాటలేనని వారు గుర్తు చేశారు. కమిషనర్ ఇంటి చెత్తను కూడా సేకరించట్లేదని ఆమె విలేకరుల సమావేశంలో చెప్పడం చూస్తే పారిశుద్ధ్య పనులు ఏ స్థాయిలో జరుగుతున్నాయో ఇదే తార్కాణం అన్నారు. ఛలో జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు నిరసనలో ప్రజలు, యువత పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో మనోహర్, సాయి, ప్రసాద్, ఆంజనేయులు పాల్గొన్నారు.

మాజీ కేంద్ర మంత్రి శివశంకర్ జయంతి వేడుకలు



నవతెలంగాణ - ధూల్ పేట్

మాజీ కేంద్ర మంత్రి పి.శివశంకర్ 95వ జయంతి వేడుకలను లాలపేట మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి శివశంకర్ చేసిన సేవలను వారు గుర్తుచేసుకున్నారు. అనంతరం స్థానిక విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సలహాదారులు జి.పాండు రాంగం, అధ్యక్షుడు చిలుక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మీసాల శ్రీనివాస్, రాష్ట్ర మున్నూరు కాపు యువక మండలి అధ్యక్షుడు కె.రాకేష్, ప్రధాన కార్యదర్శి యస్. పి.క్రాంతి కుమార్, సభ్యులు తోట కార్తీక్ చక్రవర్తి, ఆకుల ఉదయ్, సి.అభిలాష్, లాలపేట సంఘం ప్రతినిధులు ఎం.ప్రమోద్, సి.రాజు, పి.ముత్యాలు, ఎస్.వెంకట్ రావు, మోహన్ రావు, కృష్ణా స్వామి, సంతోష్, పరమేష్ ఇతర సభ్యులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముగిసిన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు

నవతెలంగాణ-సిటీబ్యూరో

సుచిత్రా అకాడమీ నిర్వహించిన రెండు రోజుల 6వ వార్షిక సదస్సు మోడల్ యునైటెడ్ నేషన్స్ కూలంకుష చర్చలు, అంతర్దృష్టితో కూడిన చర్చలు, సాంస్కృతిక మార్పిడి మధ్య ముగిసింది. 'వాయిసెస్ ఆర్ఐఎస్ఈ, సొల్యూషన్స్ సోర్' అనే ఇతి వృత్తంతో జరిగిన ఈ సదస్సు, ప్రపంచ ఐక్యత, బాధ్యత భావాన్ని పెంపొందిస్తూ, ఒత్తిడితో కూడిన ప్రపంచ సమస్యలను పరిష్కరించడానికి నగరంలో ఉన్న యువకులను ఒకచోట చేర్చింది. ఈ సందర్భంగా సుచిత్రా అకాడమీ ప్రిన్సిపాల్ దీపా కపూర్ మాట్లాడుతూ సుచిత్రా ఎంయూఎన్ 6.0 కేవలం ఒక సదస్సు మాత్రమే కాదనీ, ఇది యువ నాయకులు తమ నైపుణ్యాలను మెరుగుపరిచి, శాశ్వత స్నేహాలను ఏర్పరచుకుని, మెరుగైన ప్రపంచానికి దోహదపడే మార్గదర్శక వేదికగా నిలవాలనే ఉద్దేశ్యంతో ఆరేండ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధుల వ్యక్తిగత ఎదుగుదల, అభ్యాస అనుభవాలు నిజంగా స్ఫూర్తిదాయకంగా ఉన్నాయన్నారు. యునైటెడ్ నేషన్స్ సెక్యూరిటీ కౌన్సిల్, ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి, జాయింట్ క్రైసిస్ కమిటీ, హై లెవల్ పొలిటికల్ ఫోరమ్ ఆన్ సస్టైయినబుల్ డెవలప్‌మెంట్, ఆలిండియా పొలిటికల్ పార్టీస్ మీట్, ఇంటర్నేషనల్ ప్రెస్, ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కో-ఆపరేషన్, ఉన్నత స్థాయితో సహా పలు కమిటీల్లో వివిధ దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 290 మంది విద్యార్థులు ఉత్సాహభరితమైన ఈ చర్చల్లో పాల్గొన్నారు.



'సర్దార్ పాపన్న జయంతిని ఘనంగా నిర్వహిస్తాం'

నవతెలంగాణ - ముషీరాబాద్

విప్లవ వీరుడు సర్వాయి సర్దార్ పాపన్న జయంతిని ఘనంగా నిర్వహిస్తామని జై గౌడ సేన జాతీయ అధ్యక్షులు డా మొర్ల ఏడుకొండలు గౌడ్ అన్నారు. శనివారం బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జై గౌడ సేన ఆధ్వర్యంలో ఆగస్టు 18న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 374 జయంతి సందర్భంగా పాపన్న మహారాజు శోభాయాత్ర లోగోను ఆవిష్కరించారు. అనంతరం శోభాయాత్ర జెండాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు మొర్ల ఏడుకొండలు గౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించి శోభాయాత్రను జయప్రదం చేస్తామని తెలిపారు. బహుజన విప్లవ వీరుడు దక్షిణ భారతదేశం నుండి మొగలాయిలను తరిమి కొట్టి గోల్కొండ కోటను ఏలిన పోరాటయోధుడు సర్వాయి సర్దార్ పాపన్న అని తెలిపారు. ఏడు సంవత్సరాలుగా సర్దార్ సర్వాయి పాపన్న శోభాయాత్రలో జెండాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. దాని ద్వారా బహుజనులలో రాజ్యాధికార స్ఫూర్తిని నింపడానికి దోహదపడుతుందని తెలిపారు. క్షేత్రస్థాయి నుంచి నాయకత్వం తయారు కావడానికి కృషి చేస్తూ సామాజిక చైతన్యం తీసుకువస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జై గౌడ సేన నాయకులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
ఆదివారం | ఆగస్టు 11, 2024 | www.navatelangana.com

పేదింటి ఆడపిల్ల పెండ్లికి అండగా కార్పొరేటర్



నవతెలంగాణ-అంబర్‌పేట
అంబర్‌పేట డివిజన్ దుర్గ నగర్‌లో పేద కుటుంబానికి చెందిన దీపిక వివాహానికి కార్పొరేటర్ తన వంతు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ మహిళా నేత లక్ష్మి ద్వారా సమాచారం తెలుసుకొని ప్రహ్లాద్,లక్ష్మి కూతురు దీపిక వివాహానికి తన వంతు సాయం అందించాలన్న ఉద్దేశంతో కొంత ఆర్థిక సహాయం చేసినట్టు తెలిపారు. పేద కుటుంబానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలోపార్టీ అంబర్‌పేట డివిజన్ అధికార ప్రతినిధి మహేష్ ముదిరాజ్, లక్ష్మిసంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ పి.శివశంకర్ 95వ జయంతి



నవతెలంగాణ-ఓయూ
తార్నాక డివిజన్ లాలపేట్ మున్నూరుకాపు ఆధ్వర్యంలో శనివారం లాలాపేట్ సంఘం కార్యాలయంలో జస్టిస్ పుంజాల. శివశంకర్ 95వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు అయిన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.దేశానికి న్యాయ విభాగానికి ఆయన చేసిన కృషిని ప్రశంసించారు. కార్యక్రమంలో సలహాదారు జి. పాండ్యరంగం ,అధ్యక్షుడు చిలుక శ్రీనివాస్ ,సెక్రటరీ మీసాల శ్రీనివాస్ ,నేతలు జి.మోహన్ రావు, కృష్ణా స్వామి, ప్రమోద్ , పరమేష్ , రాజు , ముత్యాలు సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చర్మ సమస్యలపై జాగ్రత్తగా ఉండాలి..

- **జిల్లా ఆస్పత్రి చర్మ వైద్య నిపుణులు డాక్టర్ సౌజన్య దేవి**

నవతెలంగాణ -సుల్తాన్ బజార్
వర్షాకాలంలో అలర్జీ సమస్యలు రాకుండా ఉండాలంటే శుభ్రమైన కాటన్ దుస్తులు ధరించాలని, చర్మ సంబంధించిన సమస్యలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కింగ్ కోఠి హైదరాబాద్ జిల్లా జిల్లా ఆస్పత్రి చర్మ వైద్య నిపుణులు(డెర్మటాలజి)డాక్టర్ సౌజన్య దేవి అన్నారు. శనివారం కింగ్ కోఠి లోని జిల్లా ఆస్పత్రిలో ఆమె మాట్లాడుతూ.. వర్షం సమయంలో వాతావరణంలో తేమ పెరుగుతుందని.. దీని కారణంగా ఇది చర్మంపై బ్యాక్టీరియా, ఫంగస్ పెరగడానికి సులభతరం చేస్తుందన్నారు. వర్షంలో తడవడం వల్ల చర్మ వ్యాధుల ప్రభులే ప్రమాదం ఉందన్నారు. వర్షాకాలంలో పాదాలు ఎక్కువసేపు తడిగా ఉన్నప్పుడు ఫంగల్ ఇన్ఫెక్షన్ వస్తుందన్నారు. ఫంగల్ ఇన్ఫెక్షన్ చర్మంపై ఎరుపు, దురద మచ్చలను కలిగిస్తుందని చెప్పారు. ఈ ఇన్‌ఫెక్షన్ శరీరంలోని ఏ భాగానికైనా వస్తుందని, దీనిని రింగ్ వార్మ్ అని కూడా అంటారన్నారు. దీని కారణంగా, చర్మంపై వత్తాకార మచ్చలు, కనిపిస్తాయని, ఇవి నెమ్మదిగా పెరుగుతాయని తెలిపారు. ఈస్ట్ ఇన్‌ఫెక్షన్ అనేది ఫంగల్ ఇన్ఫెక్షన్ అని.. ఇది సాధారణంగా తేమ ఉన్న ప్రదేశాలలో, చంకలు, గజ్జలలలో తేమ శాతం పెరగడం వల్ల ఈ ఇన్ఫెక్షన్లు వస్తాయన్నారు. చర్మాని ఎల్లప్పుడూ హైడ్రేట్‌గా ఉంచుకోవాలన్నారు. కాలుష్యం బారిన పడకుండా చూసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు చర్మాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇమ్యూనిటీ తక్కువగా ఉన్న వారిలో చర్మ సంబంధిత సమస్యలు వస్తాయన్నారు. దురద, తామర, గజ్జి, సోయాసిస్ దీర్ఘకాలిక సమస్యలు ఉంటే వెంటనే వైద్యుని సంప్రదించాలని సూచించారు. మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలని తెలిపారు. పని ఒత్తిడి గురికాకుండా ఉండాలని, ధూమపానం ,మద్యపానం వంటివి చేయకూడదన్నారు. ఈ సీజన్ లో బహిరంగంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవద్దని సూచించారు. చర్మవ్యాధులు రాకుండా ఉండేందుకు సమతుల్య ఆహారం, పోషకాహారం, నారింజ ,స్ట్రాబెరీ, ఆపిల్స్, పుచ్చకాయ, అరటిపండ్లు ,గ్రీన్‌టీ, పండ్లు, కూరగాయలు బలమైన ఆహారం తీసుకోవాలని సూచించారు.



వక్ఫ్ బోర్డులో సమస్యలను పరిష్కరించాలి

- **ఆల్ ఇండియా ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్**


నవతెలంగాణ-హిమాయత్ నగర్
వక్ఫ్ బోర్డులో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆల్ ఇండియా ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ చైర్మన్ సయ్యద్ ముఖ్తర్ హుస్సేన్ డిమాండ్ చేశారు. శనివారం హైదర్ గూడలోని ఎన్ఎస్ఎస్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎంఏ.సిద్ధిఖీతో కలిసి ఆయన మాట్లాడారు. 20 కిలో మీటర్ల దూరంలో ఉన్న హైవేల వెంబడి 100 ఎకరాల వక్ఫ్ భూమిని శ్మశానవాటికలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.పట్టణ ప్రాంతాలు, అన్ని జిల్లా హెడ్ క్వార్టర్స్ లో ఇండ్లు లేని పేద ముస్లింలకు 100 చదరపు గజాల వక్ఫ్ భూమిని కేటాయించాలన్నారు. మొత్తం వక్ఫ్ భూమిని భూ కబ్జాదారులు, ఆక్రమణదారులు మాత్రమే వినియోగిస్తున్నారన్నారు. మైనార్టీ శాఖలు అన్ని నిపుణులైన సిబ్బంది కొరతను ఎదుర్కొంటున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిక్లరేషన్‌ను అమలు చేసి వక్ఫ్ బోర్డుకు న్యాయపరమైన అధికారాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.అలాగే చాలా కాలంగా కబ్జాలో ఉన్న వక్ఫ్ ఆస్తులను భూ కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకోవాలన్నారు. రాష్ట్రానికి చెందిన రూ.5 లక్షల కోట్ల విలువైన వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో ఆర్గనైజేషన్ ప్రతినిధులు ఖైరుద్దీన్, సనావుల్లాఖాన్, మహమ్మద్ సలీం, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



వర్గీకరణతో మాదిగ ఉపకులాలకు సమన్యాయం

- **అడ్వకేట్ సిద్ధార్థ్ లూథర**

నవతెలంగాణ-అంబర్‌పేట:
సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన అడ్వకేట్ సిద్ధార్థ లూథరను మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు, జాతీయ నాయకులు, రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య ఆధ్వర్యంలో ఢిల్లీలోని వారి కార్యాలయంలోక లిసి శాలువా, బొకేతో ఘనంగా సన్మానించారు. ఏబీసీడీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో వాదనలు వినిపించినందుకు కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సిద్ధార్థ లూథ్రా మాట్లాడుతూ ఎస్సీలలో 59 కులాలు సమానంగా రిజర్వేషన్లు పంపిణీ జరగాలని.. అప్పుడే మాదిగ, మాదిగ ఉపకులాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. అసుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల ధర్మాసనం, డివై చంద్రచూడ్ బందానికి మేడిపాపయ్య కృతజ్ఞతలు తెలియజేశారు. డ్వకేట్‌ను కలిసిన వారిలో తెలంగాణ న్యాయవాదుల సంఘం నాయకులు కొమ్ము ప్రవీణ్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులిజాల గెలువయ్య, ఆంధ్రప్రదేశ్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు డీఎస్ రాజు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, కేదాసి మోహన్ , రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మంచాల యాదగిరి, దక్షిణ తెలంగాణ అధ్యక్షులు మల్లెపోగు శ్రీనివాస్ ఉన్నారు.



పాలమూరు అభివృద్ధి ప్రదాత జూపల్లి

- **బోరెల్లి సురేష్**

నవతెలంగాణ-ఓయూ
పాలమూరు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిన అపర భగీరథుడు రాష్ట్ర ఎక్సైజ్ , సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ అన్నారు. బోరెల్లి సురేష్ ఆధ్వర్యంలో శనివారం జూపల్లి కృష్ణారావు జన్మదిన వేడుకలు ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నరు. బోరెల్లి సురేష్ మాట్లాడుతూ. ఉమ్మడి పాలమూరు జిల్లా పచ్చబడడానికి, వలసలను అరికట్టి,అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోవడానికి కారణం జూపల్లి కృష్ణారావు అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు వలిగొండ నరసింహ తెలంగాణ పట్టభద్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మండ్ల రవి, ఓయూ జేఏసీ నాయకులు దేవరకొండ నరేష్ , బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఓయూ ఇన్‌చార్జి కల్వకుర్తి శ్రీశైలం బీఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు భిక్షం ,ఆరె కంటి శ్రీకాంత్, మధు, రేవంత్, చింటూ, మోహన్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు జీహెచ్ఎంసీ ప్రత్యేక ఫోకస్

- డెంగ్యూ హాట్ స్పాట్‌లలో వైద్య శిబిరాల ఏర్పాటు
- 108 వార్డులలోని 465 కాలనీలలో ఆగస్టు 15 వరకు ఉచిత వైద్య శిబిరాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో
వర్షకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు జీహెచ్ఎంసీ ప్రత్యేక ఫోకస్ పెట్టింది. నగరంలో సీజనల్ వ్యాధుల నివారణకు అవగాహన కార్యక్రమాలతో నగరంలో పెద్ద ఎత్తున ఉచిత హెల్త్ క్యాంప్ లను ఏర్పాటు చేయనుంది. దోమల వలన వ్యాధికి గురైన వారికి హెల్త్ క్యాంప్ ల ద్వారా ఉచితంగా చికిత్సలు చేయడం పట్ల నగర ప్రజల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. హెల్త్ క్యాంపు నిర్వహణతో పాటు దోమలు వ్యాప్తి చెందకుండా ఉత్పత్తి కేంద్రాలను గుర్తించి వాటి నియత్రణకు ఫాగ్గింగ్, ఆయిల్ బాల్స్, గంబుజియా చేపలు విడుదల చేస్తూ ముఖ్యంగా దోమల వల్ల వ్యాధి ప్రబలకుండా కుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

జీహెచ్ఎంసీ వ్యాప్తంగా దోమల హాట్ స్పాట్ లను గుర్తించి అక్కడ దోమల ద్వారా వ్యాధి బారిన పడిన కుటుంబాలకు ఉచితంగా చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవడం జరిగింది. దీనికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పూర్తి సహకారం అందించారు. గ్రేటర్ వ్యాప్తంగా108 వార్డులలో 465 కాలనీలలో జిల్లా వైద్య ఆరోగ్య, జిహెచ్ఎంసి సంయుక్తంగా గుర్తించిన హాట్ స్పాట్ లలో వ్యాధి సోకిన ప్రజలకు చికిత్స అందించడం వలన ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఈ వైద్య ఆరోగ్య శిబిరాలు ఈ నెల 5 వ తేదీ నుండి 15 వరకు గుర్తించిన వార్డులలో నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు 175 వైద్య శిబిరాలునిర్వహించారు. 191 డెంగ్యూ హాట్ స్పాట్ లలో యాంటీ లార్వా ఆపరేషన్స్, పైత్రన్ రసాయనాలను స్ప్రే చేయడం జరిగింది. హాట్ స్పాట్ లలో 345 మందికి డెంగ్యూ, ఒకటి మలేరియా వ్యాధి సోకినట్లు అంచనా, డెంగ్యూ వ్యాధి గుర్తించిన ఇంటి చుట్టూ సుమారు 50 ఇళ్ల వరకు దోమల నివారణకు స్ప్రే చేసి డెంగ్యూ దోమల నివారణకు కృషి చేశారు.

68,434 ఇండ్లల్లో సర్వే చేయగా 43 వాటర్ స్టాగ్నెట్ ఏరియాలుగా గుర్తించారు. చెరువుల వద్ద మూసీ రివర్ ప్రాంతంలో 24 చోట్ల యాంటీ లార్వా ఆపరేషన్స్ చర్యలు తీసుకున్నారు.డెంగ్యూ పాజిటివ్ కేసు నమోదైన ఇండ్ల చుట్టూ మొత్తం 6151 ఇళ్లలో స్ప్రే చేశారు. 13,721 ఇళ్లలో 118 పాఠశాలలు, 12 కళాశాలలో ఇండోర్ రెసిడ్యువల్ స్ప్రే చేయడం జరిగింది. 62 లొకేషన్లలో 365 ఆయిల్ బాల్స్ విడుదల చేయగా, 148 ఓపెన్ ప్లేసెస్, గంబుజియా చేపలను విడుదల చేశారు. 16 లోకేషన్లలో 17 బ్రీడింగ్ సోర్సెస్ లో మొత్తం 1665 విడుదలయ్యాయి.

ముందస్తు అవగాహన

సీజనల్ వ్యాధి నివారణకు ముఖ్యంగా చికెన్ గున్యా, డెంగ్యూ వ్యాధిపై గ్రేటర్ వ్యాప్తంగా ఉన్న పాఠశాలలో, కాలేజీలలో గల విద్యార్థినీవిద్యార్థుల తోపాటు బయోలజి టీచర్లకు దోమల నివారణ, వ్యాధి లక్షణాలు, చికిత్స విధానం పై అవగాహన కల్పించారు. విద్యార్థులు నివసించే కాలనీలో కాలనీ వాసులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు అవగాహన కల్పించేందుకు గుర్తించిన వాలంటీర్ లను జిహెచ్ఎంసి హీరోస్ గా గుర్తించడం జరిగింది. గ్రేటర్ వ్యాప్తంగా ఉన్న 4846 కాలనీలలో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సహకారంతో ఒక్కొక్క కాలానీకి ముగ్గురు, నలుగురు చొప్పున ఏ ఎల్ ఓ లను బాధ్యులను చేస్తూ ఫాగింగ్ యాంటీ లార్వా ఆపరేషన్స్, చేసి వ్యాధి ప్రబలకుండా ఉండేందుకు ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కరపత్రాలు, స్టిక్కర్ లను స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశాలలో పంపిణీ చేశారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రేటర్ లో అప్రమత్తం చేస్తున్నారు.డెంగ్యూ వ్యాధి ప్రబలిన వారికి చికిత్సతో పాటు వ్యాధి బారిన పడకుండా ప్రజల అవగాహనతో పాటు యాంటీ లార్వా ఆపరేషన్స్ విస్తృంగా చేపడుతున్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం చాలా ముఖ్యం. నగర వాసులు చెత్తను స్వచ్ఛ ఆటో వాళ్లకు ఇవ్వాలని చెత్తను గాని, సి అండ్ డి వ్యర్థాలు గాని ప్రజలు ఇష్టమైన రీతిలో ఎక్కడ పడితే అక్కడ వేయకూడదని జిహెచ్ఎంసి కోరింది.

రజక వృత్తిదారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



- **రజక వృత్తిదారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు వెంకటస్వామి**

నవతెలంగాణ-మెహదీపట్నం
రజక వృత్తిదారులకు ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి రజక కుటుంబానికీ రూ. 10 లక్షల ఆర్థిక సహకారం అందించాలని రజక వృత్తిదారుల సంఘం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు చారగొండ వెంకటస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. తెలంగాణ రజక వత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో నాంపల్లిలో జోన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ నేటికీ రజకవత్తిదారులపై గ్రామీణ ప్రాంతాల్లో కుల వివక్షత, దౌర్జన్యాలు, సామాజిక దాడులు, అగ్ర కులాల వారిచే కొనసాగుతున్నయన్నారు. వీటిని అరికట్టడానికి ప్రభుత్వం ప్రత్యేక సామాజిక భద్రతా చట్టం రూపొందించాలని కోరారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నేటికి వేలాది రజక వత్తిదారులు వారి కులవత్తియే జీవన ఆధారంగా బతుకుతున్నాయని వీరందరూ కడు పేదరికంతో బాధపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సీహెచ్ నగేష్, జోన్ సభ్యులు వి. రమేష్, చంద్రమోహన్, విఠల్ యాదయ్య, బాబు, రవీందర్, పద్మ, శివమ్మ పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



- **ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ**

నవతెలంగాణ-హిమాయత్ నగర్
నేషనల్ హెల్త్ మిషన్ స్కీమ్ లో గత 3 ఏండ్ల నుండి ప్రైమరీ హెల్త్ సెంటర్ స్థాయిల్లో ప్రజానీకానికి వైద్య సేవలు అందిస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్ హెచ్ పీ)లకు కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం హిమాయత్ నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు అమలు చేయకుండా అతి తక్కువ జీతాలతో విధులు నిర్వహిస్తున్నారని, డ్యూటీ చార్ట్ ప్రకారం విధులు చేయించకుండా అనేక రకాల క్రింది స్థాయి పనులను వారిపై రుద్దుతూ పని భారాన్ని పెంచడం అన్యాయమన్నారు.బీఎస్సీ నర్సింగ్ విద్యార్హతతో డిస్టిక్ సెలక్షన్ కమిటీ ద్వారా ఎన్నికైన ఎంఎల్ హెచ్‌పీ ఉద్యోగులకు కనీస వేతనం రూ.44,000 ఇవ్వాలని, కానీ కేవలం రూ.29 వేల వేతనం మాత్రమే చెల్లిస్తున్నారన్నారు.హెల్త్ డిపార్ట్మెంట్ లో పని చేస్తున్న వారికి హెల్త్ ఇన్సూరెన్స్ లేకపోవడం బాధాకరమన్నారు.రూ.10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు తోట రామాంజనేయులు, ఎంఎల్ హెచ్ పీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సందీప్, ప్రధాన కార్యదర్శి ఎం.డి.ఆస్పియా, నాయకులు జోసెఫ్, చంద్రకళ, సిహెచ్.నవీన్, పవన్ వర్మ, ప్రవీణ్ కుమార్, సంధ్య, భారతి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సీతక్కను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

- **మంత్రివర్గ విస్తరణలో లంబాడీలకు అవకాశం కల్పించాలి**
- **ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ డిమాండ్**



నవతెలంగాణ-హిమాయత్ నగర్
రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మహిళా మంత్రి సీతక్క లంబాడీలకు పదవులు దక్కకుండా అడ్డుకుంటూ గిరిజనుల మధ్య చిచ్చు పెడుతున్నారని కావున వెంటనే ఆమెను తన మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని, లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ (ఏబీఎస్ఎస్) హెచ్చరించింది. హిమాయత్ నగర్, లిబర్టీలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి సంఘ్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు సభావత్ రాజు నాయక్, ప్రధాన కార్యదర్శి రవీంద్ర నాయక్, గిరిజన విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు ఇందల్ రాథోడ్ మాట్లాడుతూ మంత్రివర్గ విస్తరణలో లంబాడీలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర జనాభాలో 45 లక్షలకు పైగా ఉన్న లంబాడీలకు కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి వర్గంలో అవకాశం కల్పించకుండా కేవలం 9 లక్షల జనాభా గల ఆదివాసీలకు అవకాశం కల్పించారని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడుస్తున్నప్పటికి గిరిజనులకు ఎలాంటి న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు గిరిజనుల అభివద్ధికి కోట్లు ఖర్చు చేస్తున్నామని గొప్పలు చెబుతున్నా, ఎవరికి ఎంత ఖర్చు పెట్టారో..ఎక్కడ ఖర్చు పెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనులను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసిందని గుర్తు చేశారు .ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వం తండాలను రెవిన్యూ గ్రామ పంచాయితీలుగా గుర్తించి వాటి అభివద్ధికి కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయాలని, టీపీసీసీ పదవిని లంబాడీలకు కేటాయించి, నామినేటెడ్ పదవుల్లో లంబాడీలకు అవకాశం కల్పించాలని కోరారు.

30 ఏండ్లుగా ట్రైబల్ వెల్ఫేర్ విధులు నిర్వహిస్తున్న శంకర్ రావును వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన యూనివర్సిటీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కోరారు.మిగతా కుల సంఘాలకు ఏ విధంగా కుల భవనాలు ఉన్నాయో అదే విధంగా తమకు బంజారా భవన్‌ను కేటాయించి, బంజారా లంబాడీలకు అప్పగించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఏబీఎస్ఎస్ నాయకులు సురేష్ నాయక్, అశోక్ రాథోడ్, వినోద్, వినయ్, అమర్ సింగ్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యను అందించే మా విధానం ఆధునికమైంది

- **చైతన్య హబ్ జూనియర్ కళాశాలల చైర్మెన్ వి.వి.హనుమంతరావు**



నవతెలంగాణ-హిమాయత్ నగర్
తమ కళాశాల విద్యార్థులకు విద్యనందించే తమ విధానం ఆధునికమైందని, విద్యార్థుల విజయానికి కీలకమైన జీవిత, విద్యా నైపుణ్యాలతో పాటు వారిని పూర్తి గొప్ప వ్యక్తులుగా తయారు చేయడమే తమ కళాశాల లక్ష్యంగా పెట్టుకుందని చైతన్య హబ్ జూనియర్ కళాశాలల చైర్మెన్, వ్యవస్థాపకులు వి.వి.హనుమంతరావు చెప్పారు. శనివారం రాంకోఠిలోని షాలిమార్ ఫంక్షన్ హాల్ లో 'చైతన్య హబ్ జూనియర్ కళాశాల' ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు, నత్యాలతో అందరిని అలరించారు. వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. అనంతరం చైర్మెన్ మాట్లాడుతూ హిమాయత్ నగర్ కేంద్రంగా ఉన్న చైతన్య హబ్ జూనియర్ కళాశాల ఏసీ క్యాంపస్‌లో దాదాపు 25 ఏండ్లకు పైగా అపార అనుభవం ఉన్న అధ్యాపకులచే చక్కటి వ్యవస్థీకత బోధన పద్ధతితో కూడిన అంకిత భావం కలిగిన బందం ఉందన్నారు. తమ కళాశాలలు నాణ్యమైన విద్యను అందిస్తూ ముందుకెళున్నాయన్నారు. తమ కళాశాలలో ఎంపీసీ, ఐఐటి, బీపీసీ, నీట్, ఎంఈసీ, సీఈసీ, సీఏ/ఐపీఎంఏటీ తదితర కోర్సులు అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా తమ విద్యా సంస్థ పని చేస్తుందని, ప్రతి ఏడాదిలో ఎందరో తమ కళాశాల విద్యార్థులు బహుళ జాతి సంస్థలకు ఎంపికవ్వడమే దీనికి నిదర్శనమన్నారు.ఈ వేడుకల్లో కళాశాల అధ్యాపక బందం, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నిరుద్యోగం పెరగడానికి కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణం

- **ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి**



నవతెలంగాణ-హిమాయత్ నగర్
దేశంలో నిరుద్యోగం పెరగడానికి కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పేర్కొంది. శనివారం హిమాయత్ నగర్ లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.దేశంలో నిరుద్యోగం పెను భూతంలా మారిందని, బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేండ్ల కాలంలో ప్రభుత్వ రంగ సంస్థలు మూసివేతకు గురయ్యాయన్నారు. నిరుద్యోగం పెరగడం వల్ల దేశంలో ఆర్థిక సమతుల్యత తగ్గుతుందని, దేశ స్థూల ఉత్పత్తిలో వ్యత్యాసాలు కనపడుతాయన్నారు. కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేసే విధానాలనే కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్నదన్నారు. యువతలో చీలికలు తెచ్చి పబ్బం గడపాలనే మోడీ విధానాలను తిప్పి కొట్టాలని వారు పిలుపునిచ్చారు.రాష్ట్రంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో త్వరలో కేంద్ర యువజన వ్యతిరేక విధానాలపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, పోరాటాలు నిర్వహించనున్నామని ప్రకటించారు.ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ వెంకటేశ్వర్లు, కుసుకుంట్ల శంకర్, టి.సత్య ప్రసాద్, యుగంధర్, మహేందర్, ఎం.శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మహిళలు.



నవతెలంగాణ- జూబ్లీహిల్స్
బోరబండకు చెందిన పలువురు మహిళలు శనివారం బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. చేరిన వారిలో వినాయక్ రావు నగర్ కు చెందిన నాగమణి, మాలతి , కుమారి,పద్మ, అలివేలు, అనేకమంది మహిళలు ఉన్నారు. బాబా నాయకత్వంలో బోరబండలో కాంగ్రెస్ పార్టీకి సేవలు అందించేందుకు పార్టీలో చేరినట్టు మహిళలు తెలిపారు. ప్రభుత్వ పథకాలు నచ్చి,అదే విధంగా ప్రజా పాలన మహిళలకు చాలా సంక్షేమ పథకాలను అమలు చేసిందని పార్టీలో చేరినట్టు చెప్పారు.



ఖైరతాబాద్ నియోజకవర్గంలోని వెంకటేశ్వర నగర్ కాలనీ డివిజన్ ప్రతాప్ నగర్‌లో శనివారం శ్రీ శ్రీ శ్రీ నల్లపోచమ్మ దేవాలయ 16వ వార్షికోత్సవ మహోత్సవ కార్యక్రమన్ని పురస్కరించుకొని ఖైరతాబాద్ కార్పొరేటర్ పి. విజయా రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. వెంకటేశ్వర నగర్ డివిజన్ అధ్యక్షులు బి. శ్రీనివాస్ యాదవ్ గారు, ఎం. ఆనంద్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. నవతెలంగాణ - బంజారా హిల్స్

చిన్న చిట్కా..

చిన్నచిన్న ఆరోగ్య సమస్యలను మన ఇంట్లో ఉండే ఆహార పదార్థాలతోనే దూరం చేసుకోవచ్చు. ఏయే పదార్థాలతో ఏయే లాభాలు ఉన్నాయో చూద్దాం.

నోటి దుర్వాసన, చిగుళ్ల సమస్యలు చాలామందికి ఎదురవుతూ ఉంటాయి. ఎన్నిరకాల పేస్టులు వాడినా సమస్య పరిష్కారం కాదు. ప్రతి రోజూ నాలుగైదు పుదీనా ఆకులను తినడం వల్ల ఈ ఇబ్బంది నుంచి బయటపడొచ్చు.

రెండుమూడు రకాల మందులు వేసుకున్నా.. పడిశం ఓ పట్టాన లొంగదు. ఇలాంటప్పుడు మిరియాల చారు భేషుగ్గా పనిచేస్తుంది. పాలలో మిరియాల పొడి వేసుకొని తాగినా గుణం కనిపిస్తుంది. అంతేకాదు ఆహారంలో మిరియాల పొడి తీసుకోవడం అలవాటు చేసుకుంటే.. రక్తంలో కొలెస్ట్రాల్ తగ్గుతుంది. నాళాల్లో రక్తం గడ్డకట్టే సమస్య కూడా దూరమవుతుంది.

రక్తపోటు సమస్యకు సరైన వైద్యం తీసుకోవాలి. బీపీ నియంత్రణలో ఉండాలంటే మునగాకు పొడి తరచూ తీసుకోవడం మంచిది. ప్రతిరోజూ చిటికెడు మునగాకు పొడి తీసుకుంటే.. బీపీ కంట్రోల్‌లో ఉంటుంది.

రక్తహీనత సమస్యకు తేనె చక్కని పరిష్కారం. చక్కెర వినియోగాన్ని తగ్గించి టీ, కాఫీ, ఇతర ఆహార పదార్థాల్లో తేనెను ఉపయోగిస్తే రక్తహీనత నుంచి బయటపడొచ్చు.

రక్తనాళాలు మందంగా ఉండి సమస్యలను ఎదుర్కొనే వాళ్లు బీట్‌రూట్ రసాన్ని రోజూ తాగితే మంచిది. అప్పుడు రక్త ప్రసరణ మెరుగవుతుంది. గుండె సమస్యలు కూడా దరిచేరవు.

సైబర్ సెక్యూరిటీపై ఆసక్తితో...

సరోజా రాయ్... సమాజంలోని మూఢనమ్మకాలను తరమికొట్టేందుకు తండ్రితో కలిసి వందలాది మ్యాజిక్ షోలు చేసింది. అంతేనా దేశంలోనే అత్యంత పిన్న వయస్కురాలు, రెండవ మహిళా స్టేజ్ హిప్నాటిస్ట్‌గా పదేండ్ల కిందటే పేరు తెచ్చుకుంది. ఆ తర్వాత ఓ లెక్చరర్‌గా, ఓ కౌన్సెలర్‌గా, ఓ సైకాలజిస్ట్‌గా, ఓ ట్రైనర్‌గా, సైబర్ నేరస్తులని పట్టిచ్చే ఫోరెన్సిక్ సైకాలజిస్ట్‌గా గత ఏడేండ్ల నుండి సైకాలజీ రంగంలో విభిన్న పాత్రలు పోషిస్తుంది. హిప్నో కమలాకర్ కూతురుగానే కాక సమాజంలో తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న ఆమె పరిచయం నేటి మానవిలో...





అమ్మ డా.హిప్నో పద్మా కమలాకర్, నాన్న హిప్నో కమలాకర్. మాది తూర్పుగోదావరి జిల్లా. రెండో తరగతి వరకు రాజమండ్రిలో చదువుకున్నాను. నాకు ఓ తమ్ముడు. నేను మూడో తరగతిలో ఉన్నప్పుడు హైదరాబాద్ వచ్చేశాము. ఆక్స్‌వర్డ్ గ్రామర్ స్కూల్లో పదో తరగతి పూర్తి చేశా. ఇంటర్ ఎంపీసీ సెయింట్ మేరీస్‌లో చేశా. చిన్నప్పటి నుండి బొమ్మలు వేయడం చాలా ఇష్టం. ఎనిమిదో తరగతి నుండి ఆటో మొబైల్ డిజైనర్ కావాలనుకున్నాను. ఎలాగైనా ఎన్ఐడీలో సీటు తెచ్చుకోవాలనుకున్నాను. కానీ రాలేదు. వేరే చోట సీటు వచ్చింది కానీ వెళ్లలేకపోయాను. దాంతో విల్లా మేరీలో డిగ్రీ చేరాను. సైకాలజీ, జర్నలిజం, లిటరేచర్ సబ్జెక్ట్ తీసుకున్నా. అక్కడ థియేటర్‌లో మూడేండ్లు బెస్ట్ యాక్టర్‌గా అవార్డు తీసుకున్నాను. అలాగే ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిం, డైరెక్టర్, గ్రాఫిక్ డిజైనింగ్ ఇలా డిగ్రీ చేసేటప్పుడే అన్నీ నేర్చుకున్నాను. కొన్ని పత్రికల్లో ఇంటన్‌షిప్ కూడా చేశాను. అయితే నా సబ్జెక్ట్‌లో సైకాలజీ కూడా ఉండటంతో డిగ్రీ అయిపోయిన తర్వాత డాడీ ఫ్రెండ్స్ చాలా మంది ఎమ్మె సైకాలజీ చేయాల్సిందిగా ప్రోత్సహించారు. అయితే సైకాలజీలో ఏదైనా కొత్తగా చేయాలని క్లీనికల్ కాకుండా ఫోరెన్సిక్ సెలక్ట్ చేసుకున్నాను.

రీసర్చ్ అంటే ఇష్టం

డిగ్రీ తర్వాత గుజరాత్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీలో ఫోరెన్సిక్ సైకాలజీ చేశాను. నాకు మొదటి నుండి రీసర్చ్ అంటే చాలా ఇష్టం. కొత్తగా ఏదైనా నేర్చుకోడానికే ఎప్పుడూ ఆసక్తి చూపేదాన్ని. తర్వాత మధ్య ప్రదేశ్‌లోని అమిటి యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీలో ఎంఫిల్ చేశాను. యూనివర్సిటీ సెకండ్ ర్యాంక్ వచ్చింది. అది చేస్తూనే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో క్రిమినల్ జస్టిస్ అండ్ ఫోరెన్సిక్ సైన్సెస్ అనే సబ్జెక్ట్‌పై డిప్లొమా కోర్సు చేశాను. తర్వాత నేను మాస్టర్స్ చేసిన కాలేజీలోనే రెండేండ్లు లెక్చరర్‌గా చేశాను.

ఫోరెన్సిక్ సైకాలజిస్టుగా...

2018లో ఢిల్లీలోని అన్ని పోలీస్ స్టేషన్స్‌లో ఫోరెన్సిక్ సైకాలజిస్టులు ఉండాలనే నిబంధన పెట్టారు. నేరస్తులు నిజం చెబుతున్నారా లేదా, ఎలాంటి మానసిక పరిస్థితుల్లో వాళ్ళ నేరాలు చేస్తున్నారు, దొంగ సాక్షాలు ఏమైనా సృష్టించారా వంటివి ఫోరెన్సిక్ సైజాలజిస్టులు



తెలుసుకోగలుగుతారు. సైబర్ నేరాలు పెరుగుతున్న ఈ రోజుల్లో ఈ పోస్టులు చాలా అవసరం. ఢిల్లీ తర్వాత రాజస్థాన్, పంజాబ్ పోలీసులు కూడా ఈ పోస్టులు భర్తీ చేశారు. కానీ మన రాష్ట్రంలో ఎందుకో దీని గురించి అంత సీరియస్‌గా ఆలోచించడం లేదు.

ఫోరెన్సిక్ చాలా ప్రత్యేకం

లెక్చరర్‌గా చేస్తూనే సైబర్ సైకాలజీపై, ఎథికల్ హాకర్స్‌పై రీసర్చ్ చేశాను. అంటే ఇది సైబర్ సెక్యూరిటీకి సంబంధించింది. వాళ్ల చెప్పేది నిజమా కాదా, ఇంకా ఏమైనా దాస్తున్నారా అనేదానిపై నా రీసర్చ్. టెక్నాలజీ పెరిగిన తర్వాత మోసాలు చేసే విధానం కూడా మారిపోయింది. చివరకు జనాలను చంపడానికి కూడా ఆన్‌లైన్‌ను ఉపయోగించు కుంటున్న కాలమిది. వీటినే సోషల్ ఇంజనీరింగ్ ఎటాక్స్ అంటారు. ఈ మధ్య కాలంలో ఇవి బాగా పెరిగిపోయాయి. దీనిపై అవగాహన ప్రజలకు చాలా అవసరం. నేరం చేసిన వారి నుండి చేసిన నేరాన్ని రాబట్టడం చాలా అవసరం. క్లీనికల్ కన్నా ఫోరెన్సిక్ చాలా కష్టమైనది. ఎలా అంటే సైకాలజిస్టు దగ్గరకు అందరూ తమ సమస్యను పరిష్కరించుకోడానికి వారంతట వాళ్లే వస్తారు. కానీ ఫోరెన్సిక్‌లో బలవంతంగా వస్తారు. నేరం చేసిన వాడు మనకు సహకరించడు. అతను చెప్పేది నిజమా కాదా తెలీదు. అలాంటి వాళ్లను హాండిల్ చేయాలి.

ఏవియేషన్ సైకాలజీలో...

బెంగుళూరులో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఏవియేషన్ సైకాలజీలో ఎనిమిది నెలలు పని చేశాను. అక్కడ డాక్టర్ సౌగంధి అనే సీనియర్ సైంటిస్ట్ వద్ద వర్క్ చేశాను. ఆమె డీఆర్‌డీఏలో పని చేస్తారు. రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైనప్పుడే ఏవియేషన్‌లో సైకాలజీని ప్రవేశపెట్టారు. అంటే పైలెట్ మానసిక పరిస్థితి ఎలా ఉంది, దాన్ని నడపటానికి అతను సిద్ధంగా ఉన్నాడా లేదా అనేది మేము అంచనా వేస్తాం. ఒక్క మాటలో చెప్పాలంటే ఫిట్ - అన్‌ఫిట్ అనేది అంచనా వేస్తాం. అలాగే వాళ్ళ ట్రైనింగ్ ఎలా ఉండాలి, ట్రైనింగ్ పద్ధతులు ఎలా ఉంటే వాళ్లు సులభంగా నేర్చుకోగలరు అనే దానిపై కూడా మేము స్టడీ చేసేవాళ్లం.

అవగాహన కల్పించేందుకు

చిన్నప్పటి నుండి నాతో తమ్ముడితో నాన్న మ్యాజిక్ షోలు చేయించేవారు. మంత్రాలు, తంత్రాలు కేవలం మూఢనమ్మకాలు మాత్రమే అని ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం నాన్న మాతో ఇలా చేయించేవారు. డిగ్రీలో ఉన్నప్పుడు హిప్నాటిజం కూడా స్టార్ట్ చేశాను. అప్పటికే సినిమాల్లో హిప్నాటిజం ను చాలా తప్పుగా ప్రచారం చేసేవారు. నేరాలు చేయడం కోసం దీన్ని ఉపయోగిం చుకునేవారు. అయితే ఇది చాలా బాగా ఉపయోగించుకోవల్సిన సైన్స్. మాటల ద్వారా మనిషిని ప్రేరేపించే మనోవైజ్ఞానిక శాస్త్రమే హిప్నాటిజం అంటారు నాన్న. అందుకే అనేక రాష్ట్రాలు తిరిగి ఆయన దీని గురించి ప్రచారం చేసేవారు.

ముందే అవగాహన ఉంటే...

టెక్నాలజీ పెరిగిపోతుంది. దీని కోసం లక్షల మంది ఇంజనీర్లు పని చేస్తున్నారు. ఒక కొత్త యాప్ తయారవుతుందంటే దాని వల్ల మనిషికి లాభమెంతో, నష్టమెంతో కూడా ముందే ఒక అంచనా వుండాలి. కానీ అలాంటి పద్ధతి మన దగ్గర లేదు. టెక్నాలజీపై ప్రజలకు పూర్తి అవగాహన లేదు. అందుకే చాలా మంది టెక్నాలజీని ఉపయోగించుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. అదే పెరుగుతున్న టెక్నాలజీ వల్ల ఈ నష్టాలు ఉంటాయి అని ప్రజలకు ముందే అవగాహన కల్పిస్తే జాగ్రత్తగా ఉంటారు. టెక్నాలజీ వల్ల సాధ్యమైనంత వరకు మనిషికి నష్టం జరగకుండా చూడాలి. అలాంటి టెక్నాలజీ అభివృద్ధి కావాలి. సైబర్ నేరాలను కంట్రోల్ చేయాలి. ఆ ఆసక్తితోనే సైబర్ సెక్యూరిటీపై వర్జీనియాలోని ఓల్డ్ డొమీనియన్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేయబోతున్నాను.

- సలీమ



తెలంగాణకు స్టాన్‌ఫోర్డ్ సహకారం

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తమయ్యాయి. రాష్ట్రంలో స్టాన్ ఫోర్డ్ బయోడిజైన్ శాటిలైట్ సెంటర్ ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై చర్చలు జరిగాయి. బయోడిజైన్ ఆవిష్కరణలను అకడమిక్, హెల్త్ కేర్ విభాగాలకు అనుసంధానం చేయాలని తన ఆలోచనలను రేవంత్ ఈ సందర్భంగా వారితో పంచుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ స్టాన్‌ఫోర్డ్ లాంటి ప్రఖ్యాత యూనివర్సిటీతో భాగస్వామ్యం పంచుకోవటం తెలంగాణ యువత భవితకు కొత్త బాటలు వేస్తుందన్నారు. ఇప్పటికే దేశంలో పరిశ్రమలు, కొత్త ఆవిష్కరణలతో తెలంగాణ ముందంజలో ఉందని చెప్పారు. స్టాన్‌ఫోర్డ్ బయోడిజైన్ లాంటి ప్రపంచ స్థాయి విభాగాలు కలిసి వస్తే స్కిల్స్ డెవలప్‌మెంట్‌లో ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరుతుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రభుత్వానికి తగిన సహకారం అందిస్తామని యూనివర్సిటీ బయోడిజైన్ విభాగం అధిపతులు డాక్టర్ అనురాగ్ మైరాల్, డాక్టర్ జోష్ మాకోవర్ ఈ సందర్భంగా ప్రకటించారు. తమ ఆసక్తిని వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డికి లేఖను అందించారు. భారీ వైద్య పరికరాల పరిశ్రమ అభివృద్ధితో రాష్ట్రంలో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రస్తావించారు. వైద్య పరికరాల విద్య, కొత్త ఆవిష్కరణలకు తమ మద్దతు ఉంటుందని లేఖలో పేర్కొన్నారు.

అర్హులందరికీ తెల్లరేషన్ కార్డులు

(మొదటిపేజీ తరువాయి)

శాసనమండలి సభ్యులందరికీ లేఖలు రాసి విధివిధానాల్లో సూచనలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ కార్యదర్శి డీఎస్ చౌహాన్‌కు మంత్రి సూచించారు. డాక్టర్ ఎన్‌సీ సక్సేనా కమిషనర్‌గా ఉన్న సక్సేనా కమిటీ సిఫారసులను కొత్త తెల్లరేషన్ కార్డుల మంజూరీలో పరిగణనలోకి తీసుకోబోతున్నట్టు ఆయన తెలిపారు. ఈ కమిటీలో సుప్రీంకోర్టు నియమించిన స్పెషల్ కమిషనర్ హర్ష మండర్ సభ్యుడిగా ఉన్నారన్నారు. అంతేగాక రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు దిగువ పేద, మధ్యతరగతి ప్రజలకు ఇస్తున్న తెల్ల రేషన్ కార్డుల మంజూరీ విషయంలో అధికారుల బందం ఇప్పటికే దేశంలోని మిగతా రాష్ట్రాలలో అధ్యయనం చేసినట్టు వెల్లడించారు. అదే సమయంలో అంతర్ రాష్ట్రాల నుంచి తెలంగాణకు వలస వచ్చిన వారికి రెండు చోట్లా తెల్లకార్డులు ఉన్నట్టు తేలిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 89.96 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని గుర్తు చేశారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందే తడవుగా కొత్త తెల్లరేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఇవ్వడంతో పది లక్షల దరఖాస్తులు వచ్చాయని చెప్పారు.

హైదరాబాద్‌లో జొయిటిస్ విస్తరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రముఖ జంతు ఆరోగ్య సంస్థగా పేరొందిన జొయిటిస్ కంపెనీ హైదరాబాద్‌లో తమ వ్యాపార సెంటర్‌ను విస్తరించాలని నిర్ణయించింది. 2024 సెప్టెంబర్ నుంచి తన కార్యకలాపాలను ప్రారంభించ నున్నట్టు వెల్లడించింది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందంతో కంపెనీ ప్రతినిధులు సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో జొయిటిస్ ఇండియా కేపబిలిటీ సెంటర్‌ను విస్తరించే నిర్ణయాన్ని ఈ సందర్భంగా సీఎం స్వాగతించారు. తెలంగాణలో కొత్త ఆవిష్కరణలకు, వ్యాపార వృద్ధికి అపారమైన అవకాశాలున్నాయని వారికి సీఎం వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి లైఫ్ సైన్స్ హబ్‌గా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ ఆలోచనలకు ఈ పెట్టుబడులు దోహదపడుతాయని చెప్పారు. ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీలో జొయిటిస్ రంగ ప్రవేశం రాష్ట్రానికి మరింత గుర్తింపు తెస్తుందని వ్యాఖ్యానించారు. ఇండియాలో తమ కంపెనీ విస్తరణకు హైదరాబాద్ అనువైన ప్రాంతమనీ, తమ కంపెనీ విస్తరణ జంతు ఆరోగ్యానికి సంబంధించి సరి కొత్త సాంకేతిక ఆవిష్కరణలకు ఉపయోగపడుతుందని జోయిటిస్ కంపెనీ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ కీత్ సర్‌బాగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న ప్రపంచ స్థాయి ప్రతిభా వనరులను సద్వినియోగం చేసుకుంటామని ఆ కంపెనీ కేపబిలిటీ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ అనిల్ రాఘవ్ పేర్కొన్నారు. కంపెనీ విస్తరణతో రాష్ట్రంలో కొత్త ఉద్యోగాలతో పాటు జంతు ఆరోగ్య సంరక్షణలో మెరుగైన ఫలితాలు వస్తాయని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

రూ. 2 వేల కోట్లు ఇవ్వండి

ప్రధాని మోడీకి సీఎం విజయన్ విజ్ఞప్తి

(మొదటిపేజీ తరువాయి)

పర్యటించారు. చూర్మాలాకు చేరిన తర్వాత వాహనం నుంచి కిందకు దిగిన మోడీ అక్కడి సహాయక సిబ్బందితో మాట్లాడారు. శిథిలాల కుప్పలతో నిండిన ఆ ప్రాంతంలో కాలినడకన తిరిగారు.

పరిస్థితి తీవ్రతను అంచనా వేసేందుకు కాల్‌పేట్‌లో వాయనాడ్ కలెక్టరేట్ వద్ద సమీక్షా సమావేశంలో ప్రధాని పాల్గొన్నారు. బాధితులకు అండదండగా నిలవడం ప్రస్తుతావసరమని, పునరావాస కార్యక్రమాలకు నిధులనేవి అడ్డంకి కాబోవని అన్నారు. బాధితులకు భవిష్యత్తులో మంచి జీవితాన్ని అందించడం ఈ సమాజం బాధ్యత అని వ్యాఖ్యానించారు. బాధితులకు అవసరమైన సాయాన్ని అందించేందుకు సాధ్యమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఏరియల్ సర్వే

చూర్మాలాలా, ముండక్కై, పంచిరిమట్టమ్ ప్రాంతాల్లో మోడీ ఏరియల్ సర్వే జరిపారు. హెలికాప్టర్‌లో ఆయనతో పాటు ముఖ్యమంత్రి విజయన్, గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ ఇతర



అధికారులు వున్నారు. కేంద్ర మంత్రి సురేష్ గోపి కూడా వారితో పాటే వున్నారు.

సమగ్ర మెమోరాండం ఇవ్వండి

కొండచరియలు విరిగిపడిన ఘటనకు సంబంధించి సమగ్ర మెమోరాండాన్ని కేంద్రానికి అందజేయాలని ప్రధాని, రాష్ట్రాన్ని కోరారు. బాధితుల కోసం చేపడుతున్న పునరావాస ప్రాజెక్టుల గురించి రాష్ట్రానికి గల ఆలోచనలు, ప్రణాళికలు ఏమిటో తెలియజేయాలని కోరారు. అంతేకానీ కేంద్రం వైపు నుంచి చేయాల్సిన వాటి గురించి ఎలాంటి ప్రకటన చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థించినట్టుగా కనీసం ఈ ఘటనను ప్రకృతి వైపరీత్యంగా కూడా ప్రకటించలేదు.

రూ.2వేల కోట్ల సాయం కోరిన కేరళ

ప్రకృతి ఆగ్రహానికి గురైన వాయనాడ్ జిల్లాలోని బాధిత ప్రాంతాల్లో సహాయ పునరావాస చర్యల కోసం రూ.2 వేల కోట్లు అవసరమని కేరళ ప్రభుత్వం కోరింది. ఈ ప్రమాదంలో 226 మంది మరణించారని అధికారికంగా ప్రకటించారు. ఇంకా అనేకమంది గల్లంతయ్యారు.

ఖమ్మంలో డ్రగ్స్ కలకలం

- హెరాయిన్ పట్టుకున్న టూ టౌన్ పోలీసులు
- అప్రమత్తంగా వ్యవహరించిన టీజీఏఎన్ బీ
- క్రిప్టో కరెన్సీతో కొనుగోలు.. అసోం నుంచి పార్సిల్

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సహకారంతో ఖమ్మం టూ టౌన్ పోలీసులు డ్రగ్స్ రాకెట్‌ను ఛేదించారు. ఖమ్మం నగరంలో మొట్టమొదటి సారిగా డ్రగ్స్ కలకలం రేపడం చర్చనీయాంశంగా మారింది. ఖమ్మం 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు హెరాయిన్ పట్టుకున్నారు. డ్రగ్స్ వినియోగిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ను నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 2.5 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మంలో కొంతమంది యువకులు డ్రగ్స్ వినియోగిస్తున్నారన్న సమాచారంతో నార్కోటిక్స్ బ్యూరో పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో సంబంధిత సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జులై 31న డార్క్ వెబ్ ద్వారా



ఆర్డర్ చేశాడు. అస్సాం రాష్ట్రానికి చెందిన సిల్చుఖురి నుంచి క్రిప్టో కరెన్సీ ఆధారంగా డ్రగ్ తెప్పించుకున్నాడు. స్పీడ్ పోస్టు ద్వారా ఈనెల 8వ తేదీన ఆ డ్రగ్ సంబంధిత చిరునామాకు చేరింది. దీనిని సదరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తీసుకుంటున్న సమయంలో పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. న్యూస్ పేపర్‌లో టేప్ వేసి చుట్టిన హెరాయిన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీరు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని తల్లిదండ్రులకు విషయాన్ని వెల్లడించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పట్టుబడిన యువకుడు ప్రముఖ న్యాయవాది కుమారుడని తెలుస్తోంది. హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూ డ్రగ్స్‌కు ఎడిక్ట్ అయినట్టు పోలీసులు గుర్తించారు. ఇంకా ఈ డ్రగ్ రాకెట్ వెనుక ఎవరున్నారు అనే కోణంలో ఆరా తీస్తున్నారు.

త్యాగాల వారసత్వాన్ని భావితరాలకు అందిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

మోజు పెరుగుతున్న సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతున్న విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులందరూ ప్రభుత్వ పాఠశాలల బాగుకోసం నిబద్ధతతో పని చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకునే బాధ్యత సమాజం, ప్రభుత్వాలతో పాటు ఉపాధ్యాయులపై మరింత ఉందన్నారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ యూటీఎఫ్ సమాజ అభివృద్ధి, విద్యా వికాసం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పనిచేస్తున్నదని చెప్పారు. ఉపాధ్యాయులు అనుభవిస్తున్న సౌకర్యాలలో కీలక భూమిక పోషించిందన్నారు. ఉపాధ్యాయులకు సంఘాలు పెట్టుకునే హక్కును సాధించడంలో చెన్నుపాటి లక్ష్మయ్యది కీలక పాత్ర అని అన్నారు. పాఠశాల విద్యా వ్యవస్థను సరిచేయుటలో పర్యవేక్షణ వ్యవస్థది ప్రధాన పాత్ర అని చెప్పారు. డీఈఓ, డిప్యూటీఈఓ, ఎంఈఓ ఖాళీలను వెంటనే భర్తీ చేసి విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టీఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు మోత్కూరు సంయుక్త మాట్లాడుతూ సంఘాలలో మహిళల పాత్ర పెరగాలని కోరారు. ఉపాధ్యాయుల్లో శాస్త్రీయ ఆలోచనను పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఈ గాలయ్య, సింహాచలం, సీనియర్ నాయకులు మోత్కూరు నరహరి, మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జల విద్యుత్ ప్రాజెక్టుల్లో గరిష్ట ఉత్పత్తి చేయండి

- థర్మల్ కేంద్రాల్లో 17 రోజుల బొగ్గు నిల్వలు ఉండాలి : విద్యుత్‌శాఖ చీఫ్ ఇంజనీర్లతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని జలవిద్యుత్ కేంద్రాల్లో గరిష్ట ఉత్పత్తి చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థికశాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారుల్ని ఆదేశించారు. కృష్ణ, గోదావరి పరివాహక ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల్లోను వర్షపాతాలు భారీగా నమోదవుతున్న దృష్ట్యా ఈ ఏర్పాట్లు తప్పనిసరి అని చెప్పారు. శనివారంనాడిక్కడి మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో థర్మల్, హైడల్ విద్యుత్ ఉత్పాదనకు సంబంధించిన చీఫ్ ఇంజనీర్లతో ఆయన సమావేశమయ్యారు. ఆయా జలవిద్యుత్ కేంద్రాల్లోని సమస్యల్ని సానుకూలంగా విన్నారు. వాటి పరిష్కారాలకు పలు సూచనలు చేశారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం, అలసత్వం, ఆలస్యానికి తావు ఇవ్వవద్దని చెప్పారు. ఎస్మా పరిధిలో ఉన్న విద్యుత్‌శాఖలో పని చేయడం అంటే ప్రజల కోసం నిరంతరం శ్రమించడమేననీ, 24/7 అన్ని స్థాయిల అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. విద్యుదుత్పత్తికి సంబంధించి నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. సకాలంలో తీసుకోవాల్సిన నిర్ణయాలు తీసుకోకపోవడం వల్ల గతంలో శ్రీశైలం, జూరాల వంటి హైడల్ విద్యుత్ ప్రాజెక్టుల్లో సాంకేతిక సమస్యలు తలెత్తి, నష్టం జరిగిందని గుర్తుచేశారు. అందువల్ల రాష్ట్రంలో విద్యుదుత్పత్తికి సంబంధించి వారానికోసారి పూర్తి నివేదికల్ని తనకు పంపాలని ఆదేశించారు. అధికారులకు ఎలాంటి సమస్యలు ఉన్నా, వెంటనే విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ప్రాజెక్టులకు సంబంధించి సీఈలు నిర్లక్ష్యం వహిస్తే, వారినుంచి రాతపూర్వకంగా వివరణ తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో జేఎమ్‌డీ శ్రీనివాసరావు, ఇంధనశాఖ ఓఎస్డీ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదానీ తర్వాత ఎవరు?

(మొదటిపేజీ తరువాయి)

క్లీన్‌చిట్ ఇచ్చింది. అదానీ-హిండెన్‌బర్గ్ ఉదంతంపై కోర్టు పర్యవేక్షణలో సిట్ చేత విచారణ జరిపించాలంటూ దాఖలైన రివ్యూ పిటిషన్‌ను ఇటీవల సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. కాగా తనపై వచ్చిన ఆరోపణలను అదానీ గ్రూపు తోసిపుచ్చిన విషయం తెలిసిందే. గత కొన్ని రోజులుగా స్టాక్ మార్కెట్లు మంచి ఫలితాలు నమోదు చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో హిండెన్‌బర్గ్ ఏ కంపెనీ గుట్టు రట్టు చేస్తుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడానికే ఆ సంస్థ ఇలాంటి నివేదికలు విడుదల చేస్తోందని ఆరోపిస్తున్న వారూ ఉన్నారు.

ఇది కోతల ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

బంగారం ఇస్తామని ఎన్నికలప్పుడు కాంగ్రెస్ నేతలు ప్రగల్భాలు పలికారని.. అదేమోగానీ గతంలో కేసీఆర్ ఇచ్చినట్టు లక్ష రూపాయలు కూడా ఎగ్గొడుతున్నారని ఆరోపించారు. అబద్ధాలు.. మోసం మాటలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఆగస్టు నెల సగమైనా రైతుబంధు రాలేదన్నారు. గ్రామాల్లో చెత్త పేరుకుపోతుందన్నారు. ట్రాక్టర్ డీజిల్‌కు, సఫాయి కార్మికులకు డబ్బులు లేవని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు చెవుటోని ముందు శంఖం ఊదినట్టుందని విమర్శించారు. మధ్యాహ్న భోజనం కార్మికులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ రెసిడెన్షియల్స్ కార్మికులకు 8 నెలల నుంచి జీతాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో కుక్కలు కరుస్తుంటే.. వసతి గృహాల్లో ఎలుకలు కొరుకుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు గ్రామాల్లో చెత్త లేదని, ఇంటింటికీ చెత్త సేకరణ జరిగిందన్నారు. ఇప్పుడు గ్రామాలే చెత్త కుప్పలుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు.

కిమ్స్ సన్ షైన్‌లో వ్యాక్సినేషన్ సెంటర్ ప్రారంభం



నవతెలంగాణ-బేగంపేట్

పెద్దవారి కోసం వ్యాక్సినేషన్ సెంటర్‌ను శనివారం బేగంపేట కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్ లో ఆస్పత్రి ఎండీ, చీఫ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ ఏవీ గురవారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనదేశంలో యూనివర్సల్ ఇమ్యునైజేషన్ కార్యక్రమం కింద పిల్లలకు వ్యాక్సినేషన్ ప్రక్రియ ఎంతో అద్భుతంగా జరుగుతోందని తెలిపారు. అయితే పెద్దవారు వ్యాక్సినేషన్ నిర్లక్ష్యం చేయడంపై, డాక్టర్లు ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు ప్రస్తుతం అందుబాటులో ఉన్న వ్యాక్సినేషన్లను తీసుకునే విధంగా అడల్ట్ వ్యాక్సినేషన్ సెంటర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు.

సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్, క్రిటికల్ కేర్, స్లీప్ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ జి రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో బీపీ, షుగర్, గుండె సంబంధ సమస్యలతో పాటు లంగ్స్, సిఓపి డి, ఆస్తమా సమస్యలు పెరుగుతున్నాయన్నారు. వీటితోపాటు క్యాన్సర్ తో బాధపడుతున్న వారు, ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంటేషన్ అయినవారికి రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుందని చెప్పారు.

ఇలాంటివారు రెగ్యులర్‌గా వ్యాక్సినేషన్ తీసుకో వడం ఎంతో అవసరం అన్నారు. రాబోయే ఒకటి రెండు దశాబ్దాల్లో వయసు పైబడిన వారి సంఖ్య పెరిగిపోయే అవకాశం ఉందని, ఇలాంటి వారికి వ్యాక్సినేషన్ ఎంతో అవసరమన్నారు. న్యూమోనియా, ఇన్ఫ్లుఎంజా, టి టి, టీడీఏపీ, టేటినస్, హెపటైటిస్ బి, సింగిల్స్‌వంటి అడల్ట్ ఇమ్యునైజేషన్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గైడ్‌లైన్స్ ప్రకారం వ్యాక్సిన్లు తీసుకుంటే ప్రతి సంవత్సరం 20 నుంచి 30 లక్షల మంది మరణాలను అరికట్టవచ్చని స్టడీలు చెబుతున్నాయని తెలిపారు. ప్రజల్లో వ్యాక్సిన్ లపై ఉన్న అపోహల కారణంగా మంచి వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నా తీసుకోవడం లేదన్నారు. వ్యాక్సిన్లు చాలా సేఫ్ అని ఎలాంటి అపోహలు లేకుండా వ్యాక్సిన్లు తీసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి పల్మనాలజిస్ట్ డాక్టర్ లక్ష్మణ్ బాబు, డాక్టర్ శిరీష్, డాక్టర్ స్వాతి రెడ్డి, జనరల్ ఫిజీషియన్లు డాక్టర్ ప్రశాంత్ కుమార్, డాక్టర్ నవ వికాస్, హాస్పిటల్స్ సీఓఓ డాక్టర్ సుధాకర్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పత్రిక నవతెలంగాణకు వార్షికోత్సవ శుభాకాంక్షలు



నవతెలంగాణ-చంపాపేట్

ప్రజా పత్రిక నవతెలంగాణకు నా హృదయపూర్వక 9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు. అంకితభావంతో పని చేస్తున్న విలేకరులు, సిబ్బంది ఈ పత్రికకు ఆయువు పట్టు. సమాజం పట్ల గౌరవంతో, ప్రజల పట్ల నిబద్ధతతో పని చేస్తున్న పత్రిక నవతెలంగాణ ప్రజా కోణంలో వార్తలు, విశ్లేషణలు అందిస్తూ ఎప్పటికప్పుడు నూతన ఉత్తేజంతో పాఠకులకు చేరువవుతోంది. 9 సంవత్సరాలు పూర్తి చేసుకుని 10వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పత్రిక ఉన్నతికి కారణమైన ప్రతి ఒక్కరికి అభినందనలు. భవిష్యత్తులో ఇది మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నాను.

– సంతోష్ నగర్ ఏసీపీ మహమ్మద్ గౌస్

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

డిపాజిట్లు పెంచాలి

- ఆకర్షణీయ పథకాలు ప్రవేశపెట్టాలి
- బ్యాంక్‌లకు మంత్రి సీతారామన్ సూచన
- బ్యాంకింగ్‌లో సంస్కరణలు చేపడుతాం
- ఆర్‌బీఐ బోర్డు భేటీకి హాజరు



న్యూఢిల్లీ : బ్యాంకింగ్ రంగంలో తగ్గుతోన్న డిపాజిట్లపై ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆకర్షణీయ, వినూత్న డిపాజిట్ పథకాలను ప్రవేశపెట్టాలని బ్యాంకర్లకు సూచించారు. శనివారం ఆర్‌బీఐ బోర్డు సమావేశంలో మంత్రి సీతారామన్ పాల్గొన్నారు. ఆర్‌బీఐ ప్రధాన కార్యాలయంలో జరిగిన భేటీలో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్, ఇతర బోర్డు డైరెక్టర్లు పాల్గొన్నారు. ఇందులో బడ్జెట్‌లోని అంశాలు, దేశంలోని ప్రస్తుత ఆర్థిక పరిస్థితులపై చర్చలు జరిగాయని సమాచారం. బోర్డు మీటింగ్ అనంతరం ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్‌తో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ప్రజల నుంచి డిపాజిట్లను ఆకర్షించడానికి వినూత్న ఉత్పత్తులను తీసుకురావాలన్నారు. డిపాజిట్లు, రుణాలు బండికి రెండు చక్రాల లాంటివని అభివర్ణించారు. డిపాజిట్లుగా వచ్చిన నిధులను అవసరమైన వారికి రుణాలుగా సమకూర్చాలన్నారు. అప్పుడే డిపాజిట్లకు, రుణాలకు మధ్య ఉన్న అంతరం తగ్గుతుందన్నారు. ఇందుకోసం వినూత్న, ఆకర్షణీయ డిపాజిట్ పథకాలు అవసరమన్నారు. బ్యాంకుల్లో వడ్డీ రేట్లు కూడా తక్కువగా ఉన్నాయని అన్నారు. అనేక ఏళ్లుగా కొనసాగుతున్న సమస్యకు పరిష్కారం చూపాలని మంత్రి బ్యాంకర్లకు సూచించారు.

వడ్డీ రేట్లపై బ్యాంక్‌లదే నిర్ణయం

బ్యాంకింగ్ రంగంలో డిపాజిట్లు, రుణాలు అసమతుల్యత గురించి శక్తికాంత దాస్ ఆందోళనలను వ్యక్తం చేశారు. బ్యాంకులు సొంతంగా డిపాజిట్లను పెంచుకోవడానికి రేట్లను పెంచుకునే వెసులుబాటు ఉందని తెలిపారు. బ్యాంకులు తమ రేట్లను నిర్ణయించుకునే స్వేచ్ఛను కల్పించామని ఆయన పేర్కొన్నారు.

నామినీ చట్టాల్లో మార్పులు..

చాలా ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న బ్యాంకింగ్ చట్టాల్లో సవరణలు చేస్తామని మంత్రి వెల్లడించారు. నామినీ చట్టాల్లో కూడా మార్పులు తీసుకురానున్నామన్నారు. ఈ మార్పుల ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థ కస్టమర్ ఫ్రెండ్లీగా మారుతుందని చెప్పారు. బ్యాంక్‌లు అన్ క్లెయిమ్డ్ డిపాజిట్లపై దృష్టి సారించాలని సూచించారు. రిజర్వు బ్యాంక్ వివరాల ప్రకారం.. 2024 మార్చి 31 నాటికి ఏడాది ప్రాతిపదికన బ్యాంకుల వద్ద ఎవరూ క్లెయిమ్ చేయని సొమ్ము 26 శాతం పెరిగి రూ.78,213 కోట్లకు చేరుకుంది. ఈ నేపథ్యంలోనే ఖాతాదారులు ఒక ఖాతాకు నలుగురు నామినీలను ఎంపిక చేసుకునేందుకు వెసులుబాటు కల్పించాలని బ్యాంకింగ్ చట్టాల సనవరణ బిల్లు 2024 నిర్ణయించింది. దీనికి ముందు వరకు ఒక ఖాతాకు కేవలం ఒక నామినీని మాత్రమే ఖాతాదారులు ఎంపిక చేసుకునేందుకు అవకాశం ఉండేది. కొత్త చట్టాలు అమలులోకి వస్తే తదనుగుణంగా నామినీలను ఖాతాదారులు పెంచుకోవచ్చు. ఈ మార్పు ద్వారా సదరు ఖాతాదారులు మరణిస్తే డిపాజిట్లు లేదా ఇతర మొత్తాన్ని క్లెయిమ్ చేసుకోవటానికి చట్టపరంగా నామినీలకు అవకాశం కల్పించబడుతుంది. దాంతో భారీగా పెరుగుతున్న అన్ క్లెయిమ్డ్ డిపాజిట్లను భారీగా తగ్గించుకోవచ్చని యోచన.

త్వరలో హిండెన్‌బర్గ్ మరో బాంబు..!

HINDENBURG RESEARCH

న్యూఢిల్లీ : అదానీ గ్రూపు తీవ్ర ఆర్థిక అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించి భారత్‌లో సంచలనం రేపిన అమెరికన్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ సంస్థ హిండెన్‌బర్గ్ మరో బాంబు పేల్చనుందని తెలుస్తోంది. హిండెన్‌బర్గ్ తాజాగా చేసిన ఓ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'సమ్‌థింగ్ బిగ్ సూన్ ఇండియా' అని హిండెన్‌బర్గ్ ట్వీట్ చేయడం ఇన్వెస్టర్లలో తీవ్ర ఆసక్తిని రేపుతోంది. తాజా ట్వీట్ అంతరార్థం మాత్రం అవగతం కాకుండా ఉంది. అదానీ గ్రూపును ఓ కుదుపు కుదిపిన అమెరికన్ సంస్థ తాజా ట్వీట్‌తో మరోసారి భారతీయ మార్కెట్లలో బాంబు పేల్చనుందనే అంచనాలు, విశ్లేషణలు జోరందుకున్నాయి. ఈ దఫా ఏ కంపెనీ అక్రమాలను బయటికి తీస్తోందో.. ఎప్పుడు ఆ రిపోర్ట్ విడుదల చేస్తోందోనని నెటిజన్లు ఆసక్తితో పోస్టింగ్‌లో పెడుతున్నారు. ఈ ఏడాది జనవరిలో అదానీ గ్రూపునపై విడుదల చేసిన రిపోర్ట్‌తో భారత స్టాక్ మార్కెట్లలో పెను సంచలనాన్ని రేపిన విషయం తెలిసిందే. ఆ దెబ్బతో అదానీ గ్రూపు మార్కెట్ కాపిటలైజేషన్ వేల కోట్లు ఆవిరయ్యింది.

సిస్కోలో వేలాది ఉద్యోగులపై వేటు

న్యూయార్క్ : అమెరికాకు చెందిన టెక్ దిగ్గజం సిస్కోలో వేలాది మంది ఉద్యోగులు రోడ్డున పడనున్నారు. మాంద్యం భయాలతో ఇటీవల టెక్నాలజీ కంపెనీల సిబ్బందిపై వేటు వేస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి రెండో వారంలో దాదాపు 4,000 మందికి ఉద్వాసన పలికిన సిస్కో.. మరోమారు భారీగా సిబ్బందిని తొలగించే ప్రక్రియలో ఉందని రిపోర్టులు వస్తున్నాయి. ఆరు నెలలు కూడా కాకముందే మళ్లీ ఉద్వాసనల సంకేతాలు ఆ సంస్థ ఉద్యోగులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోన్నాయి. వ్యాపారంలో డిమాండ్ తగ్గడం, సరఫరా చైన్‌లో సమస్యల కారణంగానే కంపెనీ ఇలాంటి నిర్ణయాలను తీసుకుంటోందని తెలుస్తోంది. సిస్కోలో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 85వేల మంది ఉద్యోగులు పని చేస్తోన్నారని అంచనా. సైబర్ సెక్యూరిటీ, ఏఐ రంగాల వైపు దృష్టి సారించింది. 2025 నాటికి ఏఐ ఉత్పత్తుల ఆర్డర్‌లో బిలియన్‌కు చేరుకోవాలనే లక్ష్యంలో భాగంగా ఉద్యోగులను తగ్గించుకొనేందుకు ప్రయత్నాలు ప్రారంభించిందని తెలుస్తోంది.

అల్ట్రాటెక్ లైమ్‌స్టోన్ గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్

హైదరాబాద్ : తమ పన్నెండు అల్ట్రాటెక్ లైమ్‌స్టోన్ గనులకు మైనింగ్ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ నుంచి ఫైవ్ స్టార్ రేటింగ్‌ను ఇచ్చిందని ఆ సంస్థ తెలిపింది. ఇందులో అనంతపురంలోని అల్ట్రాటెక్ లైమ్‌స్టోన్ గనికి స్థానం లభించిందని పేర్కొంది. దీనికి సంబంధించి ఇటీవల ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి నుంచి అవార్డును అందుకున్నట్లు పేర్కొంది.

బస్సుల్లో పెరగనున్న రద్దీ : రెడ్‌బస్

redBus

హైదరాబాద్ : స్వాతంత్ర్య దినోత్సవం వేళ వరుస సెలవులు రావడంతో తెలుగు రాష్ట్రాల్లో బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరగనుందని రెడ్‌బస్ ఓ రిపోర్ట్‌లో తెలిపింది. ఈ నెల 17 నుంచి 19 వరకు వరుస సెలవులు రావడంతో ప్రయాణికులు సొంతుళ్లకు, పర్యాటకానికి వెళ్లడానికి సిద్ధమవుతున్నారని పేర్కొంది. దీనికి తగ్గట్లుగానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ట్రావెల్స్ బుకింగ్స్‌కు రద్దీ పెరిగిందని తెలిపింది. గత వారంతో పోలిస్తే ఈ వారంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 29 శాతం అత్యధికంగా సీట్లు బుక్ అవుతున్నట్లు తెలిపింది రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ ఆర్‌టిసి సర్వీసులు, ప్రయివేటు బస్ ఆపరేటర్లు కూడా దాదాపు 8000కు పైగా సర్వీసుల్ని సిద్ధంగా ఉంచుతున్నారని పేర్కొంది.

బజాజ్ ఫైనాన్స్ రూ.341 కోట్ల జీఎస్టీ ఎగవేత..!

న్యూఢిల్లీ : బజాజ్ ఫైనాన్స్ రూ.341 కోట్ల జీఎస్టీని ఎగవేసిందని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ) తెలిపింది. దీనికి సంబంధించిన ఈ నెల 3న పన్ను ఎగవేత నోటీసులను జారీ చేసినట్లు వెల్లడించింది. కంపెనీకి మొత్తం 160 పేజీల నోటీసు పంపింది. మినహాయింపు ప్రయోజనాలను పొందేందుకు బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ సర్వీస్ లేదా ప్రాసెసింగ్ ఛార్జీలను వడ్డీగా పరిగణించడం ద్వారా జీఎస్టీని ఎగవేస్తోందని డీజీజీఐ తెలిపింది. ఈ అంశంలో రూ. 341 కోట్ల పన్ను ఎగవేత, రూ.150 కోట్ల వడ్డీ సహా జరిమానా కలుపుకుంటే మొత్తంగా రూ.850 కోట్ల జరిమానా చెల్లించాల్సి ఉందని తెలుస్తోంది.

ప్రసూతి 'పెనాల్టీ'

మెటర్నిటీ సెలవు తర్వాత కెరీర్‌కు అడ్డంకులు

- 75 శాతం మంది తల్లులది ఇదే పరిస్థితి
- 'వాయిస్ ఆఫ్ ఉమెన్ స్టడీ'లో వెల్లడి



న్యూఢిల్లీ : ప్రసూతి సెలవుల తర్వాత చాలా మంది తల్లులు తమ కెరీర్‌లో అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. దాదాపు 75 శాతం మంది తల్లులది ఇదే పరిస్థితి. 'వాయిస్ ఆఫ్ ఉమెన్' అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. 560 కంటే ఎక్కువ కంపెనీలలో 24,000 మంది మహిళా ఉద్యోగులను ఈ అధ్యయనంలో భాగంగా సర్వే చేశారు.

అధ్యయనం ప్రకారం.. భారత్‌లో కార్పొరేట్ రంగంలో పని చేసే తల్లులు గణనీయమైన సవాళ్లతో పోరాడుతున్నారు. ప్రసూతి సెలవుల తర్వాత తల్లులు ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నారు. 75 శాతం మంది పని చేసే తల్లులు ప్రసూతి సెలవు నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఒకటి నుంచి రెండు సంవత్సరాల వరకు కెరీర్‌లో వైఫల్యాన్ని నివేదించారు. ఈ మహిళల్లో దాదాపు 40 శాతం మంది ప్రసూతి సెలవుపై వెళ్లటం వారి వేతనాన్ని దెబ్బతీస్తున్నది. చాలామంది ఉద్యోగాల్లో తమ స్థానాలను వారు ఇష్టపడని స్థానాలకు మార్చినట్టు గుర్తించారు. పని ప్రదేశాల్లో మహిళలకు పక్షపాతం, వివక్ష ఎదురవుతున్నది. సర్వేలో పాల్గొన్న మహిళల్లో దాదాపు సగం మంది పనిలో పక్షపాతాన్ని అనుభవిస్తున్నట్టు వివరించారు. 37 శాతం మంది వారు సున్నితమైన ప్రవర్తనను ఎదుర్కొన్నట్టు వెల్లడించారు. ఇంకా, ఆరు శాతం మంది లైంగిక వేధింపులను ఎదుర్కొంటున్నట్టు నివేదించారు. వీటిలో సగం కంటే తక్కువ కేసులే అధికారికంగా నివేదించబడటం గమనార్హం.

సీనియర్ మేనేజ్‌మెంట్, లీడర్‌షిప్ రోల్స్‌లో ఉన్న మహిళలు ఎంట్రీ-లెవల్ స్థానాల్లో ఉన్నవారితో పోలిస్తే రెండింతలు వివక్షను ఎదుర్కొంటున్నారు. 34 శాతం మంది సీనియర్ మహిళలు, 17 శాతం ప్రవేశ స్థాయి మహిళలు పక్షపాతాన్ని ఎదుర్కొంటున్నట్టు నివేదించారు. ఈ పెరుగుతున్న పక్షపాతం మహిళలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నది. పక్షపాతాన్ని అనుభవించిన మహిళలు ఒక సంవత్సరంలోపు తమ ఉద్యోగాలను విడిచిపెట్టాలని భావించే అవకాశమున్నది. అంతేకాదు, మహిళా నాయకత్వం కార్యాలయంలో వివక్షను ఎదుర్కొంటున్నది. సంస్థల్లో మహిళా నాయకత్వం కొంత సానుకూల ప్రభావాన్ని కలిగి ఉన్నది. సర్వేలో పాల్గొన్న మహిళల్లో సగానికి పైగా (53 శాతం మంది) కనిపించే మహిళా నాయకులు తమ కెరీర్ వృద్ధిపై విశ్వాసాన్ని పెంచినట్టు నివేదించారు. కాగా, రంగమేదైనా మహిళలపై అణచివేత కొనసాగుతున్నదనీ, దీనిని నిరోధించటానికి చురుకైన చర్యలు తీసుకోవాలని పాలకులను సామాజికవేత్తలు, మహిళా సంఘాల నాయకులు కోరుతున్నారు.

అధిక లాభాలు వచ్చే పంటలు వేయాలి



రుణమాఫీ అందని వారు అధికారులకు సమాచారం ఇవ్వండి :రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-అక్కన్నపేట

అధిక లాభాలు వచ్చే వాణిజ్య పంటలను రైతులు సాగు చేసి ప్రయోజనాలు పొందాలని బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని రామవరం గ్రామ రైతు వేదికలో అధికారులు రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా అధిక ఆదాయం వచ్చే పంటల సాగువైపు రైతులు మొగ్గు చూపాలన్నారు. వాణిజ్య పంటలు వేయాలని సూచించారు. పాడి పశువుల పెంపకంపైనా దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా వ్యవసాయంలో సంప్రదాయ పంటల్లో వచ్చే ఆదాయం కన్నా.. భిన్నమైన పంటల్లో లాభాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ముఖ్యంగా సెరికల్చర్, హార్టికల్చర్, ఆయిల్ పామ్ తోటలు పెంచాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో రైతులకు రుణమాఫీ జరిగిందన్నారు. ఇప్పటికే రూ.1.50 లక్షల లోపు ఉన్న రుణాల మాఫీ జరిగిందని, త్వరలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ జరగనుందని చెప్పారు. సాంకేతిక సమస్యల వల్ల రుణమాఫీ అందని వారు వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500గ్యాస్ సిలిండర్ అందని వారు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మహిళా సంఘాలు ప్రభుత్వ అందించే సబ్సిడీల ద్వారా మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకాలను చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా తప్పకుండా కార్యదర్శులకు తెలియజేయాలన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టుకి ప్రభుత్వం రూ.431.50 కోట్లు విడుదల చేసిందని, తొందరలోనే ప్రాజెక్టును పూర్తి చేసి రైతుల పొలాలకు నీరందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య, సొసైటీ చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, డైరెక్టర్ బుర్ర ప్రభాకర్‌గౌడ్, ఆర్డీవో రామ్మూర్తి, ఎంపీడీవో జయరామ్, ఎమ్మార్వో అనంతరెడ్డి, ఏపీఎం శ్రీనివాస్, ఏఓ నాగరాజు, సీడీపీఓ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

నవతెలంగాణ- ఇనుగుర్తి


(ఫైల్)

అప్పులబాధకు తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం కోమటిపల్లి పరిధి కోక్యతాండాలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కోక్య తండాకు చెందిన కౌలు రైతు జాటోత్ రమేష్(36) 10 ఎకరాలు కౌలుకు తీసుకొని మూడేండ్లుగా పత్తి, మొక్కజొన్న, మిర్చి, వరి పంటలు సాగు చేశాడు. ఆశించిన దిగుబడులు రాక రూ.15 లక్షల వరకు అప్పులు అయ్యాయి. దీంతో మనోవేదనకు గురైన రమేష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి చక్రు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మురళీధర్ రాజ్ తెలిపారు.

పాలస్తీనా కోసం మౌన ప్రదర్శన

- జీన్ డ్రేజ్, అన్నీ రాజాను అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు



న్యూఢిల్లీ : దేశ రాజధాని న్యూఢిల్లీలో పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలుపుతూ మౌన ప్రదర్శన చేస్తున్న ఆర్థికవేత్త జీన్ డ్రేజ్, సీపీఐ నాయకుడు అన్నీ రాజా సహా ప్రముఖ కార్యకర్తలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిరసన గురించి కార్యకర్తలు పోలీసులకు సమాచారమందించి నప్పటికీ అరెస్ట్ చేయటం గమనార్హం. గాజాలో తక్షణ కాల్పుల విరమణను డిమాండ్ చేస్తూ.. పాలస్తీనా కోసం వీరు నిర్వహించిన మార్చ్.. ఖాన్ మార్కెట్ ప్రాంతం నుంచి ప్రారంభమై ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం వైపు వెళుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. "మేము నినాదాలు కూడా చేయలేదు. కానీ బ్యానర్లతో నిశ్శబ్దంగా నిలబడి ఉన్నాం. కానీ దురదృష్టవశాత్తు, పోలీసులు మమ్మల్ని అదుపులోకి తీసుకున్నారు" అని డ్రేజ్ అన్నారు. పాలస్తీనాపై దాడులను ప్రారంభించిన ఇజ్రాయెల్‌తో అన్ని సంబంధాలనూ వెంటనే ముగించాలని భారత ప్రభుత్వాన్ని కోరిన సామాజికవేత్తలు, కార్యకర్తలు ఈ నిరసనకు హాజరయ్యారు. భారతదేశం సంతకం చేసి, ఆమోదించిన జెనోసైడ్ కన్వెన్షన్ ప్రకారం మారణహోమాన్ని నిరోధించటానికి భారత్ అన్ని చర్యలనూ తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

లేబర్ సెస్ నిధుల వినియోగంలో కేరళ టాప్

తిరువనంతపురం : దేశంలో లేబర్ సెస్ నిధులను పూర్తి స్థాయిలో వినియోగించిన రాష్ట్రంగా కేరళ రికార్డు సృష్టించింది. కార్మిక సంక్షేమ సెస్ కింద రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు రూ.1.12 లక్షల కోట్లు వసూలు చేయగా అందులో ఖర్చు చేసింది కేవలం రూ.64,000 కోట్లు మాత్రమే. 1996వ సంవత్సరపు బిల్డింగ్-ఇతర నిర్మాణ కార్మికుల చట్టం ప్రకారం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు లేబర్ సెస్ నిధులను వసూలు చేస్తాయి. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం దీనిని ఖర్చు చేస్తారు. అందుకోసం రాష్ట్ర సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేస్తారు. ప్రమాదం జరిగినప్పుడు తక్షణమే ఆర్థిక సాయం అందించేందుకు, గ్రూప్ ఇన్సూరెన్స్ పథకాల కోసం చెల్లింపులు జరిపేందుకు, లబ్దిదారులకు పెన్షన్ చెల్లింపులకు, ఇంటి నిర్మాణం కోసం లబ్దిదారుడికి రుణాలు, అడ్వాన్సులు చెల్లించేందుకు, లబ్దిదారుల పిల్లల చదువులకు ఆర్థిక సాయం అందించేందుకు, ప్రధాన వ్యాధుల బారిన పడిన వారికి వైద్య ఖర్చులు చెల్లించేందుకు, గర్భిణులుగా ఉన్న మహిళా లబ్దిదారులకు వైద్య ఖర్చులు అందించేందుకు ఈ నిధులు వెచ్చిస్తారు.



కేరళ మినహా ఏ రాష్ట్రం లేదా కేంద్ర పాలిత ప్రాంతం వంద శాతం నిధులను ఖర్చు చేయలేదు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కార్మిక, ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖ అందజేసిన సమాచారం ఈ విషయన్ని నిర్ధారిస్తోంది. రాజ్యసభలో కర్నాటకకు చెందిన కాంగ్రెస్ సభ్యుడు జీసీ చంద్రశేఖర్ అడిగిన ప్రశ్నకు సంబంధిత శాఖ సహాయ మంత్రి శోభ కరండ్లజే సమాధానమిస్తూ వసూలైన సొమ్ములో రాష్ట్రాలు, యూటీలు రూ.48,137.19 కోట్లు ఖర్చు చేయలేదని తెలిపారు. పారిశ్రామిక రాష్ట్రమైన గుజరాత్‌లో రూ.5,549.46 కోట్లు వసూలు కాగా రూ.1,012.22 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని చెప్పారు. గుజరాత్‌తో పోలిస్తే కర్నాటక, మహారాష్ట్రలు కొంత ఎక్కువ నిధులను ఖర్చు చేశాయని వివరించారు. కేరళలో రూ.3,457.32 కోట్లు వసూలు కాగా అంతే మొత్తం ఖర్చయిందని అన్నారు.



బ్రెజిల్‌లో ఘోరం

విమానం కూలి 61 మంది దుర్మరణం

బ్రసీలియా : బ్రెజిల్‌లో దారుణం చోటు చేసుకున్నది. సావో పాలో రాష్ట్రంలో శుక్రవారం 61 మందితో ప్రయాణిస్తున్న విమానం గేటెడ్ రెసిడెన్షియల్ కమ్యూనిటీపై కూలిపోయింది. ప్రయాణికులంతా మరణించారని ఎయిర్‌లైన్స్ తెలిపింది. సావో పాలోకు వాయువ్యంగా 80 కిలోమీటర్ల (50 మైళ్లు) దూరంలో ఉన్న విన్‌హెడోలో కూలిపోయిన విమానంలో 62 మంది ప్రయాణిస్తున్నారని ఎయిర్‌లైన్ ఇంతకు ముందు నివేదించింది. అయితే ఆ తర్వాత సంఖ్యను 61కి అప్‌డేట్ చేసింది. "విమానం 2283లో ఉన్న మొత్తం 61 మంది వ్యక్తులు సైట్‌లో మరణించారని తెలియజేయడానికి కంపెనీ విచారం వ్యక్తం చేస్తున్నది" అని సంబంధిత ఎయిర్‌లైన్ ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రారంభానికి సిద్ధంగా సీపీపీ

- పామాయిల్ పరిశ్రమలో స్వతంత్రంగా విద్యుత్ ఉత్పత్తి
- పరిశ్రమ అవసరాలకు వినియోగం

నవతెలంగాణ - అశ్వారావుపేట



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమకు అవసరం అయ్యే విద్యుత్ ఉత్పత్తి కోసం నిర్మించిన క్యాప్టివ్ పవర్ ప్లాంట్(సీపీపీ) టర్బైన్ ప్రారంభానికి సిద్ధమైంది. దీని కమీషనింగ్ తుది దశకు చేరుకుని విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. పామాయిల్ పరిశ్రమలో 2.5 మెగావాట్ విద్యుత్తును స్వతంత్రంగా తయారు చేసుకుని పరిశ్రమ అవసరాలకు అందజేసేందుకు వీలుగా దీనిని నిర్మించారు. కమీషనింగ్ ప్రారంభించిన ఇంజినీరింగ్ అధికారులు తుది దశను చేరుకుందని తెలిపారు.

పూర్తి కంప్యూటరైజ్డ్, ఆటోమేటిక్ యంత్రాలతో చేపట్టిన దీని నిర్మాణానికి రూ.36 కోట్లు ఖర్చు చేశారు. షెడ్ ఫైబర్‌తో నడిచే ఈ బాయిలర్ సామర్థ్యం 30 టీపీహెచ్ (ట్రాన్స్‌పర్ అవర్), 2.5 మెగా వాట్ విద్యుత్తు ఉత్పత్తి చేసే విధంగా గతేడాది జులైలో ప్రారంభించి నిర్మాణం పూర్తి చేశారు. దీనివల్ల నెలకు రూ.15 లక్షలకు తగ్గకుండా విద్యుత్తు బిల్లు ఆదా అవుతుందని వెల్లడించారు. దీని వల్ల ఏడాదికి రూ.15 కోట్ల నుంచి రూ.18 కోట్ల వరకూ ఆదా కానుంది.

అంతరాయాలూ లేకుండా పామాయిల్ పరిశ్రమకు విద్యుత్తు సరఫరా అందుతుంది. దమ్మపేట మండలం అప్పారావుపేట పామాయిల్ పరిశ్రమలో వినియోగించిన ఇదే సాంకేతిక పరిజ్ఞానం మంచి పలితాలు ఇస్తోంది. ఈ ప్లాంట్‌ను త్వరలో ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి నూతన పామాయిల్ పరిశ్రమలో 60 టన్నుల సామర్థ్యం ప్లాంట్ పనులు ప్రారంభించనున్నారు. కొద్ది రోజుల్లో నూతన బాయిలర్‌ను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమ మేనేజర్ మంద నాగబాబు 'నవతెలంగాణ'తో చెప్పారు.

జూరాల 23 గేట్లు ఎత్తివేత

- కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

నవతెలంగాణ- ధరూరు



జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో శనివారం అధికారులు 23 గేట్లను ఎత్తారు. ఎగువన నారాయణపూర్ డ్యామ్ నుంచి 2 లక్షల20 వేల క్యూసెక్కుల నీరు జూరాలకు వస్తోందన్నారు. జూరాల నుంచి లక్ష 60వేల 540 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్టు తెలిపారు. జూరాలలో నీటిమట్టం 318.518 అడుగుల వద్ద ఉండగా.. జల విద్యుత్ కేంద్రం ద్వారా 5 యూనిట్ల లో 24 వేల 246 క్యూసెక్కుల నీటిని కిందకు వదులుతున్నారు. నెట్టెంపాడుకు 750, కోయిల సాగర్ 630, లెఫ్ట్ కెనాల్‌కు 820, రైట్ కెనాల్‌కు 684, ఫైనల్ కాల్వకు 600 క్యూసెక్కుల నీరు, భీమాలిఫ్ట్-2కు 750 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం ప్రాజెక్టులోకి వదులుతున్నట్టు అధికారులు తెలిపారు.

ఆటో, కారు ఢీ.. ఆటో బోల్తా

- ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి
- మరో నలుగురు విద్యార్థులకు గాయాలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



ఆటో, కారు ఢీకొనటంతో ఆటోలో ఉన్న గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతిచెందాడు. మరో నలుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం ఏపీ రాష్ట్రం ఎటపాకలో శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం బండారుగూడెం గ్రామానికి చెందిన కుంజ దీపక్(13), అతని తమ్ముడు కుంజ అనిల్(6వ తరగతి), కాటిబోయిన కార్తీక్ (8వ తరగతి), కాటిబోయిన జస్వంత్(9వ తరగతి), అశ్వాపురం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన తాటి అఖిల్(10వ తరగతి) కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలలో చదువుతున్నారు. ఈ ఐదుగురు శనివారం ఉదయం వార్డెన్‌కు చెప్పకుండా బయటకు వచ్చి ఆటోలో స్వగ్రామాలకు బయలుదేరారు. ఆటో డ్రైవర్‌కు ఎడమ వైపున దీపక్, జస్వంత్ కూర్చున్నారు. ఏపీ పరిధిలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం తునికి చెరువు గ్రామం వద్ద ఆటో, కారు ఢీకొన్నాయి. దీంతో ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో దీపక్ తలకు బలమైన గాయం కావడంతో చెవి, ముక్కుల నుంచి తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. వారిని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలివచ్చారు. దీపక్ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కాగా, ఈ విషయమై వార్డెన్ బి.హరికృష్ణను 'నవతెలంగాణ' సంప్రదించగా.. శని, ఆదివారం సెలవు దినాలు కావడంతో కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు వసతి గృహానికి వచ్చి సెలవు చీటి ఇచ్చి ఇంటికి తీసుకెళ్లారని చెప్పారు. కానీ మృతిచెందిన దీపక్, మరో నలుగురు విద్యార్థులు తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే గోడ దూకి వెళ్లారని వివరించారు. రోడ్డు ప్రమాదం ఏపీ పరిధిలో జరగడంతో ఎటపాక పోలీసులు ఆటో, కారు డ్రైవర్లను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రజాకవి వేమన'పై పరిశోధన చేసి డాక్టరేట్ పొందిన ఆధునిక కవి?



నానాపురం నర్సింహులు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహేశ్వరం, రంగారెడ్డి జిల్లా.
9030057994

శతకాలు

శతకాలు సంస్కృత ప్రాకృత కన్నడాది భాషలలో వెలువడినప్పటికీ తెలుగు వాటికి ప్రత్యేకమైన స్థానమున్నది. తెలుగులో వేలకొలది శతకాలు వెలువడ్డాయి. సంస్కృత ప్రాకృత శతకాల్లో లేని సంఖ్యా నియమం, మకుట నియమం, ఛందోనియమం, రసనియమం, ఆత్మాశ్రయ కవితాధర్మం అనే లక్షణాలు తెలుగు శతకాలలో రూపు దిద్దుకొన్నాయి. తెలుగు శతకాలలో సామాన్యంగా 100కి బదులు 108 పద్యాలుంటాయి. ప్రాచీనాంధ్ర సాహిత్యంలో భక్తి శతకాలు, నీతి శతకాలు ఎక్కువగా వెలువడ్డాయి. క్రీ.శ.16వ శతాబ్దంలో ప్రబంధాల ప్రభావం వల్ల శృంగార శతకాలు కొందరు రచించారు.

తెలుగులో శతక కవిత్వానికి ఆద్యుడిగా మల్లికార్జున పండితారాధ్యుడిని ప్రథమశతక కర్త అని చెప్పవచ్చు. కాని శతకానికి తగిన లక్షణాలు లేవు. ఇతడు రాసిన శివతత్త్వసారంలో 489 కంద పద్యాలున్నాయి. పాల్కురికి సోమనాథుడు రచించిన 'వృషాధిప శతకము' సర్వ లక్షణ సంపన్నమైన తొలి తెలుగు శతకం. తెలుగులో శతకాలు నీతి, భక్తి, వ్యాజస్తుతి, వేదాంత శతకాలని నాలుగు విధాలుగా డా॥ దివాకర్ల వేంకటావధానిగారు విభజించి పరిశీలించారు. తెలుగులో తొలి శతక పరిశోధకుడు వంగూరి సుబ్బారావు.

సాధన ప్రశ్నలు


1. తొలి తెలుగు సమగ్ర శతకం రాసి, శతక బ్రహ్మ కీర్తి గాంచిన కవి, శతకం?
   ఎ. శివతత్త్వసారం – మల్లికార్జున పండితారాధ్యుడు
   బి. వృషాధిపశతకం – పాల్కురికి సోమన
   సి. సర్వేశ్వర శతకం – యథావాక్కుల అన్నమయ్య
   డి. సుమతి శతకం – బద్దెన
2. తొలి తెలుగు శతక మన దగిన 'శివతత్త్వ సారం' రాసిన మల్లికార్జున పండితరాధ్యుడు అందులో వాడిన పద్యాలు?
   ఎ. ఉత్పలమాల, చంపకమాల
   బి. ఆటవెలది, తేటగీతి
   సి. కందం
   డి. సీసం
3. ఈ క్రింది వానిలో పాల్కురికి సోమన రచన కానిది?
   ఎ. చెన్నమల్లు సీసములు   బి. బసవలింగ శతకం
   సి. సర్వేశ్వర శతకం   డి. చతుర్వేదసారం
4. పాల్కురికి సోమన 'వృషాధిపశతకం'?
   ఎ. వేదాంత శతకం   బి. భక్తి శతకం
   సి. వ్యాజస్తుతి శతకం   డి. నీతి శతకం
5. రాజనీతి, గృహనీతి, సర్వజన సుబోధకంగా, సమయోచితంగా రచించిన నీతి శతకం 'సుమతీ శతకం' కర్త?
   ఎ. బద్దెన   బి. మారన
   సి. మారదవెంకయ్య   డి. మంచన
6. శైవభక్తి శతకాల్లో అగ్రగణ్యమైన సమగ్ర శతకం?
   ఎ. బసవ లింగ శతకం
   బి. దాశరథీ శతకం
   సి. భాస్కర శతకం
   డి. శ్రీకాళహస్తీశ్వర శతకం
7. జతపర్చుము
   1. పోతన   అ. ఒంటి మిట్ట రఘువీరశతకం
   2. అయ్యలరాజు తిప్పయ్య   ఆ. వేంకటేశ్వర శతకం
   3. వెన్నెలకంటి జన్నమంత్రి   ఇ. నారాయణ శతకం
   4. తాళ్లపాక పెద తిరుమలయ్య   ఈ. దేవకీనందన శతకం

	1	2	3	4
ఎ.	అ	ఇ	ఈ	ఆ
బి.	ఇ	అ	ఈ	ఆ
సి.	ఇ	ఈ	అ	ఆ
డి.	ఇ	ఈ	ఆ	అ

8. 'సుమతీ శతకం'లో పద్యాలు...?
   ఎ. ఆటవెలది   బి. తేటగీతి
   సి. కందం   డి. ఉత్పలమాల
9. పిఠాపురంలోని 'కుక్కుటేశ్వరస్వామి'కి అంకితంగా 'కుక్కుటేశ్వరశతకం' (సీసపద్యాల్లో) రచించిన కవి?
   ఎ. వరాహగిరికొండ రాజామాత్యుడు
   బి. కూచిమంచి తిమ్మకవి
   సి. కూచిమంచి జగ్గకవి
   డి. అడిదము సూరకవి
10. జతపర్చుము
   1. కుమార శతకం   అ. వేంకటనరసింహకవి
   2. కుమారీ శతకం   ఆ. నృసింహకవి
   3. రామలింగేశ్వర శతకం   ఇ. అయ్యగారికోట పార్థసారథి
   4. కృష్ణ శతకం   ఈ. అడిదము సూరకవి

	1	2	3	4
ఎ.	ఇ	అ	ఈ	ఆ
బి.	ఈ	అ	ఇ	ఆ
సి.	అ	ఇ	ఈ	ఆ
డి.	ఆ	అ	ఈ	ఇ

11. మారద వెంకయ్య రాసిన 'భాస్కర శతకం'?
   ఎ. శృంగార శతకం   బి. వైరాగ్య శతకం
   సి. భక్తి శతకం   డి. నీతి శతకం
12. పాల్కురికి సోమన రాసిన వృషాధిపశతకంలో పద్యాలు?
   ఎ. ఆటవెలది, తేటగీతి   బి. కంద,సీసం
   సి. చంపకమాల, ఉత్పలమాల   డి. ద్విపద
13. శతకానికి ప్రత్యేక వ్యక్తిత్వం సమకూర్చి, పద్యాలన్నింటికి అంతర్వాహిని అయిన ఐక్యబంధాన్ని సమకూర్చేది?
   ఎ. సంఖ్యానియమం   బి. మక్కుట నియమం
   సి. ఛందో నియమం   డి. రసనియమం
14. శతకాన్ని 'ముక్తకకావ్యం' అనడానికి కారణం?
   ఎ. ప్రతి పద్య చమత్కృతి
   బి. ప్రతి పద్యమంలో మకుటం
   సి. ప్రతి పద్యం దేనికదే స్వతంత్రం
   డి. ఆత్మాశ్రయమైన భావన
15. వేమన శతకంలోని పద్యాలన్నీ..?
   ఎ. కందం   బి. ఉత్పలమాల
   సి. తేటగీతి   డి. ఆటవెలది
16. 'ప్రజాకవి వేమన'పై పరిశోధన చేసి డాక్టరేట్ పొందిన ఆధునిక కవి?
   ఎ. ఆచార్య ఎస్.గోపి   డి. డా.సి.నారాయణరెడ్డి
   సి. ఆరుద్ర   డి. ఆత్రేయ



17. తెలుగు శతక సాహిత్యంపై పరిశోధన చేసి, శతక లక్షణాలను సమగ్రంగా పరిశీలించి 'ఆంధ్ర శతక సాహిత్య వికాసం' గ్రంథం రాసిన వారు?
   ఎ. వంగూరి సుబ్బారావు   బి. డా॥కె.గోపాలకృష్ణారావు
   సి. ఆచార్య ఎస్.గోపి   డి. వేటూరి ప్రభాకరశాస్త్రి
18. 'భద్రగిరి శతకం' గ్రంథకర్త?
   ఎ. పార్థసారథిసెట్టి   బి. తెన్నేటి నారాయణ శర్మ
   సి. భల్లా పేరయ్య   డి. కంచర్ల గోపన్న
19. కాసుల పురుషోత్తమ కవి సీసపద్యాల్లో రాసిన 'ఆంధ్రనాయక శతకం'?
   ఎ. దృష్టాంత శతకం   బి. వ్యాజనిందశతకం
   సి. వ్యాజస్తుతి శతకం   డి. నీతి శతకం
20. 'సింహాద్రి నరసింహా శతక'కర్త..?
   ఎ. భల్లా పేరయ్య
   బి. పక్కి అప్పల నర్సయ్య
   సి. వేదం వేంకటకృష్ణశర్మ
   డి. గోగుల పాటి కూర్మనాథకవి
21. శతక పద్యాల్లో
   ఎ. తప్పకుండా 100 పద్యాలే ఉంటాయి
   బి. వస్త్వైక్యత ఉండదు
   సి. ఏకపాదమకుటం ఉండాలి.
   డి. తెలుగులో శతక వాఙ్మయం ఆధునిక కాలంలో ప్రారంభమైంది.
22. 'సిరిసిరి మువ్వ శతకం' కృతికర్త
   ఎ. శ్రీశ్రీ   బి. ఆత్రేయ
   సి. ఆరుద్ర   డి.జాషువా
23. నిఘంటువును శతకంగా రచించిన కవి?
   ఎ.నార్ల వెంకటేశ్వరరావు
   బి. బేతవోలు రామ బ్రహ్మం
   సి. గణపవరపు వేంకటకవి
   డి. కాసుల పురుషోత్తమకవి
24. జతపర్చుము
   1. బోయిభీమన్న   అ. టెంకాయ చిప్ప శతకం
   2. విశ్వనాథ   ఆ. అభినవ వేమన శతకం
   3. బేతవోలు రామబ్రహ్మం   ఇ. పిల్లి శతకం
   4. వాలిలకొలను సుబ్బారావు   ఈ. వరలక్ష్మీ త్రిశతి

	1	2	3	4
ఎ.	ఆ	ఇ	ఆ	ఈ
బి.	ఇ	అ	ఆ	ఈ
సి.	ఇ	ఆ	ఈ	అ
డి.	ఇ	ఈ	ఆ	అ

25. శ్రీకాళహస్తీశ్వర శతకంలో కనిపించే అంశం?
   ఎ. ఆత్మ నివేదన   బి. రాజనిరసన
   సి. నిర్వాజభక్తి   డి. ఎ, బి మరియు సి
26. 17వ శతాబ్దం ప్రారంభంలో కవి చౌడప్ప రాసిన 'కవి చౌడప్ప శతకం'..?
   ఎ. నీతి శతకం   బి. శృంగార శతకం
   సి. అధిక్షేపశతకం   డి. భక్తిశతకం
27. డా॥సి.నారాయణరెడ్డి రాసిన శతకం ఏది?
   ఎ. సినారె శతకం   బి. సమదర్శనము
   సి. నీలకంఠశతకం   డి. సిరిసిరిమువ్వశతకం
28. కాసుల పురుషోత్తమ కవి రాసిన శతకం/శతకాలు?
   ఎ. హంసలదీవి వేణుగోపాలశతకం   బి. మానస బోధ శతకం
   సి. భక్త కల్పద్రుమ శతకం
   డి. పైవన్నీ
29. జతపర్చుము
   1.మృత్యుంజయ శతకం   అ.కందుకూరి వీరేశలింగం
   2.మార్కండేయ శతకం   ఆ.చెళ్లపల్లి వేంకటశాస్త్రి
   3.మాతృశతకం   ఇ.వడ్డాది సుబ్బారామకవి
   4. భక్త చింతామణి శతకం   ఈ.దుర్భాక రామిరెడ్డి

	1	2	3	4
ఎ.	ఆ	అ	ఈ	ఇ
బి.	అ	ఆ	ఈ	ఇ
సి.	అ	ఇ	ఆ	ఈ
డి.	ఆ	ఈ	ఇ	ఇ

30.'శతక కవుల చరిత్ర' గ్రంథకర్త..?
   ఎ.వేదం వెంకట కృష్ణశర్మ
   బి. వంగూరి సుబ్బారావు
   సి.కె.గోపాలకృష్ణరావు
   డి. కందుకూరి విరేశలింగం
31.'శతక వాఙ్మయ సర్వస్వం' పరిశోధాత్మక గ్రంథం రాసింది..?
   ఎ. వేదం వేంకట కృష్ణశర్మ
   బి. వంగూరి సుబ్బారావు
   సి. ఎనుగు లక్ష్మణకవి
   డి. కె.గోపాలకృష్ణరావు
32.తెలుగులో శతక వాఙ్మయం ఏ శతాబ్దంలో ప్రారంభమైంది?
   ఎ.14వ శతాబ్దము   బి. 13వ శతాబ్దము
   సి.12వ శతాబ్దము   డి.11వ శతాబ్దము
33. 'బసవా బసవా వృషాధిపా' అనే మకుటం గల శతకం?
   ఎ. శివతత్త్వ సారం
   బి. బసవలింగ శతకం
   సి. శివరాత్రి మహత్మ్యం
   డి. వృషాధిప శతకం
34. తెలుగు సాహిత్యంలో మొదటగా శతక లక్షణాలున్న పద్యాలు ఏ గ్రంథంలో కనిపిస్తాయి?
   ఎ. నన్నయ–భారతం   బి. తిక్కన–భారతం
   సి. ఎర్రన–భారతం   డి. ఏదీకాదు
35. తెలుగు తొలి ప్రసిద్ధ నీతి శతకం ఏది?
   ఎ. వేమన శతకం
   బి.భాస్కర శతకం
   సి. సుమతీ శతకం
   డి. దాశరథీ శతకం
36. బిల్వేశ్వర శతక కర్త ఎవరు?
   ఎ. మండపాక పార్వతీశ్వర శాస్త్రి
   బి. కొక్కొండ వేంకటరత్నం పంతులు
   సి. రామప్రోలు సుబ్బారావు
   డి. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ
37. జతపర్చుము
   1. హరిజన శతకం   అ. మంగిపూడి వేంకటశర్మ
   2. భక్త మందార శతకం   ఆ. తిక్కన సోమయాజి
   3. కృష్ణశతకం   ఇ. కూచిమంచి జగ్గకవి
   4. మహాత్మశతకం   ఈ. కుసుమ ధర్మన

	1	2	3	4
ఎ.	ఈ	అ	ఇ	ఆ
బి.	ఈ	అ	ఆ	ఇ
సి.	ఈ	ఇ	ఆ	అ
డి.	ఇ	ఈ	ఆ	అ

38. వ్యాజస్తుతి శతకాలకు ఉదాహరణ?
   ఎ. సింహాద్రి నరసింహ శతకం
   బి. భద్రగిరి శతకం
   సి. రామలింగేశ్వర శతకం
   డి. అన్నీ
39. సామినేని వేంకటాద్రి కవి రాసిన 'చీపుర పుల్ల శతకం'?
   ఎ. వ్యాజస్తుతి శతకం
   బి. వ్యాజ నింద శతకం
   సి. భక్తి శతకం
   డి. హాస్య శతకం
40. మధుర భక్తి శృంగార ప్రధానమైన శతకం..?
   ఎ. తాళ్ళపాక అన్నమయ్య వేంకటేశ్వర శతకం
   బి. గోగుల పాటి కూర్మనాథుడు – సింహాద్రి నారసింహశతకం
   సి. కంచెర్ల గోపన్న – దాశరథీశతకం
   డి. ధూర్జటి – శ్రీకాళహస్తీశ్వర శతకం
41. మధ్యాక్కర ఛందస్సులో శతకం రాసిన కవి?
   ఎ.నన్నయ   బి. విశ్వనాథ
   సి.సినారె   డి. రాళ్ళపల్లి
42. వేమనపై విమర్శ గ్రంథం రాసినవారు?
   ఎ. రాళ్లపల్లి   బి. సి.పి.బ్రౌన్
   సి. వేటూరి   డి. సినారె

సమాధానాలు

1. బి	2. సి	3. సి	4. బి	5. ఏ
6. డి	7. బి	8. సి	9. బి	10. ఏ
11. డి	12. సి	13. బి	14. సి	15. డి
16. ఏ	17. బి	18. సి	19. సి	20. డి
21. బి	22. ఏ	23. సి	24. డి	25. డి
26. సి	27. బి	28. డి	29. ఏ	30. బి
31. సి	32. సి	33. డి	34. ఏ	35. సి
36. బి	37. సి	38. డి	39. డి	40. ఏ
41. బి	42. ఏ			

రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు వారివి. ఆదివాసులు మైదాన ప్రాంతాల్లో ఉన్నవారిలా బతకలేరు. ఎందుకంటే అడవితోనే నిత్యం సంబంధం కలిగి ఉంటారు. అయితే పాలకుల విధానాలతో వారి జీవితాలు నేడు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. వారి జీవన భద్రత, కుటుంబాల పోషణ దినదినగండమవుతున్నది. ఈ నేపథ్యంలో వారికి ఉపాధి కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. భూములు పంపిణీ చేయకుండా, విద్యా,వైద్యాన్ని మెరుగుపరచకుండా వారి బతుకులకు ఒక భరోసానివ్వని ఆదివాసుల దినోత్సవాలు ఎన్ని జరిపితే ఏం ప్రయోజనం?

ఆదివాసుల్లో 'అమృత' వెలుగులేవీ?



అంకం నరేష్
6301650324

ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యరాజ్యసమితి ప్రతి ఏడాది ప్రపంచ ఆదివాసుల దినోత్సవం జరుపుకోవాలని తీర్మానించింది. 1994 నుంచి జరుపుతున్న ఈ దినోత్సవాన్ని ఈ ఏడాది "స్వీయ భరోసా కోసం సమస్యలను పరిష్కరించే వారిగా స్థానిక యువత ఎదగాలి" అనే థీమ్‌ను ప్రకటించింది. కానీ ఈ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో బీజేపీ సర్కార్ నిర్లక్ష్యంగా ఉంది. ఈ దినోత్సవాన్ని పట్టించుకోకపోవడం చూస్తే గిరిజన, ఆదివాసుల పట్ల పాలకులకున్న చిత్తశుద్ధి అర్థమవుతోంది. కొన్ని రాష్ట్రాల్లో ఆదివాసులతో కార్యక్రమాలు నిర్వహించినా అది ఆ రాష్ట్రాల చొరవతోనే తప్ప కేంద్రం ప్రత్యేకంగా చేసిందేమీ లేదు. వాస్తవానికి ఆదివాసులు ఆధునిక సమాజానికి ఇంకా దూరంగానే జీవిస్తున్నారన్న సంగతి ప్రభుత్వాలు మరవకూడదు. వారి సంస్కృతి, కట్టుబాట్లు, ఆచారాలు మిగతావారితో పోల్చితే భిన్నంగానే ఉంటాయి. కానీ వారి సమిష్టి జీవన పద్ధతులు, సహజీవనం, పారదర్శతకు నిలువెత్తు సాక్షులు వారు. కానీ నిత్యం అసౌకర్యాలతో బతుకు పోరాటం చేస్తూ కష్టాల కారడివిలో జీవన పోరాటం చేస్తున్నారు. భారత రాష్ట్రపతిగా గిరిజన తెగకు చెందిన ద్రౌపది ముర్ము రెండేళ్ల క్రితం బాధ్యతలు చేపట్టిన తర్వాత దేశవ్యాప్తంగా ఆదివాసుల సమస్యలపై విస్తృత చర్చ జరుగుతున్నది. కానీ మాటలే తప్ప చేతలు కనబడడం లేదు. స్వాతంత్రం వచ్చి వజ్రోత్సవాలు జరుపుకున్నా ఇప్పటికి గిరిజనుల పరిస్థితి దయనీయంగా ఉండటం శోచనీయం.



చట్టాలున్నా కాగితాలకే పరిమితం

ప్రస్తుతం మన దేశంలో 700 పైగా గిరిజన తెగలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతవనిలో 11 కోట్ల మంది గిరిజనులు ఉన్నారు. మొత్తం జనాభాలో వారు 8.6శాతం.కాని ఆరోగ్యం, సరైన పౌష్టికారం, కనీస మౌలిక వసతులు లేక దుర్భర జీవనం సాగిస్తున్నారు. ఆదివాసుల అధికంగా గల తూర్పు పశ్చిమ కనుమలు ఈశాన్య ప్రాంత రాష్ట్రాలు, మధ్య భారత దేశంలో అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో వనాల విధ్వంసంనకు పాల్పడడం, ఖనిజాల తవ్వకాలు ఆదివాసుల జీవనానికి అవరోధాలుగా మారినాయి. గిరిజనుల సంక్షేమం హక్కుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తెచ్చిన చట్టాలు కాగితాలకు పరిమితం అవుతున్నాయి. ఆదివాసుల ప్రాంతాల పరిపాలన సంక్షేమంపై రాజ్యాంగంలో 5వ, 6వ షెడ్యూలు ఉన్నాయి. ఆదివాసి గ్రామాలకు స్వీయ పరిపాలన హక్కులు కల్పించే విషయంలో పంచాయతీరాజ్ షెడ్యూల్ ప్రాంతాల విస్తరణ చట్టం (పెసా)–1996 తెచ్చారు. అలాగే గిరిజనులకు అడవి భూముల హక్కులు కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వం అటవీ హక్కుల గుర్తింపు చట్టం–2006 ను అమల్లోకి తెచ్చింది. గిరిజన ప్రాంతాలలో భూ బదలాయింపును నిషేధిస్తూ చేసిన 1/70 చట్టం వుంది. కానీ చట్టాలను పక్కగా అమలుపరిచే సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలు మొద్దు నిద్ర నటిస్తున్నాయి.స్వాతంత్ర్య అమృత మహోత్సవాలు పూర్తయిన గిరిజనుల ఆరోగ్యం వారి అభివృద్ధిపై ప్రభుత్వాలు సరైన దృష్టి సారించడం లేదు. 2022 డిసెంబర్ నెలలో జరిగిన పార్లమెంటు సమావేశాల్లో హిమాచల్ ప్రదేశ్ లోని 'హటి' కులం వారిని షెడ్యూల్ తెగల జాబితాలో చేరుస్తూ పార్లమెంట్ ఆమోదం తెలిపింది. దీనిద్వారా కులాల చేర్పు, తొలగింపుల విషయంలో శాస్త్రీయత లేదన్నది స్పష్టమైంది. ఒక రాష్ట్రంలో ఎస్టీ జాబితాలో ఉన్న వారు మరొక రాష్ట్రంలో ఉండడం లేదు. దీనివల్ల తమ రాష్ట్ర నుంచి వేరే రాష్ట్రాలకు వలస వెళ్లే వారికి కులధ్రువీకరణ పెద్ద తలనొప్పిగా తయారైంది. గనుక గిరిజన ప్రజల జీవితాల మీద ప్రభావం చూపే ఏ విధానమైనా శాస్త్రీయ అవగాహనతో, అధ్యయనం జరిపిన తర్వాతే సామాజిక కోణంలో పరిశీలన చేసి అమలు చేయాల్సిన అవసరం ఉన్నది.

పోడుభూములు.. ఆదివాసులు

తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గోండులు, ఖోలాంలు, వరంగల్ ఖమ్మం జిల్లాలో కోయలు కొండారెడ్లు నాగర్ కర్నూల్ నల్గండ జిల్లాలో చెంచులు నివసిస్తున్నారు. నాయకపోడు, బంజారాలు, యానాదులు, ఎరుకలు ఇతర జిల్లాలో ఉన్నారు. వామపక్షాలు చేసిన పోరాటంతో గత రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు అక్కడక్కడ పోడు భూములకు పట్టాలిచ్చింది. కానీ అసౌకర్యంగా ఉన్న భూములు కావడంతో చదును చేయాల్సిన పరిస్థితి ఉంది. దీంతో అవి చాలాచోట్ల పడావుగానే ఉన్నాయి. దరఖాస్తు చేసుకున్న చాలామంది అర్హులకు భూములు ఇవ్వడం లేదు. వారు అడవుల్లో సాగు చేసుకుంటున్న భూములను ఫారెస్టు అధికారులు ధ్వంసం చేస్తున్నారు. అక్కడినుంచి వెళ్లిపోవాలని, ఇది సర్కార్ భూమి అంటూ వారిని బెదిరిస్తున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు వారివి. ఆదివాసులు మైదాన ప్రాంతాల్లో ఉన్నవారిలా బతకలేరు. ఎందుకంటే అడవితోనే నిత్యం సంబంధం కలిగి ఉంటారు. అయితే పాల కుల విధానాలతో వారి జీవితాలు నేడు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. వారి జీవన భద్రత, కుటుంబాల పోషణ దినదినగండమవుతున్నది. ఈ నేపథ్యంలో వారికి ఉపాధి కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. భూములు పంపిణీ చేయకుండా, విద్యావైద్యాన్ని మెరుగుపరచకుండా వారి బతుకులకు ఒక భరోసానివ్వని ఆదివాసుల దినోత్సవాలు ఎన్ని జరిపితే ఏం ప్రయోజనం? ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం ఆదివాసుల సమస్యలు, వారి జీవనానికి కావాల్సిన భద్రతను కల్పించాల్సిన అవసరం ఉన్నది. ఆదివాసుల కుటుంబాల్లో సారా పెద్ద సమస్యగా మారింది. పురుషులు దానికి బానిసై అనారోగ్యం పాలవుతున్నారు. కుటుంబాలు నాశనమవుతున్నాయి. సారా తయారీ, సరఫరా నియంత్రణపై ప్రభుత్వం దృష్టి సారించాలి. ఈ సారా తయారి చేసేవాళ్లకు ఇతర ఉపాధి చూపించి ఆర్థిక సహకారం అందించాలి.

ఏజెన్సీ ఏరియాల్లో భూముల ఆక్రమణలు

గిరిజనులకు వైద్య సేవలందించడానికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ములుగు జిల్లాలో సంచార వైద్యశాల నెలకొల్పింది. గిరిజనులు ఉన్న ప్రాంతాల్లో ఇటువంటివి ఇంకా పునరుద్ధరించవలసిన అవసరం ఉంది. అధిక శాతం గిరిజన గూడెల్లో తాగునీటి సౌకర్యం లేదు. మిషన్ భగీరథ ద్వారా మంచినీటిని అందించాలి. ఏజెన్సీ ఏరియాగా గుర్తించబడిన ప్రాంతాల్లో 1/70 చట్టం సంపూర్ణంగా అమలు కావడం లేదు. ఈ చట్టాన్ని కాపాడాల్సిన సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థలు పట్టించుకోకపోవడంతో గిరిజన ప్రాంతాల్లో అక్రమార్కులు భూముల క్రయవిక్రయాలు జరుపుతూ అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు.ఈ ఆక్రమణలను నియంత్రించాల్సిన అవసరం అధికార యంత్రాంగంపై ఉన్నది. చాలా జిల్లాల్లో పోడు గ్రామాల్లో అభివృద్ధి అంతంత మాత్రమే ఉంది.

నాడు నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన పోరు గ్రామాలు నేటికీ అసౌకర్యాలతో సహవాసం చేస్తున్నాయి. సరైన రహదారులు, పౌష్టికాహారం, వైద్య సేవలు లేక మనగడ కోసం నిత్యం పోరాటం కొనసాగించాల్సిన దుస్థితి ఆ గ్రామవాసులది. ఆదివాసుల బతుకులు బాగుపరచడానికి కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు తన వంతుగా ప్రయత్నాలు చేయడం లేదనే విమర్శలు కోకొల్లలు. గిరిజనుల స్వయం పాలన, విద్య, ఆర్థిక సాధికారికత సాధనకు ఇప్పటికైనా పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయాలి. ఆ అవసరాన్ని 'ఆదివాసుల హక్కుల దినం' నొక్కి చెబుతున్నది. ■

బంగ్లాదేశ మనకు నేర్పుతున్న పాఠమేంటి?



జాజుల దినేష్
9666238266

బంగ్లాలో కొన్నేండ్లుగా షేక్ హసినా పరిపాలనలో అభివృద్ధితో పాటు అసమానతలు కూడా అంతే స్థాయిలో పెరిగాయి. అవినీతి, బంధుప్రీతి, అసంబద్ధ నిర్ణయాలు పౌరుల్ని వీధుల్లోకి రప్పించాయి. ఇప్పటికే పాకిస్థాన్, శ్రీలంకలో ఏం జరిగిందో చూశాము. నిధుల్లేక ఐఎంఎఫ్ నుంచి తెచ్చిన అప్పులు తీర్చడానికి ప్రజలపై పన్నుల భారం మోపడంతో తిరుగుబాటు ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. పాలకుల తప్పిదాలు, అనుసరిస్తున్న విధానాలపైనే దేశ భవిష్యత్తు, ప్రజల భద్రత ఆధారపడి ఉంటాయనేది చరిత్ర నేర్పుతున్న పాఠం. ప్రజల్ని విస్మరించి పాలిస్తే గనుక బంగ్లాదేశ్ పరిస్థితి రేపు మనదేశానికి ఎదురవ్వచ్చు.

ఆమె బంగ్లాదేశ్ పాలక పార్టీ అవామీ లీగ్ నాయకురాలు. బంగ్లాదేశ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, బంగ్లాదేశ్ జాతిపితగా పిలిచే షేక్ ముజిబుర్ రెహ్మాన్ కుమార్తె. ప్రపంచంలో అత్యంత ఎక్కువ కాలం ప్రభుత్వ అధినేతగా వ్యవహరించిన మహిళగా షేక్ హసీనా పేరొందారు. షేక్ హసీనా 1996 నుంచి 2001 మధ్య .. అనంతరం 2009 నుంచి తాజాగా రాజీనామా చేసేవరకు బంగ్లాదేశ్‌ను పాలించిన నేత. ఏళ్ల దాదాపు రెండు దశాబ్దాల పాలనలో బంగ్లాదేశ్ ఆర్థికంగా అభివృద్ధి చెందిన మాట వాస్తవం. జీడీపీ వృద్ధిలో వరల్డ్ బ్యాంక్ నుంచి ప్రశంసలు కూడా అందుకుంది. ప్రపంచంలోనే అతిపెద్ద రెడీమేడ్ దుస్తుల హబ్ గా ఎదిగింది. మరోవైపు విపరీతమైన అవినీతి కారణంగా ద్రవ్యోల్బణం పెరిగిపో యింది. నిరుద్యోగ సమస్యకు తోడు రిజర్వేషన్లతో ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికింది. నిరసనకారులపై ఉక్కుపాదం మోపడంతో పరిస్థితి అదుపుతప్పి ప్రధాని పదవీచ్యుతురాలయ్యే పరిస్థితికి దారితీసింది.

అసలేం జరిగింది? ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కొన్ని నెలల క్రితం శాంతియుతంగా మొదలైన నిరసనలు.. ఊహించని పరిణా మాలకు దారితీశాయి. ఆందోళనలతో రగిలిపోయిన రచ్చలో వందలాది మంది మృతిచెందారు. దేశవ్యాప్తంగా చెలరేగిన హింసాత్మక ఘటనలతో బంగ్లాదేశ్ అట్టుడికిపోయింది. నాలుగోసారి వరుసగా గెలిచి పదహారేండ్లుగా దేశాన్ని పాలించిన షేక్ హసీనా తప్పుకో వాల్సిన పరిస్థితి వచ్చింది. అయితే ప్రజావ్యతిరేక విధానాలు, అసంబద్ధ నిర్ణయాలు, వివాదాలు తలెత్తే అంశాల పట్ల జాగ్రత్త వహించకపోవడంతోనే బంగ్లాకు ఈ దుస్థితి వచ్చిందని రాజకీయ విశ్లేషకుల వాదనా. ఎందుకంటే ఆర్థికంగా ఎంత అభివృద్ధి ఉన్నా సరే..ప్రతిపక్షాలకు మాట్లాడే స్వేచ్ఛ లేకపోతే అది నిర్బంధపాలన కిందకే వస్తుంది. దేశంలో జరుగుతున్న పరిణామాలు, అల్లర్లు, ఆందోళనలు ఆ కోవలో నుంచి పుట్టుకొ చ్చినవే. విద్యార్థుల ఆందోళనలతో బంగ్లాదేశ్ ప్రభుత్వం వణికిపోయింది. ప్రధాని రాజీనామా చేయడంతో దేశం సైనిక పాలనలోకి వెళ్లిపోయింది.



ఆ రిజర్వేషన్ల వల్లే ఆందోళనలు

పాకిస్తాన్ నుంచి బంగ్లాదేశ్ విముక్తి కోసం 1971లో జరిగిన యుద్ధంలో పోరాడిన వారి పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించే విధానాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు చాలా రోజులుగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. 1971 నాటి బంగ్లా విముక్తి పోరాటంలో పాల్గొన్న వారిని ఇక్కడ యుద్ధవీరులుగా చెబుతుంటారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మూడింట ఒక వంతు వారి పిల్లలకు రిజర్వ్ చేశారు. మరికొన్ని ఉద్యోగాలు మహిళలు, మైనారిటీలు, వికలాంగులకు రిజర్వయి ఉంటాయి.యుద్ధవీరుల పిల్లల కోసం మూడింట ఒకవంతు పోస్టులు కేటాయించడం వివక్షతో కూడుకున్నదని, ప్రతిభ ఆధారంగానే రిక్రూట్‌మెంట్ జరగాలని కొందరు విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. 2018లో ఇలాంటి నిరసనలే వెల్లువెత్తడంతో షేక్ హసీనా ప్రభుత్వం ఈ రిజర్వేషన్లను రద్దుచేసింది. కానీ, ఆ కోటాను పునరుద్ధరించాలని 2024 జూన్ ప్రారంభంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు తాజా ఆందోళనలకు దారితీసింది. హైకోర్టు ఇచ్చిన ఆ ఆదేశాలను రద్దు చేయాలని అటార్నీ జనరల్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో, తాజా విచారణ అనంతరం హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. 93 శాతం ఉద్యోగాలను మెరిట్ ఆధారంగా ఇవ్వాలని, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు 5 శాతం, మైనార్టీలకు 1 శాతం, వికలాంగులు, థర్డ్ జెండర్‌లకు ఒక శాతం రిజర్వేషన్ ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పింది. అయినా కూడా దేశంలో నిరసనలు ఆగలేదు.

కోటా రద్దు డిమాండ్‌ను వదిలి షేక్ హసీనా ప్రధాని పదవి నుంచి దిగిపోవాలన్న డిమాండ్‌తో నిరసనలు తీవ్ర రూపం దాల్చాయి.ఈ ఉద్రిక్త పరిస్థితులు ఆందోళనకరంగా మారడంతో షేక్ హసీనాను ప్రధాని పదవికి రాజీనామా చేయాలని ఆర్మీ కొన్ని నిమిషాల గడువు పెట్టింది. అంతేకాదు భద్రతా కారణాల దృష్ట్యా దేశం వెడిచి వెళ్లాలని చెప్పినట్లు సమాచారం.

బంగ్లా సంక్షోభంతో భారత్ అలర్ట్

ప్రధాని షేక్ హసీనా పదవికి రాజీనామా చేయగానే భారత్‌కు చేరుకున్నారు.యూపీలోని ఘజియాబాద్ ఎయిర్‌బేస్‌కు చేరుకున్న ఆమె అక్కడి నుండి విదేశాలకు వెళ్లేందుకు సిద్ధమవ్వగా వారు నిరాకరించినట్టు వార్తలు. బంగ్లాదేశ్ రాజకీయ సంక్షోభంతో భారత్ అలర్ట్ ఒక్కసారిగా అలర్ట్ అయింది. బార్డర్‌లో హైఅలర్ట్ ప్రకటించి సరిహద్దు గ్రామాల ప్రజలకు జాగ్రత్తగా ఉండాలని సూచించింది.ఇప్పటికే బీఎస్ఎఫ్ డీజీ కోల్‌కతాకు చేరుకుని పరిస్థితిని సమీక్షించినట్టు సమాచారం. మరోవైపు భారత్ నుంచి బంగ్లాదేశ్‌కు రెగ్యులర్‌గా నడిచే అన్ని రైళ్లను రద్దు చేస్తున్నట్లు ఇండియన్ రైల్వే ప్రకటించింది. కరోనా తర్వాత బంగ్లాదేశ్‌లో పరిస్థితులు దిగజారుతూ వచ్చాయి. ఉక్రెయిన్ వివాదంతో బంగ్లాదేశ్ దిగుమతి చేసుకునే ఇంధనం నుంచి నిత్యావసరాల వరకు అన్నీ ధరలు 20శాతం వరకు పెరిగాయి. యువతకు ఉద్యోగాలు లేవు. కనీసం రోజు గడవడమే కష్టంగా మారింది. ఇవే విద్యార్థులను విధుల్లోకి వచ్చి ఆందోళన చేయడానికి కారణమయ్యాయి. విద్యార్థుల్లో ఉన్న ఆగ్రహావేశాలను బంగ్లాదేశ్‌లోని అపోజిషన్ పార్టీ, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ అవకాశంగా మలుచుకుంది.

మన దేశం నేర్వాల్సిన పాఠం

ప్రజల సౌకర్యాలతో పాటు ధరల నియంత్రణ, కొనుగోలు శక్తి పెంచి, ఉపాధినిచ్చే కార్యక్రమాలు, పథకాలు చేపట్టాలి. కానీ బంగ్లాలో కొన్నేండ్లుగా షేక్ హసినా పరిపాలనలో అభివృద్ధితో పాటు అసమానతలు కూడా అంతే స్థాయిలో పెరిగాయి. అవినీతి, బంధుప్రీతి, అసంబద్ధ నిర్ణయాలు పౌరుల్ని వీధుల్లోకి రప్పించాయి. ఇప్పటికే పాకిస్థాన్, శ్రీలంకలో ఏం జరిగిందో చూశాము. నిధుల్లేక ఐఎంఎఫ్ నుంచి తెచ్చిన అప్పులు తీర్చడానికి ప్రజలపై పన్నుల భారం మోపడంతో తిరుగుబాటు ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. పాలకుల తప్పిదాలు, అనుసరిస్తున్న విధానాలపైనే దేశ భవిష్యత్తు, ప్రజల భద్రత ఆధారపడి ఉంటాయనేది చరిత్ర నేర్పుతున్న పాఠం. ప్రజల్ని విస్మరించి పాలిస్తే గనుక బంగ్లాదేశ్ పరిస్థితి రేపు మనదేశానికి ఎదురవ్వచ్చు. తగిన జాగ్రత్తలు మన పాలకులు తీసుకోవాలి. ప్రతిపక్షాలను నిర్బంధించి, ఏకఛత్రాధిపత్య పాలన సాగిస్తున్న మన ప్రధాని మోడీ ఆ విధానానికి స్వస్తి పలకాలి. బంగ్లాదేశ్ వైఫల్యాలను ఒక గుణపాఠంగా తీసుకుని ప్రజానుకూల పాలన సాగించాలి. లేదంటే కాలగర్భంలో ప్రజలు వేసే ఓటుతో కనుమరుగవకు తప్పదు! ■